కుశ

Vasireddy Publications
*initiative*



# పిపాసి

కిరణ్ కుమార్ సత్యవోలు

స్వాతి వీక్లీ నవలల పోటీల్లో లక్ష రూపాయల బహుమతి పొందిన నవల
‘వైకుంఠపాళి’ దీనితో అనుబంధం

**PIPASI**

***KIRAN KUMAR SATYAVOLU***

© Author

*Author contact:*
*kirankumar.satyavolu12@gmail.com*
*FB: facebook.com/profile.php?id=100000208012761*
*Page: facebook.com/satyavoluscripts*

ISBN: 978-81-924128-3-2

**Normal Edition Price: Rs. 150/-**
**Library Edition Price: Rs. 200/-**

*First Edition:* 10th February 2018

*For copies:*
**VASIREDDY PUBLICATIONS**
B-2, Telecom Quarters, Kothapet
Hyderabad - 500 060
Phone: 9000528717

Also available at: flipkart.com, vmrgbooks.com
For e-book: www.kinige.com

*Cover Concept & Design*
**Parvastu Chinnayasuri**

*Page Layout*
**A. Thirupathaiah**

*Printed at*
**Om Sai Graphics,**
Narayanaguda, Hyderabad.

ప్రపంచంలో ప్రతివాడికి ఒక కథ ఉంటుంది. కాని ఆ కథలన్నీ చివరికి ఒకడి చరిత్రలో కలిసిపోతాయి. నదులన్నీ సముద్రంలో చేరినట్టు!!

బంజారా హిల్స్ లో ఉన్న ఒక డుప్లెక్స్ హోం. ఇంటి చుట్టూ పూల మొక్కలు. ఇంటి ముందు అందంగా గార్డెనింగ్ చేయబడి ఉంది. వర్షం నీళ్ళు చూరు మీంచి డైరెక్ట్ గా పూల కుండీల్లో పడుతున్నాయి. మధ్యాహ్నం రెండు దాటింది. డైనింగ్ హాల్లో వంటవాడు భోజనానికి అంతా సిద్ధం చేస్తున్నాడు. కపర్ది వచ్చి డైనింగ్ టేబుల్ కి ఒక చివర కూర్చుని వంటవాడి వైపు చూసాడు. “అయ్యగారు లోపలేదో రాసుకుంటున్నారు” అని చెప్పాడు వంటవాడు. అక్కడ కూర్చునే గదిలోకి తొంగి చూసాడు. లోపల తనగదిలో లీనమై ఏదో రాసుకుంటున్నాడు మహాదేవ. వడ్డించు అన్నట్టుగా సైగ చేసాడు కపర్ది. వంటవాడు వడ్డించాడు. తాను మౌనంగా తినడం ప్రారంభించాడు. పది నిమిషాలకు మహాదేవ ఏవో కాగితాలు పట్టుకుని వడివడిగా డైనింగ్ హాల్లోకి వచ్చాడు. అతని ముఖం అదొక రకమైన ఆనందంతో వెలిగిపోతోంది. కుర్చీలో కూర్చుని కపర్దిని చూసాడు. తండ్రినేమి పట్టించుకోకుండా “కొంచెం అన్నం వడ్డించు..” అన్నాడు కపర్ది. వంటవాడు వడ్డించి “మీకు పెట్టేయమంటారా?” అనడిగాడు మహాదేవని.

“ఒరేయ్ ఈ కవిత వింటావా?” చాలా ఉత్సాహంతో అడిగాడు మహాదేవ. ఏమి పట్టనట్టు ఉన్నాడు కపర్ది.

“నిన్నేరా అడిగేది, ఈ కవిత వింటావా ఇప్పుడే రాసాను, చాలా బాగా వచ్చిందిరా” అన్నాడు తనలో తాను మురిసిపోతూ.

“ఎందుకు నాన్నా ఇవన్ని? బ్రతుకుతెరువు కోసం, అవకాశాల కోసం ఒకడి ముందు సాగిలపడటం! అక్షరాలను అమ్ముకోవడం. ప్రపంచానికి నువ్వు జీవితాన్ని ధారబోసిన ఓ సాహిత్య ఉద్యమకారుడు కావచ్చుగాక, నాకు మాత్రం అక్షరాలని అవసరానికి అమ్మేసిన అప్రయోజకుడువే. అసహ్యం వేస్తోంది నాన్నా, మిమ్మల్ని మీ రాతల్ని చూస్తుంటే!! దేనికైనా ఒక లిమిట్ ఉంటుంది అది ఎప్పుడో దాటిపోయింది.” అన్నాడు కపర్ది ఆవేశంగా.

“నన్ను అను పడతాను. నా అక్షరాన్ని అనకు. నా ఆత్మ అక్షరం. నా అంతరాత్మ అక్షరం. నా ఊపిరి అక్షరం. నా గుండెచప్పుడు అక్షరం. నా ఆనందం అక్షరం. నా అలసట అక్షరం. నా అణువణువు అక్షరం. నా జీవితం అక్షరం. ఆఖరికి నువ్వు తినే ఆ అన్నం కూడా ఆ అక్షరం నుండి వచ్చిందే!!” అన్నాడు మహాదేవ అంతే ఘాటుగా. ఆ గది అంతా అక్షరం అనే మాట ప్రతిధ్వనించింది. తింటూ ఉన్న కంచాన్ని ముందుకు విసురుగా తోసేసి లేచి నిలబడ్డాడు కపర్ది.

“నీ ఆత్మ, నీ ఊపిరి, నీ ఆనందం, ఈ అన్నం కూడా అయినా ఆ అక్షరంతోనే ఉండు. నాకు నా జీవితం ముఖ్యం. నేను నా ప్రపంచంలోకి బయలుదేరుతున్నాను. నీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నా ప్రపంచంలోకి ఆహ్వానం.. ‘నీకు’ మాత్రమే నీ అక్షరానికి కాదు.” అన్నాడు కపర్ది.

“నువ్వు పెడితే తిని, నీ మోచేతి నీళ్ళు తాగాల్సిన గతి నాకేం పట్టలేదు” అన్నాడు మహాదేవ కోపంగా కసిగా!

“అంత కాకపోయినా కడకు జరిగేది అదే! వృద్ధాప్యంలో చలి కాచుకోవడానికి పనికొస్తాయి నీ కవితలు” అన్నాడు కపర్ది.

“నోర్ముయ్!! మరొక్క మాట పెగిలావా ప్రాణాలు తోడేస్తాను జాగ్రత్త” మహాదేవ కళ్ళు ఎర్రబడ్డాయి.

“ఆరిపోయే దీపానికి వెలుగెక్కువ నాన్నా!!”

“నాన్న!? ఛీ. నన్ను అలా పిలవకు”

“చూడండి. ఈ ఇంట అక్షరాలు అమ్ముకునే రోజులైనా పోవాలి. లేదా నా ఇంటికి అక్షరాన్ని విడిచి పెట్టి అయినా రావాలి. నీ కవితలకు కర్మకాండలు జరిగిపోవాలి, అప్పుడే ఈ తండ్రి కొడుకుల కలయిక” తెగించి చెప్పాడు కపర్ది ఎంగిలి చేయిని విదిలిస్తూ.

“కళామ్మతల్లి ముద్దు బిడ్డను నేను. కొడుకు లేకపోయినా బాధలేదు. నాకు అమ్మ ఉంది.” అని చెప్పాడు మహాదేవ దృడంగా.

“అందుకేనా నీ తల్లి కోసం నా తల్లిని పొట్టన పెట్టుకున్నావ్?” అని ప్రశ్నించాడు కపర్ది.

ఆ మాటకు మహాదేవ దెబ్బ తిన్నట్టు చూసాడు. అతనిలోని మౌనం వెర్రిగా అరిచింది. అతని కళ్ళు ఆకాశ మేఘాలను తలపించాయి. గడప దాటి

వెళ్ళిపోతున్న కొడుకును తడిసి ముద్దైన కళ్ళు స్పష్టంగా చూపించలేక మరొక అశ్రువుని జారవిడిచి ఋణం తీర్చున్నాయి. కాలం కలిసి వస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడు. కలిసి రాకపోతే కన్నకొడుకు ఉన్న బంధాలు తెంచేసుకుంటాడు.

“కన్నానో కొడుకుని! కపర్ది అని పిలుచుకున్నాను! కంటికి రెప్పలా కాపాడుకున్నాను! ఆ కంటినే పొడిచి వదిలి పోతుంటే చివరికి కన్నీరు మిగుల్చుకున్నాను!” కాగితం మీద రాసుకున్నాడు మహాదేవ.

* * *

అక్కడి నుండి బయలుదేరి చెన్నై చేరుకున్నాడు కపర్ది. మెరీన బీచ్ లో సముద్రాన్ని చూస్తూ ఒంటరిగా కూర్చున్నాడు. నడి వయసు ఉన్న ఒక మనిషి వచ్చి పక్కన నుంచున్నాడు. తలెత్తి అతన్ని చూసాడు. తెల్లగా ఒత్తుగా ఉన్న గడ్డం. కళ్ళు లోపలికి పోయాయి. అయినా కళ్ళ జోడు ఉండటం వలన చురుకుగా చూస్తున్నాయి. ప్రశాంతంగా ఉంది ఆయన ముఖం. బ్రౌన్ కలర్ కాటన్ శేర్వాని, వైట్ ప్యాంటు వేసుకున్నాడు. చేతిలో ఒక బాగ్, అందులో చార్ట్స్ ఉన్నాయి. అతను కపర్దిని చూసి నవ్వాడు. కపర్ది పట్టించుకోకుండా సముద్రపు అలలను చూసాడు.

“సార్” పిలిచాడాయన. మళ్ళీ చూసాడు కపర్ది. “తెలుగువారా?” ప్రశ్నించాడు. అవునన్నట్టు తలూపాడు కపర్ది.

“నా పేరు విరించి. 50 రుపీసే సార్. మీ బొమ్మగీసి మీకు ఇచ్చేస్తాను” అన్నాడు చిరునవ్వుతో. మౌనంగా విరించిని చూసాడు కపర్ది. “బాగా గీస్తాను సార్. నచ్చితేనే డబ్బులివ్వండి” అన్నాడు విరించి. లేచి నిలబడ్డాడు కపర్ది.

“రండి సార్, అక్కడ కూర్చుందాం” అంటూ ముందుకు కదలబోయాడు.

“నా దగ్గర డబ్బులు లేవు” అన్నాడు కపర్ది. ముందుకు వెళ్ళేవాడు ఆగి వెనక్కి చూసాడు విరించి. కపర్ది సూటిగా విరించిని చూసాడు.

“నో ప్రాబ్లం సార్, థ్యాంక్ యు” అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు విరించి.

విరించి రాత్రి పది వరకు పని చేసుకుని ఇంటికి బయలుదేరబోతు కపర్ది ఇంకా అక్కడే కూర్చుని ఉండటం చూసి అతని దగ్గరకు వెళ్ళాడు.

“ఏంటి సార్, ఇంకా వెళ్ళలేదా?” అని ప్రశ్నించాడు విరించి. మౌనంగా చూసాడు కపర్ది.

“ఇంటిలో గొడవపడి వచ్చేసారా?” అనడిగాడు మళ్ళీ. చివుక్కున చూసాడు కపర్ది. విరించి నవ్వి, “సరే, ఇందా ఈ యాభై రూపాయలు ఉంచు బాబు. ఏమైనా తిను.” అని జేబులో యాభై నోటు పెట్టి వెళ్ళిపోయాడు. నిజానికి కపర్దికి విపరీతమైన ఆకలి వేస్తోంది. ముందు రోజు మధ్యాహ్నం

తిన్నాడు. ఆ రాత్రి ఉన్న డబ్బులుతో చెన్నై వచ్చేసాడు. కాని కపర్దికి తప్పు చేశాననే భావన ఏ మాత్రం కలగలేదు.

ఇంటికి చేరుకున్నాడు విరించి. కూతురుతో “ఈరోజు 300 రూపాయలు వచ్చాయమ్మా” అన్నాడు చెప్పులు విప్పుతూ.

తండ్రి చేతిలోని సంచి అందుకుని కొక్కానికి తగిలిస్తూ, “నువ్వు ఎంత సంపాదించినా నాకేం పర్లేదు, దారిలో దానధర్మాలు ఏమి చేయకుండా ఉంటే అదే పదివేలు” అంది కూతురు గీత.

“పది వేలు... మన జీవితంలో చూస్తామంటావా?” అన్నాడు విరించి.

“ఎందుకు చూడము నాన్న... పదివేలు చూడటము కూడా గొప్పేనా. అలా చూస్తూ ఉండు నువ్వు లక్షలు లెక్క పెడతావు” అంది కంచాలు సర్దుతూ.

“అవును. నీ పెళ్లి చేయాలంటే లక్షలు లెక్కపెట్టాల్సిందే” అన్నాడు నవ్వుతూ.

“నీ మొహం... ముందు తిను...” అని అన్నం వడ్డించింది.

డబ్బులు లెక్కపెడుతున్న కూతురితో “పాపం ఎవరో కుర్రాడే, ఆకలితో ఉంటే ఒక యాభై ఇచ్చాను. ఏమైనా తినమని చెప్పాను” అని చెప్పాడు.

“మనకే ఇంత ఇబ్బంది ఉంటే మళ్లీ ఈ దానాలేంటి నాన్నా?” అనడిగింది.

“ఆకలి బాధ నాకు తెలుసు కదమ్మా. అందుకే ఇవ్వకుండా ఉండలేకపోయాను. మనం చేసిన సాయం ఊరికనే పోదు” అన్నాడు విరించి.

విరించి ఇచ్చిన డబ్బుతో కొంచెం ఖర్చు పెట్టి కడుపు నింపుకున్నాడు కపర్ది. కొంచెం డబ్బు దాచాడు. ఆ రాత్రికి అక్కడే బీచ్ దగ్గరున్న ఒక బెంచ్ మీద పడుకుని నిద్రపోయాడు. ఉదయాన్నే లేచి టీ తాగి, ఉద్యోగం ఏమైనా దొరుకుతుందేమో అని వెళ్ళాడు. ఎమ్.బి.ఏ చేసాడు కపర్ది. అక్కడో కన్స్ట్రక్షన్ జరుగుతోంది. అక్కడికి వెళ్ళాడు. అక్కడ కూర్చుని ఉన్న ఒక పెద్ద మనిషి దగ్గరకి వెళ్ళాడు.

"నమస్కారం సార్" అని అన్నాడు కపర్ది.

"ఒనక్కమ్..," అన్నాడాయన తమిళంలో. తెల్ల చొక్కా, తెల్ల పంచె కట్టుకుని బంగారం గొలుసు చొక్కా బయటకు కనిపించేలా వేసుకుని ఉన్నాడు. తలకు నూనె రాసి ముఖానికి ఒక అడ్డ బొట్టు పెట్టాడు. నల్లగా ఉన్నాడు.

"ఉద్యోగం ఏమైనా ఉందా సార్?" అని అడిగాడు.

"ఎన్నా?" అన్నాడాయన.

"ఇక్కడేమైన ఉద్యోగం దొరుకుతుందా సార్?" అని అడిగాడు.

"ఎన్నా వేనుం ఉంగలకు? యనకు ఒన్నుమే పురియిల్లె" (మీకేం కావాలి. నాకేం అర్థం కాలేదు) అని అన్నాడు.

తను ఎమ్.బి.ఏ చేసానని, ఇక్కడ జరిగే పని మీద తనకు అవగాహన ఉందని, ఏమైనా పని ఉంటే ఇప్పించమని చెప్పుకొచ్చాడు కపర్ది. ఏ పని

చేయడానికైనా సిద్ధమని చెప్పాడు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కపర్ది చెప్పేది ఒక్క ముక్క కూడా పెద్ద మనిషికి అర్థం కాలేదు.

వీళ్ళిద్దరి మాటలు విన్నాడు శీను. "ఇల్లిటరేట్ ఫెలోస్" అని అనుకుంటూ అక్కడికి వెళ్ళాడు. కాలర్ వెనక్కి విసిరి కుడి చేతిని గుండెల దగ్గర చొక్కా లోపలికి పెట్టి వాళ్ళిద్దరి దగ్గరికి వెళ్లి "ఎన్న ప్రచ్న?" అన్నాడు కపర్దిని చూస్తూ.

కపర్దికి అర్థం కాలేదు. ఒక తమిళ్ వాడితోనే చస్తుంటే వీడేంటి అనుకున్నాడు. "తమిళ్ తెరియాదా?" అని అడిగాడు శీను. సౌండింగ్ కొంచెం సింక్ అయ్యి "తెలియదు" అన్నాడు. "ఇల్లిటరేట్ ఫెలో" అన్నాడు శీను. అదోలా ముఖం పెట్టాడు కపర్ది.

"పూర్ పీపుల్ ... తెలుగా?" అనడిగాడు శీను.

"అవును. నీకు తెలుగు వచ్చా?"

"వచ్చా? తెలుగు వచ్చు. తమిళ్ వచ్చు. ఏం కావాలి?" కనుబొమ్మలెగరేసాడు.

"ఉద్యోగం ఏమైనా దొరుకుతుందో అని వచ్చాను" అన్నాడు కపర్ది.

"దొరకడం ఏంటి నువ్వేదో పారేసుకున్నట్టు. అయినా ఇక్కడ ఉద్యోగాలు ఉండవు. పని ఉంటుంది. కూలి పని. ఏం పనో సెల్వం సార్ ని

అడుగు. ఎలా చేయాలో మేస్త్రి శీనుని అడుగు" అన్నాడు శీను. కపర్ది మౌనంగా శీనుని చూసాడు.

"ఏంటలా చూస్తున్నావ్! మేస్త్రి శీను ఎవరనేగా. నేనే! ది గ్రేట్ శీను!" అన్నాడు. గట్టిగా ఊపిరి తీసి వదిలాడు కపర్ది.

"మనోడే, నేనే రమ్మని చెప్పాను. పాపం చాలా కష్టాల్లో ఉన్నాడు. మన సెల్వం ఉన్నాడు. పని ఇప్పిస్తాను అంటే వచ్చాడు. ఇప్పటివరకు నా గురించే చెప్పబోయాడు. తమిళ్ రాదు కదా. అందుకే చెప్పలేకపోయాడు." అని చెప్పాడు సెల్వంతో తమిళ్ లో!

"ఏం పని చేస్తాడు?" అడిగాడు సెల్వం.

"ఏ పని అయినా ఇవ్వు. రోజు కూలి ఇవ్వు. నేను పని చేయిస్తాను. సరేనా" అన్నాడు శీను.

"సరే, 150 రూపాయలు ఇస్తాను. మధ్యాహ్నం అన్నం పెడతాము. సాయంత్రం సాంబార్ రైస్. అంతే." అని చెప్పాడు సెల్వం. దాన్ని తెలుగులో చెప్పాడు శీను.

"సరే," ఒప్పుకున్నాడు కపర్ది.

"ఫాలోయింగ్ మి" అన్నాడు శీను కపర్ది.

"పేరు ఏంటో?" అనడిగాడు శీను.

“కపర్ది” చెప్పాడు.

“మీనింగ్?”

“శివుడి పేరు”

“అయినా ఎందుకంత టిపికల్ నేమింగ్. నా నేమింగ్ చూడు.. శీను!. అలా సింపుల్ గా ఉండాలి”

“నా పేరు నేను పెట్టుకోలేదు. లేకపోతే అంతే సింపుల్ గా ఉండేదేమో!” అని అన్నాడు కపర్ది.

“………”

“పనేంటో చెప్పు శీను”

“సరే.. పదా!!”

అక్కడ పని చూసుకుని సాయంత్రం సాంబార్ రైస్ తినేసి కూలి తీసుకున్నాడు కపర్ది. శీను కూడా కూలి తీసుకుని కపర్ది దగ్గరకి వచ్చాడు.

“ఎక్కడుంటున్నావ్?” అనడిగాడు శీను.

“అదే ఆలోచిస్తున్నాను. ఎక్కడికి వెళ్ళాలా అని” అన్నాడు కపర్ది.

“ఇల్లు లేదా?” ప్రశ్నించాడు. పెదవి విరిచాడు కపర్ది.

“సరే, నాతో రా. మా ఇంటికెళ్దాం!” అన్నాడు శీను.

దారిలో నడిచి వెళ్తూ “నీకు ఎవ్వరు లేరా?” అనడిగాడు శీను.

“ఒక రకంగా అంతే” బదులిచ్చాడు కపర్ది.

“సారీ” చాలా ఫీల్ అవుతున్నట్టుగా చెప్పాడు.

“నీకు సెంటిమెంట్స్ ఉంటాయా?”

“అదేం లేదు. సినిమాల్లో ఏమైనా సాడ్ న్యూస్ చెప్తే సారీ అంటారు కదా, అందుకే చెప్పాను.”

“అన్నట్టు నువ్వు మేస్త్రిని అన్నావ్, కాని కూలి చేసావేంటి?”

“ఫ్యూచర్ లో మేస్త్రిని అవుతాను. నాకంటే సీనియర్స్ ఇద్దరు ఉన్నారు. వాళ్ళిద్దరి తరువాత నేనే. అయినా మనకి మనం గొప్పోడు అనుకోకపోతే బతకలేం బాసు.”

“ఇక్కడ కూడా సీనియర్స్ ఉంటారా?”

“ఎందుకుండరు… జఫ్ఫా గాళ్ళు! ఒకడికి అయితే అస్సలు పని తెలియదు. అయినా ఆడు చెప్పింది చేయాలి.”

“మ్… ఇంతకి ఏం చదువుకున్నావ్?”

“ఎనిమిది. మధ్యలో మానేసాను”

“ఎందుకు?”

“అదో లాజిక్ మిస్ అయిన ట్రాజిక్ స్టొరీ. ప్రోగ్రెస్ కార్డులో లెక్కలు మార్క్స్ మార్చాను. మా నాన్నకు తెలియలేదుగాని మా టీచర్ కి

తెలిసిపోయింది. దానితో నన్ను చావ కొట్టింది. నాకు కోపమొచ్చి తిరిగి కొట్టాను. అంతే అదే ఆఖరి రోజు స్కూల్ కి వెళ్ళడం. కాని మా టీచర్ ఇంటి చుట్టూ వారం రోజుల పాటు తిరిగాను."

"ఎందుకు? సారీ చెప్పడానికా?"

"అంత లేదు. నేను ప్రోగ్రెస్ కార్డులో మార్క్స్ మార్చాననే విషయం ఎలా కనిపెట్టేసిందా అని కనుక్కోవడానికి. టీచర్ ఏ పెన్ వాడుతుందో ఆ పెన్ కొని నేను చాలా జాగ్రత్తగా లెక్కలు మార్క్స్ 18 వస్తే దాన్ని 78 గా మార్చాను. సైన్స్ 27 వస్తే రెండు దగ్గర బ్లేడుతో గీసి దాన్ని 57 చేసాను. ఒక్కడికి కూడా అస్సలు అనుమానం రాదు. కాని దొంగ మొహంది పట్టేసింది. కనిపెట్టేసింది. పట్టుకొట్టేసింది. అందుకే ఆవిడ ఎలా కనిపెట్టిందా అని అడగడానికి ఆమె ఇంటి చుట్టూ తిరిగాను"

"ఇంతకి ఎలా కనిపెట్టింది?"

"మార్క్స్ మార్చాను కాని టోటల్ మార్చలేదు. అక్కడ దొరికిపోయాను. అంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యానో ఇప్పటికీ తెలియదు తెలుసా"

పడిపడి నవ్వుకున్నాడు కపర్ది. ఇంటికెళ్ళే వరకు నవ్వుతూనే ఉన్నాడు.

"ఇంక నవ్వింది చాలు. మన ఇల్లు వచ్చేసింది." అన్నాడు శీను. ఆ ఇంటి ముందు నుంచుని ఇల్లుని చూసాడు కపర్ది. చాలా చిన్న ఇల్లు. శిధిలావస్థలో

ఉంది. పురాతత్వశాఖ వారికి ఇస్తే ఒక చిన్న డాక్యుమెంటరీ తీసుకుంటారు.

“ఇంత చిన్న ఇంట్లో ఎలా ఉంటున్నావ్?” అనడిగాడు కపర్ది.

“ఇంట్లో కాదు. మేడ మీద మన ఇంద్ర భవనం ఉంది. పదా.” అని పైకి తీసుకెళ్ళాడు శీను. ముందు భాగం చిన్నగా ఉన్న రైలు పెట్టేలా దీర్ఘ చతురస్రాకారంలో ఉంది. విశాలమైన మేడ మీద ఒక మూలకి ఒక గది ఉంది.

లోపలికి వెళ్తూ “ఇదే నా రాజ్యం. నేనే రాజుని.” అన్నాడు శీను.

“కింద ఓనర్స్ ఉంటారా?” అనడిగాడు కపర్ది.

“కాదు. టెనెంట్స్” చెప్పాడు శీను.

“అంటే నువ్వు ఇంటి ఓనర్ వా?” ఆశ్చర్యపోయాడు కపర్ది.

“అబ్బ, సౌండింగ్ ఎంత బాగుంది. కాదు, నేను కూడా టెనెంట్ నే” అన్నాడు శీను.

“మరి?” సందేహం వ్యక్తపరిచాడు కపర్ది.

“అబ్బా... గోల! వాళ్ళు తిరుచిలో ఉంటారు. అందుకే నిన్ను తీసుకురాగలిగాను” అన్నాడు శీను.

“సరే... కూల్” అన్నాడు కపర్ది.

ఇద్దరు పడుకున్నారు. “మన ఇంట్లో ఇంకొకడు ఉన్నాడు. నేను రాజైతే వాడు మంత్రి. చాలా ఇంటరెస్టింగ్ క్యారెక్టర్. రేపు పరిచయం చేస్తాను.”

అన్నాడు శీను.

“రేపా? ఎక్కడికి వెళ్ళాడు.” అన్నాడు కపర్ది.

“నైట్ వాచ్ మాన్ ఉద్యోగం కదా. పగలు మాత్రమే దొరుకుతాడు” అన్నాడు శీను. ఇద్దరు నిద్రకు ఉపక్రమించారు.

సూర్యోదయం అయ్యింది. ఈల వేసుకుంటూ మేడ పైకి వచ్చాడు బాలరాజు. గదిలో ఇద్దరు దుప్పటి ముసుగేసుకుని నిద్రలో ఉన్నారు.

ఎవరీ కొత్త శాల్తి? అనుకుని వాళ్ళ ముందు గొంతుక్కూర్చున్నాడు. ఎప్పుడు లేస్తారా అని ఎదురు చూసాడు. ఒకరి తరువాత ఒకరు బాలరాజు మొహాన్ని చూస్తూ లేచారు. “హి..హి..” అని వెకిలిగా నవ్వాడు.

“ఆ నవ్వేంటి? ఆ కూర్చోవడం ఏంటి? ఆ వాటం ఏంటి? తెర్రప్పచ్చిలా” అన్నాడు శీను.

“ఎవరు?” అని సైగ చేసాడు కపర్దిని చూపించి ముసి ముసిగా నవ్వుతూ బాలరాజు.

“హాయ్, ఐ యామ్ కపర్ది” షేక్ హ్యాండ్ ఇచ్చాడు కపర్ది.

“ఓహ్, ఐ యామ్ బాలరాజు.” చేయి కలిపాడు.

“చూడటానికి రిచ్ కిడ్ లా ఉన్నావ్! ఏ ఊరు మనది?” అనడిగాడు బాలరాజు.

“ఒరేయ్ చైల్డ్ కింగ్! రాగానే మొదలెట్టావా? కథ ఇప్పుడే మొదలైంది కదా అప్పుడే ఫ్లాష్ బ్యాక్ చెప్పరు. కొంతకాలం పోయాక చెప్తారు. ఎన్ని సినిమాలు చూడలేదు. అంతే కదా కపర్ది!” అన్నాడు శీను నవ్వుతూ. కపర్ది నవ్వి ఊరుకున్నాడు. బాలరాజు నవ్వుతూ “నీ ఫ్లాష్ బ్యాక్ ఏమైనా డోంట్ వర్రీస్. నువ్వు మాతో హాపీస్ గా ఉండచ్చు.” అన్నాడు.

“అబ్బో, ఓనర్ గారు ఒప్పుకున్నారు” అన్నాడు శీను.

“కపర్ది, వీడితో జాగ్రత్త! నువ్వు అనుకున్నంత మంచోడేమికాదు” అన్నాడు బాలరాజు

“చూసావా కపర్ది. వీడికి అస్సలు కృతజ్ఞత లేదు. నాలాంటి అమాయకుడిని అంటే కళ్ళు పోతాయిరా”

“అమాయకత్వం చూసే మనిషిని బట్టి ఉండదు. చేసే పనులను బట్టి ఉంటుంది.”

“నేనేం చేసాను” అన్నాడు శీను.

“మళ్లీ చాందినిని కెలికవా?” ప్రశ్నించాడు బాలరాజు.

“ఏం ఏమైంది?” అనడిగాడు శీను.

“అన్ని ఈడికి ఇష్టమొచ్చినట్టు చేస్తాడు కపర్ది. వాళ్ళందరూ నా మీద వచ్చి పడతారు” అన్నాడు బాలరాజు.

“నేనేం చాందినిని కెలకలేదు. నాలుగు రోజుల నుండి కనపడలేదురా, ఏదో ఊరు వెళ్లిందట. అందుకే వచ్చిందేమో అని అడిగాను. అంతే” అన్నాడు శీను.

“పాపంరా, నువ్వు ఆమె గురించి అడగడం మానుకోరా! నీ వల్ల ఆమెను కొట్టారట. ఎందుకు చెప్పు ఆమెను బాధ పెడతావు?” అన్నాడు బాలరాజు.

“ఒక్కొక్కడిని నరికేస్తాను. నాటకాలు ఆడుతున్నారా! కొట్టడం ఏంటి? ఆ కొట్టేదేదో నన్ను కొట్టమను దమ్ముంటే” అంటూ లేచి నుంచున్నాడు ఆవేశంగా.

“అదిగో, అదే వద్దని చెప్పాను, కూర్చో ముందు.” చేయి పట్టుకుని కిందకి లాగాడు బాలరాజు.

వీళ్ళిద్దరి సంభాషణ మౌనంగా చూస్తూ కూర్చున్నాడు కపర్ది.

“నువ్వైనా చెప్పు కపర్ది. కొంచెం కోపం తగ్గించుకోమని!” అన్నాడు బాలరాజు. కొన్నేళ్ళ నుండి స్నేహం చేస్తున్న నీ మాటే వినని వాడు నా మాటేం వింటాడు అనుకున్నాడు మనసులో. అయినా తనేం చెప్పాలి? అసలు ఏమి జరిగిందో కొంచెం కూడా తెలుసుకోకుండా ఏమని చెప్పమంటున్నాడు అని అనుకున్నాడు కపర్ది.

“ఏంటలా చూస్తున్నావ్ కపర్ది? చెప్పు వీడికి” అన్నాడు బాలరాజు.

చేసేది లేక “బాలరాజు చెప్పేది కాస్త వినచ్చు కదా శీను.” అన్నాడు కపర్ది లౌక్యంగా.

“ఇంకెంతకాలం.! పాస్పోర్ట్ రాగానే దుబాయ్ వెళ్ళిపోతాను. డబ్బు సంపాదించి వాళ్ళ మొహాన కొట్టి నా చాందినిని తెచ్చేసుకుంటాను” అన్నాడు ఎటో చూస్తూ. కాసేపు వాళ్ళ మధ్య నిశబ్ధం రాజ్యమేలింది. కిర్రుకిర్రు మని

ఫ్యాన్ శబ్దం స్పష్టంగా వినిపించింది. తడిసిన కళ్ళు తుడుచుకుని లేచి వెళ్ళిపోయాడు శీను.

బాలరాజు వైపు తిరిగి "ఇంతకి ఎవరా చాందిని?" అనడిగాడు కపర్ది.

"...." మౌనం వహించాడు బాలరాజు.

"ఏమైంది! పర్సనల్ అయితే చెప్పద్దులే" అన్నాడు కపర్ది.

"ఆమె ఒక వేశ్య" అన్నాడు బాలరాజు చాలా మంద్రంగా తలొంచుకుని!

ఆ క్షణంలో కపర్దిలోని మౌనం ఎన్నో ప్రశ్నలను తయారు చేసుకుంది. అవన్నీ గొంతులోని స్వరపేటిక దగ్గరకి వచ్చి బోల్తా పడిపోయాయి. ఇంకేమి అడగలేక ఊరుకున్నాడు.

కాలం నడుస్తూ ఉండగానే మనకు తెలియకుండా పాఠాలు నేర్పేస్తుంది. డేట్ అనౌన్స్ చేయకుండా సడెన్ గా పరీక్షకు కూర్చోమంటుంది. కాని విచిత్రం ఏంటంటే ఎప్పుడు పాస్ చేయాలనేది కూడా కాలమే నిర్ణయిస్తుంది.

* * *

అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ గోదావరి ఒడ్డున కూర్చున్నాడు మనోహర్. అతనక్కడ చాలాసేపటినుండి ఉన్నాడు. అతని మనసు బాగోనప్పుడల్లా అక్కడికి వస్తు ఉంటాడు. పడవ ఎక్కి గోదావరి మధ్యన ఉండే చిన్నచిన్న ఇసుక మేటల దగ్గరకు వెళ్లి ఒక్కడే ప్రశాంతంగా కూర్చోవడం, చీకటి పడ్డాక ఇంటికి చేరుకోవడం మామూలే.

"ఎంత సేపు ఉంటావ్ ఇక్కడ?" అనడిగింది శ్రీజ అక్కడికి వచ్చి.

"నువ్వేంటిక్కడ? ఎలా వచ్చావ్?" అనడిగాడు మనోహర్.

"ఎగురుకుంటూ వచ్చాను" అని చెప్పింది. ఒడ్డు దగ్గర ఆపిన పడవను చూసి ఆమెను చూసాడు.

"పిచ్చి ప్రశ్నలు అడిగితే సమాధానం కూడా పిచ్చిగానే ఉంటుంది" అంది వెటకారంగా.

"నాకసలే పిచ్చి పిచ్చిగా ఉంది" అన్నాడు చిరాగ్గా.

"నీకు పిచ్చి అని నాకు తెలుసులే బావ. ఇంట్లో వాళ్ళు అయితే నీ పిచ్చి బాగా ముదిరిపోయినదని అనుకుంటున్నారు." అంది చిన్నగా నవ్వుతూ.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. కాసేపైన ప్రశాంతంగా ఉండనివ్వండి నన్ను." విసుక్కున్నాడు. మౌనంగా అలా బావని చూస్తూ ఉండిపోయింది.

"శ్రీ.. ప్లీజే !! కాసేపు వదిలేయవే నన్ను" అన్నాడు దండం పెట్టి.

"రా బావా, ఇక్కడే ఎంతసేపుంటావ్?" అంటూ చేయి పట్టుకుని లాగింది. లేచి నిలబడి ప్యాంటు దులుపుకున్నాడు. ఇద్దరు ఇంటికి బయలుదేరారు.

"మా నాన్న ఉన్నారా?" అనడిగాడు ఇంటికి దగ్గరవుతుండగా.

"చూస్తే ఆశ్చర్యపోతావ్!!" అంది నవ్వు ఆపుకుంటూ.

“మళ్లీ ఏం కుట్ర పన్నారు అందరు కలిసి?” అనడిగాడు.

“తినబోతూ రుచులెందుకు బావ” అంది.

ఇంటిలోకి వెళ్లి చూసాడు. మొత్తం చుట్టాలందరూ కట్టకట్టుకుని వచ్చేసారు. మనిషి మనిషికో నవ్వు నవ్వాడు మనోహర్ పెదాలు వంకర్లుపోయేలా. పేరుపేరున బాగున్నారా అని అడిగాడు. అందరు ట్రైనింగ్ అయినా కోతుల్లా ఒకటే చూపు చూసారు. వంటింటి లోపలికి వెళ్లి “ఏంటమ్మా వరద బాధితుల్లా అందరు?” అనడిగాడు వచ్చిన చుట్టాలకు టీ పెడుతున్న తల్లితో.

“ఏమో మీ నాన్ననే అడుగు!” అంది మనోహర్ తల్లి.

“ఒరేయ్ మనోహర్..” హాల్ లో నుండి వినిపించింది తండ్రి లక్ష్మణరావు కంఠం.

“ఇదేంటమ్మ! ఇంట్లో సమస్యలని ఊళ్లోకి, ఊళ్ళో సమస్యలని ఇంట్లోకి తీసుకునిరావడం వల్లే సగం కుటుంబాలు అశాంతితో బతుకుతున్నాయి” అన్నాడు మనోహర్.

“నీ హితోపదేశాలు తరువాత, మావయ్య పిలుస్తున్నారు వెళ్ళు.” అంది శ్రీజ. హాల్ లోకి వెళ్ళాడు మనోహర్.

“చెప్పరా, బాబాయ్ అడుగుతున్నాడు, ఎందుకు ఉద్యోగం మానేసావు అని, చెప్పరా బాబాయ్ కి ఏం సమాధానం చెప్తావో చెప్పు?” అన్నాడు

లక్ష్మణరావు.

"బంగారంలాంటి ఉద్యోగం, దేనికి లోటు లేని జీతం. అసలు మానేయాల్సిన కర్మ ఏంటని అడుగుతోంది రుక్మిణి అత్తయ్య. సమాధానం చెప్పు" అన్నాడు మళ్లీ. మౌనంగా వాళ్ళందరి ముందు దోషిలా నిలబడ్డాడు.

"చెప్పు.. మాట్లాడవే?" అన్నాడు లక్ష్మణరావు.

"నాకా ఉద్యోగం చేయడం ఇష్టం లేదు నాన్న" అన్నాడు మనోహర్.

"ఎందుకో??" వెనక నుండి అడిగింది శ్రీజ.

వెనక్కి తిరిగి కొరకొరమంటూ చూసి "నాకు సినిమాలు అంటే ఇష్టం. సినిమా ఫీల్డ్ లోకి వెళ్తాను" అన్నాడు. అంతే, అప్పటివరకు సైలెంట్ గా ఉన్న గొంతులన్ని ఒక్కసారిగా నీతులు చెప్పడం మొదలెట్టాయి.

"సినిమాల్లోకి వెళ్తావా?" నోరెళ్ళబెట్టి చూసాడు ఓ దూరపు బంధువు.

"అవును, డైరెక్టర్ అవ్వాలని ఉంది" అని మనసులో మాట చెప్పాడు.

"శభాష్ రా అల్లుడు, నువ్వు సినిమా తియ్యి. నేను ప్రొడ్యూస్ చేస్తాను" అన్నాడు శ్రీజ తండ్రి చక్రవర్తి.

"నువ్వు ఊరుకో బావా! సగం వాడిని నువ్వే చెడగొట్టావ్" అన్నాడు లక్ష్మణ రావు. శ్రీజ చాలా సంతోషించింది. చివరకు ధైర్యంగా అసలు విషయం

అందరికి చెప్పాడు. ఇప్పుడు సమస్యకి పరిష్కారం దొరకడం పెద్ద విషయమేమీ కాదు.

"సినిమా డైరెక్టర్ అవుతావా?" నక్సలైట్ అవుతావా అన్నట్టు అనడిగాడో పెద్దాయన.

"అవును" అన్నాడు.

"అదికాదురా, మన్ను... మీ నాన్న ఎంత కష్టపడి చదివించాడో నీకు తెలియంది కాదు. ఇప్పుడు సినిమా డైరెక్టర్ అంటే ఎలారా? మనకవన్ని అచ్చురావురా" అని సముదాయించింది రుక్మిణి అత్త.

"అచ్చు రాకపోవడం ఏంటి అత్తయ్య? మన కుటుంబంలో ఎవరు వెళ్ళారు ఇప్పటివరకు? అయినా నాకు నచ్చిన పని నేను చేస్తాను అంటే ఏంటిది?" అన్నాడు మనోహర్

"మన్నూ... సినిమా ఫీల్డ్ అంటే నువ్వేదో అనుకుంటున్నావ్! నువ్వేమైనా చెప్పురోరేయ్, పండని నేలలో ఇత్తనాలు చల్లకూడదు. మనకి కాని దాంట్లో ఏలెట్టకూడదు. నీలాగే పోయి చేతులు కాల్చుకుని జీవితాల్ని నాశనం చేసుకున్నవాళ్ళు కోకొల్లలు. నేను హైదరాబాద్ వెళ్ళినపుడు చూసాను. సినిమా పిచ్చోళ్ళు అనచ్చు ఆళ్ళని" అన్నాడు.

"ఆ పిచ్చోళ్ళకి ఛాన్స్ వచ్చి, సినిమా బాగా తీసి. అది హిట్ అయ్యాక, దాన్ని మీరు చూసి బాగా తీసాడురా అనుకుంటూ బయటకు వచ్చినప్పుడు

మీ దృష్టిలో అప్పటివరకు ఉన్న పిచ్చోడు గొప్పోడు అయిపోతాడు. కానీ అప్పుడు ఇప్పుడు మీరు పిచ్చోళ్ళకి గొప్పోళ్ళకి మధ్యలోనే ఉండిపోతారు. పిచ్చోళ్లని తిట్టుకుంటూ, గొప్పోళ్ళకి మెచ్చుకుంటూ" అని చెప్పాడు మనోహర్.

"ఈ మాత్రం దానికి లక్షలు తగలేసి ఇంజనీరింగ్ చేసిందెందుకు.?" కోపంగానే అడిగాడు తండ్రి లక్ష్మణరావు.

"నాకు ఈ సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఏం నచ్చలేదు నాన్నా. ఒకటే పని, ఆ మాత్రం పని ఎనిమిదో క్లాసు పాస్ అయినావాడికి నేర్పినా చేస్తాడు. జీతాలు బాగుంటాయన్న పేరుకేగాని జీవితాయశయాలు నెరవేరవు నాన్నా" అన్నాడు మనోహర్.

"జీవితాశయాలు!!? చూడవే నీ కొడుకు ఎంత బాగా మాట్లాడుతున్నాడో. బంగారంలాంటి ఉద్యోగం వదిలేసి సినిమాల్లోకి వెళ్తాడట" అన్నాడు మనోహర్ తల్లితో.

"నాన్నా, నాకంటూ గుర్తింపులేని పని నేను చేయలేను నాన్నా. నాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండి. నేను ప్రూవ్ చేసుకుంటాను. ఒకవేళ ప్రూవ్ చేసుకోకపోతే మీరు చెప్పినట్లే చేస్తాను" అన్నాడు మనోహర్.

"సరే నీకు సంవత్సరం టైం ఇస్తున్నాను. ఈలోపులో డైరెక్టర్ అయ్యి సినిమా తీయి. లేకపోతే వచ్చే ఏడాది మళ్లీ నువ్వు ఉద్యోగంలో చేరాల్సిందే"

అని చెప్పాడు తండ్రి

"సరే" అన్నాడు. లక్ష్మణరావు అక్కడినుండి వెళ్ళిపోయాడు. సినిమా వదిలినట్టు అందరు వెళ్ళిపోయారు.

శ్రీజ మనోహర్ దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకుంది. "ఆల్ ది బెస్ట్ బావ" అంది.

"అల్లుడు ఇంతకి కథ పేరేంటి?" అనడిగాడు శ్రీజ తండ్రి.

నవ్వుతూ చెప్పాడు "పిపాసి." అని.

"అంటే?" అనడిగాడు.

"వెండి తెర మీద చూడండి" అన్నాడు మనోహర్ ఆనందంతో.

"సరే., హైదరాబాద్ ఎప్పుడు వెళ్తావ్ మరి? టికెట్స్ బుక్ చేయమంటావ?" అనడిగాడు చక్రవర్తి.

"హైదరాబాద్ కాదు, చెన్నైకి బుక్ చేయి" అని చెప్పాడు.

"చెన్నై ఎందుకు బావ?" అనడిగింది.

"అక్కడ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవుతోంది. అక్కడ నేను తీసిన షార్ట్ ఫిల్మ్స్ చూపిస్తాను. ఎవరికైన నచ్చి అవకాశం ఇస్తే నా కల నెరవేరినట్టే" అన్నాడు ఆశగా.

"అలాక్కాని అల్లుడు." అని చెప్పి వెళ్ళిపోయాడు చక్రవర్తి.

“బావా” పిలిచింది

“మ్.....” అని ఆమె వైపు చూసాడు. అతని కళ్ళలోకి చూసింది ప్రేమగా. “ఏంటే?” అన్నాడు. ఏమి లేదు అన్నట్టుగా తలూపి అతన్ని హత్తుకుపోయింది.

చక్రవర్తి లేటు చేయకుండా చెన్నైకి టికెట్ పట్టుకోచ్చేసాడు. “ఎల్లుండి సాయంత్రం ట్రైన్, డైరెక్టర్ అల్లుడు గారు” అన్నాడు టికెట్ ఇస్తూ.

“థాంక్స్ మావయ్య” అన్నాడు మనోహర్.

“బావ, సాయంత్రం గోదారిగట్టుకి వెళ్దామా?” అనడిగింది శ్రీజ.

“సరే ..” అన్నాడు మనోహర్. ఇద్దరు కోటిలింగాల రేవు దగ్గరకు వెళ్ళారు.

“బావ..”

“మ్..”

“ఇదిగో ..” అని ఒక కాగితం అందించింది.

“ఏంటిది ?”

“చదవబోతు విషయం ఏంటి అని అడుగుతావేంటి?”

ఆ కాగితాన్ని చదవడానికి సిద్ధపడ్డాడు.

* * *

అతని కళ్ళు అక్షరాల వెంబడి పయనించాయి. అతను చదివినంతసేపూ మౌనంగా గోదావరిని చూస్తూ కూర్చుంది. ఆ కాగితాన్ని చదివి "ఏంటిది?" అన్నాడు మళ్లీ.

"అర్థం కాలేదా? బాండ్ పేపర్!" అంది.

"అది అర్థమవుతోంది.." అన్నాడు.

"అయితే సంతకం పెట్టు" అంది.

"నీకేమైనా పిచ్చా? నేను పెట్టను ఫో!!" అన్నాడు.

"పెట్టు..." అరిచింది.

"ఎందుకలా అరుస్తావ్ దెయ్యంలాగా"

"లేకపోతే సంతకం పెట్టనంటావే?"

"ఎహె, అసలు ఏంటిది? దీన్ని బాండ్ పేపర్ అంటారా? రూళ్ళ బుక్ లో మధ్య పేపర్ చించేసి పిచ్చి పిచ్చిగా ఏదో ఒకటి రాసేసి సంతకం పెట్టేయమంటే నేనెందుకు పెట్టాలి"

"పిచ్చిపిచ్చిగా రాసానా?"

"మరి కాదా..." అని అందులో ఉన్నది మళ్ళీ ఒకసారి పైకి చదివాడు.

బావ మరదళ్ల ఒప్పంద పత్రం...

1) శ్రీజ బావ అయిన నేను నా జీవితాశయం నెరవేర్చుకోవడానికి ఆమె అనుమతితోనే వెళ్ళుతున్నాను. ఆమెయే నా జీవితం అని నమ్ముతున్నాను, ఆమె లేకుండా నేను ఒక్క క్షణం కూడా జీవించలేను. అందుకే ఉదయం లేవగానే నా మరదలు ముఖం చూస్తాను. ప్రతిక్షణం ఆమెనే తలుచుకుంటూ జీవిస్తాను.

2) నా కల నెరావరడానికి నా శ్రీజనే కారణం కనుక సినిమా డైరెక్టర్ అయ్యాక, 'మనోహర్@శ్రీజ బావ' అని స్క్రీన్ మీద వేయిస్తాను.

3) నాతో పని చేసే ప్రతి హీరోయిన్ ని సిస్టర్ అని పిలుస్తాను. అందరితో సోదర భావంతో మెలుగుతాను.

పై మూడు నిబంధనలు మీరనని మనస్పూర్తిగా ఒప్పుకుంటున్నాను.

ఇట్లు ,

మనోహర్

శ్రీజ బావ

"సంతకం పెట్టు" అంది మళ్లీ.

"ఏంటి పెట్టేది? ఇలాంటి బాండ్ పేపర్ ప్రపంచంలో ఎక్కడా ఉండదు" అన్నాడు.

"అదంతా నాకు తెలియదు. పెట్టు, లేకపోతే ఒప్పుకోను"

“నువ్వు ఒప్పుకునేదేమిటి?”

“........” మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

“ప్చ్... ఏంటిది? ఇలా మొండి పట్టుపడతావేంటి?” అనడిగాడు నెమ్మదిగా

“ఏం నువ్వు పట్టచ్చు మొండిపట్లు. నేను పట్టకూడదు” అంది అలుగుతూ

“నా మీద నమ్మకం లేదా?” అనడిగాడు

“నీ మీద ఉంది. వేరే వాళ్ళ మీద లేదు” అంది.

“.... నీకు ఎలా చెప్పాలి. నీలాంటి బంగారాన్ని ఎవరైనా వదులుకుంటారా? చెప్పు!” అనడిగాడు

“....”

“సరే, ఇదిగో నీకోసం పెడుతున్నాను.” అని సంతకం పెట్టాడు. “ఇప్పుడు సంతోషమా?” అనడిగాడు.

“....” అతన్ని ప్రేమగా చూస్తూ ఉండిపోయింది.

“ఇంకా ఏంటి?” అన్నాడు.

“ఐ లవ్ యు బావ” అని అతన్ని అల్లుకుపోయింది.

మనోహర్ చెన్నై బయలుదేరాడు తన జీవితాశయం నెరవేర్చేకోవడానికి!!

* * *

బాలరాజు ఇంటిలోకి వస్తూ "డియర్ ఫ్రెండ్స్, బి రెడీ. మనం వచ్చే ఆదివారం సాయంత్రం వేలేచేరిలో జరిగే షార్ట్ ఫిలిం ఫెస్టివల్ కి అటెండ్ అవ్వబోతున్నాం" అన్నాడు.

"డబ్బులు ఇలా తగలేయద్దని చెప్పానుగా?" అనడిగాడు శీను.

"నో తగలెట్టింగ్. ఇది ఫ్రీ... ఫ్రీ... ఫ్రీ... మా ఓనర్ కొడుకు ఏదో షార్ట్ ఫిలిం తీసాడట. అది థియేటర్ లో వేస్తున్నారు. నాకో నాలుగు టికెట్స్ ఇచ్చాడు" అని చెప్పాడు బాలరాజు.

"నీ పనే బాగుంది. సరే, మేము వస్తాం" అన్నాడు శీను.

"మేము ఏంటి? నేను రాను. నాకు అలాంటివి ఇష్టం లేదు" అన్నాడు కపర్ది.

"అదేంటి కపర్ది! ఫ్రీనే కదా, సరదాగా చూసేసి బయట తలపకట్టు బిరియాని తినేసి ఇంటికొచ్చేద్దాం" అన్నాడు శీను.

"చెప్పానుగా, నాకు ఇష్టం లేదు. నన్ను బలవంతం చేయకండి, ప్లీజ్" అని చెప్పాడు కపర్ది.

“సరేరా శీను, నో ఇష్టం. నో బలవంతం. మనకి ఇంకా రెండు టికెట్స్ ఉన్నాయి ఏం చేద్దాం మరి?” అనడిగాడు వెళ్ళిపోబోతున్న కపర్దిని చూస్తూ బాలరాజు.

“రెండు ఎక్కడ ఒకటే కదా!” అన్నాడు శీను.

“ఒకటా? నాలుగులోంచి రెండు తీస్తే రెండు వస్తుంది. నువ్వు లెక్కలు ఫెయిల్ అయ్యావని ప్రతిసారి ప్రూవ్ చేసుకోనక్కర్లేదు” అన్నాడు బాలరాజు.

“నీ మొహం! మిగిలిన ఒక టికెట్ గురించి ఆలోచించు. నేను ఒక టికెట్ ఆల్రెడీ బుక్ చేసేసాను” అన్నాడు శీను.

“ఎవరికీ?” అనుమానంగా అడిగాడు బాలరాజు. సిగ్గు పడుతూ నవ్వాడు శీను.

“అమ్మనీ!! చాందినియా?” అనడిగాడు బాలరాజు.

“ఎస్” తల నిలువుగా ఆడిస్తూ చెప్పాడు శీను.

“మనిషికి మరీ ఇంత పైత్యం పనికి రాదు” అన్నాడు బాలరాజు.

“పైత్యం కాదు చైల్డ్ కింగ్.! ప్రేమ.. లవ్.. కాదల్.. గుండెల్లోంచి బయటకు పొంగే లవ్” అన్నాడు గుండెను పాముకుంటూ.

“లవ్ కాదు. లావా!! ఎప్పుడో అప్పుడు కాల్చేస్తుంది. బూడిద మిగులుతుంది.” అన్నాడు బాలరాజు.

"బూడిద కానిది ఏముంది చెప్పు లోకంలో?" అనడిగాడు శీను.

"నీకు చెప్పడం నాది బుద్ధి తక్కువ!! అయినా నువ్వు ప్రేమించడం తప్పు కాదు ...." ఏదో చెప్పబోయాడు బాలరాజు.

"... ప్రేమించిన మనిషి తప్పు అంటావా?" కోపంగానే చూసాడు శీను.

"అదికాదురా శీను...." సముదాయించబోయాడు బాలరాజు.

"నీకు అది అలా కనపడుతోందేమో! నా కళ్ళకు చాందిని ఎప్పుడు అలా కనపడదు. ఎందుకో తెలుసా? దాన్ని నేను ప్రేమిస్తున్నాను. ప్రాణం కంటే ఎక్కువగా!" అన్నాడు శీను.

"నీ ప్రేమ వల్ల నువ్వు ప్రేమించిన మనిషి బాధ పడకూడదు. కాని అలా జరగడం లేదు. అక్కడ ఆమెను కొడుతున్నారు." అన్నాడు బాలరాజు

"ఆ విషయం చాందినిని చెప్పమను. సరే, నువ్వన్నదే నిజమనుకుందాం. అన్ని దెబ్బలు తిన్నా నన్ను కలవడానికి ఎందుకు వస్తుంది? అదేంటో నాకెప్పుడు కొడుతున్నారని కూడా చెప్పలేదు. ఉన్న కాసేపు సరదాగా మాట్లాడుతుంది. వెళ్ళిపోతుంది. అంతే!" అని చెప్పాడు శీను.

బాలరాజు మౌనంగా ఉండిపోయాడు. వెళ్తున్న కపర్ది ఆగి వీళ్ళిద్దరి సంభాషణ విన్నాడు. శీను అంతగా ప్రేమించే ఆ అమ్మాయిని చూడాలనుకున్నాడు. అనవసరంగా రానని చెప్పేసాను అని అనుకున్నాడు.

వాళ్ళని గమనిస్తున్న కపర్దితో "ఇదిగో కపర్ది లాస్ట్ ఛాన్స్, వస్తానంటే రావచ్చు. వస్తే చాందినిని పరిచయం చేస్తాను." అన్నాడు శీను.

శీను మాటకు బాగా రిలీఫ్ అయ్యాడు కపర్ది. కాసేపు మౌనంగా ఉన్నట్టు నటించి "సరే, వస్తాను" అని చెప్పాడు కపర్ది.

"గుడ్ బాయ్. కీప్ ఇట్ అప్" అన్నాడు శీను నవ్వుతూ. కపర్ది కూడా నవ్వాడు.

"అబ్బా, ఇంగ్లీష్!" అన్నాడు బాలరాజు వెటకారంగా.

"ఏంట్రా! నా ఇంగ్లీష్ నే కామెడీ చేస్తావా? గుడ్ కి టెన్స్ చెప్పరా?" అనడిగాడు శీను తనకి తెలియకపోయినా.

"ఓస్, అది కూడా తెలీదా? గుడ్-గుడర్-గుడెస్ట్" అని చెప్పాడు బాలరాజు తడుముకోకుండా.

ఒక్కసారిగా పక్కున నవ్వాడు కపర్ది. 'గుడ్-గుడర్-గుడెస్ట్!!' అంటూ పకపకా పొట్ట చెక్కలయ్యేలా నవ్వాడు కపర్ది. దొరికిందే ఛాన్స్ అనుకుని "చూడరా, నీ ఇంగ్లీష్ అలా ఉంది. చూడు, నవ్వి నవ్వి చచ్చిపోయేలా ఉన్నాడు కపర్ది" అని ఆన్నాడు శీను.

"అది గుడ్-బెటర్-బెస్ట్" అని చెప్పాడు కపర్ది నవ్వాపుకుంటూ.

"ఓహో, నీకు ఇంగ్లీష్ అంత బాగా వచ్చన్నమాట?" అనడిగాడు బాలరాజు దొరికిపోయిన విషయం బయటపడకుండా.

“ఏదో , కొంచెం!” అన్నాడు కపర్ది.

“అయితే బ్యాడ్ కి టెన్స్ చెప్పు?” అనడిగాడు బాలరాజు.

“బ్యాడ్…???” ఒక్కసారిగా ఏం చెప్పాలో అర్థం కాలేదు కపర్దికి.

“నాతో పెట్టుకోకండి,” అని పక్కకి తిరిగి నాలుక బయట పెట్టి అక్కడి నుండి తొందరగా వెళ్ళిపోయాడు బాలరాజు.

“అదేంటి కపర్ది, అలా వదిలేసావ్ వాడిని?” అనడిగాడు శీను.

“.....మైండ్ బ్లాంక్ అయిపోయింది శీను. బ్యాడ్ కి???” అని ఆలోచనలో పడ్డాడు కపర్ది, “మై బ్యాడ్” అని అనుకున్నాడు.

అదొక ప్రముఖ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ. బోటనీ డిపార్టుమెంటు బయట నాటిన మొక్కలను చూసుకుంటూ నడవసాగాడు ప్రొఫెసర్ సత్యకృష్ణ. అటెండర్ ని పిలిచి “మొక్కలకి నీళ్ళు పోయలేదా ఈరోజు?” అనడిగాడు.

“ఇంకా లేదు సార్” చెప్పాడు అటెండర్. చేతి వాచ్ చూసుకున్నాడు. క్లాస్ కి ఇంకా పది నిమిషాలు ఉంది. చొక్కా చేతులు వెనక్కి మడిచి పంపుకి పైప్ బిగించి అక్కడ ఉన్న మొక్కలకి నీళ్ళు పోసాడు.

“సార్, నేను చేస్తాను కదా సార్” అన్నాడు అటెండర్.

“ఉదయాన్నే పోయాలి, మధ్యాహ్నం అయ్యాక పోయకూడదు.” అంటూ చేతి వాచ్ చూసుకున్నాడు.

“క్లాసు కి టైం అయింది నాకు, మిగిలిన మొక్కలకి నీళ్ళు పోసి వెళ్ళు” అని పైప్ అందించాడు.

క్లాసు కి వెళ్లేసరికి కెమిస్ట్రీ సార్ గురునాధం ఇంకా లెక్చర్ చెప్తున్నాడు.

“సార్, నా క్లాస్” అనడిగాడు గుమ్మం దగ్గర నిలబడి.

“ఒక్క పది నిమిషాలు సత్యకృష్ణ” అన్నాడాయన.

“సారీ సార్,” అన్నాడు వినయంగా

“సరే కాని… “ అంటూ బయటకు నడిచాడాయన.

“థాంక్యు సర్” అని చెప్పాడు సత్యకృష్ణ.

“మీకు ఒక ఐదు నిమిషాలు టైం ఇస్తున్నాను. అందరు రన్నింగ్ నోట్స్ ఓపెన్ చేసి రెడీగా ఉండండి” అన్నాడు సత్యకృష్ణ. బోర్డు క్లీన్ చేయకుండా ఉండటం గమనించి డస్టర్ తీసుకుని గబగబా చెరిపాడు. అతను చెప్పాల్సిన పాయింట్స్ రాసి, క్లాస్ వైపు తిరిగాడు.

“ఈరోజు స్పెషల్ ఏంటి?” అనడిగాడు. అందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

“హూ ఈజ్ ది ఫాదర్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్?” అనడిగాడు.

“ఎమ్.ఎస్.స్వామినాథన్” చెప్పిందో అమ్మాయి.

“గుడ్. ఈ రోజు ఆగష్టు 7, ఆయన బర్త్ డే” అన్నాడు సత్యకృష్ణ. అందరు పెదాలు సాగదీసి నవ్వారు. “బోటనీ కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. ఆయనకు మన తరఫున ఎ బిగ్ అప్లాస్” అన్నాడు. అందరు లేచి నిలబడి చపట్లు కొట్టారు.

“థట్స్ ది స్పిరిట్” అన్నాడు నవ్వుతూ.

సత్యకృష్ణ పాఠం చెప్తున్నాడు అంటే క్లాసులో ఉన్న అందరు ఇన్వాల్వ్ అయి వింటారు. అతను అడిగే ప్రశ్నలు సబ్జెక్టుని అర్థం చేసుకునే రీతిలో ఉంటాయేగాని ఏ స్టూడెంట్ ని ఇబ్బంది పెట్టేలా ఉండవు. అందుకే అతని క్లాస్ టైం తెలీకుండా అయిపోతుంది. చివరి పీరియడ్ అయినా సరే అంతే

ఉత్సాహంతో క్లాసు తీసుకుంటాడేగాని అస్సలు అలసిపోయినట్టు కనిపించడు. స్టూడెంట్స్ కి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువ ఉపయోగపడుతుందని, ప్రాక్టికల్ గా నేర్పితే థియరీ రాయడం పెద్ద విషయం కాదని ఆ పద్ధతిలోనే పాఠం చెప్తాడు. చెదరని నవ్వు అతను ఎప్పుడు ధరించే ఆభరణం. చిరాకు అతని దరిదాపుల్లో ఉండదు. సమయాన్ని చాలా విలువగా భావిస్తాడు. ఎప్పుడు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటాడు. ఖాళీగా అస్సలు కూర్చోడు. చాలా మంది స్టూడెంట్స్ సత్యకృష్ణని రోల్ మోడల్ గా భావిస్తారు.

బెల్ మోగింది. “ఓకే స్టూడెంట్స్, ఉయ్ విల్ మీట్ టుమారో” అని చెప్పి వెళ్ళిపోయాడు. అందరు గౌరవంగా లేచి నిలబడ్డారు. కాలేజీ అయిపోగానే బండి పార్కింగ్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడ గురునాధం బండి తీసుకుంటూ కనిపించారు.

“ఏమయ్యా సత్యకృష్ణ, ఒక్క పది నిమిషాలు ఆగమంటే ఆగలేకపోయావు. ఇదేమి బాగోలేదయ్య” అన్నాడు గురునాధం.

“మీరు కూడా బోర్డు క్లీన్ చేయకుండా వెళ్ళిపోవడం ఏమి బాగోలేదు సార్” అన్నాడు నవ్వుతూ

“ఆ మాత్రం బోర్డు క్లీన్ చేయకపోవడం కూడా తప్పేనా? అయినా ఏ స్టూడెంట్ ని తుడవమన్నా తుడుస్తాడు” అన్నాడాయన.

"వాళ్ళు వచ్చింది బోర్డులు తుడవటానికి కాదు. పాఠం చెప్పాక క్లీన్ చేసి పోవడం మన బాధ్యత" అన్నాడు అదే చిరునవ్వుతో

"ఏమోనయ్యా సత్యకృష్ణ, కొంచెం సడలింపు, సర్దుకుపోవడాలు ఉండాలయ్యా జీవితం అంటే. అన్నీ రూల్స్ అంటే ఎలా?" ప్రశ్నించాడు గురునాధం.

"సరే, సార్ వస్తాను. నాకు టైం అవుతోంది." చెప్పి బయలుదేరి వెళ్ళిపోయాడు.

దారిలో వెళ్తూ గుడి బయట పూలు అమ్ముకునే రమణమ్మ దగ్గర బండి ఆపాడు. రమణమ్మ శ్రీకాకుళం నుండి వలస వచ్చి ఓ గుడి బయట పూలు అమ్ముకుంటూ ఉంటుంది. సత్యకృష్ణ రాగానే అతనికోసం ఉంచిన పూలను అందించింది. అవి అందుకుని డబ్బులిస్తూ "ఏం రమణమ్మ ఎలా ఉంది వ్యాపారం?" అనడిగాడు.

"గడిచిపోతోంది బాబు" అంది చిల్లర అందిస్తూ. నుదురు అంతా నిండిపోయేలా పెద్ద బొట్టు, ముఖానికి పసుపు రాసుకుని సాయంత్రం గుడికి వచ్చే భక్తులకు పూలు, కొబ్బరికాయలు, దీపాలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తోంది రమణమ్మ. గుడి మూసేలోపు దాదాపుగా అంతా అమ్ముడైపోతాయి. ఊరిచివర ఒక పూరిగుడిసెలో ఒక్కత్తే ఉంటోంది. చిల్లర తీసుకుని బయలుదేరిపోయాడు సత్యకృష్ణ.

"ఏం రమణమ్మ ఎలా ఉన్నావ్?" అనడిగాడు అక్కడికి వస్తూ శీను. వెనకాలే బాలరాజు, కపర్ది కూడా వచ్చారు.

"బాగున్నాను శీను బాబు" అంది. రమణమ్మని చూసి నవ్వాడు బాలరాజు. "ఎలా ఉన్నావ్ బాలరాజు?" అనడిగింది. "ఇదిగో వీడు ఉండగా ఏం బాగుంటాం" అన్నాడు బాలరాజు శీనుని చూపిస్తూ. కపర్దిని చూసి ఎవరు అన్నట్టుగా అనడిగింది. "ఇతని పేరు కపర్ది, నేనే లైఫ్ ఇచ్చాను" అన్నాడు శీను.

"నీకే సరైన లైఫ్ లేదు ఇంకొకడికి లైఫ్ ఇచ్చాడట. చూసావా కపర్ది!" అన్నాడు. కపర్ది నవ్వి ఊరుకున్నాడు.

అప్పుడే మనోహర్ "అక్కడికి వచ్చి ఒక పూలమాల, కొబ్బరికాయ ఇవ్వమ్మా" అనడిగాడు. రమణమ్మ ఇచ్చి డబ్బులు పుచ్చుకుంది. డబ్బులు ఇస్తున్నప్పుడు అతని పర్సులో శ్రీజ ఫోటో చూసాడు బాలరాజు. పెదవి విరిచి కనుబొమ్మలు ఎగరేసి చూడు అన్నట్టుగా కపర్దికి సైగ చేసాడు. కపర్ది కూడా చూసాడు, కాని కనిపించలేదు.

"పర్సులో అమ్మాయి బాగుంది కదా?" అన్నాడు బాలరాజు.

"నేను చూడలేదు" అని అన్నాడు కపర్ది

"కనిపించలేదు అని చెప్పు నమ్ముతాను" అన్నాడు బాలరాజు

"సరే, నాకు కనిపించలేదు" అన్నాడు కపర్ది

"అది, అలా చెప్పు." అన్నాడు బాలరాజు. అందరు గుడి లోపలికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. శుక్రవారం అవడంతో అమ్మవారి గుడి కిటకిటలాడుతోంది. దర్శనం చేసుకుని మెట్ల మీద కూర్చున్నారు. మనోహర్ కంగారుగా అటు ఇటు తిరగడం గమనించారు ముగ్గురు.

"ఏమైంది బాసు?" అనడిగాడు శీను.

జేబులు తడుముకుంటూ "నా పర్సు.., నా పర్స్ పోయిందండి." అన్నాడు మనోహర్. కపర్ది బాలరాజుని చూసాడు.

"అతని పర్స్ పోతే నన్ను చూస్తావేంటి చిరాగ్గా." అన్నాడు బాలరాజు.

"కాష్ ఉందా?" అనడిగాడు కపర్ది.

"క్యాష్ కాక కలరా ఉండలు పెట్టుకుంటారా?" అన్నాడు బాలరాజు చిరాగ్గా.

బాలరాజు మాటను పట్టించుకోకుండా "అవునండి. డబ్బులన్నీ అందులోనే ఉన్నాయి.". అన్నాడు మనోహర్ కంగారుగా.

"మీరేం కంగారు పడకండి. ఇప్పుడే పోయింది కదా, తలోపక్క వెతుకుదాం. దొరుకుతుంది." అని చెప్పి నలుగురు నాలుగు మూలలకు వెళ్ళారు.

చాలాసేపు వెతికారుకాని లాభం లేకపోయింది. మనోహర్ మౌనంగా కూర్చుండిపోయాడు. ఇప్పుడెలా అని అనుకున్నాడు. "నువ్వేమి బాధపడకు

బాసు. మా శీను ఉన్నాడు లైఫ్ ఇవ్వడానికి" అన్నాడు బాలరాజు.

వచ్చే నవ్వుని ఆపుకుంటూ శీనుని చూసాడు కపర్ది. మనోహర్ శీను దగ్గరకి "సార్, ఒక్క రెండు రోజులు సార్, ఆ తరువాత నేనే వెళ్ళిపోతాను. మీ దగ్గర ఉన్నందుకు డబ్బులు కూడా ఇచ్చేస్తాను." అన్నాడు. శీను కాదనలేకపోయాడు. బయటే తినేసి రూం కి చేరుకున్నారు.

"అందరికి రూం లో సరిపోదు. అందుకని బయట ఇద్దరు పడుకుందాం. లోపల ఇద్దరం పడుకుందాం. ఎవరు బయట పడుకుంటారో వాళ్ళు బయట పక్క వేసుకోండి" అన్నాడు శీను. కపర్ది, మనోహర్ లోపలికి వెళ్లి పడుకున్నారు. శీను, బాలరాజు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. "లైఫ్ ఇచ్చావ్ కదా అలాగే ఉంటుంది." అన్నాడు బాలరాజు.

ఉదయాన్నే నాలుగున్నరకే లేచి బయట చలిలో పడుకున్న శీనుని, బాలరాజుని చూసాడు. దుప్పటి తీసి కప్పాడు ఇద్దరికీ. మేడ చివరి వరకు వచ్చి రోడ్ మీదకు చూసాడు. ఇంకా లైట్స్ వెలిగే ఉన్నాయి. దగ్గరలో ఉన్న టీ కొట్టువాడు అప్పుడే లేచి వ్యాపారం ప్రారంభించాడు. ఒకరిద్దరు చేరి టీ తాగుతూ సిగరెట్ కాలుస్తున్నారు. పేపర్ బాయ్ అక్కడ ఉన్న కిళ్ళి కొట్టు దగ్గర పేపర్స్ విడిచి పెట్టి సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోతున్నాడు. మార్నింగ్ ఫస్ట్ బస్సు ఒకరిద్దరి ప్రయాణికులతో జోరుగా పోతోంది. పక్కనే ఉన్న వెంకటేశ్వర స్వామి గుడినుండి సుప్రభాతం వినిపించసాగింది.

"పడుకోలేదా?" అనడిగాడు మనోహర్. ఉలిక్కిపడ్డాడు కపర్ది. "మీరా?" అన్నాడు కపర్ది.

"మెలకువ వచ్చింది" అన్నాడు కపర్ది పడుకున్న ఇద్దరినీ చూస్తూ. నిద్ర మత్తులో బాలరాజు శీను మీద కాలు వేసాడు. "నిజంగా వీళ్ళు లేకపోతే నా బతుకు ఫుట్ పాతే" అన్నాడు మనోహర్. చిన్నగా నవ్వాడు కపర్ది.

"మిమ్మల్ని ఎక్కడో చూసాను కపర్ది" అన్నాడు మనోహర్. కపర్ది మహాదేవ కొడుకని సినిమా ఇండస్ట్రీలో చాలా వరకు తెలుసు. కాని బయట ప్రపంచంలో చాలా తక్కువ మందికి తెలుసు.

"గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించవద్దు. గుర్తొచ్చినా పట్టించుకోవద్దు" అని చెప్పి అతని భుజంపై చేయి వేసి వెళ్ళిపోయాడు కపర్ది.

ఆదివారం రానే వచ్చింది. “బాసు, మా దగ్గర ఇంకో టికెట్ ఉంటే నువ్వు కూడా వచ్చేవాడివి. మేము ఇక్కడో షార్ట్ ఫిల్మ్స్ వేస్తున్నారట వెళ్తున్నాం” అన్నాడు బాలరాజు మనోహర్ తో.

తన దగ్గరున్న టికెట్ తీసి చూపించి “నాకు కూడా పాస్ ఉంది. నేను ఇక్కడకు వచ్చిన పనే ఇది. నేను తీసిన షార్ట్ ఫిల్మ్స్ కూడా వేస్తారు” అన్నాడు మనోహర్.

“సూపర్ అయితే!! మరి చెప్పవే ఆ మాట.” అన్నాడు బాలరాజు. అందరు రెడీ అయి వెళ్ళారు. మనోహర్ షార్ట్ ఫిలిం కాంటెస్ట్ టీం దగ్గరకు వెళ్ళిపోయాడు. మిగిలిన ముగ్గురు చాందిని కోసం గేటు దగ్గర ఆగారు. శీను వాచ్ చూసుకుని “ఇంకా రాలేదేంటిరా?” అనడిగాడు.

“ఏమో నాకేం తెలుసు” అన్నాడు బాలరాజు. నిజానికి వాళ్ళిద్దరి కన్నా కపర్ది చాలా ఈగర్ గా ఎదురు చూస్తున్నాడు. “అదిగో వచ్చేస్తోంది” అన్నాడు బాలరాజు. కళ్ళు తిప్పి అటువైపు చూసాడు కపర్ది.

ఆమె కళ్ళు శీనుని చూసి నవ్వాయి. లేత పసుపు రంగు చుడిదార్ కి గ్రీన్ కలర్ దుపట్ట వేసుకుని రోడ్ క్రాస్ చేస్తున్న చాందినిని చూసాడు కపర్ది. సినిమాల్లో చూపించినట్టు, బయటకూడా బొడ్డు కిందకి చీర కట్టుకుని జుట్టు విరబోసుకుని, చూడగానే వెర్రెత్తిపాయేలా ఉంటారేమో అనుకున్నాడు. కాని అది అబద్ధం అని అప్పుడు తెలిసింది. అందరిలానే మాములుగానే ఉంది.

చూడగానే ఎంత అందమైన అమ్మాయి అనుకునేలా ఉంది, అంతే కాని వేరే ఎలాంటి దురభిప్రాయం కలగలేదు ఆమెను చూస్తే.

ఆమె శీను దగ్గరకు వచ్చి "డ్రెస్ ఎలా ఉంది?" అని అడిగింది నవ్వుతూ.

"నీకేంటి చందు, సూపర్" అన్నాడు శీను.

"థ్యాంక్ యు" అంది నవ్వుతూ.

శీను ఆమె గురించి మాట్లాడింది చాలా తక్కువే అనిపించింది. అతను చెప్పిన దానికంటే వంద రెట్లు అందంగా ఉంది. మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంది ఆమె అందం. ఆమె వేశ్య అంటే నిజంగా కపర్ది గుండెల్లో కలుక్కుమంది. కారణం ఆమె అందం గురించి కాదు, ఆమె అమాయకత్వం తలుచుకుని.!!

"శీను... నీకు తెలుసా నిన్న అంతా ఖాళీనే, ఆంటీతో నిన్ను కలుస్తాను అంటే ఒప్పుకోలేదు. నిన్న అంతా ఏడ్చాను. ఇలా అయితే పని చేయను అన్నాను ఏడుస్తూ. అందుకే ఈరోజు పంపింది." అంది నవ్వుతూ.

శీనుని బాలరాజు ఎందుకు తిడుతున్నాడో అప్పుడు అర్థమైంది. ఆమె మాట్లాడుతుంటే కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి కపర్దికి.

"అలా ఏడవద్దని చెప్పాను కదా, ఎందుకు ఏడుస్తావు?" అన్నాడు శీను, చాందినితో.

“లేకపోతే ఏంటి? ఆంటీ చెప్పినట్టు చేస్తున్నాను కదా, మరి నాకిష్టమైనవి నన్ను చేయనివ్వాలి కదా” అంది బుంగ మూతి పెట్టుకుని.

“మ్, ఇంకెప్పుడు ఏడవను అని ప్రామిస్ చేయి.” అని చేయి చాచాడు.

“అయ్యో శీను, చేతులు చూడు ఎలా కాయలు కాసేసాయో!! నేను మంత్రం వేయనా తగ్గిపోతాయి” అంది అతని చేయిని పాముతూ. ప్రామిస్ మాట మర్చిపోయాడు శీను. చిన్నగా నవ్వుకున్నాడు కపర్ది.

ప్రోగ్రామ్ స్టార్ట్ అయింది. నాలుగు ఫిల్మ్స్ వేసాక నలుగురు బయటకు వచ్చేసారు. “ఇవేం ఫిల్మ్స్ రా బాబు, తలపోటు వచ్చేసింది. ఒక స్ట్రాంగ్ టీ పడాల్సిందే” అన్నాడు బాలరాజు.

“ఫ్రీగా వచ్చినవి అలానే ఉంటాయి.” అన్నాడు శీను నవ్వుతూ.

మనోహర్ అప్పుడే అక్కడికి వచ్చి “అప్పుడే వచ్చేసారేంటి, నెక్స్ట్ నాదే! నాది చూడరా మరి?” అనడిగాడు.

“నువ్వొకడివి ఉన్నావ్ కదా, పదండి.” అన్నాడు శీను. మళ్ళీ వెళ్లి కూర్చున్నారు. చాందిని తెలిసిన వాళ్ళు ఆమెను చూస్తూ కూర్చున్నారు. అది గమనించిన కపర్ది వాళ్ళ వైపు చూసాడు. వాళ్ళు తలలు తిప్పేసుకున్నారు. శీను, చాందిని ఏమి పట్టనట్టు ఫిలిం చూస్తున్నారు. మనోహర్ తీసిన షార్ట్ ఫిలిం ఎంతకి వేయలేదు. టైం అయిపోవడంతో ప్రోగ్రామ్ క్లోజ్ చేసేసారు. మనోహర్ ఎంత బ్రతిమాలినా వాళ్ళు ఒప్పుకోలేదు.

అతనికి ఏడుపొక్కటే తక్కువ. బిక్క ముఖం వేసాడు. "సరే, ఫీల్ అవ్వకు పద వెళ్దాం" అన్నాడు కపర్ది. "మీరు రూంకి వెళ్ళండి. నేను చందుని దించేసి వస్తాను" అన్నాడు శీను. మిగిలిన ముగ్గురు రూంకి వెళ్ళిపోయారు.

చాందిని శీనులు నడుచుకుంటూ వెళ్తున్నారు.

"చందూ," పిలిచాడు శీను.

"మ్.." అంది.

"నిజం చెప్పు నాతో మాటాడుతుంటే నిన్ను కొడుతున్నారా?" అనడిగాడు.

"ఏం? బాలరాజు చెప్పాడా?" అంది.

"చెప్పు.."

"అవును.."

"నొప్పిగా ఉంటోందా అలా కొడుతుంటే?"

"దెబ్బలు కొడితే నొప్పిగా ఉండదా మరి? అయినా వాళ్ళు కర్రతో కాళ్ళ మీదే కొడుతున్నారు."

"ఎందుకు అంత నొప్పి భరించడం?"

"ఇంకెంతకాలం శీను, నువ్వు ఆంటీకి డబ్బులిచ్చేసి తీసుకెళ్ళిపోతాను అని చెప్పావ్ కదా."

ఆమెను అలానే చూస్తూ ఉండిపోయాడు. ఆమె ఉండే ఇల్లు వచ్చేసింది. బయట ఆంటీ ఎదురు చూస్తోంది.

“వచ్చావా? అయ్యాయా తిరుగుళ్ళు. తొందరగా స్నానం చేసి రెడీ అవ్వు” అంది ఆంటీ.

“ఈరోజు చాందిని నాకు కావాలి” అన్నాడు శీను.

“కుదరదు.. ఆల్రెడీ డబ్బు అందింది.”

“దానికి రెండింతలు ఇస్తాను. ఈరోజు నాకు కావాలి” పంతంగా అడిగాడు.

ఆ డబ్బు ఇచ్చేసి ఆమెతో పాటు గదిలోకి వెళ్ళాడు. గడియపెట్టి లోపలికి వెళ్లారు ఇద్దరు. నువ్వు రెడీ అవ్వు అన్నాడు. వెళ్లి మంచం మీద కూర్చున్నాడు. ఆమె స్నానం చేసి వచ్చింది.

“ఇంక హాయిగా పడుకో చందూ!” అన్నాడు.

ఆమె పడుకుంది. ఆమె కాళ్ళ దగ్గరకు జరిగి కూర్చుని ఆమె కాళ్ళని ఒళ్లోకి తీసుకుని కాళ్ళు ఒత్తాడు. “నువ్వు హాయిగా పడుకో” అన్నాడు. అతని కళ్ళల్లో ఆత్మీయత. ఆమె కళ్ళలో సన్నటి కన్నీటి తెర. ఆమె అలానే అన్నట్టుగా తలూపి నిశ్చింతగా నిద్రపోయింది. అలా చాలాసేపు ఆమె కాళ్ళు పట్టి అతను కూడా అక్కడే ఎప్పటికో నిద్ర పోయాడు.

మిగిలిన ముగ్గురు రూంకి చేరుకున్నారు. "ఇంకా పడుకోలేదా?" అని అడిగాడు బాలరాజు.

"లేదు, శీను వస్తాడేమో" అని అన్నాడు కపర్ది.

"వాడు అక్కడే పడుకుని ఉదయం వస్తాడు. నువ్వు పడుకో" అని పక్కకి తిరిగి దుప్పటి పూర్తిగా కప్పుకున్నాడు బాలరాజు. ఆ పక్కనే ఉన్న మనోహర్ తల మీద చేయి వేసుకుని తిరుగుతున్న ఫ్యాన్ ని తదేకంగా చూస్తూ పడుకున్నాడు. అతని కన్నీరు చెంపలను తాకింది. అతని మనసు శ్రీజ మీదకు మళ్ళింది. "నువ్వు తప్పకుండా సాధిస్తావ్ బావ. నేను చెప్తున్నాను కదా" అన్న ఆమె మాటలు గుర్తుకు వచ్చాయి. ఎవ్వరి బాధలను పట్టించుకోకుండా కాలం కదిలిపోయింది. చీకటిని చీల్చుకుని సూర్యుడు పొడుచుకుని వచ్చాడు.

ఉదయాన్నే వచ్చేసాడు శీను. అప్పటికి ఇంకా ఎవరు లేవలేదు. బయటకు వెళ్లి ఉన్న డబ్బులతో నలుగురికి టిఫిన్స్ తెచ్చాడు. వాళ్ళు లేచి ముఖాలు కడుక్కుని టిఫిన్స్ చేసారు.

“నీ సాయం ఎన్నటికి మర్చిపోలేను శీను” అన్నాడు మనోహర్

“మర్చిపోకు” అన్నాడు శీను. నవ్వారు మిగిలిన ఇద్దరు.

“అది సరే కాని చెన్నై ఎందుకు వచ్చావ్ అసలు?” అనడిగాడు బాలరాజు.

జరిగిన విషయం అంతా చెప్పాడు మనోహర్. “ఏంటేం..టేం..టేంటి!! సంవత్సరంలో డైరెక్టర్ అయిపోతాను అని శపథం చేసి వచ్చావా?” అని అడిగాడు బాలరాజు.

“అవును” అన్నాడు మనోహర్.

“ఇంజనీరింగ్ అవడానికి ఎన్నేళ్ళు చదివావు?” అనడిగాడు.

“నాలుగేళ్ళు”

“అదేం, సంవత్సరంలో అవగోట్టేయకపోయావా?”

“వెటకారమా?”

“నువ్వు అక్కడ చేసి వచ్చినదాన్ని ఏమంటారు.. వెటకారం కాదా?”

“అప్పుడు నాకు వేరే దారి లేదు. అందుకే అలా చెప్పి వచ్చాను. అయినా నాకు నమ్మకం ఉంది.” అన్నాడు మనోహర్.

“పిచ్చి లోకం…” అని అనుకున్నాడు.

“అయి చూపిస్తాను” అని లేచి నుంచున్నాడు మనోహర్.

“చేసిన శపథమే ఎన్ని సార్లు చేస్తావ్.. కూర్చో!!” విసుక్కున్నాడు బాలరాజు. మౌనంగా కూర్చున్నాడు.

“సరే, నీకో టెస్ట్ పెడతాను. పాస్ అయితే అప్పుడు నమ్ముతాను” అన్నాడు బాలరాజు.

మౌనంగా చూసాడు మనోహర్. “నేనో కథ చెప్తాను, తరువాత ఏంటో గెస్ కొట్టు చూద్దాం!” అన్నాడు బాలరాజు.

సరే చెప్పు అన్నాట్టుగా చూసాడు మనోహర్. కపర్ది, శీనులు ఇద్దరి సంభాషణ వినడానికి సిద్ధపడ్డారు నవ్వుతూ.

“అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఎంతమంది కొడుకులు.?” అనడిగాడు బాలరాజు.

“ఏడుగురు” అన్నాడు మనోహర్.

“నీ మొహం!! ఎప్పుడు ఏడుగురేనా? ఇంక ఆ రాజుకి వేరే పనేమీ లేదనుకున్నావా? ఆ రాజుకి అసలు కొడుకులే లేరు.”

"కొడుకులే లేరా?"

"అవును, అందుకోసం ఆయన ఒక యాగం ప్రారంభించాడు. ఏంటా యాగం?"

"పుత్రకామేష్టి యాగం"

"మళ్లీ నీ మొహం. కళ్యాణసాఫల్య యాగం"

"అంటే, ఆ రాజుకి ఇంకా పెళ్లి అవలేదా?"

"అవును, అందుకే పిల్లలు లేరని చెప్పాను"

"ఓహో"

"ఆ యాగానికి ఎవరెవరిని పిలుద్దాం అనుకున్నాడు?"

"ఇంకెవారిని పిలుస్తారు. ఆ యాగం జరిపించే పురోహితులను, బ్రాహ్మణులను"

"నీ మొహం.. వాళ్ళే ఈ యాగం నిర్ణయించాక మళ్లీ వాళ్ళని పిలవడం దేనికి?"

"మరి?"

"చుట్టు పక్కల ఉన్న రాజ్యాల రాజులను సపరివారంగా పిలిచాడు"

"ఓ.. వాళ్ళలో ఎవరైనా రాకుమారిని చూసి పెళ్లి చేసుకోవడానికి కాబోలు"

“కాదు”

“కాదా, మరి?”

“ప్రెస్టేజ్ కోసం”

“ఓహో... తరువాత?”

“యాగం అయిపోయింది.. కథ అయిపోయింది.” అన్నాడు.

“నువ్వేం పట్టించుకోకు మనోహర్, వాడు అంతే! అలా ఏదో ఒకటి అంటూ ఉంటాడు.” అన్నాడు శీను.

“అదేం లేదులే, నిజంగా బాలరాజు భలే కథ చెప్పాడు. నాకు ఛాన్స్ వస్తే కామెడీ సీన్స్ రాయించుకోవచ్చు” అన్నాడు మనోహర్.

“దట్స్ ది స్పిరిట్” అన్నాడు కపర్ది నవ్వుతూ. “అంటే నన్ను కమెడియన్ని చేసావ్ అన్నమాట” అన్నాడు బాలరాజు.

ఆ రాత్రి శ్రీనుతో కపర్ది “నాకు ఈ కూలి పని చేయడం చాలా కష్టంగా ఉంది” అని అన్నాడు.

“మానేస్తావా? మరి వేరే పని ఇప్పించెంత సీన్ లేదు నాకు” అన్నాడు శ్రీను.

“నువ్వేం ఇప్పించద్దు. నేనే చూసుకుంటాను. నేను చదివిన చదువుకి ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుంది. సర్టిఫికెట్స్ కోసం ఇంతకాలం ఆగాను.

ఇప్పుడు సర్టిఫికెట్స్ వచ్చేస్తున్నాయి, అవి రాగానే నేను ఉద్యోగం వెతుక్కుంటాను."

"మరి అదేదో వచ్చే ముందే తెచ్చేసుకుంటే ఇంత అల్లరి ఉండేది కాదు కదా?" అనడిగాడు.

"ఇక్కడికి రావాలని రాలేదు. అలా అప్పటికప్పుడు బయలుదేరాను. స్టేషన్ కి చేరుకున్నాను. అప్పుడు ఉన్న ట్రైన్ టికెట్ తీస్కుని ఇక్కడికి వచ్చేసాను,"

"అంటే చెప్పకుండా వచ్చావా?"

అవును అన్నట్టుగా తలూపాడు కపర్ది.

"ఎందుకలా చేసావ్?"

".... చెప్తానులే, టైం వచ్చినప్పుడు." అన్నాడు కపర్ది. మళ్లీ ఈ విషయం గురించి డిస్కస్ చేయలేదు.

అనుకున్నట్టుగానే సర్టిఫికెట్స్ పోస్ట్ లో వచ్చాయి. అవి పట్టుకుని ఉద్యోగ వేట కోసం బయలుదేరాడు. ఒక ప్రైవేటు ఎం.బి.ఎ కాలేజీలోకి వెళ్లి ఉద్యోగం ఏమైనా ఉందేమో వాకబు చేసాడు. వాళ్ళు ఇంటర్వ్యూ కండక్ట్ చేసి కపర్దికి జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం ఇచ్చారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి లేట్ అయింది. శ్రీను, మనోహర్ ఎదురుచూస్తున్నారు కపర్ది కోసం.

“ఏమైంది?” అని అడిగాడు మనోహర్. నవ్వాడు కపర్ది. శ్రీను, మనోహర్ లు కూడా నవ్వారు.

“అయితే పండు అన్నమాట” అన్నాడు శ్రీను.

“అవును, జాబు వచ్చింది. ఈరోజు నుండి ఈ రూం రెంట్ బాధ్యత నాది” అన్నాడు కపర్ది.

“నేను ట్రై చేస్తున్నాను శ్రీను, నాకు కొంచెం టైం ఇవ్వు శ్రీను, నేనూ ఎందులో అందులో సర్దుకుంటాను.” అన్నాడు మనోహర్.

“ఇంత చదువుకున్న నువ్వు నా దగ్గర ఇలా బతిమాలడం ఏం బాలేదు బాసు. నేను చేసింది చాలా చిన్న సాయం” అన్నాడు శ్రీను. అప్పుడే బాలరాజు వడివడిగా వచ్చాడు. గంభీరంగా ఉన్న వాళ్ళ ఫేసులు చూసి “అంతా ఓకే కదా” అనడిగాడు. “డబల్ ఓకే” అన్నాడు శ్రీను.

***

కాలేజీ నుండి ఇంటికి వెళ్ళాడు సత్యకృష్ణ. ఇల్లు అంతా నీట్ గా తుడిచేసాడు. స్నానం చేసి దేవుడి గదిలోకి వెళ్ళి పూజ చేసుకుని ధ్యానం చేసాడు. అలమారులో ఉన్న పుస్తకాన్ని తీసుకుని గంట అలారం పెట్టుకుని చదివాడు. తరువాత మేడ పైన కాసేపు వాక్ చేసి కిందకు వచ్చి వంటకు కుక్కర్ పెట్టేసి, కూరలు తరిగాడు. వండుకుని తినేసి పడుకునే ముందు తరువాత రోజు చెప్పే పాఠం ఒకసారి చూసుకుని పాయింట్స్ నోట్ చేసుకున్నాడు. పక్క సర్దుకుని డైరీ తీసుకున్నాడు రాయడానికి. పేజి మార్క్

దగ్గర డైరెక్ట్ గా తెరిచాడు. ఆరోజు విశేషాలు రాసుకున్నాడు. ముందు రోజు ఏం రాశాడో చూసాడు. అదే ఉంది, అంతకు ముందు..., అంతకు ముందు..., ఇంచుమించుగా అతని జీవితంలో అన్నీ ఒకే రంగు కాగితాలు. డైరీలో ఇంకొంచెం ముందుకు పేజీలు తిప్పబోయాడు. ధైర్యం చాలలేదు. స్పీడ్ గా డెస్క్ డ్రాయర్ ఓపెన్ చేసి డైరీని అందులోకి విసిరేసి అంతే స్పీడ్ గా మూసేసాడు. “టక్”మనే శబ్దంతో అది మూసుకుంది. బెడ్ లైట్ ఆపేసి నిద్రపోయాడు. ఉదయాన్నే లేచి అంట్లు తోమేసుకుని స్నానం చేసి కాలేజీకి స్టార్ట్ అయిపోయాడు. డెస్క్ డ్రాయర్ లో ఇరుక్కుపోయిన డైరీలోని ఒక పేజీలో ఇలా ఉంది

“అదేంటో!! నీ జ్ఞాపకం నా కన్నీరు ఒకేసారి వస్తాయి. నన్ను నాలా బతకనీయక నానా హింస పెడతాయి. గతంలోకి ఈడ్చుకుపోయి, నా జీవితాన్ని గాడి తప్పించడానికి ప్రయత్నిస్తాయి. సగటు మనసున్న మనిషినే కదా?! అప్పుడప్పుడు ఇరుక్కుపోయి కొట్టుకుంటాను. బయటపడే ప్రయత్నం చేయాలని కూడా చూడను. ఎందుకంటే.. నువ్వు అందమైన గతానివి. అర్థం లేని ప్రస్తుతానివి. గమ్యం లేని భవిష్యత్తువి. లాభం లేదు. తేరుకుని ఒక్క అడుగైనా ముందుకు వేయాలి. అదిగో వేసాను... బలవంతపు చిరునవ్వుతో!!”

అతను వెలుగులో ఉన్నా, అతని మనసు మాత్రం అలా చీకట్లో మిగిలిపోయింది. సరాసరి కాలేజీకి వెళ్ళాడు.

గీత కూడా అదే కాలేజీలో లైబ్రేరియన్ గా ఉద్యోగం చేస్తోంది. లైబ్రేరీ వైపు వస్తున్న గీతని చూసి పలకరింపుగా నవ్వాడు సత్యకృష్ణ. ఆమె కూడా చిన్నగా నవ్వి "గుడ్ మార్నింగ్ సార్ " అంది.

"గుడ్ మార్నింగ్ గీతా .." అని తాను పట్టుకొచ్చిన పుస్తకం ఇచ్చి "రెన్యూవల్ చేయాలమ్మా.." అన్నాడు.

"సరే, సార్.." అని పుస్తకం అందుకుంది. డీటెయిల్స్ ఎంటర్ చేసి "సార్, ఈ పుస్తకం మన లైబ్రేరీలో ఒకటే ఉంది. చాలా మంది స్టూడెంట్స్ దీని గురించి అడిగారు, మీరు ఏమి అనుకోనంటే మీకు కావలసిన చాప్టర్స్ xerox తీయించుకుంటారా?" అని అడిగింది.

"ఓహ్.. తప్పకుండా.. కానీ ఒకటి! xerox అనకూడదు. అది ఒక కంపెనీ పేరు. ఫోటో స్టాట్ కాపీ అనాలి." అని చెప్పాడు.

"ఏదో వాడుక భాషలో చెప్పిందిలేవయ్యా ..." అని అన్నాడు గురునాధం అప్పుడే లైబ్రేరీలోకి వస్తూ.

"పరావలేదు సార్, నాకు తెలియని విషయం సార్ చెప్పారు." అంది గీతా.

"నువ్వు ఈయనకే సపోర్టా..." అన్నాడు గురునాధం. నవ్వి ఊరుకుంది.

సత్యకృష్ణ తనకి అవసరమైన టాపిక్స్ ఫోటో స్టాట్ కాపీ తీసుకుని పుస్తకాన్ని సబ్మిట్ చేసేసాడు.

"అదేమిటయ్యా మరీ అంత పిసినారివాడిలా ఒక పేపర్ కి నాలుగు పేజీలు కలిపి తీసుకున్నావ్..? కాలేజీ పేపరే కదా , ఒక్కో పేజీ తీసుకోవచ్చు కదా.." అనడిగాడు గురునాధం

"ఒక్కో పేపర్ తయారవడానికి ఎన్ని చెట్లు కొట్టాలో తెలుసా సార్. అందుకే ఎంత తక్కువ వీలు అయితే అంత తక్కువ తీసుకున్నాను. నిజానికి రాసుకుందాం అనుకున్నాను, టైం లేక ఇలా ఫోటో స్టాట్ కాపీ తీసుకున్నాను" అని చెప్పాడు సత్య.

"బాటని లెక్చరర్ అనిపించావ్" అన్నాడు గురునాధం. ఇద్దరూ అక్కడినుండి ఎవరి క్లాసెస్ కి వాళ్ళు వెళ్లిపోయారు.

కాలేజీలో ఉన్న అందరి స్టూడెంట్స్ కి కాలేజీ వెబ్ సైట్ లో ఎకౌంట్స్ ఉన్నాయి. స్టూడెంట్స్ కి, లెక్చరర్స్ అందరికి కాలేజీ మెయిల్ ఐడి ఒకటి ఇవ్వబడుతుంది. కాలేజీకి సంబంధిన అన్ని వివరాలు ఎప్పటికప్పుడు ప్రతి విద్యార్థికి మెయిల్ రూపంలో నోటిఫై అవుతూ ఉంటాయి. లైబ్రరీ నుండి తీసుకున్న పుస్తకాలు తిరిగిరావాల్సినవి ఎక్కువ ఉండటంతో వాళ్ళ లిస్ట్ ఒకటి తయారు చేసి, అందులో ఎవరెవరు ఎన్ని రోజుల డ్యూ ఉన్నారో సార్ట్ అవుట్

చేసి అలా గ్రూప్స్ వారీగా అందరికి మెయిల్ సెండ్ చేసింది గీత. పని కొంచెం ఎక్కువ ఉండటం వలన చీకటి పడింది.

ఇంటికి వెళదామని కాలేజీ బయటకు వచ్చి ఆటో కోసం పిలిచింది. ఒక ఆటో రావడంతో ఆపి తాను వెళ్లాల్సిన స్టాప్ చెప్పి ఎక్కింది. ఆటో వాడు కొంచెం దూరం మామూలు స్పీడ్ గా వెళ్లినా ఒక్కసారిగా స్పీడ్ పెంచి డ్రైవ్ చేయడం ప్రారంభించాడు.

"అన్నా, అంత స్పీడ్ ఎందుకు అన్నా.." అంది గీత. ఆటో డ్రైవర్ పట్టించుకోలేదు.

"అన్న...నిన్నే.." అని పిలిచింది. అతను పట్టించుకోలేదు. హారన్ మోగించుకుంటూ మరింత వేగంగా ఆటోని నడుపుకుంటూపోతున్నాడు. గీతకి భయం వేసింది. రోడ్ అంతా దాదాపుగా నిర్మానుష్యంగా ఉంది. కొండకొచో ఉన్నారు. అదే సమయంలో కపర్ది ఇంటికి కావలసిన సామాన్లు కొనుక్కుని ఆటో కోసం రోడ్ మీద ఎదురు చూస్తున్నాడు. గీత అప్పటికే అరవడం మొదలెట్టింది. ఆటో ఆపడం కోసం చేయి చాపాడు కపర్ది. ఆటో వాడు స్పీడ్ గా వెళ్లిపోవడం, అందులో గీత అరవడం అంతా చూసిన కపర్ది ఆటో వెనకాల పరిగెత్తాడు.

గీతా బయటకు చూస్తూ "హెల్ప్ మీ.... సార్..." అని అరిచింది.

“మీ దగ్గర హ్యాండ్ బాగ్ ఉందా???” అనడిగాడు అరుస్తూ పరిగెడుతూనే...

“ఏంటి....??” అనరిచింది.

“బ్యాగ్...బ్యాగ్...” అంటూ తన దగ్గరున్న బ్యాగ్ ని చూపిస్తూ అరిచాడు.

“ఉంది..” అరిచింది.

“దాన్ని వాడి మెడకు చుట్టి మెలి పెట్టండి...” అంటూ పరిగెత్తుతూనే నటించాడు తన దగ్గర బాగ్ ని మెడకి బిగించుకుంటూ.

ఆమె క్షణం కూడా లేట్ చేయకుండా ఆటో డ్రైవర్ మెడకు చుట్టి ఉచ్చు బిగించింది. కాసేపు గింజుకున్నాడు. వెనక కపర్ది పరిగెత్తుతూనే ఆటోని వెంబడించాడు. ఆమె మరింత గట్టిగా బిగించి , పెన్ తీసి చెవిలో పొడిచింది. ఆటో వాడు స్పీడ్ తగ్గించేసాడు.

కపర్ది త్వరగా ఆటోని చేరుకొని, రన్నింగ్ లో ఎక్కి ఆమె పట్టుకుని ఉన్న దాన్ని మరింత బలంగా బిగించాడు. అతనికి ఊపిరి సలపలేదు. బ్రేక్ వేసి ఆటోని ఆపేసాడు. ఆటో డ్రైవర్ ని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు.

“చాలా థ్యాంక్స్...” అంది.

“పరవాలేదండి...” అన్నాడు ఇంకా ఆయాసపడుతూ.

"ఇంకా ఆయాసపడుతున్నారా…?" అనడిగింది.

"హ… కొంచెం ఆస్తమా ఉంది. తగ్గిపోయిందిలెండి. బాగా పరిగెత్తాను కదా… అందుకే ఇలా… కాసేపు అయితే సర్దుకుంటుంది.." అని చెప్పాడు ఆయాసపడుతూనే

"సారి…" అంది. చిన్నగా నవ్వాడు. "పదండి మీ ఇంటి దగ్గర దింపేస్తాను.." అన్నాడు.

ఆమెను ఇంటి దగ్గర దించేసి "వస్తానండి…" అని చెప్పాడు.

"కాసేపు ఉంటే నాన్న వస్తారు.." అంది పరిచయం చేద్దాం అని.

"హ్మ్మ్, ఇప్పుడు వద్దులెండి. మళ్ళీ వస్తాను .." అన్నాడు.

"థ్యాంక్స్ అగైన్…" అంది.

"పరవాలేదండి.." అని బయలుదేరిపోయాడు.

కాసేపు అయ్యాక విరించి వచ్చాడు.

"పది నిమిషాలు ముందు రావచ్చు కదా నాన్నా" అంది.

"ఆ విషయం నాకు ఒక ఇరవై నిమిషాల ముందు బీచ్ దగ్గరకి వచ్చి చెప్పాల్సింది కదా మరి" అన్నాడు విరించి

"అది కాదు నాన్నా…"

"ఏది కాదు…"

“అది కాదు నాన్న...” అంటూ జరిగిన విషయం చెప్పి “అతన్ని పరిచయం చేద్దాం అని అనుకున్నాను” అంది. ఆమె విషయం చెప్తున్నప్పుడు తండ్రిగా కించిత్ భయబడ్డాడు. కానీ అంతా విన్నాక ఊపిరి పీల్చుకున్నాడు.

“అతను ఎవరో , పేరేంటో కనుక్కున్నవా?” అని అడిగాడు.

“లేదు నాన్నా. ఈసారి కనిపిస్తే తప్పకుండా కనుక్కుంటాను..” అంది.

***

భోజనం పూర్తి చేసుకుని తన గదిలో కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి వెళ్ళాడు మహాదేవ. కపర్ది ఇంటిలో నుండి వెళ్లిపోవడంతో చాలా వరకు రాయడం తగ్గించేసాడు. ప్రొడ్యూసర్స్ కూడా మహాదేవని తొందరగా రాయమని చెప్పడానికి ధైర్యం చేయలేకపోయారు. అతని పాట ఉంటే కథకు ఒక రకమైన బలం చేకూరుతుంది అని ఒక నమ్మకం. వంటవాడు డైనింగ్ టేబుల్ సర్దుకునే పనిలో ఉన్నాడు. అప్పుడే ఓ ఇద్దరు అక్కడికి వచ్చి “మహాదేవగారు ఉన్నారా?” అనడిగారు.

“ఉన్నారు, పడుకున్నారు..” చెప్పాడు వంటవాడు.

“హ్మ్, ఎప్పుడు లేస్తారు?” అనడిగాడు వారిద్దరిలో చిన్నగా ఉన్నవాడు.

“ష్..” పరవాలేదు వెయిట్ చేస్తాము అన్నాడు పెద్దగా ఉన్నవాడు.

వంటవాడికి విషయం అర్థమైంది. ఏదో పాట రాయించుకోవడానికి వచ్చారని. పెద్దగా ఉన్నవాడు ప్రొడ్యూసర్ అని, మాములుగా ఉన్నవాడు

డైరెక్టర్ అయి ఉంటాడని తొందరగానే పసిగట్టాడు. నిజానికి అతనికి అలవాటు అయిపోయింది.

"సరే.. కూర్చోండి." అన్నాడు వంటవాడు.

అక్కడే గెస్ట్ హాల్ లో కూర్చున్నారు. ఆ గది నిండా మహాదేవకి వచ్చిన అవార్డ్స్, వాటికి సంబంధించిన ట్రోఫీలు ఉన్నాయి. అవన్నీ చూస్తూ కూర్చున్నాడు డైరెక్టర్. ప్రొడ్యూసర్ మాత్రం ఫోన్ లో ఏవో చూసుకుంటూ కూర్చున్నాడు.

"తీసుకోండి.." అంటూ టేబుల్ మీద కాఫీ పెట్టేసి వెళ్ళిపోయాడు వంటవాడు.

మహాదేవ కోసం వాళ్ళు గంట సేపు ఎదురు చూసారు.

"ఇంకెంత సేపు సార్ .." అన్నాడు కుర్ర డైరెక్టర్.

"ఉండవయ్యా బాబు.. అసలే చెప్పాపెట్టకుండా వచ్చాము.. పెద్దాయన ఏమంటాడో అని నేను టెన్షన్ పడుతుంటే"

"ఏమనరండి...ఆయన మనసు మంచిది"

"హా, నువ్వే చెప్పాలి ఆయన గురించి"

అప్పుడే మహాదేవ ఆ గదిలోకి వచ్చాడు. ఇద్దరు లేచి నుంచున్నారు. నమస్కారం అన్నారు. మహాదేవ ప్రతి నమస్కారం చేసాడు. అతని కుర్చీలో

కూర్చున్నాడు.

“నా పేరు కిరీటి సార్” పరిచయం చేసుకున్నాడు డైరెక్టర్. ఈయన ప్రొడ్యూసర్ ‘రాఘవ గారు’ చెప్పాడు పరిచయం చేస్తున్నట్టుగా. నెమ్మదిగా వినయంగా కుర్చీలో చిన్నగా కదిలాడు.

“చెప్పండి”

“మేము తీయబోయే సినిమా కి మీరు పాటలు రాయాలి సార్” అన్నాడు డైరెక్టర్.

“నేనే ఎందుకు రాయాలి?” వెనక్కి వాలుతూ అడిగాడు.

“మీరు రాసిన పాటలన్ని సూపర్ హిట్ సార్. అందుకే” అని చెప్పాడు ప్రొడ్యూసర్.

“అంటే... నేను రాసుకున్న కథకు మీరు పాటలు రాస్తేనే న్యాయం చేయగలరనిపించింది సార్.. అండ్ మాది చిన్న సినిమా. మీరు నాలాంటి వాళ్ళని చాలా మందిని ప్రోత్సహించారు, మమ్మల్ని కూడా ప్రోత్సహిస్తారని నమ్మకం కూడా ఉంది.”

“ఎన్ని పాటలు?”

“మొత్తం ఐదు పాటలు సార్..”

“సిట్యువేషన్ అన్నీ రాసి ఇవ్వండి. చూద్దాం.”

“సరే సార్.. అండ్.. మీరు అడిగినంత ఇచ్చుకోలేం సార్. కొంచెం కన్సిడర్ చేయండి.”

వాళ్ళని సూటిగా చూసాడు. ప్రొడ్యూసర్ అయితే పొమ్మంటాడేమో అని డిసైడ్ అయిపోయి మైండ్ ని ప్రిపేర్ చేసుకుంటున్నాడు.

“అవన్నీ తరువాత, ముందు సిట్యుయేషన్స్ ఇవ్వండి” అని చెప్పాడు. ఇద్దరు మహదానందపడిపోయారు.

“థ్యాంక్యూ సార్ .. థ్యాంక్యూ సార్” అని చెప్పారు ఇద్దరు.

***

ప్రతి మనిషి జీవితంలో కొన్ని ప్రదేశాలు, కొంత మంది వ్యక్తులు కనిపించకూడదని వినిపించకూడదని కోరుకుంటాడు. కానీ జీవితం మాత్రం ఎప్పుడు పుండు మీద కాకి పొడిచినట్టు ప్రతిసారి ఏదో రకంగా గతాన్ని గుర్తు చేసి ఇబ్బందిపెడుతూనే ఉంటుంది.

సత్యకృష్ణ సూపర్ మార్కెట్లో తనకు కావాల్సిన నెల సరుకులను తీసుకుని కార్ట్ లో వేస్తున్నాడు. వెనకనుండి 'రాధికా' అన్న పిలుపు వినపడింది. వెంటనే వెనక్కి తిరిగి చూసాడు. "వస్తున్నా .." అంటూ ఒకావిడ ఆ పిలిచిన వ్యక్తి దగ్గరకి వెళ్ళింది.

రాధిక.. ఆ పేరు.. పరిచయం.. పరిణయం.. ప్రళయం.. విరహం.. వేదన.. వేదాంతం.. వైరాగ్యం.. అతని మస్తిష్కంలో కదలాడేదేదో కూడా తెలియని విచిత్రమైన దైన్య పరిస్థితి.

"భూమి పరిభ్రమణం చెందుతూ కాలాన్ని నెట్టేస్తుంది. కానీ ఈ ప్రేమ ఆ కాలాన్ని వెనక్కి లాగేసి మనసనే చెరసాలలో జీవిత ఖైదీని చేసి బాధిస్తుంది."

అతను ఆమెకు మనసిచ్చాడు. కానీ ఆమెకు కావలసింది మనసు కాదు, అంతకు మించినదేదో. పెళ్లి అయిన తరువాత ఆమె ఊహించిన జీవితం ఆమెకు అతనివ్వలేకపోయాడో లేక అతనిచ్చింది ఆమెకు సరిపోలేదో తెలియదు కానీ అతని నుండి విడిపోవడానికి ఆమె వంద కారణాలు పైనే దగ్గర పెట్టుకోగలిగింది.

అది దాంపత్య వైఫల్యం కాదు. అవగాహనా లోపం, అర్థం చేసుకోలేని తత్త్వం!! ఆమె కోరికల గుబ్బాల రెక్కలకు బలమెక్కువ. అవి ఎప్పుడు విహంగ వీక్షణాలు చేయాలని పరితపించిపోతుండేవి. కానీ అవన్నీ అతని జీవితంలో ఒక భాగం మాత్రమే. ఆమెకు అదే జీవితం..!!

సింపుల్ గా వారి జీవితాలకు ఈక్వేషన్ చేస్తే 'అతని ప్రేమ, సహనం ఈజ్ గ్రేటర్ దాన్ ఆమె సహనం, ప్రేమ'. ఆలుమగలు మధ్య అలకలు ఉండచ్చేమో కానీ అపార్థాలు ఉండకూడదు.

ఆ పరిస్థితుల నుండి పారిపోవాలని చాలా ప్రయత్నించాడు. ప్రమాదం నుండి అయితే తప్పించుకోవచ్చు కానీ ప్రేమ నుండి తప్పించుకోలేకపోయాడు. వద్దనుకునే ప్రేమ దగ్గరకు రాకపోవచ్చేమోగాని దూరమైన ప్రేమ ఏదో ఒక రూపంలో దగ్గరకు వచ్చి బాధ పెడుతూనే ఉంటుంది. అదే అతని విషయంలో జరిగింది. ఎవరో మహానుభావుడు చెప్పినట్టు ప్రేమ గురించి ప్రేమలో విఫలమైన వాడిని అడుగు , బాగా చెప్తాడు అన్నమాట అతని విషయంలో అక్షర సత్యం.

"హలో సార్.." ఎవరో విష్ చేసేసరికి ప్రస్తుతంలోకి వచ్చాడు.

"హాయ్..." అన్నాడు చిరునవ్వుతో. బిల్ పే చేసి ఇంటికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

డైరీ తీసుకుని అందులో తన భార్య ఫోటోని తడిమాడు తడిసిన కళ్ళతో. అందులో ఇలా రాసుకున్నాడు....

“తొలకరి జల్లులు పడుతున్న సమయాన నీ పాదాల గజ్జల సవ్వడి ఆ వర్షపు చినుకుల శబ్ధంలో లయమవుతుంటే నన్ను నేను మరిచిపోయిన క్షణాలు నాకు తిరిగిరావు.

నువ్వు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నప్పుడు చలించిపోయి నా చేయి నీ చెంపను చేరడానికి పడే తపన తిరిగి రాదు.

నీ దారిన నువ్వు వెళ్తూ ఎదురైనపుడు, గుండె లయతప్పి కొట్టుకునే సందర్భాలు నాకు తిరిగిరావు.

నీవు నా ప్రేమనే కోల్పోయావు. నేను నా జీవితాన్ని కోల్పోయాను.

కళ్ళతో చూస్తూ ఉండిపోవాలనుకున్నాను. కంటి నీరులా జారిపోయావు.

గుండెల్లో పెట్టుకుని చూసుకుందామనుకున్నాను. గుండెగదిని వీడిపోయావు.

నా జీవితం నీ పాదాల చెంత ఉంచుదామనుకున్నాను. నీ జీవితంలో అడుగు చోటు కూడా లేదన్నావు.

ప్రతిక్షణం నీ గురించి తపించిపోయాను. క్షణంలో కొట్టిపాడేసావు.

నా మనసుకు చిరునామా నీవనుకున్నాను. మనసేలేనివాడిని చేసావు.

సుతిమెత్తని నా హృదయాన్ని గాయపరచి నవ్వుకున్నావు. కాని నీకు తెలియదు నీ నవ్వే నాకు ఆనందమని...”

డైరీని మూసి కళ్ళు మూసుకున్నాడు.. ఆలోచనలు మనసుని ముసిరేస్తే ఆకలి ఉండదు. కంట నీరు చేరితే నిద్ర ఉండదు. కడుపులో ఉన్న బాధకి కలత నిద్రే పట్టింది తరువాతెప్పుడో!!

***

రమణమ్మ ఇంటికి చేరుకునే సరికి రోజూ రాత్రి ఎనిమిది అవుతుంది. అప్పుడు వెళ్లి అన్నం వండుకుని తినేసి పడుకుంటుంది. రమణమ్మ తన ఇంటిలోకి ఎవరినీ రానివ్వదు. పూరి గుడిసెలో ఉంటున్న రమణమ్మ వలస వచ్చినప్పటి నుండి ఆమె ఇంటి దగ్గరకి ఎవరు వచ్చినా బయటకు వచ్చే మాట్లాడుతుంది. బయట నిలబెట్టే మాట్లాడుతుందే తప్ప, ఇంటిలోకి ఆహ్వానించింది లేదు.

ఆ రోజు శీను పని అయ్యేయేసరికి లేట్ అయింది. బాగా దాహం వేయడంతో, దారిలోనే రమణమ్మ ఇల్లు ఉండటం వలన ఆవిడ ఇంటికి వెళ్లి తలుపు కొట్టాడు.

అన్నం వడ్డించుకుంటున్న రమణమ్మ చప్పుడు అవుతున్న తలుపు వంక చూసింది.

"(యారు ..) ఎవరూ ...??" అని అంది.

"నేను శీనుని రమణమ్మా... దాహంగా ఉంది, కొంచెం నీళ్లు ఇస్తావా?"

"నువ్వా శీను.. ఉండు వస్తున్నాను.." అని చెప్పింది.

"సరే.."

ఐదు నిమిషాలైనా రాకపోవడంతో "ఎంతసేపు రమణమ్మా?" అని అడిగాడు.

తలుపు తీసి బయటకు వచ్చి మంచి నీళ్లు అందించింది "నువ్వు వచ్చినప్పుడు బట్టలు మార్చుకుంటున్నాను అబ్బి.." అంది.

"సర్లే..." అని నీళ్లు తాగాడు.

గ్లాస్ అందిస్తూ "ఏం చేస్తున్నావ్ ఏంటి?" అన్నాడు.

"నేనేం చేస్తాను శీను, ఇంత ముద్ద తిని పడుకోవడమే.." అంది.

"ఏం వండావ్?"

"పచ్చి పులుసు..."

"అబ్బా.. నాకు చాలా ఇష్టం... నాకు కొంచెం ఇస్తావేంటి"

"ఇస్తా.. ఉండు,"

"ఇలా బయటే నిల్చోబెట్టి మాట్లాడతావా.."

"లోపల అంతా చిరాగ్గా ఉంది.. మళ్ళొచ్చినప్పుడు వద్దుగానిలే లోపలికి...,"

"ఏంటో! నాకేదో అనుమానంగా ఉంది, లోపల ఏమన్నా వజ్రాలున్నాయేమో అని.." అంటూ అక్కడే కింద కూర్చున్నాడు. రమణమ్మ లోపలికి వెళ్లి గ్లాస్ లో పచ్చి పులుసు పోసుకుని వచ్చి ఇచ్చింది.

అది అందుకుని "సరే.. వస్తాను" అన్నాడు.

"వెళ్ళిరా శీను.." అంది. ఆమె కళ్ళల్లోకి చూసాడు. ఆమె దేనికో కంగారు పడుతోందని గమనించాడు. వెళ్ళిపోతూ ఆగి "నీ కొడుకులాంటోడిని... కష్టముంటే చెప్పు రమణమ్మా... తీర్చేస్తాను" అన్నాడు.

ఆ మాటకు రమణమ్మ కళ్ళు చెమర్చాయి. కడుపులోంచి ఏదో తెలియని బెంగ ఆమెను కుదిపేసింది. మాట పెగలలేదు. సరే అన్నట్టుగా తలూపింది.

***

రూమ్ కి చేరుకునే సరికి అందరూ శీను కోసం ఎదురు చూస్తున్నారు. మనోహర్ చికెన్ వండాడు. శీను వస్తే కలిసి తిందామని ఆగారు.

"వచ్చాడ్రా బాబు..." అన్నాడు బాలరాజు శీనుని చూసి.

"ఏరా.. ఇంకా డ్యూటీకి వెళ్లలేదా?" అనడిగాడు శీను.

"బాబుగారు వస్తే తినేసి వెళదామని ఆగాను..." అన్నాడు బాలరాజు.

"సరే.. అన్నం పెట్టు పచ్చి పులుసు పట్టుకొచ్చాను. తిందాం" అన్నాడు శీను.

"మనవాళ్ళు చికెన్ వండారు..." చెప్పాడు బాలరాజు.

"చికినే...!! వండటమే...!!" ఆశ్చర్యపోయాడు.

"అవును శీను.. నాకు వంట బాగా వచ్చు.. ఇన్ఫాక్ట్ ఇంట్లో మా అమ్మ కంటే నేనే వంట బాగా చేస్తాను." అని చెప్పాడు మనోహర్.

అందరూ భోజనానికి కూర్చున్నారు.

శీను కపర్ది ప్లేట్ లో చికెన్ వేస్తుంటే "నేను వెజ్.." అన్నాడు కపర్ది.

"ఓహో.. ఇదొకటి ఉందా?" అన్నాడు శీను.

"హ్మ్.. పరవాలేదు. నేను పచ్చడి పెరుగు తెచ్చుకున్నాను." అన్నాడు కపర్ది

"అందులో పచ్చి పులుసు ఉంది వేసుకో.." అన్నాడు శీను. బాలరాజు ఆ గ్లాస్ అందించాడు.

"అన్నట్టు నీకు వంట వచ్చా కపర్ది?" అనడిగాడు బాలరాజు.

"రాదు, మా ఇంట్లో కుక్ ఉన్నాడు" అని చెప్పాడు కపర్ది.

"అబ్బో.. అలా అయితే మీ ఇంట్లో వంటిల్లు ఎక్కడుంటుందో కూడా తెలియదు కదా.." అన్నాడు బాలరాజు. నవ్వుకున్నాడు కపర్ది. కపర్దికి వాళ్ళ

స్నేహంలో ఉండే చనువు బాగా నచ్చింది.

అందరూ ఫుల్ గా తినేసారు. డ్యూటీకి టైం అయిపోవడంతో అందరికంటే ముందే తినేసి వెళ్ళిపోయాడు బాలరాజు. శీను కూడా అలసిపోయి వచ్చాడేమో తినేయగానే నిద్రపోయాడు.

“చూడు ఎలా పడుకున్నాడో! అంత కష్టపడి వండాను. బాగుందని ఒక్కమాట చెప్పచ్చుగా..” అన్నాడు మనోహర్ కపర్దితో.

“బాగుంది కాబట్టే ఏమి మిగల్చకుండా తినేసారు.” చెప్పాడు కపర్ది.

“హ్మ్.. కానీ బాగుందని చెప్తే నిజంగా చాలా బాగుంటుంది కపర్ది. నీకు తెలియదు కపర్ది, వంట చేసిన వాడికి, రచన చేసిన వాడికి ఎలా ఉందో చెప్తే వాడు పొందే సంతృప్తి వేరు.. నువ్వు ఎప్పుడైనా మీ కుక్ వండిన వంటని బాగుందని చెప్పావా?” అనడిగాడు.

లేదన్నట్టుగా తలూపాడు.

“ఈ సారి ఇంటికెళ్లినప్పుడు చెప్పి చూడు. ఆ సమయంలో మీ వంటవాడి కళ్ళల్లోకి చూడు, ఐ యాం షూర్.. అతని కళ్ళల్లో వచ్చే వెలుగు నువ్వు ముందెప్పుడూ చూసి ఉండవు. అంతలా ఆనందపడతాడు”

నిజమే తానెప్పుడూ ఇంట్లో వంటవాడి వంటను మెచ్చుకోలేదు. తండ్రి రచనలనూ మెచ్చుకోలేదు.

***

"హలో... శ్రీ..."

"హలో.. బావా.. ఎలా ఉన్నావ్?"

"నేను బాగున్నానే.. నువ్వు?"

"నాకేంటి బావ.. మూడు పూటలా వండి పెడుతున్నారు. ఇంకేం కావాలి చెప్పు.."

"వంట నేర్చుకోమన్నాను కదా.."

"నీకూ వచ్చి నాకూ వచ్చి.. ఏం చేస్తాం ఇద్దరం.. బజ్జి బండి పెట్టుకుంటావా ఏంటి?"

"నిజానికి మా సాఫ్ట్ వేర్ వాళ్ళ కన్నా, వాడే ఎక్కువ సంపాదిస్తున్నాడు తెలుసా?"

"ఎవరమ్మా మనోహరా?" అక్కడికి వస్తూ అడిగాడు మనోహర్ తండ్రి.

"అవును మావయ్యా... సినిమా ఫీల్డ్ లో ఇష్టం లేదంట. బజ్జి బండి పెట్టుకుంటాను అంటున్నాడు" అని చెప్పి ఫోన్ ఇచ్చింది.

"అవునా..." అంటూ ఫోన్ తీసుకుని "ఏరా.. ఏంటి బజ్జిలంటున్నావంట.. ఒకసారి రారా బాబూ రాజమండ్రిలో కర్రి రామారెడ్డిగారికి చూపిస్తాను.."

“అబ్బా.. అదేం లేదు నాన్న.. అది అలా ఏదోటి చెప్తూ ఉంటుంది. ఎలా ఉన్నారు?”

“ఎలా ఉంటాం బానే ఉంటాం.. కొడుకు గాలి తిరుగుళ్ళు తిరుగుతున్నా ఊళ్ళోవాళ్ళందరికీ ఆఫీస్ పని మీద చెన్నై ఎళ్ళాడని అబద్ధాల చెప్పుకుంటూ తిరుగుతున్నాం.”

“నాన్న.. నలుగురు నాలుగు రకాలుగా అనుకున్నా నాలుగొందల రకాలుగా అనుకున్నా నాకనవసరం నాన్నా. కానీ ఒక రోజు వస్తుంది నీ కొడుకు ఏంటనేది అందరికి తెలుస్తుంది.”

“చెప్పింది ఇంటే కొడుకు ఎందుకు అవుతాడు... ఇంట పెంచుకునే కుక్క అవుతుంది గాని...”

అక్కడే ఉన్న శ్రీజ “మావయ్యా.. ప్లీజ్ ..” అంటూ ఫోన్ తీసేసుకుంది. ఆమె కళ్ళల్లో కోపం, బాధ. ఆ కళ్ళు ఎందుకు ఎర్రబడ్డాయో ఆమె మనస్సుకి మాత్రమే తెలుసు. ఆమె వైపు ఓ క్షణం చూసాడు మనోహర్ తండ్రి. మాట జారానని అర్థం చేసుకున్నాడు. తల దించుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

“బావ, నేను తరువాత మాట్లాడుతాను.” అంది గంభీరంగా.

“సరే.. ఈ నెంబర్ సేవ్ చేసుకో, నా రూమ్మేట్ నెంబర్ ఇది..” చెప్పాడు మనోహర్.

“సరే..” అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

కాసేపు అయ్యాక మావయ్య గది దగ్గరకి వెళ్ళింది.

***

కాసేపు అయ్యాక మావయ్య గది దగ్గరకి వెళ్ళింది శ్రీజ.

"రా శ్రీజ.." అన్నాడు.

"బావని మీరు ఎంకరేజ్ చేయకపోయినా పర్లేదు మావయ్య, నిరుత్సాహపరచకండి. అవతలి మనిషికి అవకాశం ఇచ్చినప్పుడు అతనికి పూర్తి స్వేచ్ఛని ఇవ్వాలి. బావ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడో లేదో వేచి చూడాలి. ఇక్కడ బావ గెలిస్తే అందరం సంతోషిస్తాం.. కానీ ఓడిపోతే బావ మాత్రమే బాధ పడతాడు. ఎందుకంటే మీరు వేసుకున్న లెక్కలే కరక్ట్ అనే సంతృప్తి మీకు ఓడిపోయిన వాడి మీద సానుభూతిని ఇవ్వవు. ఒక్క విషయం చెప్తాను మావయ్య.. బావ బజ్జీలబండి పెట్టుకున్నా బావకి భార్యనవడానికి నాకు ఎటువంటి నామోషీ లేదు. జీవితాంతం కాపురం ఉండాల్సినదాన్ని నేనే ఇంత ధైర్యంగా ఉన్నాను. మీరు నిశ్చింతగా ఉండండి మావయ్య. మీరు కూడా నమ్మండి, బావ పెద్ద డైరెక్టర్ అవుతాడు." అంది.

ఆమె వెళ్లిపోతుంటే ఏమి మాట్లాడకుండా మౌనంగా ఆమెను చూస్తూ ఉండిపోయాడు.

***

ఆ రోజు ఆదివారం కావడం వలన నలుగురు కలిసి తెలుగు సినిమాకి వెళ్లారు. అది కూడా మనోహర్ బలవంతం మీద!. శీనుకి సినిమా మీద కన్నా చాందిని మీదే ఎక్కువ ధ్యాస ఉంది. ఆమెను చూసి అప్పటికే చాలా రోజులు

అయింది. అప్పుడే సినిమాలో ఒక పాట వచ్చింది. ఆ సినిమాకి అది సూపర్ హిట్ సాంగ్.. దానిని రాసింది మహాదేవ!

కపర్ది పాట ఎప్పుడు అయిపోతుందా అని ఎదురుచూశాడు.

మనోహర్ ఆ పాటలో శ్రీజని తనని ఊహించుకున్నాడు.

బాలరాజు హీరో హీరోయిన్ డాన్స్ ఎలా ఉందో చూసాడు.

శీను మనసు మాత్రం చాందిని మీదే ఉంది పాట మీద లేదు. నలుగురి జీవితాలు.. ఒకేచోట నాలుగు దారులలో నడక సాగిస్తున్నాయి!!

సినిమా మధ్యలో లేచి "నాకు చాందినిని చూడాలని ఉంది" అన్నాడు శీను.

"ఇప్పుడా?" అనడిగాడు బాలరాజు.

"అవును" అన్నాడు శీను.

"సినిమా అవ్వనీ.. వెళ్దాము" అన్నాడు బాలరాజు.

"నేను ఒక్కడినే వెళ్తాను" చెప్పాడు శీను

"నేను కూడా వస్తాను" అన్నాడు కపర్ది.

"సరే.. మీరు వెళ్ళండి." అన్నాడు బాలరాజు.

"ఇంత సడెన్ గా ఏంటి? సినిమా అయ్యాక వెళ్లచ్చుగా" అనడిగాడు మనోహర్.

అప్పటికే వాళ్ళు థియేటర్ బయటకు వచ్చేసారు.

“శీను గాడు అంతే.. చాందిని కంటే ఎవరు ఎక్కువ కాదు.” చెప్పాడు బాలరాజు.

“చాందిని ఎవరు?” ప్రశ్నించాడు మనోహర్.

“ఓ.. సారీ, నీకు పుస్తకంలో మధ్య పేజీ ఇచ్చినట్టున్నాను. తరువాత చెప్తాలే స్టోరీ.. సినిమా అయిపోని” అన్నాడు బాలరాజు. సరే అని అప్పటికి ఊరుకున్నాడు మనోహర్.

బయటకు వచ్చేసిన కపర్ది శీనుతో “ఇప్పుడు ఎక్కడికి?” అనడిగాడు.

“చాందిని ఇంటికి..” నడుస్తూనే చెప్పాడు. అది పరుగు లాంటి నడక.

“ఎందుకంత స్పీడ్ గా వెళ్తున్నావ్?”

“నువ్వు ఇంటికి వెళ్ళిపో బాసు.. నేను వెళ్లి వస్తాలే”

“పర్లేదు. అక్కడేమైనా ప్రాబ్లమ్ అయితే?”

“ప్రాబ్లమ్ అయితే నేనొక్కడినే చాలు”

“అంత కాన్ఫిడెన్స్ పనికి రాదు”

“చాందిని విషయం అక్కడ... ప్రాణాలు అడ్డేస్తాను ఏమైనా సరే”

“ఎందుకంత ఎమోషనల్ అవుతున్నావ్ ఇప్పుడు? చాందినిని చూడటానికే కదా వెళ్ళేది?”

“కాదు.. తీసికొచ్చేస్తాను”

“ఒక్క నిమిషం ఆగు” అని చేయి పట్టుకుని ఆపాడు కపర్ది.

“చెప్పు”

“తీసుకొచ్చేసి ఎక్కడ ఉంచుతావ్?”

“తెలియదు. తీసుకొచ్చేస్తాను”

“సడెన్ గా ఏమైంది శీను”

“ఏమో తెలీదు”

“ఇలాంటప్పుడు మనకి బాలరాజు మనోహర్ కూడా ఉండటం చాలా అవసరం”

“అవన్నీ ఆలోచించేంత ఓపిక నాకు లేదు”

“ఆలోచించకుండా నిర్ణయం తీసుకోకూడదు.”

“నువ్వు ఆలోచించుకునే ఇక్కడకి వచ్చావా? అప్పటికప్పుడు అనుకునే వచ్చావ్ కదా!” ఒక్క క్షణం ఆగి ప్రశ్నించాడు శీను.

ఆ ఒక్క క్షణం మౌనం... కపర్ది గతమంతా ఒక్కసారి ఫ్లాష్ లా కళ్ళ ముందు కదిలింది.

“నిర్ణయాలు ఒక్కటే కావచ్చు, కానీ నా జీవితం వేరు. నా దారి వేరు” నిదానంగానే చెప్పాడు.

"సారి బాస్, నాకు ఇప్పుడు చాందినిని చూడాలని ఉంది" మళ్ళీ నడక సాగిస్తూ చెప్పాడు.

"సరే పద, వెళ్దాం"

చాందిని ఉన్న ఇంటికి చేరుకున్నారు.

శీనుని చూస్తూనే అక్కడి ఆంటీ "ఏంటి శీను, దారిటు మళ్లింది!" అనడిగింది.

"చాందినిని చూడాలి"

"కుదరదు"

"ఎందుకు కుదరదు?" శీను ప్రశ్న.

"ఎందుకు చూపించాలి?" ఆంటీ ప్రశ్న.

"ఎందుకు చూపించరు?" కపర్ది ప్రశ్న .

"ఎవడ్రా నువ్వు ...?" కపర్ది దగ్గరగా వచ్చి ఆంటీ అనుచరుడి ప్రశ్న.

జేబులో ఉన్న డబ్బులు విసిరి కొట్టాడు శీను. "చూపించు" అన్నాడు.

ఓ క్షణం సూటిగా కళ్ళలోకి చూసింది.

"నీ డబ్బు ఇక్కడ కండోమ్ పాకెట్స్ కొనడానికి కూడా సరిపోదు." అంది.

"మర్యాదగా మాట్లాడండి" అన్నాడు కపర్ది.

"ఎక్కడకొచ్చి మర్యాద అడుగుతున్నావురా?" అంది.

"అవన్నీ అనవసరం ముందు చాందిని చూపించు." అన్నాడు శీను చాలా ఆవేశంగా.

"చాందిని లేదు. ముంబై పంపించేశాం" అంది.

ఆ మాట వినగానే కోపంతో ఊగిపోతూ ఆంటీ మీదకు వెళ్లి పీక పట్టుకున్నాడు శీను. ఆమె దగ్గర ఉన్న అనుచరులు శీనుని బలవంతంగా విడదీసి కిందపడేసి చావగొట్టారు. కపర్ది కాపాడాలని ట్రై చేసినా వాళ్ళు ఎక్కువ మంది ఉండటంతో కపర్దిని కూడా రక్తం వచ్చేట్టు కొట్టారు. ఇద్దర్ని చావగొట్టి గేటు బయటకు వరకు ఈడ్చుకెళ్లి రోడ్ మీద పారేశారు.

***

బాలరాజు, మనోహర్ లు సినిమా అయ్యాక కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి బయలుదేరారు. దారిలో చాందిని గురించి చెప్పాడు బాలరాజు. అంతా చెప్పి "అదన్నమాట స్టోరీ" అన్నాడు బాలరాజు.

"నాకు చాందిని ని చూడాలని ఉంది" అన్నాడు మనోహర్.

"శీనుకి చెప్పు పరిచయం చేస్తాడు." అని చెప్పాడు.

ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. ఇంటికి తాళం వేసే ఉంది. టిఫిన్ కోసం వెళ్ళారేమో అని కాసేపు ఎదురుచూసి కింద వాటాలో ఉండే వాళ్ళని అడిగాడు బాలరాజు. వాళ్ళు ఇంకా రాలేదని చెప్పడంతో గబగబా చాందిని ఉండే

ఏరియాలోకి వెళ్లారు ఇద్దరు. అక్కడ ఉన్న వాళ్ళను అడిగితే కొట్టిపాడేశారు ఎవరో ఇద్దర్ని, ఒక పెద్దాయన వచ్చి పక్కనే ఉన్న హాస్పటల్ కి తీసుకుని వెళ్లారు అని చెప్పాడు. వెంటనే హాస్పటల్ కి పరిగెత్తుకుని వెళ్లారు.

అప్పటికే వారికి తగిలిన గాయాలకు కట్లు కట్టారు. డాక్టర్ తో మాట్లాడుతున్న పెద్దాయన దగ్గరకు వెళ్లి "ఎలా ఉంది మా ఫ్రెండ్స్ కి?" అని అడిగాడు బాలరాజు.

"ఏమో నాకేం తెలుసు. డాక్టర్ ని అడగండి." అన్నాడు విరించి.

"ఓహ్, సారీ.. డాక్టర్ అనుకున్నాను" అని చెప్పి డాక్టర్ వైపు చూసాడు.

అప్పటికే డాక్టర్ గుడ్లు మిటకరించి చూస్తున్నాడు.

"సార్, మా ఫ్రెండ్స్ కి ఎలా ఉంది?" అని అడిగాడు బాలరాజు.

"నేను చెప్పను. వెళ్లి ఆయన్నే అడగండి." అన్నాడు డాక్టర్ విరించిని చూపిస్తూ.

"సార్ మీరు హర్ట్ అయినట్టు ఉన్నారు!"

"అవక, కట్టు వేసింది నేను అయితే కర్టసి మాత్రం ఆయనకా!"

"ఏదో తెలియక..."

"సారీ చెప్పు"

"సార్..."

"సారి చెప్పు" అని మళ్ళీ అడిగాడు.

"సారీ" అని చెప్పాడు బాలరాజు.

"అది... మీ వాళ్లకు ఏం భయం లేదు. తీసుకుపో." అని చెప్పాడు.

మనోహర్ విరించి దగ్గరకి వెళ్లి "థ్యాంక్ యు సార్." అని చెప్పాడు.

"పర్లేదు బాబు. నేను జాయిన్ చేసాను. కొంచెం ఫీస్ అది మీరు సర్దేసుకోండి ఎలాగో వచ్చారు కదా" అని అన్నాడు విరించి.

"అది ఓకే సార్." అన్నాడు మనోహర్.

"ఏంటి ఓకే... నీ దగ్గర డబ్బులేమున్నాయ్" అని అడిగాడు బాలరాజు మనోహర్ చెవి దగ్గరకి వచ్చి.

"ఉన్నాయ్" అన్నాడు మనోహర్.

"ఎక్కడ?"

మెడలో ఉన్న గొలుసు తీసి "దీన్ని తాకట్టు పెడదాం" అన్నాడు.

"సినిమాల ప్రభావం!" అనుకున్నాడు బాలరాజు.

"బాలరాజు, ఆ గొలుసు జాగ్రత్త. మా మరదలు దాచుకున్న డబ్బులతో కొనిచ్చింది. కొంచెం సెంటిమెంట్" అన్నాడు మనోహర్.

"పర్సులో అమ్మాయా?" అనడిగాడు.

"అవును. నీకెలా తెలుసు?"

“నీకన్నా ముందు ఆమెనే చూశాలే, గుడి దగ్గర కొబ్బరికాయ కొని డబ్బులు ఇస్తున్నప్పుడు.”

బాలరాజును సూటిగా చూసాడు.

“టెన్షన్ పడకు! నీ పర్స్ పోవడానికి నేను కారణం కాదు.” అన్నాడు నవ్వుతూ. ప్రతినవ్వు నవ్వాడు మనోహర్.

కపర్ది‌ని, శీనుని ఇంటికి తీసుకువచ్చేసారు. అందరూ లైట్ గా తినేశారు.

“ఇప్పుడు చెప్పు ఏమైంది?” అనడిగాడు మనోహర్ శీనుని.

“చెప్పడానికేముంది, అక్కడికెళ్లి గొడవపడి ఉంటాడు. దూ.. తీర్చుకున్నారు.” అన్నాడు బాలరాజు.

“వాళ్ళని అస్సలు వదిలే ప్రసక్తి లేదు.” అన్నాడు కపర్ది.

“నువ్వొకడివి తయారయ్యావా మాకు.” బాలరాజు.

“నన్ను కొట్టినవాడిని వదిలే సమస్యే లేదు. నువ్వన్నావ్ చూడు దూ... .. అదే తీర్చేస్తాను” అన్నాడు శీను. కపర్ది కూడా అందుకు వంత పాడాడు. “హ్మ..” అని నిట్టూర్చాడు బాలరాజు.

***

సత్యకృష్ణ ఫోన్ కూడా చాలా తక్కువగా వాడుతూ ఉంటాడు. అత్యవసరమైతేగాని కాల్స్ చేయడు. ఇంటర్నెట్ కూడా అవసరమైతేనే ఉపయోగిస్తాడు. ఆ రోజు కూడా ఎప్పటిలానే కాలేజీ నుండి ఇంటికి వెళ్ళాడు.

బండి పార్క్ చేసి, చెప్పుల స్టాండ్ లో షూస్ విడిచి, తాళం తీసుకుని లోపలికి వెళ్లి కీ హోల్డర్ కి బండి తాళాలు, ఇంటి తాళాలు తగిలించాడు. ఫోన్ తీసుకుని టేబుల్ మీద పెట్టి బాత్ రూమ్ కి వెళ్లి ఫ్రెష్ అప్ అయి వచ్చి సోఫాలో కూలబడ్డాడు. వాట్సాప్ మెస్సేజ్ వచ్చిన బీప్ శబ్దం. ముందుకు చేయి చాచి ఫోన్ అందుకుని మెసేజ్ బాక్స్ ఓపెన్ చేసాడు. ఒక అన్-నోన్ నెంబర్ నుండి వచ్చిందా మెస్సేజ్.

“నేను, నీ రాధిని, బాగున్నావా ?”

అది చదవగానే అసంకల్పితంగా ముందుకు వంగాడు. కళ్ళు మరింత పెద్దవి అయ్యాయి.

“నేను, నీ రాధిని, బాగున్నావా ? ....”

అది చదవగానే అసంకల్పితంగా ముందుకు వంగాడు. కళ్ళు మరింత పెద్దవి అయ్యాయి.

“.. నేను మోసపోయాను సత్య. గొప్పగా బతకడం అంటే డబ్బు ఉంటేనే అని అనుకుని ఎండమావుల వెంట అమృతం ఉందేమో అని నమ్ముకుని సముద్రాలు దాటి వచ్చాను. నాకు నీ ప్రేమ విలువ ఇప్పుడు తెలుస్తోంది. నాకు నిన్ను పట్టుకుని మనసారా ఏడవాలని ఉంది. మాట తప్పిన వాడిని క్షమించచ్చేమో కానీ నాలా మనసిచ్చి తప్పిన వాళ్ళని క్షమించకూడదు. నాకు నిజానికి బతకాలని కూడా లేదు. కానీ నీకు ఒక్కసారి చెప్పాలనిపించింది. చావు సమస్యకి సమాధానం అయితే నేను దుబాయిలో ఉన్నప్పుడే చనిపోయేదాన్ని.

ప్రేమించానని, లగ్జరీ లైఫ్ చూపిస్తానని నన్ను దుబాయి తీసుకెళ్లినవాడు నన్ను ఒకరింట్లో పని మనిషిగా అమ్మేశాడు. నన్ను నానా హింసలు పెట్టారు. అక్కడున్న ఇండియన్స్ సాయంతో నేను ఎలాగోలా తప్పించుకుని వచ్చాను. నేను ఇన్నాళ్లు నరకం అనుభవించాను సత్య. ఎందుకు బతికానో, ఎలా బతికానో కూడా నాకు తెలియదు. ఈ మెసేజ్ కూడా ఎయిర్ పోర్ట్ నుండి పంపిస్తున్నాను. నాకు ఇప్పుడు నీ దగ్గర నుండి కావాల్సింది ఏంటో కూడా నాకు తెలియదు. ఒంటరిగా నాలుగు రోజుల నుండి ఇక్కడే

తిరుగుతున్నాను. నేను నీ దగ్గరకు రానా? అడగడానికి అదోలా ఉంది. అది అహం కాదు అడగాలంటే నాకే సిగ్గుగా ఉంది. తప్పు చేసాను కదా.. భయంగా ఉంది. వస్తే నన్ను ఆదరిస్తే నీ పాదాల దగ్గర కన్నీళ్లు విడిచి క్షమించమని అడుగుతాను. వద్దని పొమ్మంటే అదే పాదాల దగ్గర ప్రాణాలు విడిచి మరో జన్మకైనా నీ భార్యగా పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను. నిర్ణయం నీదే సత్య.. నీకై ఎదురుచూస్తూ..."

వెంటనే ఆ నెంబర్ కి కాల్ చేసాడు. ఎవరో ఒక కుర్రాడు ఎత్తాడు.

"హలో.. ఎవరు?"

"మీరు ఎవరు?"

"మీ నెంబర్ నుండి నాకో మెసేజ్ వచ్చింది. నా భార్య పంపించింది."

"ఓ.. ఆవిడా.. ఎయిర్పోర్ట్ లో ఉన్నప్పుడు మెసేజ్ చేసుకుంటాను, ఫోన్ పోయిందంటే ఇచ్చానండి. మెసేజ్ చేసి డెలివర్ అయ్యాక డిలీట్ చేసేసారు. ఎందుకని అడిగితే ఏం చెప్పలేదు. ఫోన్ చేసుకోండి పర్లేదు అంటే వద్దు మెసేజ్ చాలు, అన్నారు."

"అవన్నీ కాదండి. ఇప్పుడు ఎక్కడున్నారు ఆవిడ."

"ఎయిర్పోర్ట్ లోనే ఉంటారు."

"థ్యాంక్స్" పెట్టేసాడు.

గబగబా ఎయిర్పోర్ట్ కి బయలుదేరాడు. గంటలో చేరుకున్నాడు. అక్కడ ఎక్కడని వెతకాలి! ఎంక్వైరీలో అడిగాడు. అటు ఇటు కంగారుగా పరిగెత్తాడు. సత్యకృష్ణని గమనించిన ఒక పోలీస్ ఏమైందని అడిగాడు. వివరం చెప్పాక తనతోపాటు రమ్మని చెప్పి అక్కడి క్లినిక్ లోకి తీసుకెళ్లాడు.

ఆమె నాలుగు రోజుల నుండి సరిగా ఏమి తినకపోవడం వలన స్పృహ తప్పి పడిపోయింది. అక్కడి డాక్టర్స్ సెలైన్ పెట్టారు.

“ఈవిడేనా?”

“అవును”

“ఇలా ఎందుకు వదిలేశారు?”

“సారీ... నేను వదిలేయలేదు.”

“మరి ఆవిడే వెళ్లిపోయిందా?”

“మేము విడాకులు తీసుకున్నాం.”

“మరి భార్య అని చెప్పారు?”

“ఒకప్పుడు”

“విడాకులు తీసుకుని ఎంత కాలం అయింది? వివరంగా చెప్పండి.” ప్రశ్నించాడు అక్కడి అధికారి.

అక్కడి సిబ్బంది అనుమానం వస్తే మొత్తం వివారాలు అడిగి సంతృప్తి చెందితేనే పంపిస్తారు.

“మేము ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. ముందుగా నేను ఆమెను ఇష్టపడ్డాను. వాళ్ళింట్లో ఒప్పుకోలేదు. కారణాలు లౌకికమైనవే. కులం లాంటివి! ఆ విషయం మీద ఒప్పించడానికి ఆమె ఇంటికి వెళ్లాను. వాళ్ళ నాన్న గారిని అడిగాను..........”

***

“మీ ప్రాబ్లెమ్ ఏంటి అంకుల్!” అన్నాడు సత్యకృష్ణ.

“నువ్వే” చెప్పాడు రాధిక తండ్రి.

“నేను మీ అమ్మాయిని బాగా చూసుకుంటాను. చదువుకున్నవాడిని. పి.హెచ్.డి అయ్యాక మంచి ఉద్యోగం ఎలాగో సంపాదించగలననే నమ్మకం ఉంది. మీకు ఇంకేం కావాలి?”

“కులం కావాలి.”

“లేని దాన్ని తెచ్చిపెట్టుకోలేను అంకుల్. ఉన్నదాని గురించి పట్టింపులేదు.”

“కానీ నాకు ఉంది. నా కూతుర్ని నీకు ఇచ్చి చేస్తే, నా కుటుంబం పరువు పోతుంది.” లేచి నిలబడుతూ అన్నాడు.

“మీకు ఎలా చెప్పాలి అంకుల్.”

“నువ్వేమి చెప్పక్కర్లేదు. నేను ఏమి వినక్కర్లేదు. బయలుదేరు.”

చాలా కాలం వారి అంగీకారం కోసం ఎదురు చూసారు. ఒప్పుకోలేదు. ఇంక వరస్ట్ కేస్ కింద బయట గుళ్లో పెళ్లి చేసుకున్నారు. అప్పటికి అతను ఇంకా లైఫ్ లో సెటిల్ అవలేదు. ఆ విషయం ఆమెకు కూడా తెలుసు. కానీ తనకి సహనం తక్కువ. వెంటనే పెళ్లి అయిపోవాలి అని పట్టుబట్టింది. పెళ్లి చేసుకున్నాక చిన్న రూమ్ లో అద్దెకు దిగారు. ముందు కొంచెం అడ్జస్ట్ అయినా తరువాత ఆమెకు అది నచ్చలేదు.

ఒకరోజు అడిగింది.

“ఇల్లు మారిపోదాం సత్య?”

“మారాలి. కొంచెం టైం ఇవ్వు.”

“నో… ఇప్పుడే.”

“ఇప్పటికిప్పుడు అంటే ఎలా.”

“నాకు తెలియదు. పద వెతుకుదాం.”

“ప్లీజ్, ఈ రోజు ఫుల్ వర్క్ నాకు. కొంచెం రెస్ట్ తీసుకుంటాను. సండే వెళ్లి వెతుకుదాం.”

కోపంతో చూసి వెళ్ళిపోయింది. అర్థం చేసుకుంటుందిలే అని ఊరుకున్నాడు. రాత్రి పడుకునే ముందు…

“ఇంకా కోపం పోలేదా?” అడిగాడు దగ్గరకు జరుగుతూ. ఆమె మాట్లాడలేదు. ఆమెపై చేయి వేసి దగ్గరగా హత్తుకోబోయాడు. అతని చేయిని విడిపించుకుని లేచి కూర్చుని “దీనికి మాత్రం ఓపిక ఉందా? ఆదివారం అంటావేమో అనుకున్నాను” అంది. ఆ మాట వినేసరికి అతని ముఖంలో నెత్తురు చుక్క లేదు. చాలా ఎంబరేసింగా అనిపించింది. సమాధానం ఏమి ఇవ్వలేకపోయాడు. అక్కడే ఉండలేకపోయాడు. బయటకు వెళ్లలేకపోయాడు. గుండెల్ని గోళ్ళతో రక్కిన ఫీలింగ్. నిజమే.. రాగానే కొంచెం సెటిల్ అయ్యి ఇల్లు అద్దెకు దొరుకుతుందేమో ప్రయత్నించాల్సింది అనుకున్నాడు.

“సారి... రేపు వెళదాం” అన్నాడు చాలాసేపు మౌనం తరువాత. కానీ అప్పటికే ఆమె నిద్రపోయింది. జీవితంలో అంతటి మానసిక సంఘర్షణ ఎప్పుడు అతను అనుభవించలేదు.

మర్నాడు ఇల్లు వెతకడానికి వెళ్లారు. చివరికి ఒక ఇల్లు బాగుందనిపించింది. ఆ ఇల్లు రాధికకి చాలా నచ్చింది. కానీ అద్దె చాలా ఎక్కువ. ఓనర్ తో ‘ఒక్క నిమిషం’ అని చెప్పి రాధికకి పక్కకి తీసుకువచ్చాడు.

“అద్దె ఎక్కువ రాధికా, నా సంపాదన అంతా అద్దెకు పోతుంది.” అన్నాడు.

“నాకు ఈ ఇల్లు నచ్చింది.” అంది.

“నాకూ నచ్చింది, కానీ మన పరిస్థితి గురించి కూడా ఒకసారి ఆలోచించు.” అన్నాడు.

“నీ ఇష్టం.. ఈ ఇల్లు కాకపోతే నేను మనం ఉన్న ఆ పాడు గుడెసెలోనే ఉందాం.” అంది.

“అలా కాదు రాధి.. ప్లీజ్.. నా ఆర్థిక పరిస్థితి కూడా ఆలోచించు.” అన్నాడు.

“ఆర్థిక పరిస్థితి లేనివాడివి లేవదీసుకునివచ్చి ఏ ధైర్యంతో పెళ్లి చేసుకున్నావ్?” అనడిగింది.

“నేనా? ఇలా చూడు నాకేసి, నేనా? నువ్వే కదా పెళ్లి చేసేసుకుందాం అని ప్రెజర్ చేసావ్. నువ్వే కదా పెళ్లికి తొందరపడింది?” అనడిగాడు.

“అవును... తొందరపడ్డాను, నిన్ను ప్రేమించి తొందరపడ్డాను. నిన్ను పెళ్ళి చేసుకుని తొందరపడ్డాను నీతో పడుకుని...”

“షట్ అప్ రాధి. డోంట్ అట్టర్ ఎ వర్డ్ ఎనిమోర్.” కళ్ళు ఎర్రబడ్డాయి కోపంతో.

“సరే.. తాళి కట్టించుకున్నాక అనుభవిస్తాను.” అని చెప్పి మెట్లు దిగి కిందికి వెళ్ళబోయింది.

“సరే.. నేనే పడతాను ఆ బాధలేవో!!” అని చెప్పి వెళ్ళి ఆ ఇంటి ఓనర్ ని బ్రతిమాలి ఒక నెల అడ్వాన్స్ మాత్రం ఇచ్చాడు.

కాలేజీ నుండి వచ్చేటపుడు రెండు, మూడు హోమ్ ట్యూషన్స్ ఒప్పుకున్నాడు. వాటితో వచ్చే డబ్బుతో ఇంటి సరుకులు తెచ్చేవాడు. రాత్రుళ్ళు డీటీపీ వర్క్ చేస్తూ, పుస్తకాలు రాసే రచయితలకు కొంత తక్కువకి చేసేవాడు. ఆ రకంగా వచ్చే డబ్బుతో రాధిక అవసరాలు తీర్చేవాడు. కడుపు నిండా తిండి తిని, కంటి నిండా నిద్రపోయిన సందర్భాలు చాలా తగ్గిపోయాయి. ఏమి చేసినా రాధిక ఆనందం కోసమే చేసేవాడు. ఎంత చేసినా ఆమెకు ఏదో ఒక లోటు. అది లేదు ఇది లేదు అంటూ వంక పెట్టేది. ఆమె నవ్వుల కోసం అప్పులు చేసాడు. డబ్బు ఎక్కడ వస్తుందన్నా ఎక్కే గుమ్మం దిగే గుమ్మం అన్నట్టుగా చెప్పులరిగేట్టు పని చేసుకుపోయేవాడు. అన్ని పనులు చేసుకుంటూనే పి.హెచ్.డి వర్క్ చేసుకునేవాడు. గడియారంతో పోటీ పడుతూ పని చేసేవాడు.

ఓ రోజు రేపు పరీక్షనగా రాధిక ఇంటికి వెళ్లాలని ఉంది అని గొడవ పెట్టింది. అప్పటికప్పుడు వెళ్ళాలసిందే అని పంతం పట్టింది. పరీక్ష అయ్యాక వెళ్దాం అని ఎంత చెప్పినా ఆమె ఒప్పుకోలేదు.

“అన్నిటికి ఇలా పంతం పడితే ఎలా రాధి?” నెమ్మదిగా అడిగాడు.

“అదంతా నాకు తెలియదు. నాకు మా అమ్మానాన్నలను చూడాలని ఉంది” అంది.

“తప్పకుండా వెళదాం. నాకు రేపు ఎక్సామ్ ఉంది. అయిపోయాక డైరెక్ట్ గా వెళదాం” అన్నాడు.

ససేమీరా ఒప్పుకోలేదు.

“ప్లీజ్ రాధి, నీకేం తక్కువ చేసాను. నిన్ను బాగానే చూసుకుంటున్నాను కదా.”

“బానే చూసుకుంటే నేను అడగగానే నన్ను తీసుకెళ్ళేవాడివి.”

“ఇప్పుడు నేను చదువుకోవాలి.. నేను వద్దు అని అనలేదు కదా. రేపు వెళదాం అని చెప్తున్నాను కదా”

“అంటే ఇప్పుడు నాకంటే నీ చదువే నీకు ఇంపార్టెంట్ అన్నమాట.”

“అలా మాట్లాడుతావేంటి రాధి? ఇప్పుడు మనం ఈ మాత్రం అన్నా ఉండగలుతున్నాం అంటే ఇప్పుడు నేను చదువుతున్న చదువే కదా కారణం.”

“అంత ఇబ్బంది పడుతూ నన్ను ఎందుకు చూసుకోవడం?”

“అలా అని నేను అనలేదు. ఒకరినొకరు ప్రేమించుకున్నాం. ఒకరికొకరు కలిసి బతకాలనుకున్నాం.”

“కానీ కష్టాలు నువ్వు పడుతుంటే నేను సుఖపడుతున్నాను అంటావా?” మాట పూర్తి అవకుండానే అడిగింది.

"కాదు రాధి, కలిసి బతకడం అంటే ఒక చోట కలిసి ఉండటం కాదు. ఒకే జీవితంగా బతకడం. ఇప్పుడు నాకు మోరల్ సపోర్ట్ కావాలి. నేను ఏమి సంపాదించినా, సాధించినా అదంతా నీకోసమే. ఎక్సామ్ సరిగా రాయకపోతే ఉద్యోగం కోసం మళ్ళీ వెతుకులాట సాగించాలి. అర్థం చేసుకో రాధి.."

విసుక్కుంటూ... నసుక్కుంటూ గదిలోకి వెళ్ళిపోయి తలుపేసేసుకుంది.

"ఎదురుగా ఇంకా చదవాల్సిన పుస్తకం... గదిలోపల మరింత చదవాల్సిన పుస్తెలు కట్టిన భార్య" ఒక పరీక్ష జీతం కోసం.. మరొక పరీక్ష జీవితం కోసం.

తరువాత రోజు అనుకున్నట్టుగానే ఆమె పుట్టింటికి తీసుకెళ్లాడు. ముందు నానా మాటలు అన్నా చివరకి ఆమెను ఇంటిలోకి పిలిచి ఆదరించారు గాని సత్యకృష్ణ ముఖం వైపు కూడా చూడలేదు. ఇంటి బయటే ఆమె కోసం రెండు గంటలు ఎదురు చూసాడు. చీకటి పడటంతో రాధికను పిలిచాడు.

ఆమె తండ్రి బయటకు వచ్చి “ఇంకా ఎందుకు ఉన్నావ్?” అనడిగాడు.

“రాధిక కోసం..”

“రాధిక రాదు.. రేపు వస్తుంది…”

“రాధి….” పిలిచాడు

“రాదని చెప్పాను కదా..”

“రాధికా….” అరిచాడు.

లోపల నుండి ఎటువంటి రెస్పాన్స్ లేదు. మళ్ళీ పిలిచాడు.

ఆమె వచ్చింది. “పద వెళదాం..” అన్నాడు. అతని కళ్ళు అప్పటికే ఎర్రబడ్డాయి.

“వస్తాను నాన్నా…” అని చెప్పి బయలుదేరింది. ఇద్దరు ఇంటికి చేరుకున్నారు.

సత్యకృష్ణ చదువు పూర్తి అయింది. ఉద్యోగం సంపాదించున్నాడు. అదే విషయం చెప్తే జీతం ఎంత అని అడిగింది. చెప్పాడు. పెదవి విరిచింది.

“ముందు అర్జెంట్ గా బండి కొనుక్కోవాలి. రోజు బస్ లో వెళ్లి రావడం చాలా కష్టంగా ఉంది.” అన్నాడు.

“కొత్తగా ఉద్యోగం వస్తే పెళ్ళానికి బంగారం చేయించాలని లేదా?” అనడిగింది.

“సరే.. నీకు నచ్చినట్టుగానే బంగారం కొనుక్కుందాం. బండి తరువాత తీసుకుంటాను.” అన్నాడు. ఆమె ముఖం వికసించింది. అతనికి దగ్గరగా వచ్చి హత్తుకుంది.

కొంతకాలం బాగానే సాగిపోయింది. సత్యకృష్ణ కూడా జూనియర్ లెక్చరర్ గా నియమితుడయ్యాడు. ఉద్యోగం పనుల్లో మరింత బిజీ అవ్వసాగాడు. ఇంటిలో ఉండే సమయం కన్నా కాలేజీలోనే ఎక్కువ ఉండటం వల్ల రాధికతో ఎక్కువ సమయం కేటాయించలేకపోయేవాడు. సొంత ఇల్లు అంటూ ఒకటి తీసుకున్నాడు. ఇంట్లో కావాల్సినవన్నీ అమర్చాడు. ఎంత లేట్ గా వచ్చినా రాధిక అడిగేది కాదు. ఆమె టి.వి చూస్తూ టైం పాస్ చేసేసేది. తాను కాలేజీకి వెళ్ళినపుడు ఆమె ఏం చేస్తోందని ఎప్పుడు అడిగేవాడు కాదు. ఆమె తనతో ఉంటే చాలు అన్నట్టుగా ఉండేవాడు.

ఓ రోజు ఎప్పటిలానే లేటుగా వచ్చిన సత్యకృష్ణకి టి.వి చూస్తూ రాధిక కనిపించింది.

“హాయ్ ...రాధి..” అన్నాడు లోపలికి వస్తూ.

“హాయ్..” అంది.

తన గదిలోకి వెళ్ళేవాడు ఆగి, ఆమెలో ఏదో కొత్తగా అనిపించి ఆమెను గమనించాడు.

క్షణంలోనే తేడా గుర్తించాడు.,

“చీర కొత్తదా?” అనడిగాడు.

“అవును” అంది టి.వి చూస్తూనే.

“ఎప్పుడు కొన్నావ్.. చెప్పనేలేదు” అనడిగాడు.

“ఫ్రెండ్ గిఫ్ట్” అంది.

“ఫ్రెండా? ఎవరా ఫ్రెండ్?”

“తెలుసుకుని ఏం చేస్తావ్?”

“మాములుగా అడుగుతున్నాను రాధి”

“దీపికా అని ఉందిలే”

“సరే... అన్నం తిన్నావా?”

“బయట తినేసాం… నువ్వు తినేసేయ్”

“సరే” అని డైనింగ్ టేబుల్ దగ్గరకి వెళ్ళాడు. అన్ని ఖాళీ గిన్నెలు ఉన్నాయి.

“వంట చేయలేదా?” అని అడిగాడు.

“చెప్పాగా బయట తినేసాను అని”

“నాకు రైస్ అయినా పెట్టాల్సింది కదా రాధి. పచ్చడి, పెరుగు వేసుకునైనా తినేసేవాడిని.”

“నస ఆపు.. అన్నం ఎంతసేపు పెట్టుకుంటావ్? ఇప్పుడు పెట్టుకో, పది నిమిషాల్లో అయిపోతుంది. ఈ మాత్రానికి ఆకలితో చావవు కదా” అంది. మౌనంగా అన్నం పెట్టుకుని తినేసి పడుకున్నాడు.

ఒకరోజు ఎదురింటాయన సత్యకృష్ణని బయట మార్కెట్ లో కలిసినపుడు “నీతో ఒక విషయం చెప్పాలయ్యా సత్యకృష్ణ. మరి నువ్వు ఎలా తీసుకుంటావో అని భయంగా ఉంది” అన్నాడు.

“చెప్పండి సార్. పర్లేదు”

“ఏం లేదయ్యా. ఎలా చెప్పాలో కూడా అర్థం కావడం లేదు. మరోలా అనుకోకు ఇలా అడుగుతున్నానని. నువ్వా పొద్దున్న పోయి రాత్రికి ఇంటికి వస్తావ్. పెళ్ళాం ఒకత్తే ఇంట్లో ఉంటోంది. ఆమె బాగోగులు చూసుకుంటున్నావా? ఆమె కనీస అవసరాలు తీరుస్తున్నావా?” అనడిగాడు.

కనీస అవసరాలు అంటే ఏంటో అర్థమవడానికి సత్యకృష్ణకి ఆట్టే సమయం పట్టలేదు.

"ఏమైంది సార్?" అనడిగాడు.

"మీ ఆవిడని కలవడానికి రోజు ఒక కుర్రాడు వస్తున్నాడు. దీపక్ అని పెద్ద పోరంబోకు వెధవ. డబ్బు ఉంది, చదువు లేదు వెధవకి" అని చెప్పాడు.

సత్యకృష్ణ తన ఎమోషన్ ని బయట పెట్టకుండా నిభాయించుకున్నాడు.

"నేను చూసుకుంటాను సార్. థాంక్స్ ఫర్ ది కన్సర్న్" అని చెప్పి వెళ్ళబోతూ ఆగి, వెనక్కి తిరిగి ఆ పెద్దాయన కళ్ళలోకి చూసాడు. "ఎవరికీ చెప్పనులే సత్యకృష్ణ...కొడుకులాంటివాడివి." అన్నాడాయన. ఆయన చేతులు పట్టుకుని గట్టిగా ఒత్తాడు. అంతకు ముందెప్పుడో రాధిక చెప్పిన 'దీపిక' అన్న పేరు 'దీపక్' అని అర్థం చేసుకున్నాడు.

ఇంటికి వెళ్లేసరికి దీపక్ తో ఉండగా రాధికని చూసేసాడు. సత్యకృష్ణ ఇద్దరి వైపు కోపంగా చూసాడు. అతను పారిపోబోయాడు. అతన్ని పట్టుకుని లోపలికి లాగి, తలుపు గడియ పెట్టాడు.

ఇద్దర్ని కూర్చోమన్నాడు. తాను మాత్రం ఇద్దరి ముందు నుంచుని రాధిక వంక చూసి "ఎందుకు ఇలా చేసావ్ అని అడగను. ఎందుకంటే నువ్వు చెప్పే జవాబు నాకు అవసరం లేదు. కానీ ఒక్కటి అడుగుతాను. నేను అంటే

నీకు ప్రేమ లేదా? లేదా నేను నిన్ను ఎంత ప్రేమిస్తున్నానో నీకు తెలియడం లేదా?”

ఆమె సమాధానం ఏమి ఇవ్వలేదు.

దీపక్ వైపు తిరిగి “నిన్ను ఒకటే అడుగుతాను. రాధికని పెళ్లి చేసుకుంటావా?” అనడిగాడు.

దీపక్ కొంచెం తడబడినా చేసుకుంటాను అని చెప్పాడు.

“రాధిక నీకు ఇతన్ని పెళ్లి చేసుకోవడం ఇష్టమేనా?”

“ఇష్టమే.. కానీ…”

“కానీ…”

“తరువాత నాకు లీగల్ గా ఏం ప్రాబ్లెమ్ రాకూడదు…”

అప్పటి వరకు పంటి అంచున నొక్కి పెట్టి ఆపిన బాధ అంతా ఒక్కసారిగా సత్యకృష్ణ కళ్ళల్లో నీళ్లు ఉబికాయి. గుటక వేసి కళ్ళ నీళ్లు తుడుచుకుని “అంటే విడాకులు అడుగుతున్నావా?”

“అవును” అన్నట్టుగా తలూపింది. విడాకుల పేపర్ మీద సంతకం చేసినప్పుడు సత్యకృష్ణ ఏడ్చినట్టు ఎవరు ఏడ్చి ఉండరు. ఎన్నో కలలు కన్నాడు, ఆమెతో ఉండే ప్రతి క్షణం ఒక కొత్త అనుభూతిలా జీవితాన్ని మలచుకోవాలనుకున్నాడు. కానీ ఒక్క సంతకంతో తన జీవితం మొత్తం

మారిపోయింది. సంసారాన్ని, బంధాల్ని, ప్రేమని , అన్నిటినీ దూరం చేసిన తన సంతకాన్ని మొట్ట మొదటిసారి అసహ్యించుకున్నాడు. వాళ్ళు కోరుకున్నట్టుగానే వారిద్దరి పెళ్లి గుడిలో జరిపించాడు.

ఆ తరువాత ఆమె ఆలోచనల నుండి బయట పడటానికి ఏదో పనిలో నిమగ్నమవడం అలవాటు చేసుకున్నాడు. తాను చదివింది బాటని కావడంతో మొక్కలు పెంచడం అలవాటు చేసుకున్నాడు.

ఒకప్పుడు క్షణం తీరిక లేకుండా రాధిక కోసం పని చేసాడు. ఇప్పుడు తన కోసం క్షణం తీరిక లేకుండా పని చేసుకుపోతున్నాడు. ఒకటి ప్రేమిస్తూ చేసాడు. మరొకటి ప్రేమని మర్చిపోవడానికి చేసాడు...!!

***

మొత్తం సత్యకృష్ణ కథ అంతా విన్న ఎయిర్పోర్ట్ ఆఫీసర్ సత్యకృష్ణ వైపు జాలిగా చూసి “ఐ యామ్ సారీ సత్యకృష్ణ గారు” అన్నాడు. చిరు నవ్వు నవ్వాడు.

“ఇంత జరిగినా ఆమె కోసం ఎలా రాగలిగారు? ఒక మనిషిని తప్పొప్పులు ఎంచకుండా అంతగా ప్రేమించచ్చా? అది సాధ్యమేనా? ఆమెపై కోపం లేదా మీకు?” అనడిగాడు ఆఫీసర్.

“మీ పేరు?” అనడిగాడు సత్యకృష్ణ.

“గౌతమ్” అని చెప్పాడు ఆ ఆఫీసర్.

“మీకు అహల్య, గౌతమ మహర్షి కథ తెలిసే ఉంటుంది కదా, అహల్య తప్పు చేస్తే మరొక అవకాశం ఇచ్చాడు గాని తెగదెంపులు చేసుకోలేదు.” అన్నాడు.

“కానీ మీరు విడిపోయారు కదా. నాకెందుకు అని ఊరుకుని ఉండచ్చు కదా”

“ఇద్దరు విడిపోవడం అంటే అర్థం ఎవరికీ వారు విడిగా దూరంగా బతకడం కాదు సార్, ఒకరి జ్ఞాపకాల్లో మరొకరు లేకుండా పోవడం. అప్పటివరకు దాన్ని విడిపోవడం అనరు” చెప్పాడు సత్యకృష్ణ.

“మీ ఫోటో ఐడెంటిటీ ప్రూఫ్ ఒకటి ఇచ్చి మీరు ఆవిడను తీసుకువెళ్ళచ్చు” అని చెప్పాడు గౌతమ్.

“థాంక్యూ సార్” అన్నాడు సత్యకృష్ణ.

“కానీ ఒక్క విషయం సత్యకృష్ణ గారు, అర్థం చేసుకునే భార్య ఉంటే అరణ్యవాసం కూడా ఆనందంగా గడిచిపోతుంది. అదే అర్థం చేసుకోని భార్య వస్తే అరసెకను కాలం కూడా అరణ్యవాసంలానే తోస్తుంది. ఐ హోప్, ఆమె ఇంక మిమ్మల్ని అర్థం చేసుకుంటుందని అనుకుంటున్నాను. కాదు నమ్ముతున్నాను. ఎందుకంటే మీరు చూపించిన, చూపిస్తున్న ప్రేమ అలాంటిది. ఐ కెన్ సే ఆమె చాలా అదృష్టవంతురాలు.” అని అన్నాడు గౌతమ్. రాధికని తనతో పాటు ఇంటికి తీసుకెళ్ళాడు సత్యకృష్ణ.

***

శీనుకి, కపర్దికి తగిలిన దెబ్బలు తగ్గాయి. ఎవరి పనుల్లో వాళ్ళు మళ్ళీ నిమగ్నులయ్యారు. మనోహర్ కూడా సినిమా ప్రయత్నాలు చేస్తూ అసిస్టెంట్ డైరెక్టర్ గా అవకాశం సాధించాడు.

“మొత్తానికి సాధించావ్” అన్నాడు శీను.

“కంగ్రాట్స్ మనోహర్!” అన్నాడు కపర్ది.

“మమ్మల్ని సినిమాలో చూపించకపోవాలి అప్పుడు చెప్తాను నీ పని.” అన్నాడు బాలరాజు.

“పార్టీ చేసుకుందామా?” అనడిగాడు కపర్ది.

“తప్పకుండా, కానీ ఈరోజు కాదు. రేపు.” అన్నాడు మనోహర్.

“రేపు ఎందుకు?” అడిగాడు శీను.

“నా మరదలు వస్తోంది. మళ్ళీ సాయంత్రం వెళ్ళిపోతుంది.” చెప్పాడు మనోహర్.

“పర్సు లో అమ్మాయా?” అనడిగాడు బాలరాజు ముందుకు జరుగుతూ.

చిన్నగా నవ్వాడు మనోహర్ ..

“చాందినిని కూడా రమ్మంటాను.” అన్నాడు శీను.

"దెబ్బలు మానయోలేదో మళ్ళీ మొదలెట్టాడు. కుక్క తోక వంకర అని ఊరకనే అనలేదు." అన్నాడు బాలరాజు.

"నువ్వు ప్రేమించ, అప్పుడు తెలుస్తుంది." అన్నాడు శీను.

"ఎందుకు దెబ్బలు తినడానికా?" అనడిగాడు బాలరాజు.

"తీసుకురా శీను.ఈ సారి తాడో పేడో తేల్చుకుందాం." అన్నాడు కపర్ది.

మనోహర్ కూడా వత్తాసు పలికాడు.

"అంటే ఆ కాడికి మీరందరు హీరోలు నేను కమెడియన్నా!" అనడిగాడు బాలరాజు.

"కాకపోతే ఏంటి!" అన్నాడు శీను. మిగిలిన ఇద్దరు నవ్వుకున్నారు.

"కంగారుపడకండి, ప్రతి కమెడియన్ కి ఒకరోజు వస్తుంది." అన్నాడు బాలరాజు.

***

"నాన్న, ఈ రోజు కాలేజీలో ఏమైందో తెలుసా?" గీత తండ్రి విరించిని అడిగింది.

"చెప్పు" అన్నాడు.

"మా సార్ ఉన్నారు కదా...అదే నాన్నా సత్యకృష్ణ గారు, ఆయన భార్య వచ్చేసిందట. ఆయన ఆనందంగా కనిపించారు, మొదటిసారి నవ్వారు

మనస్ఫూర్తిగా. మంచి మనిషి నాన్నా." అంది.

"పోన్లే పాపం. " అన్నాడు విరించి.

"సరే... పద మనం ఈరోజు బయట తిందాం."

"ఎందుకు?"

"పార్టీ ఉంది నాన్నా!"

"పార్టీనా? అయినా ఆయనెవరి భార్యో తిరిగి వస్తే మనం పార్టీ చేసుకోవడం ఏంటి?" అనడిగాడు.

"అది వేరు, ఇది వేరు నాన్న. ఆరోజు నన్ను కాపాడాడే....అతను లంచ్ కి ఇన్వైట్ చేశారు. నిన్ను కూడా తీసుకురమ్మన్నారు." అంది.

"ఓహో.. లంచ్ కి ఇన్వైట్ చేసేంత వరకు వచ్చిందన్నమాట." నవ్వుతూనే అడిగాడు.

"అబ్బా, అదేం లేదు నాన్నా... జస్ట్ ఫ్రెండ్ అంతే." అంది.

"సరే.. అలానే అనుకుందాం" అన్నాడు.

***

కాలేజీలో చిన్న పని చూసుకుని డైరెక్ట్ గా రెస్టారెంట్ కి వచ్చేస్తాను అని చెప్పి ఉదయమే వెళ్ళిపోయాడు కపర్ది. శీను చాందిని కోసం వెళ్ళాడు. ఆ రోజు ముంబై పంపించేసానని చెప్పిందంతా అబద్ధం అని తరువాత శీనుకి తెలిసింది.

బాలరాజు టిఫిన్ తీసుకురావడం కోసం బయటికి వెళ్ళాడు. ఆరోజు ఉదయమే శ్రీజ వచ్చింది. మనోహర్ తనతో పాటు ఇంటికి తీసుకువచ్చాడు.

"ఇదే నేను ఉండే ఇల్లు." నవ్వాడు మనోహర్. ఆ ఇల్లుని చూసి, బావ వంక చూసింది.

"ఇల్లు ఇలా ఉందేంటా అని అనుకోకు, ఇక్కడ నన్ను నమ్మే మనుషులు ఉన్నారు. నేను ఎవరో తెలిసి కూడా నమ్మని సొంత వాళ్ళ కన్నా నేను ఎవరో తెలియకపోయినా ఇంత అన్నం పెట్టి తమ్ముడిని చూసుకున్నట్టు చూసుకున్నాడు శీను. మిగిలిన ఇద్దరు కూడా నన్ను నన్నుగా గుర్తించారు. నా టేలెంట్ చూసారు. సగం అక్కడే కడుపు నిండిపోయేది తెలుసా?" తెలియకుండానే మనోహర్ కళ్ళు చెమర్చాయి.

అతని కంటతడిని చూసింది. "ఈ మాటలు, వీళ్ళ మంచితనం అంతా నువ్వు గెలిచాక నలుగురికి చెప్పాలి బావ. అప్పుడే నువ్వు నిజంగా గెలిచినట్టు." అంది శ్రీజ. తప్పకుండా అన్నట్టుగా తలూపాడు.

"సరే వెళ్లి రెడీ అవ్వు" అన్నాడు. ఆమె రెడీ అయ్యేసరికి బాలరాజు టిఫిన్స్ పట్టుకుని వచ్చాడు.

"హాయ్"అని పలకరించింది శ్రీజ.

"హాయ్" అన్నాడు నవ్వుతూ

"మిమ్మల్ని చూసాను ఇంతకు ముందే, కానీ సగమే చూసాను." అన్నాడు బాలరాజు.

"ఏం మాట్లాడుతున్నావ్ బాలరాజు?" అనడిగాడు మనోహర్.

"ఏహే..పాస్పోర్ట్ ఫోటో చూసాను అని చెప్తున్నాను మనోహర్" అన్నాడు బాలరాజు.

శ్రీజ చేయి అడ్డు పెట్టుకుని నవ్వు ఆపుకోవడానికి ప్రయత్నించింది.

***

మధ్యాహ్నం శీను చాందినిని తీసుకుని రెస్టారెంట్ కి వెళ్ళాడు. అప్పటికి ఇంకా ఎవరు రాలేదు. లోపలికి వెళ్తూ "మావోడు టేబుల్ బుక్ చేసాడంట. ఎక్కడ?" అని అడిగాడు శీను.

"నేమ్ సర్?" అనడిగాడు రిసెప్షనిస్ట్.

"కపర్ది" అని చెప్పాడు శీను.

లిస్ట్ చూసి వెయిటర్ కి టేబుల్ నెంబర్ చెప్పి చూపించమని చెప్పాడు రిసెప్షనిస్ట్. వారికి టేబుల్ చూపించాడు వెయిటర్.

అక్కడికెళ్లి కూర్చున్నారు. తరువాత శ్రీజ, మనోహర్, బాలరాజు హోటల్కి చేరుకున్నారు. మనోహర్ అందరిని శ్రీజకి పరిచయం చేసాడు. ఆ తరువాత విరించి, గీత చేరుకున్నారు.

"మిమ్మల్ని కూడా కపర్ది రమ్మన్నాడా?" అనడిగాడు మనోహర్.

“ఈయనెవరో తెలుసా?” అనడిగాడు బాలరాజు శీనుని, విరించి ఉద్దేశించి.

“తెలియదు.” అన్నాడు శీను.

“నువ్వు మాకు లైఫ్ ఇస్తే నీకు కపర్దికి లైఫ్ ఇచ్చింది ఈయనే.” అన్నాడు బాలరాజు.

“అవును, ఆరోజు మిమ్మల్ని హాస్పిటల్ లో జాయిన్ చేసింది ఈయనే.” అన్నాడు మనోహర్.

“హాస్పటల్ ఏంటి?” అనడిగింది చాందిని.

“అదా... ఏమి లేదు, రోడ్ మీద వెళ్తుంటే బండి గుద్దేసింది. అంతే!” అన్నాడు శీను.

“ఓహో.. హీరోలు తన్నులు తిన్నామని చెప్తే హీరోయిజం దెబ్బతింటుంది కదా, సారీ!” అన్నాడు బాలరాజు.

“దుర్మార్గుడా!” అని తిట్టాడు శీను.

“ఎవరు కొట్టారు నిన్ను?” అనడిగింది చాందిని.

“ఏమి లేదు. తరువాత చెప్తాను. ఇప్పుడు అన్ని తగ్గిపోయాయి.” అన్నాడు శీను.

“బాలరాజిక్కడ. బుకింగ్ స్పెషలిస్ట్.” అన్నాడు బాలరాజు.

"సాయంత్రం చెప్తా నీ పని." అన్నాడు శీను.

"స్టాటర్స్ ఆర్డర్ చేద్దాం సరేనా అని" అనడిగాడు మనోహర్. అప్పుడే కపర్ది రెస్టారెంట్ కి చేరుకున్నాడు.

"అదిగో వచ్చేసాడు కపర్ది." అని అన్నాడు శీను. అందరు అతని వైపు తిరిగారు.

గీత నవ్వుతూ కపర్దిని చూసింది. కపర్ది మొదటగా విరించిని చూసాడు.

"సార్.. మీరా! బాగున్నారా?" అనడిగాడు కపర్ది.

"మా నాన్న" అని చెప్పింది గీత.

"అవునా.." నవ్వుతూ "మీ నాన్న గారు ఆ రోజు చేసిన హెల్ప్ ఎప్పటికి మర్చిపోను" అని చెప్పాడు కపర్ది.

"నీకు కూడా థ్యాంక్స్ " అన్నాడు విరించి. ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు నవ్వుతూ.

శ్రీజ కపర్దిని చూస్తూ ఉండిపోయింది. అప్పుడే ఆమె వైపు చూపు తిప్పాడు.

"నా మరదలు శ్రీజ." పరిచయం చేసాడు మనోహర్.

ఒక్క క్షణం ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. ఆ క్షణంలో అవెన్నో ఊసులు చెప్పుకున్నాయి. రెప్పపాటులో తెప్పరిల్లి "షల్ వుయ్ స్టార్ట్ " అన్నాడు కపర్ది.

భోజనాలు చేశారు. కపర్ది తప్ప అందరు చికెన్ తిన్నారు.

బిల్ పే చేస్తుంటే పక్కనే ఉన్న టి.వి లో మహాదేవకి హార్ట్ ఎటాక్ వచ్చిందని హాస్పిటలైస్ అయ్యారని హెడ్ లైన్స్ ఇస్తున్నారు. అది చూసి ఒక్క క్షణం షాక్ కి గురి అయ్యాడు కపర్ది. కొడుకు ఊరిలో లేడని, అతని గురించి వాకబు చేస్తున్నారని, కొడుకు వెళ్ళాక, ఆయన బాగా క్రుంగి పోయారని అందుకే హార్ట్ ఎటాక్ వచ్చిందని వార్తల్లో చెప్తున్నారు.

"ఆలోచిస్తున్నావేంటి? వెళ్ళు కపర్ది " అంది శ్రీజ. ఆశ్చర్యపోయాడు మనోహర్.

ఆమె వంక చూసి, తిరిగి శీను వైపు చూసి "నేనొకసారి హైదరాబాద్ వెళ్ళొస్తాను" అని చెప్పాడు కపర్ది. సరే అని తలూపాడు శీను. బాలరాజు వంక చూసాడు. "జాగ్రత్త బాసు" అని చెప్పాడు బాలరాజు. వెంటనే హైదరాబాద్ కి బయలుదేరిపోయాడు.

"నీకు కపర్ది తెలుసా?" అనడిగాడు మనోహర్.

"నేను చదువుకుంటున్నప్పుడు నాకు ఒకడు ప్రపోస్ చేసాడని చెప్పాను కదా, అతనే కపర్ది." అంది శ్రీజ.

గీత విరించి ఒకరినొకరు చూసుకున్నారు.

"బయలుదేరుదామా నాన్నా?" అనడిగింది గీత.

"హ్మ్... " ఇద్దరు బయలుదేరిపోయారు.

బాలరాజు ఇంటికి వెళ్ళిపోయాడు. చాందినిని దించేసి శీను ఇంటికి వచ్చేసాడు. మనోహర్ కూడా శ్రీజని ట్రైన్ ఎక్కించేసి ఇంటికి చేరుకున్నాడు. నెత్తి మీద గుడ్డ వేసుకుని కూర్చున్నాడు బాలరాజు.

"ఏంటా వాలకం... ఏమైంది ఇప్పుడు?" అనడిగాడు శీను..

"ఫస్ట్ హాఫ్ అయింది... మొదలెట్టన్లా బాబు ఫ్లాష్ బ్యాక్స్ ఇంకా!" అన్నాడు బాలరాజు.

కపర్ది హాస్పిటల్ చేరుకునే సరికి అక్కడ చాలా మంది సినీ ప్రముఖులున్నారు. వాళ్ళల్లో కొత్త డైరెక్టర్ కిరీటి కూడా ఉన్నాడు. కపర్ది నేరుగా అక్కడున్న వంటవాడి దగ్గరకి వెళ్ళాడు.

"ఎలా ఉంది ఇప్పుడు?" ప్రశ్నించాడు కపర్ది.

"ప్రమాదం ఏమి లేదు" కిరీటి జవాబిచ్చాడు. కిరీటిని చూసాడు కపర్ది.

మీడియా వాళ్ళు కెమెరాలతో కపర్దిని చిత్రీకరిస్తున్నారు. పక్కనే ఉన్న కిరీటిక కూడా ఆ వీడియోలో పడ్డాడు.

"మొదటిసారి వచ్చిన గుండెపోటు. కంగారుపడాల్సింది ఏమీ లేదు. రేపో ఎల్లుండో ఇంటికి వెళ్లిపోవచ్చు అన్నారు" చెప్పాడు వంటవాడు.

"సరే, నేను ఇంటికి వెళ్తాను." అన్నాడు కపర్ది.

"అదేంటి, సార్ ని చూడకుండానే వెళ్తారా?" అడిగాడు కిరీటి.

"చూసి ఏమి చేయమంటారు?" ప్రశ్నించాడు కపర్ది.

"మీ నాన్నగారు గురించి మీరలా మాట్లాడటం బాగోలేదు" అన్నాడు కిరీటి.

"మా కుటుంబ విషయాల్లో మీరు కలగజేసుకోవడం కూడా ఏమి బాలేదు" అంతే ఘాటుగా సమాధానమిచ్చాడు కపర్ది.

కిరీటి ఏమి మాట్లాడలేదు. కపర్ది వెళ్ళిపోయాక మీడియా అందరు కిరీటి వెంటపడ్డారు “ఏం మాట్లాడుకున్నారు” అంటూ.

“కపర్ది గారు ఇంటికి వెళ్లి మళ్ళీ వస్తాను అన్నార”ని చెప్పాడు కిరీటి లౌక్యంగా.

కిరీటి చెప్పిన ఆన్సర్ కి ప్రొడ్యూసర్ తెగ ఆనందపడిపోయాడు.

“ఈ దెబ్బకి మన సినిమాకి ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చేశావయ్యా కిరీటి. దీని వల్ల మీడియా నీ గురించి, మన సినిమా గురించి బాగా చెప్తుంది. అలాగే పెద్దాయన్ని ఆయన కొడుకు చూడకుండా వెళ్ళాడు అన్న విషయాన్ని దాచావ్ చూడు... పెద్దాయనకు తెలిస్తే మార్కులు పడిపోతాయి నీకు.” అన్నాడు ప్రొడ్యూసర్.

“అన్నిటిలోను వ్యాపారాన్ని లాగకండి సార్. ఆయన తన తండ్రిని కలవనంటున్నాడు అంటే దానికేదో కారణం ఉండి ఉండాలి. మనం దాన్ని క్యాష్ చేసుకోవాలనుకోవడం తప్పు సార్.”

“నువ్వెక్కడ దొరికావయ్యా! సినిమా మధ్యలో ఉండగా ఎవరైనా యాక్టర్ చనిపోతే, అతని ఆఖరి మూవీ అంటూ చెప్తారు. అది పబ్లిసిటీ కాదా..చెప్పు?”

“అది వేరు, ఇది వేరు సార్. ఆఖరి మూవీ అని చెప్పేది ఆయన స్క్రీన్ మీద చూడటం అదే చివరిసారి కనక ఆ యాక్టర్ గౌరవార్థం అలా చెప్తారు.

దాన్ని వ్యాపారం అని నేను అనుకోవడం లేదు.”

“ఏది ఏమైనా నువ్వు చేసిన దాని వల్ల మన సినిమాకి మంచి పాజిటివ్ టాక్ వస్తుంది.”

“వస్తే రానివ్వండి. కానీ దీన్ని అడ్డం పెట్టుకుని సినిమాని ప్రమోట్ చేయకండి. నేను మళ్ళీ మీడియా ముందుకు వచ్చి ఇదంతా మీ ప్లాన్ అని చెప్పేస్తాను”

“నువ్వు చేసినా చేస్తావ్!” అన్నాడు ప్రొడ్యూసర్.

ప్రొడ్యూసర్ కొత్తవాడు కావడంతో ఎదురు చెప్పలేకపోయాడు. కానీ అతను ఆశించినదానికంటే ఎక్కువ పబ్లిసిటీనే దక్కింది. పైగా ఆడియో సూపర్ హిట్ అయింది. ఎఫ్.ఏం స్టేషన్స్ లో కూడా ఆ పాటలే ఎక్కువగా ప్లే చేశారు. మహాదేవ కోసం హాస్పిటల్ దగ్గరే ఉన్న కిరీటి అంటే అందరికీ అతనిపై మంచి అభిప్రాయం ఏర్పడింది. కపర్ది కిరీటి బెస్ట్ ఫ్రెండ్ అని, అందుకే కపర్దికి బదులు కిరీటి మహాదేవ బాధ్యతలు తీసుకున్నాడని, అందుకే మహాదేవ రికమండేషన్ తో సినిమా ఛాన్స్ ఈజీగా వచ్చిందని ఎవరికీ తోచిన ఊహాగానాలతో వాళ్ళు న్యూస్ రాశారు. ముఖ్యంగా యుట్యూబ్ చానల్స్ లో ఎవరికి తోచిన విషయం వారు చెప్పేసారు.

కపర్ది హాస్పిటల్ నుండి ఇంటికెళ్ళిపోయాడు. కాసేపటికి వంటవాడు వచ్చాడు. వస్తూనే, “సాయంత్రం డిశ్చార్జ్ చేసేస్తారట బాబు” అన్నాడు.

“ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఉందా?” అనడిగాడు.

“ఒక పావు గంట బాబు, వడ్డించేస్తాను. ఈ లోపులో ఫ్రూట్స్ ఉన్నాయ్! తింటారా?”

“వద్దు. ఆగుతాను” అని చెప్పి కుర్చీలో తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు.

వంటవాడు లోపలికి వెళ్లి చేతులు కడుక్కోని గబగబా వంట పూర్తి చేసి “వడ్డించేసాను రండి” అన్నాడు.

కడుపునిండా భోజనం చేసి “కూర చాలా బాగుంది” అన్నాడు. వంటవాడి కళ్ళలో మెరుపు.

“కంగారుగా చేసేసాను బాబు. సరిగా వచ్చిందో లేదో అని భయపడ్డాను” ముడుచుకుపోతూ చెప్పాడు వంటవాడు.

“లేదు..చాలా బాగుంది” అని చెప్పాడు కపర్ది.

“మీరు మొదటిసారి మెచ్చుకున్నారు బాబు. చాలా సంతోషంగా ఉంది” అన్నాడు వంటవాడు చాలా ఆనందంతో.

ఆ రోజు మనోహర్ అన్న మాటలు గుర్తొచ్చాయి కపర్దికి ‘ఈ సారి ఇంటికెళ్లినప్పుడు చెప్పి చూడు. ఆ సమయంలో మీ వంటవాడి కళ్ళల్లోకి చూడు, ఐ యాం షూర్ అతని కళ్ళల్లో వచ్చే వెలుగు నువ్వు ముందెప్పుడూ చూసి ఉండవు. అంతలా ఆనందపడతాడు’ . నిజమే, వంటవాడి కళ్ళల్లో కొత్త

మెరుపు చూసాడు. అది కపర్ది అంతకు ముందెన్నడూ చూసెరగడు. తన గదిలోకి వెళ్ళిపోతూ ఆగి వెనక్కి తిరిగి "సారీ" అని చెప్పాడు.

"ఎందుకు బాబు?" అనడిగాడు వంటవాడు.

"ఏమి లేదు" అని చెప్పి గదిలోకి వెళ్ళిపోయాడు.

సాయంత్రానికి మహాదేవని డిశ్చార్జ్ చేశారు. అన్ని సోషల్ మీడియాలలో అతను తొందరగా కోలుకోవాలని ప్రచారం చేశారు. ప్రార్ధనలు చేసారు. అది అంతా మీడియా చేసిన హైప్. మహాదేవ ఇంటికి వచ్చినా కపర్ది ఏమి పట్టనట్టే ఉన్నాడు. మర్నాడు ఉదయం తాను ఆరోగ్యంగానే ఉన్నానని మీడియాకి నోట్ రిలీజ్ చేసాడు మహాదేవ. అక్కడితో ఆ విషయం సద్దుమణిగింది. తాము చేసిన పూజల వలెనే మహాదేవ కోలుకున్నాడని కొంతమంది వీరాభిమానులు పొంగిపోయారు కూడా!!

కొడుకు వచ్చి రెండు రోజులవుతున్నా వచ్చి పలకరించలేదనే బాధ మహాదేవకి ఉంది. కానీ ఎదురెళ్లి ఎందుకు మాట్లాడటం లేదు అని అడగలేకపోయాడు. మాట్లాడుకుని పోట్లాడుకునే కన్నా మౌనం వహించి ప్రశాంతంగా ఉండటమే మంచిదని ఊరుకుండిపోయాడు. కపర్ది కూడా తండ్రిని ఎలా ఉన్నావ్ అని ప్రశ్నించలేకపోయాడు. ఎవరి ఇగోలు వాళ్ళవి. ఎవరి పంతాలు వారివి. కానీ ఎక్కడో ఒక పాశం ఇద్దరి మనసులని మెలిపెట్టేసి ఇబ్బంది పెడుతోంది.

కపర్ది మౌనంగా తల్లి ఫోటో వైపు చూస్తూ నుంచున్నాడు. మహాదేవ వచ్చి అంతే మౌనంగా కపర్దిని చూసాడు. ఇద్దరి కళ్ళు తడిసాయి.

"నన్ను చూడటానికి వచ్చినందుకు థ్యాంక్స్" అన్నాడు మహాదేవ.

"నేను మిమ్మల్ని చూడటానికి రాలేదు" చెప్పాడు తల్లి ఫోటోనే చూస్తూ.

"మంచిది, మీ నాన్న ఏమైపోయినా బాధ లేదన్నమాట!"

"నాన్న అని మీరు చెప్పుకోవడమే గాని ఎప్పుడైనా అలా ఉన్నారా?"

"నీకేమి తక్కువ చేసాను.. అడిగిందల్లా కొనిచ్చాను. అవసరమైనవన్నీ అమర్చాను. తండ్రిగా ఇంతకంటే ఏమి చేయాలి?"

"అన్నీ ఇచ్చారు. అవసరాలు తీర్చారు. అమ్మ చెప్పేది కనక! నిజం చెప్పండి. నేను ఎన్ని మార్కులతో ఎం.బి.ఎ పాస్ అయ్యానో మీకు తెలుసా?" అని అడిగాడు. మౌనం వహించాడు మహాదేవ.

"చిన్నప్పటి నుండి ఒక్కనాడైనా నా ప్రోగ్రస్ కార్డ్ మీద సంతకం చేసారా?"

సమాధానమివ్వలేదు.

"మీ అమ్మ ఉంటే వాటన్నిటికీ సమాధానమిచ్చేది. ఇప్పుడు నేనేమి జవాబు చెప్పినా నీకు నచ్చదు."

"చాలా లౌక్యంగా మాట్లాడుతున్నారు. అయినా అమ్మే ఉంటే అసలు మీకు గుండె నొప్పి వచ్చేదే కాదు. ఉంటే అంటే బతికుంటే అని కాదు, బాగా చూసుకుని ఉంటే అని" అన్నాడు తండ్రివైపు తిరిగి.

"అంటే మీ అమ్మని బాగా చూసుకోలేదనా నీ మాటకర్థం? మీ అమ్మ, నేను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. ఆ విషయం నీకు కూడా తెలుసు" నిదానంగానే బదులిచ్చాడు మహాదేవ.

"ప్రేమ... కరుడుగట్టిన తీవ్రవాదులకు కూడా గుండెల్లో ఎక్కడో మూల ప్రేమ దాగి ఉంటుందంటారు. కాని మీలాంటి కరుడుగట్టిన కళా పిపాసులకి వీసమ్మాత్రము కూడా ఉండదు." గొంతు పెంచుతూ అన్నాడు కపర్ది.

"అవునురా! నేను కళాపిపాసినే. కళ అనేది అందరికీ అబ్బేది కాదు. లోపల నుండి ఈశ్వరానుగ్రహం లేకపోతే ఏ ఒక్క కళా అబ్బదు. అది ఒక వ్యసనం. దానికి బానిసైన వాడు దాన్నుంచి బయటపడటం అంత సులువు కాదు. అది అనుభవించినవాడికే అవగతమవుతుంది."

"వాదన అనవసరం నాన్న. మీ దారి వేరు. నా గమ్యం వేరు. మీ దారిలో మీకు కవిత్వం తోడైంది. కాని నాకు మా అమ్మ దూరమైంది."

"నీకు అమ్మ కన్నా ముందు నాకు భార్య"

"భార్యలా ఎప్పుడైనా చూసారా? నాకైతే ఇంటి పనిమనిషికి, అమ్మకి పెద్ద తేడా ఏమీ అనిపించలేదు. ఎప్పుడైనా అమ్మని ప్రేమగా పిలిచి 'తిన్నావా?' అని

అడిగిన పాపానపోలేదు. ఎప్పుడూ అన్నం పెట్టు అని అడగడమేగాని.”

“నేను నీకెలా చెప్పను కపర్ది. మీ అమ్మ అవన్నీ నాకు చేయడంలో చాలా సంతోషపడేది. అవన్నీ నీకు చెప్పినా అర్థం కావు.”

“అర్థం చేసుకోవాల్సిన అవసరం అంతకంటే లేదు. నేను తిరిగి వెళ్ళిపోతున్నాను”

“ఎందుకు? ఇక్కడ ఉంటే వచ్చిన సమస్య ఏంటి?”

“సమస్య ఉందని వెళ్ళిపోవడం లేదు. మనస్శాంతి కోసం వెళ్ళిపోతున్నాను. చలి మంట వెచ్చగా ఉందని దాంట్లో కెళ్ళి కూర్చోలేము నాన్నా. దూరంగా ఉంటేనే మంచిది.”

“నిజంగా వెళ్ళిపోతావా?”

జవాబివ్వలేదు కపర్ది. ఆ రాత్రే చెప్పకుండా చెన్నై బయలుదేరి వెళ్ళిపోయాడు. ఉదయం వంటవాడు మహాదేవకి కపర్ది వెళ్ళిపోయిన విషయం చెప్పాడు. వంటవాడివైపు చూసి “కాసేపు నన్ను ఒంటరిగా వదిలేయ్.. ఎవరు వచ్చినా కలవడానికి పంపద్దు. తరువాత రమ్మనమని చెప్పానని వాచ్ మేన్ కి చెప్పు” అని చెప్పాడు మహాదేవ.

సరేనని చెప్పి వంటవాడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

***

కపర్ది చెన్నై చేరుకుని రూంకి వెళ్ళేసరికి బాలరాజు ఒక్కడే ఉన్నాడు. అది కూడా మత్తు నిద్రలో ఉన్నాడు. వాచ్ మేన్ పని కదా!. నిద్రపోతున్న బాలరాజుని చూసాడు కపర్ది. పక్కనే వెళ్ళి కూర్చున్నాడు. ఒళ్ళు తెలియకుండా పడుకుని ఉన్నాడు. ఎంతో ప్రసాంతంగా , హాయిగా నిద్ర పోతున్నాడు. బాలరాజు పడుకున్న రెండు మూడు నిమిషాలకే నిద్రలోకి జారుకుంటాడు. అది చాలా గొప్ప వరం. అది అందరికీ కుదరదు. 'కడుపుకింత కూడు, కంటికింత నిద్ర, ఒంటికింత బట్ట ఇది చాలాదా ఈ ఎదవ జీవితానికి' అని ఒకసారి బాలరాజు అంటుంటే విన్నాడు కపర్ది. నిజమే.. సంపాదనా, పరపతి, పేరు, కీర్తి, సన్మానాలు.. ఒకటి వచ్చాక ఇంకొకటి,,, దాని తరువాత ఇంకొకటి ఇలా జీవితాంతం ఏదో ఒకదాని కోసం వెంపర్లాడటమేనా.. ఇంక మనిషి బతికేదెపుడు? మనస్ఫూర్తిగా నవ్వేదెపుడు?. బాలరాజుకి సమస్యలు లేవని కాదు. సమస్యలున్నా వాటిని అంత సీరియస్ గా తీసుకోడు. తెలియని తత్వమేదో బాలరాజులో ఉందనిపించింది. నిజం చెప్పాలంటే బాలరాజు తన కంటే కోటీశ్వరుడు అనుకున్నాడు కపర్ది.

కాలేజీకి రెడీ అయ్యి వెళ్ళిపోయాడు కపర్ది. సాయంత్రం కాలేజి అయ్యాక ఇంటికి బయలుదేరుతుంటే గీత కనిపించింది.

"హాయ్" పలకరించాడు.

"హాయ్.. ఎలా ఉంది మీ నాన్నగారికి?" అనడిగింది.

“బానే ఉన్నారు.” అన్నాడు పొడిగా.

“ఇంకా?”

“చెప్పాలి”

“చెప్పడానికేముంటాయి..అంతా మామూలే.. నిన్ను ఒకడగనా?”

“అడుగు”

“అంత పలుకుబడి ఉన్న నువ్వు ఇలా లెక్చరర్ జాబ్ చేయడం ఎందుకు?”

“పలుకుబడి నాకు లేదు. మా నాన్నకి ఉంది. జాబు చేసేది నేను బతకడం కోసం.”

“ఇంతకంటే మంచి జీవితం మీ నాన్నగారు నీకు ఇవ్వగలరు కదా?”

“మా నాన్నకు అన్నిటికంటే, అందరికంటే ఇష్టమైనవి చాలా ఉన్నాయి. ఆ లైన్ లో నిలబడితే నేను ఎక్కడో ఉంటాను.”

“మరి ఇలా వచ్చేస్తే మీ అమ్మగారు బాధపడరా?”

“అమ్మ లేదు.”

మౌనం వహించింది.

“నీకో విషయం చెప్పనా?” అనడిగింది.

"చెప్పు" అన్నాడు బస్ స్టాండ్ లో ఉన్న చైర్ లో కూర్చుంటూ. ఆమె కూడా పక్కన కుర్చీలో కూర్చుంటూ "మీ నాన్నగారు మా నాన్నకి ఫ్రెండ్ అంట.. మొన్న టి.విలో న్యూస్ చూసి ఇంటికెళ్తుంటే చెప్పారు." అని చెప్పింది. "ఆయనకు చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. అందులో మీ నాన్న ఒకరు అయ్యుంటారు." అన్నాడు.

"గుంపులో ఒకరిగా కాదు, మీ నాన్నగారు కొత్తల్లో స్ట్రగుల్ అవుతున్నప్పుడు మా నాన్నతో కలిసి రూంలో ఉండేవారట. ఈయనేమో సినిమా పోస్టర్స్ కి బొమ్మలు వేసేవారట. మీ నాన్నకి అప్పటికి ఇంకా అవకాశాలు రాలేదు కాని, మీ అమ్మగారితో ప్రేమలో ఉండేవారట. చిన్న చిన్న చాన్సెస్ వచ్చినా వదిలేవారు కాదట. అలా అజ్ఞాతంలో పాటలు రాస్తూ దాదాపు ఐదేళ్ళు గడిపేసారు. అప్పటికే నెమ్మదిగా గ్రాఫిక్స్, డిజిటలైజేషన్ వచ్చి మార్కెట్ ని నెమ్మదిగా ఆక్రమించుకుంది. మా నాన్నకి అవకాశాలు తగ్గాయి. పోస్టర్స్ మీద బూతు బొమ్మలు రావడం ప్రారంభించాయి. అవి వేయడానికి మా నాన్న మనసు అంగీకరించలేదు. అలా అని అక్కడే ఉండి మరో రకంగా బతికే అవకాశం కోసం చూడలేదు. నెమ్మదిగా సినిమా ఇండస్ట్రీ అంతా హైదరాబాద్ కి మారిపోయింది. ఈలోపులో నేను పుట్టాను. అప్పుడు అమ్మకు ప్రసవం కాంప్లికేటడ్ అయింది. అప్పుడు మీ నాన్నే అవసరానికి ఆదుకొన్నారట. కాని అమ్మ దక్కలేదు. అమ్మ పోయిన తరువాత నాన్న డిప్రెషన్ లోకి వెళ్ళిపోయారు. ఆ సమయంలో మా నాన్నకు మీ నాన్నగారే

మోరల్ సపోర్ట్ ఇచ్చారట. ఆ సపోర్ట్ తో నా కోసం మళ్ళీ బొమ్మలు వేయడం మొదలు పెట్టారు. కానీ ఆయనకు అర్ధ నగ్నంగా బొమ్మలు వేయాలనిపించలేదు. ఒకటి-అరా వేస్తుంటే సంపాదన చాలేది కాదు. సెల్ఫ్ రెస్పెక్ట్ కోసం సినిమాని వదిలేసి విడిగా బీచ్ లో మనుషుల బొమ్మలు గీయడం మొదలెట్టారు. ఎందుకలా బంగారం లాంటి అవకాశాల్ని వదులుకుంటున్నావ్ అని చాలా మంది చెప్పి చూశారట. కానీ మా నాన్న 'రేపు నా కూతురు పెరిగి పెద్దదై నేను వేసిన బూతు బొమ్మలు చూసి ఇవేంటి అని అడిగితే నా దగ్గర సమాధానం లేదు. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలున్నాయి. కానీ గౌరవం మాత్రం మన నడవడిక మీదే ఆధారపడి ఉంటుంది' అని చెప్పారట. అలా కష్టపడుతూనే నన్ను డిగ్రీ దాకా చదివించారు. ఇప్పుడు నేను ఉద్యోగం చేస్తున్నాను. బొటాబొటిగా ఇద్దరి సంపాదన అన్ని ఖర్చులకు సరిపోతుంది. ఇది లేదు అనే లోటు లేదు. మరేదో కావాలనే ఆశ లేదు. ఉన్నదాంట్లో తృప్తి ఉంది. అయినా ఆయన సంపాదించేది అంతా నా పెళ్ళి కోసమే అని నాకు తెలుసు. కాని నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఆయన మళ్ళీ ఒంటరివారు అయిపోతారు." అని ఆపింది.

మళ్ళీ తానే కొనసాగిస్తూ "నాన్న నీకు హెల్ప్ చేసానని చెప్పినపుడు నీకు ఎవరు లేరనుకున్నాను. తరువాత నన్ను కాపాడినపుడు నువ్వు దాన్ని అడ్వాంటేజ్ తీసుకుని పరిచయం మరింత పెంచుకోవచ్చు, కాని నువ్వలా చేయలేదు. మనం కలుసుకున్న సంధర్భాలు చాలా తక్కువే కావచ్చు, కానీ నీ

కంపెనీ నాకు బాగా కంఫోర్టబుల్ గా అనిపించింది. నువ్వు ఉంటే సెక్యూర్డ్ గా అనిపించింది. నిజానికి నేను నిన్ను ప్రేమించాను కపర్ది. పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. నిన్ను చేసుకుంటే నాన్న కోసం ఇంక దిగులుండదు అని అనుకున్నాను. కాని నువ్వు మరో అమ్మాయిని ప్రేమించానని తెలిసినపుడు నాకు కోపం వచ్చింది. బాధ పడే స్టేజ్ దాటిపోయాను కదా! ఆ అమ్మాయిని చూస్తే చాలా అసూయ కలిగింది. ఆమె నా అంత అందంగా కూడా లేదు కదా అని అనుకున్నాను. ఆమెలో నీకు ఏమి నచ్చిందో నరాలు తెగేలా ఆలోచించాను. మా నాన్న ఇప్పటికీ మీ నాన్నగారితో స్నేహం చేస్తూ ఉండుంటే నేను ఈ పాటికి నీ భార్యని అయ్యేదానినేమో అని అనుకున్నాను. ఇప్పుడిదంతా చెప్పేది ఎందుకో కూడా నాకు తెలియదు. నాలుగు రోజుల నుండి మనసుని తొలిచేస్తున్న బాధ. చెప్పేయాలనిపించింది. ఇది నా ప్రొపోసల్ అనుకుంటావో ఇంకేమైనా అనుకుంటావో నీ ఇష్టం. నీ అభిప్రాయాన్ని నీకు వీలున్నప్పుడు చెప్పు. అంతవరకు ......" అని చెప్పి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న గీతని చూస్తూ ఉండిపోయాడు కపర్ది.

***

కపర్ది ఇంటికెళ్ళేసరికి శీను వంట చేస్తూ కనిపించాడు.

"అదేంటి శీను నువ్వు వంట చేస్తున్నావ్?" అనడిగాడు కపర్ది.

"వచ్చావా బాసు,, ఈ మనోహర్ ఉన్నాడుగా ఏదో రెండు రకాలు నేర్పి అన్నిటికీ అదే డీఫాల్ట్ ప్రాసెస్ అని చేయమని చెప్పాడు. డబ్బులు కూడా సేవ్

అవుతున్నాయని చేస్తున్నాను. అది సరేగాని, ఎలా ఉంది మీ నాన్నగారికి?" అనడిగాడు శీను,

"బాగానే ఉన్నారు. బాలరాజు ఏడి?" అనడిగాడు కపర్ది.

"పచ్చిమిర్చి తెమ్మని పంపాను. వస్తాడిప్పుడు" చెప్పాడు శీను.

"నేను ఏమైనా సాయం చేయాలా?". అన్నాడు కపర్ది.

"సాయామేమి వద్దులేగాని, వంట ఎలా ఉన్నా వేస్ట్ చేయకుండా తినిపెట్టు, చాలు." చెప్పాడు శీను నవ్వుతూ.

"చంపుతున్నాడు కపర్ది మూడు రోజుల నుండి వీడి వంటలతో.." వస్తూనే అన్నాడు బాలరాజు.

"పచ్చిమిరపకాయ ఏది?" అడిగాడు శీను.

"ఇదిగో..." అంటూ శీనుకి పచ్చిమిర్చి అందించి, "వీడికి పిచ్చి పట్టింది కపర్ది, వీడి వంటలకి నా జీర్ణవ్యవస్థ అంతా అస్థవ్యస్తం అయిపోయింది. పేగులన్నీ లుంగలు చుట్టుకుపోయి అర్థాకలితో అలమటిస్తున్నాయి." అని కంప్లైంట్ చేసాడు బాలరాజు.

"పోన్లే అని వండి పెడుతుంటే తినడానికి నొప్పి వీడికి... పైగా వంకలు.. ఒరేయ్ నువ్వు పేరుకే రాజువి." అన్నాడు శీను.

“నా బాధ వీడికి అర్థం కాదు. ప్రతి రోజు ఉదయం నా బాధ వర్ణనాతీతం. వేడి చేసి మండిపోతోంది.” విచారంగా చెప్పాడు బాలరాజు.

“కొంతకాలం భరించు, తరువాత నీకే అలవాటు అయిపోతుంది.” అన్నాడు శీను.

“దుర్మార్గుడా .. అంతే కాని నువ్వు వంట మానవన్నమాట..” పళ్ళు పిండుకుంటూ అన్నాడు బాలరాజు.

“మానను కాక మానను.. నన్ను నేను నిరూపించుకోవాలి. చెప్పడం మర్చిపోయాను మనోహర్ కి డైరెక్టర్ అయ్యే చాన్సెస్ ఉన్నాయట. ఎవరో ప్రొడ్యూసర్ మనోడి టాలెంట్ చూసి అవకాసం ఇస్తానని అన్నాడట, కాని...” అని ఆపాడు శీను.

“కాని?” అనడిగాడు కపర్ది.

“పూర్తిగా చెప్పి చావు.. ఎదవ సస్పెన్స్, నీ వంటలానే ఉంది నీ మాట కూడా.” అన్నాడు బాలరాజు.

“కొంచెం ఎవరన్నా పలుకబడి ఉన్నోళ్ళు చెప్తే పని తొందరగా అయిపోతుంది అని చెప్పాడు కపర్ది.. అందుకనీ...” అని మళ్ళీ నీళ్ళు నమిలాడు శీను.

“అందుకనీ... చెప్పు శీను?” అన్నాడు నవ్వుతూనే కపర్ది.

“నీకు ఇంకా అర్ధం కాలేదా బాసు, మీ నాన్నగారు ఏమన్నా రికమండ్ చేస్తారేమో చూడు. మనోహర్ లైఫ్ సెట్ అయిపోద్ది అని చెప్తున్నాడు సణుగుడురావు” అన్నాడు బాలరాజు.

“సణుగుడురావు ఎవడు మధ్యలో?” అనడిగాడు శీను.

“నువ్వేరా! ఎదవ సణుగుడు..విషయం చెప్పకుండా... సణుగుడురావు,, గొణుగుడురావు..” అన్నాడు బాలరాజు.

కపర్ది మౌనంగా ఉండిపోయాడు. ఇద్దరూ కపర్ది వైపు చూసారు ఏమి చెప్తాడా అని. అప్పటికే మనోహర్ అక్కడికి వచ్చి వీరి సంభాషణ అంతా గోడ చాటు నుండి వింటున్నాడు.

బాలరాజు, శీనుల కన్నా మనోహర్ కి ఉత్కంఠగా అనిపించింది, కపర్ది సమాధానం ఏంటనేది తెలుసుకోవడానికి !!

చీకటి పడింది. ఆకాశానికి సాంబ్రాణి పొగ వేసినట్టు మేఘాలన్నీ చంద్రుడి మీంచి పోతున్నాయి. అవలా చంద్రుణ్ణి తాకుతూ పోతుంటే, నివురు కప్పిన నిప్పులా కనిపిస్తున్నాడు చంద్రుడు. ఆగి ఆగి గాలి వీస్తోంది. మేడ పైన సత్యక్రిష్ణ, రాధికలు ఇద్దరూ వెల్లకితలా పడుకుని ఆకాశం వైపు చూస్తున్నారు.

"ఎన్నేళ్ళు ఎదురు చూసానో తెలుసా ఈ రోజు కోసం?" అన్నాడు సత్యక్రిష్ణ.

ఆమె ఏమి మాట్లాడలేదు.

"నువ్వు జరిగినదంతా మర్చిపో రాధి, నాకిప్పుడూ గతం ముఖ్యం కాదు. నువ్వు మళ్ళీ నా దగ్గరకు వచ్చేసావ్ అది చాలు."

ఆమె చలించలేదు.

"పాటలు విందామా.. పాత పాటలు ఇస్తాడు రేడియోలో.. నేనొక్కడినే మాట్లాడితే నీకు బోర్ అవుతుందేమో, ఎఫ్.ఎం పెట్టనా?"

"హ్మ్మ.."

ఎఫ్.ఎం ఆన్ చేసాడు. అలనాటి ఆణిముత్యాలు అనే ప్రోగ్రాం స్టార్ట్ అయింది. పాత పాటలన్నీ ఒక్కొక్కటీ ప్లే అవసాగాయి. ఇద్దరూ మౌనంగా వింటుండగా, మహదేవ రాసిన పాటొకటి ప్లే అయింది. ఆ పాట వింటూ"ఎంత బాగా రాస్తారో తెలుసా మహదేవ గారు?" అన్నాడు.

"హ్మ్.."

"నిజంగా...ఈ పాట రాసిన సందర్భం గురించి ఒక విచిత్రమైన విషయం జరిగిందట తెలుసా! ఆ సినిమాలో హీరో భార్య చనిపోతుంది. హీరో డీలా పడకుండా ఆమె కోరుకున్నట్టు తన పిల్లలను చదివించి పెద్ద ఉద్యోగులుగా తయారు చేస్తాడు. ఆ సందర్భం కోసం రాసిన పాట. ఎన్ని వర్షన్స్ రాసినా డైరెక్టర్ కి అంతగా నచ్చలేదట. చివరికి దాని కోసం తిండి కూడా మానేసి అదే పనిగా ఈ పాట కోసం రాస్తూ తపించిపోయారట. మొత్తానికి పాట బాగా వచ్చిందని ఆనందించేలోపే అదే రోజు ఆయన భార్య చనిపోయిందట. యాదృశ్చికమైనా నిజంగా చాలా విషాదం కదా." అని చెప్పాడు.

"హ్మ్..."

"ఏంటి రాధీ.. ఏమన్నా మాట్లాడచ్చు కదా.."

ఆమె మాట్లాడకుండా అతని వైపు తలతిప్పింది. ఆమె కళ్ళు చెమర్చి చాలాసేపైందనుకుంట. కొంచెం ఎర్రబడ్డాయి. అవి చాలా ఆరాధనతో అతన్ని చూసాయి. అది ఆరాధన కూడా కాదేమో.. అదొక రకమైన భక్తి భావన. అతను ఆమెను క్షమించి భర్త స్థానంలో ఉన్నతంగా నిలబడి ఉంటే ఆమె కళ్ళు, కన్నీళ్ళతో అతని పాదాలు కడగడానికి సిద్ధంగా ఉన్నాయన్నట్టుగా ఉన్నాయి. ఒకప్పుడు అవి కురవని మేఘాలు! ఎప్పుడూ నిప్పులు కక్కుతూ వేడి వేడి చూపులతో ఉండేవి. ఇప్పుడు కుంభవృష్టిగా కురవడానికి సిద్ధంగా ఉన్నాయా

కళ్ళు. నిజమే ప్రేమ చేయలేనిదంటూ ఏమీ లేదు. అతను అన్ని పరిస్థితులలో ప్రేమనే నమ్ముకున్నాడు, అందుకే అది ప్రేమనే తిరిగిచ్చింది. కాదు, స్వచ్ఛమైన ప్రేమని తిరిగందించింది.

"ఇంకా ఎందుకు రాధి బాధపడతావ్? ఇలా రా" అని చేయి చాపాడు.

ఆమె అతని దగ్గరకు జరిగింది. అతని భుజమ్మీదకు వచ్చి తల ఆంచి అతని గుండెలపై చేయి వేసింది. ఆమె ఊపిరి అతని చాతికి తెలుస్తోంది.

"చెప్పు...నీ గుండెల్లో ఉన్న బాధనంతా చెప్పేయ్ రాధి, నేను నిన్ను నిజంగా ప్రేమిస్తున్నాను. ఇప్పటికీ...ఎప్పటికీ.."

"నన్ను వదిలేయద్దు. ప్లీజ్..." అంటూ అతన్ని మరింత గట్టిగా పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె కన్నీళ్ళలో పశ్చాత్తాపం ఉంది.

"నిన్ను వదిలేయనురా.." అని ఎన్నిసార్లు అంటున్నా అదే మాట అంటూ గుక్క పెట్టి చిన్న పిల్లలా ఏడ్చింది.

"ప్లీజ్ సత్య, ఇప్పుడు నాకు నువ్వు తప్ప ఇంకెవరూ లేరు. నేనొక అనాథను.. నన్ను వదలద్దు, నాకు చాలా భయంగాను, బెంగగాను ఉంది. నేను చాలా తప్పు చేసాను, కావాలంటే కొట్టు ఓర్చుకుంటాను. తిట్టు భరిస్తాను. కాని నన్ను వదిలేయకు." అంటూ అతన్ని మరింత గట్టిగా హత్తుకుపోయింది.

"ఇలా చూడు, ఇలా చూడు.." అంటూ ఆమెను తనని చూసేలా చేసుకున్నాడు. ఇద్దరి కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి. ప్రేమకు పరాకాష్ట దాంపత్యంలో ఇద్దరి కళ్ళు చెమర్చినరోజు.

"తరచి తరచి చూస్తే ప్రతివాడి మది నిక్షిప్తంలో ఎన్నో జ్ఞాపకాల ఊటబావులు.. కొన్ని నిండిపోయి!! కొన్ని ఎండిపోయి!! కాలానుగుణంగా ఎండిన ఊటబావుల్లో ఎప్పుడో అప్పుడు నీరొచ్చి చేరుతుంది. అప్పుడు వచ్చే కన్నీరు పన్నీరై గుండెను తడుపుతుంది. ఈ నీ బాధ ఇప్పుడు అన్ని తప్పులను తుడిచేసింది. నీ మనసు నా మనసు ఒకటై ఒకే గుండె చప్పుడై మిగిలింది. ఇప్పుడు ఇద్దరం కాదు. ఒక్కరం. నువ్వో సగం నేనో సగం." అంటూ ఆమెను మరింత హత్తుకున్నాడు.

ఆమె మనసు చాలా స్వాంతన పొందింది. అతని గుండెలపై వాలి చాలా సేపు సేద తీరింది. అతనిది మామూలు ప్రేమ కాదు. అతనొక ప్రేమ పిపాసి. దానికి అంతు అంటూ ఏమీ లేదు. అతనికి ప్రేమని ఇవ్వడమే గాని తీసుకోవడం చేతకాదు.

ఆమె నెమ్మదిగా తలెత్తి అతన్ని చూసింది. అతనింకా కళ్ళు మూసుకునే ఉన్నాడు. అతని మీదకు జరిగి అతని నుదుటిపై ఆమె పెదాలను తాకించింది. ఆమె ముంగురుల సుగంధం అతని నాసికానికి చేరి నాడిమండలాన్ని ఉత్తేజపరిచింది. ఆమె రెండు కనుబొమ్మల మధ్య ముద్దు పెట్టుకుంది. శరీరంలో ఎక్కడో ఒక చిన్న అలజడి. చిన్నగా కనుబొమ్మలు కదిపాడు. కళ్ళకు

ముద్దిచ్చింది. కంటున్న అందమైన కల చెదిరిపోయింది. కావాలనే అలా ఉండిపోయాడు. అతని బుగ్గలను ఆమె బుగ్గలతో తాకించి చెవి దగ్గర వెచ్చటి ఊపిరులూదింది. అతని శరీరంలో మరొక విద్యుత్ ప్రకంపన. అతని అధరాలను ఆమె తన ముని వేళ్ళతో సుతారంగా తాకింది. చిన్న చిరునవ్వు అతని మోములో విరిసింది. నెమ్మదిగా కళ్ళు తెరిచి ఆమెను చంద్రుని కాంతిలో చూసాడు. ఇప్పుడామె కళ్ళు ఎన్నో ఊసులు చెప్తున్నాయి. ఆమె పెదవులు అతని శరీరాన్నంతా చూసి రావలనుకుంటున్నాయి. ఆమె అతని చొరవ కోసం ఎక్కువ సేపు ఎదురు చూడలేదు. అతని పెదాలకి ఆమె పెదాలని అందించింది. చాలా సున్నితంగా, మెత్తగా చుంబించింది. ఇద్దరి కళ్ళు అరమోడ్పులయ్యాయి. ఒకరి పెదాలలోని ప్రేమని మరొకరు జుర్రుకున్నారు. అధరాలు చుంబించుకున్నాయి. హ్రుదయాలు దగ్గరయ్యాయి. హత్తుకున్నారు గట్టిగా! ఉదరాల దూరం దగ్గరైంది. ఆమె నడుముపై చేయి వేసి దగ్గరగా లాక్కున్నాడు. ఇద్దరి మధ్యా చీకటి చేరడానికి కూడా చోటు లేకుండా పోయింది. ఆ వెన్నెల రాత్రి వారి తొలిరాత్రిని మరిపింపజేసింది. ఆలుమగలిద్దరు ఏకమై ఆనంద తీరాల్ని తాకారు. మాటలకందని, రచనకి దొరకని గుప్త సంతోషవనంలో ఇద్దరూ విహరించారు. అది ఒక అనుభవ స్వర్గం. ఇహలోక భోగం. గృహస్థాశ్రమంలో ముక్తికి తొలిమెట్టు! ఊపిరి సలుపులకి అలసిపోయి ఊరట చెందారు.

"ఐ లవ్ యూ సో మచ్..." దాదాపు అరుస్తున్నట్టుగా చెప్పాడు.

ఆమె అతని పెదాల్ని ఆమె పెదాలతో ఆపుతూ, అతని అధరలామీదే ఉంచి"ఐ లవ్ యు టూ... ఎవెర్ ఫర్ ఎవెర్" అంది. రెండు బాహువులలో ఆమెను భద్రంగా దాచుకుని కళ్ళు మూసుకున్నాడు. అది ఒక అనిర్వచనమైన అనుభూతి.

***

ఇల్లంతా సెంట్ వాసనలతో నిండిపోయింది. అక్కడున్న అమ్మాయిలందరూ అందంగా ముస్తాబవుతున్నారు. కాసేపట్లో డబ్బున్న మగాళ్ళు అక్కడికి వచ్చి వాళ్ళకు కావలసిన ఆడవాళ్ళను ఎంపిక చేసుకుంటారు.

“రండి తొందరగా...” అరిచింది ఆంటీ.

ఒక్కొక్కరూ బయటకు వచ్చి నుంచున్నారు. కావాలని వారి అందాలను ప్రదర్శిస్తూ ఉన్నారు. వారికోసం వచ్చిన ఒక కుర్రాడు అందరినీ పరికించి, కొందరిని తాకి చూసి"అన్నీ ఉన్నాయ్ అసలైంది తప్ప!" అన్నాడు. ఆంటీకి అర్థమవడానికి ఎంతోసేపు పట్టలేదు.

“ఏదిరా అదీ...” అని అరిచింది.

అక్కడున్న మనుషులు చాందినీ గదికి వెళ్ళి మొత్తం చూసారు. ఎక్కడా కనిపించలేదు. ఇల్లంతా వెతికారు. మేడపైనా కిందా బయటా అంతా వెతికారు. ఎక్కడా జాడ లేదు.

“తప్పించుకుపోయింది...” అన్నాడొకడు.

“ఎంతపని చేసిందిరా... గంట క్రితం కూడా ఇక్కడే ఉంది. ఇంకా ఊరు దాటి ఉండదు. ముందు ఆ శీనుగాడి ఇంటికి పోయి వెతకండి.” అంది ఆంటీ.

***

కపర్ది సమాధానం కోసం ఎదురు చూస్తున్నారు ముగ్గురు. మెట్ల దగ్గరే నిలబడి ఉన్న మనోహర్ ని తోసుకుంటూ చాందిని”శీను...” అంటూ అరుచుకుంటూ వచ్చేసింది.

చాందినిని అక్కడ చూసి అందరు షాక్ అయ్యారు.

“నువ్వేంటి చాందిని...” అంటూ కత్తి పీటను దాటుకుంటూ వచ్చి అడిగాడు శీను కంగారుగా.

మనోహర్ పైకి వచ్చి నిలబడ్డాడు. మిగిలిన ముగ్గురు మనోహర్ ని చూసారు.

“పారిపోయి వచ్చేసాను...” అంది చాందిని.

బాలరాజు “ఇప్పుడేం చేద్దాం...” అన్నాడు పిట్టగోడ మీంచి కిందకు చూస్తూ.

“పదా..” అన్నాడు ఆమె చేయి పట్టుకుని శీను.

“ఎక్కడికి?” అనడిగాడు కపర్ది.

“చాందిని కనపడటం లేదంటే ముందు గుర్తొచ్చేది నేనే, ఇక్కడికి వాళ్ళు వచ్చేయచ్చు.” అన్నాడు శీను.

“వాళ్ళు వచ్చేస్తున్నారు.” అన్నాడు బాలరాజు మలుపు తిరుగుతున్న వాళ్ళ జీప్ ని చూస్తూ.

కపర్ది శీనుని ఉద్దేశించి “నేను మీతో వస్తాను. మనోహర్ బాలరాజు మీరు తాళం పెట్టుకుని కిందకి వెళ్లి వాళ్ళకి ఎదురెళ్ళండి. విషయం ఏంటని అడగండి. అరనిమిషం ఆపినా చాలు మేము వెనక నుండి కిందకి వెళ్ళిపోతాం.” అన్నాడు కపర్ది.

“సరే,,,” అనుకుని క్షణం కూడా లేట్ చేయకుండా వెనకింటి డాబా మీదకు వెళ్లి నిచ్చెన లాగి కిందకు వేసాడు. శీను, చాందిని ఒకరి తరువాత ఒకరు దిగారు. వెంటనే తానూ కూడా దిగి నిచ్చెనని చీకట్లో పెట్టేసాడు.

తాళం పెట్టుకుని కిందకి వెళ్లేసరికి ఆంటీ మనుషులు పైకి వస్తూ వీళ్ళని చూసి ఆగారు.

“ఎక్కడరా శీను గాడు. చాందిని ఏది?” అనడిగాడు.

“శీను గాడు సినిమాకి వెళ్ళాడు. చాందిని ఏంటి....” అన్నాడు బాలరాజు.

“లోపల ఎవరున్నారు...” ప్రశ్నించాడొకడు.

“ఎవరు లేరు. మేము కూడా తినడానికి బయటకు వెళ్తున్నాం..” చెప్పాడు బాలరాజు.

బాలరాజు చేతిలో తాళం చెవి చూసి, “ఇలా ఇవ్వరా...” అన్నాడు ఒకడు.

తాళం ఇచ్చాడు బాలరాజు. ఒకడు గబగబా పైకి వెళ్లి తాళం తీసి చూసాడు. ఎవరు లేకపోయేసరికి అలానే వదిలేసి పిట్టగోడ నుండి కిందకి చూసి"ఎవరు లేరు" అరిచారు.

“చెప్పు..ఎక్కడికి పారిపోయారో చెప్పు...” అంటూ బాలరాజు కాలర్ పట్టుకున్నాడు వాళ్ళల్లో ఒకడు. నిమిషం కూడా చూడకుండా పిడికిలి బిగించి కాలర్ పట్టుకున్న వాడి గుండెల మీద ఒకే గుద్దు గుద్దాడు మనోహర్. కాలర్ పట్టు సడిలిపోయింది. కళ్ళల్లోకి నీరు తన్నుకొచ్చింది. ఊపిరి సలపక గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు కీచుమన్నాడు. మొదలు నరికిన చెట్టులా నేలకొరిగిపోయాడు. మిగిలిన వాళ్ళందరూ ఒకడుగు వెనక్కి వేశారు.

పైనున్న వాడు కిందికి వచ్చి ముందుకు అడుగువేయడానికి ఒక క్షణం ఆలోచించాడు. బాలరాజు నోరెళ్ళబెట్టి మనోహర్ ని చూసాడు. కిందపడ్డవాడు గుండె పట్టుకుని గిలగిలా కొట్టుకున్నాడు.

మనోహర్ ఒకడుగు ముందు వేసాడు. వెనకున్న వాడు ఒకడుగు ముందుకు వచ్చాడు. ముందు ఉన్న వాళ్ళు అక్కడే నిలబడి ఉన్నారు. బాలరాజు కూడా మనోహర్ ని చూస్తూ ఉండిపోయాడు. అక్కడే ఉన్న సన్నటి ఇనుప చువ్వని లాగాడు. వీధి లైట్ వెలుగులో ఒకరి నీడలు మరొకరి మధ్యలోంచి పోతూ ఉన్నాయి.

మనోహర్ సూటిగా అందరిని చూసాడు. చేతిలో ఉన్న చువ్వని విదిలించాడు. దానికున్న తుప్పు రాలి పడింది.

“మర్యాద ఇచ్చి మాట్లాడటం రాకపోతే మర్యాదగా ఉండదు. పైకి వెళ్లి చూసుకున్నారు, అక్కడెవరూ లేరని చెప్పాక కూడా మళ్ళీ కాలర్ పట్టుకుని బెదిరింపులేంటిరా” అన్నాడు మనోహర్.

వెనకనున్న వాడు మీదకి దూకబోయాడు. మనోహర్ పక్కకి తప్పుకుని వాడి చొక్కా పట్టుకుని నేల మీదికి ఈడ్చేసాడు. చేతిలో ఉన్న చువ్వని కంటి దగ్గరకి పెట్టి రెప్ప వేస్తే కంట్లో దింపేత్తాను. వాడు కళ్ళు పెద్దవి చేసాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంది.

“పొడిచేమంటారా?” అనడిగాడు మనోహర్ మిగిలినవాళ్ళని ఉద్దేశించి.

ఒక్కడు పలకలేదు. “ఒక్కొక్కడికి ఒక్కోటి పీకేస్తే అడుక్కుని తిని బతుకుదురుగాని సరేనా?” అన్నాడు మనోహర్. అందరి వెన్నులో వణుకు పుట్టింది. గుంపులో ఆఖరున ఉన్నవాడు భయంతో పరిగెత్తాడు.

“చూసి రమ్మంటే కాల్చొచ్చే రకం నేను.. వాళ్ళందరూ నా ఫ్రెండ్స్. తేడా రానంతవరకే ఏదైనా.. తేడా వస్తే ప్రాణాలు తోడెత్తాను ఎదవల్లారా!! అడ్డంగా నాకి పోతారు. ఈళ్ళు నా వాళ్లు. ఒళ్ళు దగరెట్టుకోమని మీ వోళ్ళకి చెప్పు.” అన్నాడు చువ్వని కంటి మీంచి తీస్తూ. అందరు అక్కడి నుండి వెళ్లిపోయారు.

బాలరాజు తేరుకోవడానికి చాలాసేపు పట్టింది.

“భయపడితే అలా భయపెడుతూనే ఉంటారు బాలరాజు.. ఒకసారి ఎదురు తిరిగితే వాళ్ళే తగ్గుతారు” అన్నాడు మనోహర్.

“...”

“మాట్లాడవేంటి బాలరాజు...”

“అయ్య బాబోయ్... నువ్వు మాములోడివి కాదు బాసు. ఇప్పటివరకు హీరో కపర్ది అనుకున్నాను. కానీ నువ్వు బాసు హీరోవి. వామ్మో.. నువ్వు వాడిని గుద్దినప్పుడు నా రెండు కాళ్ళు ఒణికిపోయాయి, తెలుసా!. దీనమ్మ, నువ్వు ఈ లెవెల్ లో వార్నింగ్ ఇస్తావని తెలిస్తే వాళ్ళు అనవసరంగా అటునుండి పారిపోయేవారు కాదు కదా..” అన్నాడు బాలరాజు.

“హ..హ..వాళ్ళు వెళ్లడం మంచిదే, ఇంతకీ ఎక్కిడికి వెళ్ళుంటారు?” అనడిగాడు మనోహర్.

“ఏమో చూద్దాం పద” అన్నాడు బాలరాజు.

“ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి బాసు, ఒక్క సీన్ తో నా ఒపీనియన్ మార్చేసావ్” అన్నాడు బాలరాజు.

“ఏంటది?”

“హీరో అయిపోయావ్ నా దృష్టిలో..”

“హ హ.. నా దృష్టిలో హీరోలు అంటే మీరే బాలరాజు. వేరేవాళ్లు అయితే నన్ను ఆదరించరు.” అన్నాడు మనోహర్.

దాదాపు అన్ని వీధులు వెతుక్కుంటూ మెయిన్ రోడ్ దగ్గరకు వచ్చేసారు.

“ఇలా చూడు, ఈ సందు చీకటిగా ఉంది, ఇందులోకెళ్ళి దాక్కున్నారంటావా?” అన్నాడు మనోహర్.

“ఈ వీధిలోకైతే మనోడు రాడు..” అన్నాడు బాలరాజు.

“ఎందుకు?”

“దానికో ఫ్లాష్ బ్యాక్ ఉందిలే..”

“ఏంటది?”

“నీకా వీధి మధ్యలో ఒక పెద్ద నాలుగంతస్థుల మేడ కనపడుతోందా?”

“హ.. ఉంది.. అయితే, ఆ ఓనర్ తో కూడా గొడవెట్టుకున్నాడా?”

“గొడవేం కాదు గాని, పాపం శీనుగాడి నాన్న ఆ ఇంటికి మేస్త్రిగా పని చేసాడు. ఆ ఇల్లు కూడా మంచి మండుటెండల్లో కట్టారు. ఇల్లు కట్టడం పూర్తి అయిపోయింది. అనుకున్న టైం కి కట్టేసినందుకు డబ్బులు కూడా టైంకి ఇచ్చారు. శీనుగాడి నాన్న బాగా సెన్సిటివ్! చిన్న మాట అన్నా ఎక్కువ ఫీల్ అయిపోయేవాడు. ఆ ఇంటి గృహప్రవేశం అవుతోంది. ఇల్లంతా చుట్టాలతో బంధువులతో హడావిడిగా ఉంది. ఆ పక్క వీధిలోనే పని చూసుకుని మధ్యాహ్నం భోజనానికి అని ఇటువైపు వచ్చిన శీనుగాడి నాన్నని ఆ గృహప్రవేశంలో ఉన్న తెలిసినవాడెవడో పిలిచి మాములుగా పలకరించి భోజనం

చేసి వెళ్ళమంటే ఎర్రి మాలోకం వెళ్లి పంక్తిలో కూర్చున్నాడు. చుట్టూ జనాలందరూ డబ్బున్నోళ్ళు. ఈయనేమో చెమటోడ్చి అలసిపోయి మంచి ఆకలిమీద ఉన్నాడు. ఆకులో అన్నం వడ్డించేలోపు ఆ ఇంటి ఓనర్ కి సంబంధించిన మనుషులు వచ్చి కాలర్ పట్టుకుని పైకి లేపేసి బయటకు లాగేసారు. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయాడాయన. తానూ ఎంతో కష్టపడి, ఇష్టపడి కట్టిన ఇంటిలో నాలుగు మెతుకులు తినే అర్హత లేదా అని బాధ పడ్డాడు. శీనుకు ఈ విషయం తెలిసి "పెద్దోళ్లంతే నాన్నా! పట్టించుకోకు. నేనున్నాగా, అంతకంటే పెద్ద ఇల్లు.. అంబానీ ఇల్లు కూడా అంత ఉండదు. అంత పెద్ద ఇల్లు కట్టిస్తాను నీకు. అందులోనే నువ్వు ఉందుగాని." అని ఏదోకటి చెప్పేవాడు. కానీ ఆ సంఘటన శీనుగాడి నాన్నని బాగా బాధ పెట్టింది.

చెప్పి సముదాయించాలనుకునేవాడు. కానీ శీను నాన్న ఏ మాత్రం బయటకు రాలేకపోయేవాడు. నాన్నని ఇలా చేసిన ఆ నా కొడు... ఉరికనే వదలను" అంటూ నా దగ్గర కోప్పడేవాడు. ఒకరోజు వాళ్లిద్దరూ మాట్లాడుకుంటుంటే నేను విన్నాను..

"శీనుగా.."

"చెప్పు నాన్న,,"

"చదువుకోరా బుద్ధిగా అంటే టీచరమ్మని కొట్టొచ్చావ్ ఎధవలాగా.. కూలి పని చేస్తే కడుపు నిండితే కాలు నిండదు. కాలు నిండితే కడుపు నిండదు. నా

బతుకెలాగో కుక్క బతుకు. నువ్వన్నా బాగుపడచ్చు కదరా..”

“చదువెందుకు గుర్తొచ్చింది ఇప్పుడు. అయినా ఇప్పుడు ఎవడు చేర్చుకుంటాడు నన్ను స్కూల్ లో,”

“చాలా బాధగా ఉందిరా నా ఒక్కగానొక్క కొడకా..”

“ఎందుకు నాన్న,,”

“మనం కూలి చేసుకున్నా పక్కోడికి ఆకలి అంటే తలో పిడికిలి ముద్దా పెడతాం కదరా.. మరి అంత మంది తింటుంటే ఈ పేదోడి పట్టెడన్నం పెట్టడానికి అంత ఇది అయిపోయారేంటిరా. ఎప్పటికి మారతార్రా ఈ మనుషులు.”

“వాళ్ళకి నాన్నా పాపం. నువ్వు ఎందుకు బాధ పడతావు? ఆకలితో ఉన్నవాడిని అన్నం ముందు లేపి లాగేసినవాడికి పాపం తగుల్తుంది.”

“పాపాలు తగిల్తే ఎవడికి లాభం. నువ్వొకటి గుర్తుంచుకో, ఎవడన్నా ఆకలి అని నీ దగ్గరకు వస్తే మాత్రం వాడిని వదిలేయాకు. నీ వంతు పెట్టి అయినా వాడి కడుపు నింపు. అదే నీకు శ్రీరామరక్ష.”

తరువాత కొంతకాలానికి పనికి వెళ్లడం మానేసాడు శీను తండ్రి. తండ్రి పనికెళ్ళకుండా ఇంట్లోనే ఉంటే ఇల్లు గడవక శీనుగాడు పనికెళ్ళడం మొదలెట్టాడు. తాను కట్టిన ప్రతి ఇంటిని వెళ్లి ఒకసారి మనస్ఫూర్తిగా చూసుకుని వచ్చాడు శీను తండ్రి. కొడుకు ఎలాగైనా బతికేయగలడని ధీమా

ఆయనకేలాగో ఉంది. ఆ ధైర్యంతో, ఆ అవమాన భారంతో ఉరిపోసుకుని చనిపోయాడు. ఆ తరువాత శీనుగాడు జీవితం మరింత దుర్భరం అయిపోయింది. తాగుడుకు అలవాటు పడ్డాడు. మామూలుగా తాగేవాడు కాదు. పొద్దున్న పనికెళ్లిన డబ్బులన్నీ రాత్రి తాగుడుకు తగలేయడమే. అలా కొన్నాళ్ళు గడిపాడు.

జీవితం ఎప్పుడు గ్లామరస్ గా ఉండదు బాసు. నా జీతం ఇంటి ఖర్చులవరకు సరిపోద్ది గాని ఇంటి అద్దె బాగా ఇబ్బంది అయ్యేది. నేను చెప్పినా వినకుండా తాగేసి వచ్చేవాడు. ఒక రోజు అలానే తాగేసి ఎవరితోనో గొడవపడ్డాడు. ఆ మత్తులోనే వాళ్ళను తరుముకుంటూ దారి తప్పిపోయి ఆ ఆంటీ ఇంటికి పోయాడు. అక్కడే వీడికి చాందిని పరిచయం అయింది. జేబులో ఉన్న డబ్బులు తీసి వాళ్ళకిచ్చి చాందినిని తీసుకుని ఆమె గదిలోకి వెళ్ళిపోయాడు.

తాగిన మత్తులో, తగిలిన దెబ్బలతో గదిలోకి లాక్కెళ్ళి మంచం మీద మత్తుగా వాలిపోయాడు. తలకు తగిలిన దెబ్బవలన నుదుటి మీద రక్తం కారుతోంది.

ఆ అమాయక పిల్లేమో వీడికి తగిలిన దెబ్బలకి కట్టు కట్టి రాత్రి అంతా సేవ చేసిందట. ఉదయం లేచి చూస్తే అదో వేశ్య కొంప. అప్పుడు జరిగిందంతా నాకు పూస గుచ్చినట్టు చెప్పాడు.

***

లేస్తూనే "ఎలా ఉంది?" అని అడిగింది.

ఆమెను చూసి "నువ్వేనా ఈ దెబ్బలకి కట్టు కట్టింది" అని అడిగాడు.

అవునని తలూపి "ఎలా ఉంది?" అని అడిగింది.

"బానే ఉంది.."

"తగ్గిపోతుందిలే..."

"..."

"ఎందుకు తాగావ్?"

"నాన్న పోయాడు..."

"పోతే... తాగుతారా..."

"మరేం చేస్తారు...?"

"ఏమో..."

"ఇక్కడేం చేస్తుంటావ్?"

"ఏమో.. అందరికంటే నేనే బాగుంటానట, నన్నే అడుగుతుంటారు. నాకేమో మత్తు ఇచ్చి ఏదేదో చేస్తారు. నాకు అమ్మానాన్నా ఎవరు లేరు. నిజం చెప్పనా నిన్న అంతా నాకు కడుపు నొప్పిగా ఉంది. నువ్వు వచ్చి ఏమన్నా చేస్తావని భయమేసింది. కానీ నువ్వేమో దెబ్బలు తగిలున్నావ్. నొప్పి ఎవరికైనా నొప్పే కదా అందుకనే కట్టు కట్టాను. రాత్రి కూడా నువ్వు నన్ను ఇబ్బంది

పెట్టలేదు. హాయిగా నిద్రపోయాను. కొంతమంది అయితే అస్సలొప్పుకోరు, డబ్బులిచ్చామని చెప్పి ఇంకా ఏడిపిస్తారు. నువ్వు ఎందుకో నాకు నచ్చావ్..నీ పేరు ఏంటి?"

"శ్రీను.." చెప్పాడు తడిసిన కళ్ళతో

"ఎందుకు ఏడుస్తున్నావ్?" అని అడిగింది.

"లేదు.. వస్తాను..." అని చెప్పి వచ్చేసాడు.

***

అలా డబ్బులన్నీ ఆమెను కలిసి మాట్లాడి రావడం కోసమే ఖర్చు పెట్టేవాడు. తాగుడు తగ్గించేసాడు. దేవుడు గొప్పోడు బాసు, ఒకటి తీసి ఇంకోటి పెట్టేసి వెళ్ళిపోతాడు. అన్ని అరేంజ్ చేసేస్తాడు మనకే ఒక్కోసారి తెలియదు.

"నా గెస్ కరెక్ట్ అయితే వాళ్లిప్పుడు ఎక్కడుంటారో తెలుసా?" అని అన్నాడు బాలరాజు.

"ఎక్కడ?" అని అడిగాడు మనోహర్.

***

దబ దబా తలుపులు బాదాడు శ్రీను.

రోడ్ మీద నిలబడి ఎవరు వస్తున్నారో గమనిస్తున్నాడు కపర్ది. చాందిని అక్కడే అరుగు మీద కూర్చుని చిన్న పిల్లలా ఏడుస్తోంది. మళ్ళీ తలుపులు బాదాడు, “రమణమ్మా, ఇదే ఆఖరిసారి చెప్తున్నాను. తలుపు తీయకపోతే బద్దలుకొట్టి లోపలికి వచ్చేస్తాను” అన్నాడు శీను కోపంగా. రమణమ్మ తలుపు తీయనని ఇంట్లోకి ఎవరిని రానిచ్చేది లేదని మంకు పట్టు పట్టింది. గట్టిగా గాలి వాన వస్తే కూలిపోయేలా ఉందా గుడిసె. ప్లాస్టిక్ సంచులను ఒకదానికొకటి కుట్టి పెద్ద డేరాలా చేసి దానిని నాలుగు వైపులా కర్రలకి కట్టి నిలబెట్టిన గుడిసె.

“ఏదో జీప్ వస్తోంది.” అన్నాడు కపర్ది కంగారుగా.

“రమణమ్మా... ఏమైందే నీకు..? నీయవ్వ...!!” అరిచాడు.

“రమణమ్మగారు ప్లీజండీ.. తలుపు తీయండి...” అన్నాడు కపర్ది.

“రమణమ్మ గా...రా... ఛాన్స్ ఇస్తే కాళ్ళు పట్టుకునేలాగా ఉన్నావ్... ఒసేయ్.... తలుపు తీయవే....” అంటూ తలుపుని బలంగా తన్నాడు శీను.

తలుపులకు అడ్డగడి ఉండటం వలన కొంచెం ముందుకు వచ్చి ఆగింది. లోపల ఉన్న రమణమ్మ “రావద్దన్నాగా...” అరిచింది. మళ్ళీ గట్టిగా తన్నాడు. గొళ్ళెం ఊడి పడింది.

“ముసల్దానా... పోన్లే అని అరగంట నుండి అడుగుతుంటే...” అని అన్నాడు శీను లోపలికి వస్తూ. రమణమ్మ అటువైపు తిరిగి నిలబడి ఉంది.

వెనకనే చాందిని, కపర్ది లోపలికి వచ్చేసారు. వెంటనే తలుపు మూసేసాడు కపర్ది. పైగడి పెట్టి, కింద పడిపోయిన గొళ్ళాన్ని తాత్కాలికంగా తలుపు రాకుండా పెట్టాడు.

అది చూసిన శీను "ఏంటి ఆ గొళ్ళెం ఉంటుందనే...?" అనడిగాడు.

"గొళ్ళెం మాట తర్వాత ఈ ప్లాస్టిక్ కవర్ గుడిసెలో ఏం సేఫ్ ఉందని తీసుకొచ్చావ్?" అనడిగాడు కపర్ది గుడిసెను అంతా పరికించి చూస్తూ.

సరిగ్గా నలుగురు నిలబడటానికి కూడా చోటు లేదు. గదిలో ఒక మూలకి ఇనప్పెట్టె ఉంది. కింద పడుకోవడానికి ఒక చీకి చాప ఉంది. దానిమీద పాత చీర తలగడగా ఉంది. చిరిగిన దుప్పటి మడతపెట్టకుండా అలానే వదిలేసింది ఉంది. ఒక మూల వంట సామాగ్రి. మరో మూల దడి కట్టి ఉంది.

"బాత్రూం అనుకుంట" అన్నాడు కపర్ది.

"వాస్తు సరిపోయిందా?" అనడిగాడు శీను వెటకారంగా.

"తలుపు ఎందుకు తీయలేదు?" అనడిగాడు శీను.

రమణమ్మ మాట్లాడలేదు.

"ఏంటి మాట్లాడవు?" అంటూ దగ్గరకి వెళ్ళాడు శీను.

తిరిగి చూసింది. ఆమె కళ్ళల్లో నీళ్లు..

"నువ్వు కాదు ఏడవాల్సింది నేను." అన్నాడు శీను.

“ఎవరికీ చెప్పద్దు శీను బాబు.. నా పొట్ట కొట్టకు శీను...” అంటూ కాళ్ళ మీద పడింది.

“చెప్పడం ఏంటి..” అంటూ కింద కూర్చుని ఆమె చేతుల్ని పట్టుకున్నాడు ఏమి అర్ధం కాక.

ఆమె నుదిటి మీద బొట్టు లేకపోవడం, గోడకి తగిలించిన రమణమ్మ మొగుడి ఫోటోని అప్పుడు చూసాడు..

“ఏంటి రమణమ్మ.. మీ ఆయన వదిలేసి వెళ్ళిపోయాడు అన్నావ్..” అనడిగాడు శీను.

“లేదు బాబు అబద్దం చెప్పాను. చచ్చిపోయాడు బాబు. ఎప్పుడో చచ్చిపోయాడు. నేను వచ్చిన కొత్తల్లో బొట్టు లేని దాన్ని అని పూలు ఎవరు కొనేవారు కాదు బాబు. దాని కోసం నేను ఈ వేషం వేయాల్సి వచ్చింది. తరువాత అందరు నా చేయి మంచిదని, నన్నో నిండు ముత్తైదువని అనుకుని నా దగ్గరే ప్రత్యేకంగా పూలు కొనేవారు బాబు. నేను చేసేది పాపమో పుణ్యమో నాకు తెలియదు కానీ నేను బతకడానికి నాకు ఇంతకంటే వేరే దారి లేదనిపించింది. నాకు తెలిసింది పూలమాల కట్టి గుడిలో ఇవ్వడమే. నేను దాచుకున్నది, దోచున్నకున్నది ఏమీ లేదు. నా వల్ల నలుగురికి మంచే జరిగింది గాని ఎవరికీ చెడు జరగలేదు. అందుకే నా బతుకు నేను బతుకుతున్నాను. రోజు ఇంటికొచ్చి నా మొగుడి ముందు ఏడుస్తూంటాను

బాబు. ఆడేమో చచ్చి సుఖపడ్డాడు. నేను బతికి అనుభవిస్తున్నాను. నాలుగు వేళ్ళు లోపలికి పోతున్నాయనని ఇలా చేశాను కానీ మోసం కాదు. నేను 'ఇదీ' అని విషయం తెలిసాక ఇంక ఎవరు నా దగ్గర కొనరు బాబు. అందరికి అదో రకం భయం పట్టుకుంటుంది. కానీ ఈ ముసల్దాని ప్రాణం ఎవరికీ అప్పుడు కనపడదు. అప్పుడు నా నోటి కాడి ముద్ద పోతుంది. అదే నా భయం. ఉన్నన్నాళ్ళు ఇలా ఉండనివ్వండి. జాలితో ఇచ్చే డబ్బు నాకు వద్దు. నాకున్న దాంట్లో ఒక ముద్ద పెట్టగలను కానీ లేదని చేయి చాచి అడుక్కోలేను. అందుకే పూలు అమ్ముకుని నా తిండి నేను సంపాదించుకుంటున్నా."

రమణమ్మ మాటలు విన్న శీను "సారి రమణమ్మ, తలుపు తీయకపోయేసరికి కోపంతో ఏదేదో అనేశాను. అయినా నేనెందుకు నీ గురించి చెప్తాను?"

"చాలా సంతోషం శీను బాబు." అంటూ కపర్దిని చూసింది.

"కంగారు పడకు, వాడు మనోడే..." అన్నాడు శీను.

"రమణమ్మా.." అని పిలిచాడు కపర్ది .

"చెప్పు బాబు..."

"తోట పని చేసుకుంటావా మా ఇంట్లో.." అనడిగాడు.

అర్థం కానట్టు చూసింది.

“మూడు పూటలా భోజనం, ఉండటానికి చోటు. నెలకింత జీతం. తోట పని చేయాలి. చేరతావా?” అని అడిగాడు.

రమణమ్మ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

“అంటే ఊరుని వదిలేసి..” సంశయించింది రమణమ్మ.

“అవేమి పట్టించుకోకు.. నీతో పాటు శీను, చాందిని కూడా వస్తారు” అన్నాడు కపర్ది.

“మేమా?” ఆశ్చర్యపోయాడు శీను.

“అవును, ముగ్గురు రాత్రి హైదరాబాద్ వెళ్లిపోండి. టికెట్స్ సంగతి నేను చూసుకుంటాను. ఫ్లైట్ లో వెళ్లిపోండి. గంటలో చేరిపోతారు. అక్కడ మా కార్ వచ్చి మిమ్మల్ని పిక్ అప్ చేసుకుని మా గెస్ట్ హౌస్ కి తీసుకెళ్తుంది. డిన్నర్ చేసేసి రెస్ట్ తీసుకోండి. ఇక్కడి వివరాలు నేను నీకు అప్డేట్ చేస్తాను..” అని చెప్పుకుంటూ పోయాడు కపర్ది.

నోరెళ్ళ బెట్టి విన్నాడు శీను..

ఇప్పుడే వస్తాను అని బయటకు వెళ్ళాడు కపర్ది. రమణమ్మ ఆనందంతో పెట్టె సద్దేసుకుంది.

“నాకు భయంగా ఉంది..” అంది చాందిని శీను భుజం మీద వాలి.

"భయపడకు... మనం హైదరాబాద్ వెళ్ళిపోదాం. అక్కడే పని చేసుకుని ఉందాం."

"అది కాదు.."

"మరి..?"

"ఫ్లైట్ ఎక్కాలంటే భయంగా ఉంది..."

"ఫ్లైట్ ఎక్కాలంటే భయం ఎందుకు. జెయింట్ వీల్ ఎక్కావా ఎప్పుడైనా?"

"ఊహు, లేదు.."

"ఉయ్యాల ఊగావా మరి ఎప్పుడైనా?"

"ఊగాను..."

"అంతే, అలానే ఉంటుంది. భయపడకూడదు."

"నీకు భయం లేదా?"

"లేదు, నిజానికి నాకు బాలరాజు గాడికి విమానం ఎక్కాలని ఎప్పటి నుండో కోరిక. పిచ్చోడు వాడి కంటే ముందు నేను ఎక్కేస్తున్నాను. కుళ్లుకు చస్తాడు ఈ విషయం తెలిస్తే,"

"అవునా, అయితే బాలరాజు రాగానే ఇద్దరం కలిసి మేమే ఫస్ట్ ఎక్కాం విమానం అని ఏడిపిద్దాం..."

"సరే"

కపర్ది వచ్చాడు. ముగ్గురుకి బట్టలు కూడా తెచ్చాడు. చీకటి పడింది. శీను మార్చుకున్నాక కపర్ది, శీనులు బయటకు వచ్చి నుంచున్నారు. లోపల ఆడవాళ్ళిద్దరు మార్చుకుని వచ్చారు.

"సరే బయలుదేరుదామా?"

"హ..." అన్నాడు ముభావంగా శీను.

"ఏమైంది?"

"బాలరాజు కూడా ఉంటే బాగుండేది. రక్తం పంచుకున్నవాడు కూడా అంత తోడు ఉండడేమో.."

"మేమందరం తరువాత వస్తాం. మీరు ముందు చేరండి. ఇప్పుడు మీరు మా గెస్ట్ హౌస్ కి వెళ్ళిపోతే ఇంక మిమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు."

"సరే.."

ఎయిర్పోర్ట్ లో డ్రాప్ చేసాడు. టికెట్స్ కొని వాళ్ళని లోపలికి పంపించేశాడు. ఎలా వెళ్ళాలి, ఎలా ఎక్కాలి అవన్నీ ముందే చెప్పాడు. ఫ్లైట్ ఎక్కి కూర్చున్నారు. కిటికీ సీట్ లో కూర్చుంటాను అని చాందిని అడిగింది. శీనుకి ఆమె పక్కనుంటే చాలు.

ఎయిర్ హోస్టెస్ వచ్చి సైగలు చేస్తూ ఇన్స్ట్రక్షన్స్ చెప్తుంటే పాఠం విన్నట్టు విన్నాడు శీను. ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు.

"పాపం మూగదనుకుంటా, అందుకే వేరే అమ్మాయి మైక్ లో చెప్తుంటే ఈమె నటిస్తూ చెప్తోంది" అన్నాడు శీను.

"బాగుంది.. తెల్లగా…" అంది చాందిని.

"నీకంటేనా?" అనడిగాడు శీను. చాందిని సిగ్గుతో ముడుచుకుపోయింది.

రమణమ్మ అయితే బితుకుబితుకు మంటూ కూర్చుంది.

"ఏంటి రమణమ్మా?? భయమే…" అనడిగాడు శీను.

రమణమ్మ ఏమి మాట్లాడలేదు.

సీట్ బెల్ట్ పెట్టుకోమని మైక్ లో చెప్పారు. ఎయిర్ హోస్టెస్ సాయంతో ముగ్గురు బెల్ట్స్ పెట్టుకున్నారు.

పైలెట్ కూడా తనని పరిచయం చేసుకుని ఫ్లైట్ కాసేపట్లో బయలుదేరబోతోందని చెప్పాడు. ఎయిర్ హోస్టెస్ కూడా వారి వారి సీట్స్ లో కూర్చుని బెల్ట్ పెట్టుకున్నారు. విమానం బయలుదేరింది.

ముందు ధైర్యం నటించినా ఫ్లైట్ టేక్ ఆఫ్ అయ్యేటపుడు శీను భయంతో గట్టిగా అరిచేసాడు. రమణమ్మ కళ్ళు మూసుకుని పళ్ళు

బిగబెట్టేసింది. చాందిని చిన్న పిల్లలా చిన్నగా అయిపోతున్న జనాలను చూస్తూ కేరింతలు కొట్టింది.

కాసేపటికి అది మబ్బుల్లో పోతుంటే చూస్తూ కొంచెం స్థిమిత పడ్డాడు శీను.

రమణమ్మ కూడా భయంపోయి అంతా కలియ చూస్తోంది.

“ఇదిగో... రమణమ్మా..”

“చెప్పు...”

“విమానం ఎక్కాలంటే అదృష్టం ఉండాలి తెలుసా?” అనడిగాడు.

రమణమ్మ శీనుని చూసి. “దిగాలన్న అదృష్టం ఉండాలి తెలుసా...” అంది. పక్కనే ఉన్న చాందిని పకపకా నవ్వింది. ముగ్గురు నవ్వుకున్నారు.

చాందిని చేయిని గట్టిగా పట్టుకున్నాడు. ఆమె అతని భుజంపై వాలి “నన్ను నీ దగ్గరే ఉంచేసుకో శీను.. మళ్ళీ నేను ఆంటీ దగ్గరకి వెళ్ళను” అంది.

“సరే, నా దగ్గరే ఉందుగాని..”

ఫ్లైట్ హైదరాబాద్ లో ల్యాండ్ అయింది. కపర్ది పంపిన కార్ వాడు వచ్చి వాళ్ళని పిక్ అప్ చేసుకుని గెస్ట్ హౌస్ కి తీసుకెళ్ళిపోయాడు.

కపర్ది రూమ్ కి వెళ్లేసరికి మనోహర్ ఉన్నాడు.

"ఏమైంది? అంతా ఓకే కదా?" అనడిగాడు మనోహర్.

"అంతా ఓకే...హైదరాబాద్ పంపించేసాను. బాలరాజు ఏడి?" అనడిగాడు కపర్ది.

"బాలరాజు డ్యూటీకి వెళ్ళిపోయాడు. వాళ్ళు హైదరాబాద్ ఎలా వెళ్లారు?"

"ఫ్లైట్ లో.. అక్కడ గెస్ట్ హౌస్ ఉంది మాకు. అక్కడే ఉండమన్నాను."

"ఓకే గుడ్.."

"ఏమన్నా ఉందా తినడానికి?"

"ఉండు, పది నిముషాలు. ఎలాగో శీను కూరగాయలు కట్ చేసాడు కదా! మనకి వంట చేస్తున్నాను అయిపోతుంది."

"సరే, ఏమన్నా హెల్ప్ చేయాలా?"

"వద్దు. ఫ్రెష్ అప్ అయి రా.. తినేద్దాం.."

కపర్ది ఫ్రెష్ అప్ అయి వచ్చేసరికి వంట పూర్తి చేసాడు మనోహర్. ఇద్దరు కలిసి భోజనం చేశారు.

"కూర బాగుంది మనోహర్.." అన్నాడు కపర్ది చేయి కడుక్కుంటూ. మనోహర్ నవ్వుకున్నాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అనడిగాడు కపర్ది.

"ఆ రోజు అలా అన్నానని చెప్పావ్ కదా!" అన్నాడు మనోహర్.

"అదేం లేదు.. నువ్వు చెప్పాక నాకు అనిపించింది. మా వంట వాడు కూడా చాలా బాగా వండుతాడు. నేనెళ్ళిన రోజు అదే చేప్పాను, అప్పుడతని కళ్ళల్లో మెరుపు నిజంగా జీవితంలో మర్చిపోలేను. ఎంత సంబరపడిపోయాడో... అతనికి చాలా రుణపడిపోయాను అని అనిపించింది. అమ్మ పోయినప్పటి నుండి అతనే వండి పెట్టాడు."

"కపర్ది, నువ్వేమి అనుకోనంటే ఒకటడగనా?"

"అడుగు"

"నువ్వు ఎందుకు ఇలా ఇల్లు వదిలి వచ్చేసావ్? మీ అమ్మగారు ఎలా చనిపోయారు?"

"ఒకటని రెండు అడిగావేంటి? నిజానికి రెండు ప్రశ్నలకి జవాబు ఒకటే 'మా నాన్న వల్ల"

"మహాదేవగారా?"

"హ్మ్.. ఏంటో.. అసలు విషయం ఎలాగ అడగాలో తెలియక ఇలా కొసరు విషయం అడిగి అసలు విషయం రాబట్టాలనే కదా నీ ఉద్దేశ్యం." నవ్వాడు కపర్ది. అసలు విషయం అంటే శ్రీజ అని అర్థమవడానికి మనోహర్ కి ఎంతో సమయం పట్టలేదు.

“ఛ..ఛ..అదేం లేదు.. అడగాలనుకుంటే డైరెక్ట్ గానే అడుగుతాను. నాకు మొహమాటం ఏం లేదు.” అన్నాడు మనోహర్. మనోహర్ నిజంగా కపర్ది గురించి తెలుసుకోవాలనే అడిగాడు.

“సరే.. కానీ ఒక విషయం మనోహర్, నేను నీ గురించి మా నాన్నకి రికమెండ్ చేయలేను. అది నాకు ఇష్టం లేదు. ఏమనుకోకు…” సందర్భం వచ్చింది కనక చెప్పాలనుకున్న విషయం సూటిగా చెప్పేసాడు కపర్ది.

మనోహర్ మౌనంగా ఉండిపోయాడు.

“నాకు తెలుసు నువ్వు తీసుకోలేవని. కానీ నా అంతట నేను చెప్పడం మంచిదనిపించింది. కష్టపడు ఫలితం అదే వస్తుంది…” అన్నాడు కపర్ది ఊరడింపుగా.

“అదేంటో.. మనిషి అడక్కుండానే సలహాలు ఇవ్వడానికి మొగ్గు చూపుతాడు. సాయం అంటే ఎవరు రారు. రోడ్ మీద యాక్సిడెంట్ అయితే ఆగి మరీ చూస్తారు. అదే రోడ్ దాటడానికి ఎవరైనా ఇబ్బంది పడుతుంటే మనకెందుకులే అని వెళ్ళిపోతారు.”

“చెప్పాను కదా మనోహర్, నేను మా నాన్నగారితో నీ గురించి అడగలేను. నిజానికి నాకు ఆయనకు మాటలు లేవు. నేను చేసే సాయం అయితే నన్ను అడగక్కర్లేదు.”

"సరే.. నిన్ను ఇబ్బంది పెట్టి ఉంటే సారీ. నువ్వు కోప్పడను అంటే ఒక మాట చెప్తాను"

"చెప్పు పర్లేదు.."

"లేని తల్లిని తలుచుకుంటూ ఉన్న తండ్రిని పట్టించుకోకపోతే తరువాత ఎప్పుడో నువ్వు చేసింది తప్పు అని తెలిసాక పరిస్థితి చేయిదాటిపోతే అప్పుడు మీ నాన్నగారిని ప్రేమించినా ఫలితం ఉండదు. ఇదేదో నా స్వార్ధం కోసం చెప్పడం లేదు. లైఫ్ లో ఎంత మంది వచ్చినా నాన్న నాన్నే!! అమ్మ అమ్మే!! రక్తం పంచుకు పుట్టాక అది మరణంతో విడదీయలే గాని మనస్పర్ధలతో కాదు."

కపర్ది మౌనంగా వింటున్నాడు.

"మీ నాన్న మీద నీకు కోపం కలగడానికి నీకు కోటి కారణాలు ఉండచ్చు. కానీ అందులో ఆయన్ని తిరిగి ప్రేమించడానికి నువ్వు ఒక్క దారినైనా చూసుకున్నావా? వయసుడిగిపోతోంది. డెబ్బై ఏళ్ళు వచ్చేస్తున్నాయ్, ప్రేమ లేకపోతే లేదు. కనీసం జాలి ఉండాలి కదా. నీకు ఉండటానికి నాలుగు రోజులు చోటిచ్చాడని శీనుకి అంత సాయం చేసావ్ మరి చిన్నప్పటి నుండి నీకు అన్ని చూసిన ఆయనకీ ఏమిచ్చావ్?"

"నేను చేసేది తప్పో రైటో నాకు తెలుసు. ప్రతిదానికి ఒక హద్దు ఉంటుంది."

"కానీ తల్లిదండ్రుల ప్రేమకి హద్దు ఉండదు."

"ఆయనెప్పుడూ తండ్రిలా ప్రవర్తించలేదు.."

"అందరు తండ్రులు ఒకేలా ప్రవర్తించరు. ఒక్కొక్కరు ఒక్కోలా... వారి వారి జీవన విధానాన్ని బట్టి. కానీ అందరు ఒకేలా ప్రేమిస్తారు. కొందరు చూపిస్తారు, కొందరు చూపించరు. అంతే తేడా.."

"అంటే మా నాన్నకి నేను అంటే ఇష్టం కానీ ఆ ఇష్టాన్ని చూపించలేదు అంటావా..?"

"ఇష్టం లేకుండా అయితే ఉండదు. చూపించే సమయం ఉండకపోవచ్చు. లేదా చూపించినపుడు నువ్వు ఆయన ప్రేమని తీసుకునే స్టేజి లో లేకపోవచ్చు."

"అంటే?"

"సరే, నీకు అర్థమయ్యేలా చెప్తాను. నా కొలీగ్ ఒకడుండేవాడు. వాడు నా కంటే సీనియర్. ఎప్పుడూ ఆఫీస్ వర్క్.. ఇంట్లో టైం స్పెండ్ చేయడం అస్సలు కుదరని పని. రాత్రిప్పుడో వెళ్ళేవాడు. ఉదయం లేట్ గా లేచేవాడు. వాడి పిల్లల్ని అతని భార్యే చూసుకునేది. రాత్రి వెళ్లి పడుకున్న పిల్లల్ని చూసుకుని మురిసిపోయేవాడు. వాడికి ప్రేమని చూపించే సమయం ఉండేది కాదు. అలాగే మీ నాన్న పరిస్థితి కూడా అంతే అయ్యుండచ్చు. ఆయన ఎంతో పాషనేట్ గా చేస్తున్న పనిలో పడి మిమ్మల్ని పట్టించుకుని ఉండకపోవచ్చు, కానీ

ఏం చేసినా మీ గురించే అని ఆయన మనసులో ఎప్పుడు మెదులుతూ ఉంటుంది."

కాసేపాగి తానే కొనసాగించాడు.

"నీకు తెలియదు కపర్ది. ఒక కళాకారుడు లైమ్ లైట్ లోకి రావాలని ఎంత తపించిపోతాడో. ఒకసారి లైమ్ లైట్ లోకి వచ్చాక దాన్ని నిలబెట్టుకోవడం కోసం ఎంత కృషి చేస్తాడో. ఒక స్టేజిలో అదే జీవితం అయిపోతుంది. అప్పుడు ఆ మనిషి తపస్సులో ఉన్నట్టు ఉంటాడు. ఇంకేమి పట్టవు. లోపల ఎంత ఉందో దాన్ని తవ్వుతూనే ఉంటాడు. ఎంత వచ్చినా తనివి తీరదు. ఈ వయసులో ఆయన మనసు కష్టపెడితే నీకు వచ్చే లాభం ఏముందో ఒకసారి ఆలోచించు. కానీ ఆయన్ని బాగా చూసుకుంటే పైన ఉన్న మీ అమ్మగారు కూడా ఆనందిస్తారు. ఎందుకంటే తన భర్త కన్న కొడుకు వల్ల బాధ పడుతున్నాడు అంటే ఏ భార్యా సంతోషించదు." అని చెప్పి ముగించాడు.

కపర్ది, మనోహర్ మొహాలు గంభీరంగా మారాయి.

అప్పుడే అక్కడకి గీత వచ్చింది. తన రూమ్ దగ్గర గీతని చూసి నివ్వెరపోయాడు. గీతని చూసి ఆమె దగ్గరకు వెళ్లి "ఏంటి గీత .. ఈ టైంలో" అనడిగాడు.

"మాట్లాడాలి" అంది.

"ఇప్పుడా? రేపు మార్నింగ్ మాట్లాడుకోవచ్చులే.." అన్నాడు కపర్ది.

"అర్జెంట్.. ఇప్పుడే మాట్లాడాలి." పట్టుబడుతూ అడిగింది.

"సరే, మీరు మాట్లాడుకోండి నేను పడుకుంటాను" అని చెప్పి లోపలికి వెళ్లి తలుపు వేసుకున్నాడు మనోహర్.

"నా మాట విను. ఇంట్లో మీ నాన్నగారికి తెలిస్తే కంగారుపడతారు. రేపు మాట్లాడుకుందాం అని చెప్పాను కదా.." నచ్చ చెప్తూ అన్నాడు కపర్ది.

"నాన్నకి చెప్పే వచ్చాను..." అంది.

"చెప్పే వచ్చావా? ఏమని?" అనడిగాడు.

"నీతో మాట్లాడాలని ఉందని." వెంటనే సమాధానమిచ్చింది.

"ఒప్పుకున్నారా??" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఇప్పుడు నేను ఎలా రాగిలినాను అనుకున్నావ్.." అంది నిట్టూరుస్తూ.

"నిజమే.. విషయం చెప్పు.." అడిగాడు పిట్ట గోడకి అనుకుంటూ.

"నేను చెప్పిన విషయం ఏం చేసావ్?" అనడిగింది కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"ఏ విషయం..." అన్నాడు.

"బస్ స్టాండ్ లో చెప్పిన విషయం..." ప్రశ్నించింది చూపు తిప్పకుండా.

"ఇప్పుడు దాని గురించి అడగడానికి ఈ టైంలో వచ్చావా?" అనడిగాడు చేతులు కట్టుకుంటూ.

"అడగాల్సిన సందర్భం ముఖ్యం...అడిగే సమయం కాదు. ఒకరి మీద ప్రేమ కలగడానికి పగలు రాత్రి అంటూ ఏమి ఉండదు, మరి కలిసి మాట్లాడుకోవడానికి ఎందుకు?"

"కలిసున్నప్పుడు ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కలవాలనుకున్నప్పుడు అలా కుదరదు."

"డైరెక్ట్ గా పాయింట్ కి వచ్చేస్తున్నాను. నీకు ఇంకా ఆ హోటల్ లో చూసిన అమ్మాయంటే ప్రేమ ఉందా? ఆమెను మర్చిపోలేకపోతున్నావా?" అనడిగింది. ఒక క్షణం మౌనం.

"లేదు..." అన్నాడు.

"మర్చిపోలేకపోతున్నావా?" అంది కనుబొమ్మలు ముడి వేస్తూ..

"ప్రేమ గీమా ఏమి లేదు అంటున్నాను. అసలు ఎవ్వరి మీదా లేదు." అని చెప్పాడు నిలకడగా.

"థాంక్స్.. నాకు కావాల్సిన సమాధానం వచ్చింది." అని చెప్పి వెళ్ళిపోతూ ఆగి "ఇంకెప్పుడు నాతో మాట్లాడకు. నేను నీకు ప్రొపోజ్ చేయలేదు. నేను నిన్ను ప్రేమించలేదు. నువ్వు నన్ను కాపాడలేదు. మనం

ఇద్దరు కలుసుకోలేదు. మా నాన్న నీకు హెల్ప్ చేయలేదు. అసలు నీకు నాకు ఎటువంటి సంబంధం లేదు.” అని చెప్పి వెళ్ళిపోయింది.

***

“రా కిరీటి, కూర్చో..” అన్నాడు మహాదేవ.

“ఎలా ఉంది సార్?” అనడిగాడు కిరీటి నిలబడే.

“అలానే ఉంది.. ముందు కూర్చో కిరీటి..” అన్నాడు మహాదేవ.

“ఇప్పుడు అడగచ్చో లేదో కూడా తెలియదు సార్, నాకు కొంచెం అర్జెంట్ గా ఒక పాట రాసిపెట్టగలరా?”

కిరీటి వంక చూసాడు. కిరీటి కొంచెం కూడా తొట్రుపాడుపడలేదు.

“ఈ ఒక్క పాట వారంలో షూటింగ్ ఉంది సార్. చాలా మంది రాశారు గాని అస్సలు వర్క్ అవుట్ అవడం లేదు. అందుకే మీ దగ్గరికి రావాల్సి వచ్చింది.”

“సిట్యువేషన్ చెప్పు..”

కిరీటి సిట్యువేషన్ అంతా ఎక్స్ప్లెన్ చేసాడు. చెప్పిన దాని సారాంశం రాసి ఇచ్చాడు.

“సరే. రాసి ఇస్తాను. నీకు షూటింగ్ కి టైం అయిపోతోందని కాదు. నాకు డైవెర్షన్ కావాలని. ఎందుకంటే పాటే నాకు ఓదార్పు. పాటే నాకు ఓటమిలో గెలుపు.”

“క్షమించండి సార్. నా స్వార్థం కోసం నేను మీ పరిస్థితిని పట్టించుకోవడం లేదు.”

“అదేం లేదు. హాస్పిటల్ లో ఉన్నప్పుడు కొడుకులా కాసుకొని ఉన్నావ్. నీకు ఆ మాత్రం ప్రయారిటీ ఇవ్వగలను.”

“కొడుకని అన్నారని చనువు తీసుకుని అడుగుతున్నాను, మీ అబ్బాయి ఎందుకు మిమ్మల్ని ద్వేషిస్తున్నాడు సార్?”

మహాదేవ మౌనంగా ఉండిపోయాడు. మహాదేవని అంతే మౌనంగా చూస్తూ ఉండిపోయాడు కిరీటి. కాలింగ్ బెల్ వినపడటంతో గుమ్మం వైపు తిరిగి చూసారు ఇద్దరు.

ఇంటి గుమ్మం అవతల నుంచున్న విరించిని చూసారు.

శ్రీకృష్ణుడింటికి కుచేలుడు వచ్చినట్టు నిలబడి ఉన్నాడు. వారిద్దరి మధ్య స్నేహం కూడా అలాంటిదే. కాలం తాత్కాలికంగా కొంతమందిని దూరం పెడుతుంది. ఊహించని సందర్భంలో ఊరట కలిగిస్తూ మళ్ళీ తిరిగి కలుపుతుంది. జ్ఞాపకాల ఊసులు చెప్పుకుంటూ ఊపిరి పీల్చుకోమంటుంది.

ఒకప్పుడు భార్య చనిపోయి గుండె పగిలి ఏడుస్తుంటే ఏడవడానికి భుజం ఇచ్చాడు మహాదేవ. ఇప్పుడు అదే మనిషి కొడుకు కాదని కుమిలిపోతుంటే ఓదార్పునిచ్చే మాటకోసం, చెప్పేది ఓపిగ్గా వినే సరైన మనిషి కోసం ఎదురు చూస్తున్నాడు. నిజమే...మనిషి తలదాచుకోవడానికి షెల్టర్ లేకపోయినా ఉండగలడేమోగాని కష్టం వచ్చినపుడు తలవాల్చుకోవడానికి ఒక షోల్డర్ ని మాత్రం కోరుకుంటాడు.

ఇప్పుడు మహాదేవ అదే పొజిషన్ లో ఉన్నాడు. వెంటనే విరించిని పోల్చుకోపోయినా అతని మస్తిష్కంలో ఎక్కడో దాగిన జ్ఞాపకం, అతని గుండెగదిలో ఏ మూలో దాగిన స్నేహపాశం మహాదేవని కదిలించింది. చిన్ననాటి స్నేహితుడుని చూసేసరికి శరీరం ఆధీనం కోల్పోయిన వాడిలా తడబడి అడుగులు వేసుకుంటూ గుమ్మం దగ్గరకు పరుగు నడకతో చేరుకున్నాడు. మహాదేవ కళ్ళు తడిసి ముద్దయ్యాయి. విరించి కళ్ళు కూడా తడవడానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఎన్నాళ్ళయిందిరా చూసి? ఎలా ఉన్నావ్?" భుజం పట్టుకుని అడిగాడు మహాదేవ.

"నేను బాగున్నానురా. నువ్వెలా ఉన్నావ్?" అనడిగాడు విరించి.

అప్రయత్నంగానే విరించి కళ్ళు తడిసాయి. మహాదేవ ఎంత డెస్పరేట్ గా ఒక మనిషి ఆసరా కోరుకుంటున్నాడో తలచుకుంటే జాలి అనిపించింది. విరించి మనస్ఫూర్తిగా గుండెలకు హత్తుకున్నాడు. అదొక ఆత్మీయ స్పర్శ. తడిసిన కళ్ళు ఒకరివి. తడిసిన గుండె ఒకరిది. స్నేహంలో ఉండే గొప్పతనం అదే. అన్ని కబుర్లు ఒకేసారి కుప్ప పోసినట్టు చెప్పేసుకోవాలనిపించేస్తుంది. కానీ కిరీటి ఉన్నాడని గ్రహించి నిగ్రహించుకున్నాడు.

కిరీటిని చూసి "పాట రాయగానే కబురంపుతాను. మళ్ళీ కలుద్దాం" అని చెప్పాడు మహాదేవ. కిరీటి వెళ్ళిపోయాడు.

తన గదిలోకి తీసుకెళ్లాడు. వంటవాడికి కాఫీ తెమ్మని చెప్పాడు. ఇద్దరు కాఫీ తాగాక, తన గదిలోనే ఫ్రెష్ అప్ అయి రమ్మన్నాడు. స్నానానికి తువ్వాలందించాడు. అన్నీ దగ్గరుండి చూసుకున్నాడు. అడుగడుగునా వెనకుండి స్నేహితుడికి ఆతిధ్యం ఇచ్చాడు.

మధ్యాహ్నం భోజనానికి కూర్చున్నారు.

"కూతురు ఎలా ఉంది?" అనడిగాడు మహాదేవ.

"బాగుంది. లైబ్రేరియన్ గా పని చేస్తోంది" చెప్పాడు విరించి.

“పేరు ఏమన్నావ్?” అనడిగాడు మహాదేవ.

“గీత.. తనే నా జీవితానికి తోడై నిలిచింది.” అన్నాడు విరించి కూతుర్ని తలుచుకుంటూ.

“నువ్వు ఆ విషయంలో అదృష్టవంతుడివి.” అన్నాడు మహాదేవ.

స్నేహితుడికి కొసరి కొసరి వడ్డించాడు. భోజనం అయ్యాక “కాసేపు పడుకుంటావా?” అడిగాడు మహాదేవ.

“వద్దు. అలవాటు లేదు.” అని కాసేపాగి “నీతో చాలా మాట్లాడాలి. కొన్ని అడగాలి. ఇంకొన్ని వినాలి” అన్నాడు విరించి.

నవ్వుతూ “టి.వి లో న్యూస్ చూసావా?” అనడిగాడు మహాదేవ.

“కాదు. నీ కొడుకు కపర్దిని చూసాను.” చెప్పాడు విరించి.

మహాదేవ కన్నార్పకుండా విరించిని చూసాడు.

“అసలేం జరిగింది మహాదేవ?” అంటూ మహాదేవ భార్య లలితా సహస్ర ఫోటోని చూస్తూ అడిగాడు.

***

కపర్ది కోసం ఎదురు చూస్తోంది గీత. ఆమె దగ్గరకి వెళ్లి నుంచున్నాడు.

“నిన్నేదో కలవద్దు పిలవద్దు అన్నావ్... మళ్ళీ వచ్చావేంటి?” అనడిగాడు కపర్ది.

“మా నాన్న మీ నాన్నగారిని కలవడం కోసం హైదరాబాద్ వెళ్లారు” అని చెప్పింది.

“ఎందుకు?” అనడిగాడు ఆశ్చర్యంగా.

“తెలియదు. నిన్న రాత్రి మనిద్దరి మధ్య జరిగిన విషయం చెప్పాను. లాస్ట్ బస్ ఎక్కి వెళ్లారు.”

“కొంపతీసి సంబంధం మాట్లాడుతారా?”

“మాట్లాడితే ఏంటి? నువ్వు మీ నాన్న మాట వినవు కదా..”

“ఏంటి అందరు నన్నొక విలన్ లా చూస్తున్నారు.. నా బతుకు నేను బతుకుతుంటే ఎందుకు నన్నిలా చంపుతున్నారు.” అసహనంగా అన్నాడు.

“ఎవరు ఎవర్ని చంపుతున్నారు? ఎవరికి గుండె నొప్పులొస్తున్నాయ్? మీ నాన్న నీకేదో అన్యాయం చేసినట్టు ఒక శత్రువుని చూసినట్టు చూస్తున్నావ్? నాన్న కొట్టాడని అమ్మ తిట్టిందని ఇంట్లోంచి వచ్చేసే పదో క్లాస్ పిల్లాడికి నీకు పెద్ద తేడా ఏముంది?”

“అవును అన్యాయమే చేసాడు. మా అమ్మని ప్రేమించి అన్యాయం చేసాడు. పెళ్లి చేసుకుని అన్యాయం చేసాడు. నన్ను కని అన్యాయం చేసాడు. మా అమ్మని చంపి అన్యాయం చేసాడు.”

***

“వాడికి నేను చేసిన అన్యాయం ఏమిటో నాకు తెలియడం లేదురా..” అన్నాడు మహాదేవ.

“నిన్ను ఇంత బాధ పెడుతున్న నీ కొడుకు మీద కోపం లేదా?” అనడిగాడు విరించి.

***

“నాకు మా నాన్న అంటే పీకల దాకా కోపం ఉంది. ఆయన తలచుకుని ఉంటే మా అమ్మని కాపాడగలిగేవారే. కానీ కాపాడలేదు.” అని చెప్పాడు కపర్ది.

“ఎందుకు కాపాడలేదు?” అనడిగింది గీత.

ఆమె వైపు కోపంతో చూసాడు. ఆ కోపంలోంచి తల్లి గుర్తొచ్చి కన్నీళ్లు ఉబికి వచ్చాయి. ఎర్రబడ్డ కళ్ళతో ఆమె చేయి పట్టుకుని దగ్గరకు లాగి ” ఆయన మీరు అనుకున్నంత గొప్పోడేమి కాదు.” అన్నాడు.

***

మహాదేవ అప్పుడే కలం పట్టిన రోజులవి....

మహాదేవ తండ్రి, ఊరిలో కరణీకం చేసేవాడు. పప్పుకి, ఉప్పుకి నీటికి, నిప్పుకి దేనికీ లోటు ఉండేది కాదు. కానీ మహాదేవ తండ్రి కూడా ఊరికనే వచ్చేవి తీసుకునేవాడు కాదు. ఊరిలో నోటరీ చేస్తూ ఉండేవాడు. ఆ సంపాదనతోనే సంసారాన్ని నెట్టుకొచ్చేవాడు. మహాదేవకి వీలున్నప్పుడల్లా పుస్తకాలు కొనిచ్చేవాడు. ఆ విధంగా మహాదేవకి సాహిత్యం మీద ఇష్టం ఏర్పడింది. నెమ్మదిగా కవితలు రాయడం మొదలెట్టి గేయాలు రాయడం

కూడా చేసేవాడు. కాలేజీలో ప్రతి పోటీలోనూ పార్టిసిపేట్ చేసేవాడు. అన్నిటిలోను ఏదో ఒక బహుమతి గెలుచుకునేవాడు. డిగ్రీ అయ్యాక తండ్రికి ఉన్న పరపతితో ఊరిలోనే చిరుద్యోగానికి చేరాడు.

ఇవన్నీ జరుగుతుండగానే విరించి, సహస్ర పరిచయం అయ్యారు. వారి స్నేహం అతని సాహిత్య ప్రయాణానికి ఒక ఆలంబనగా నిలిచింది.

చిన్న చితక పత్రికలకి కవితలు పంపించుకుంటూ కాలం గడిపేవాడు మహాదేవ. అతని రాసిన కవితలకి మంచి ప్రశంస లభించేది. అతని రాసిన కవితలకు విరించి బొమ్మలు వేసేవాడు. తను రాసే కవితలకు బొమ్మలెవరు వేస్తారో తెలుసుకోవాలనిపించింది. వాకబు చేస్తే విరించి అని, తన వయసు వాడే అని తెలుసుకున్నాడు. పత్రిక వాళ్ళ దగ్గర అడ్రస్ అడిగి తీసుకుని విరించికి ఉత్తరం రాసాడు. విరించి ఆ ఉత్తరం చదివి ప్రత్యుత్తరం రాసాడు. చాలా కాలం వారు ఉత్తరాలు రాసుకున్నారు.

మహాదేవకి చాలా మంది పాఠకుల నుండి ఉత్తరాలు వచ్చేవి. వాటి అన్నిటికి ఓపిగ్గా జవాబు రాస్తూ ఉండేవాడు. అలాంటి ఉత్తరాలలో వచ్చే ఒక ఉత్తరం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఆ ఉత్తరం లలిత సహస్ర దగ్గర నుండి వచ్చేది. శుభలేఖ పంపినట్టు ఉత్తరానికి నాలుగు వైపులా చందనాన్ని సుగంధంతో కలిపి పూసేది. దాని నుండి వచ్చే సువాసన ద్వారా ఆమె ఉత్తరాన్ని యిట్టె కనిపెట్టేవాడు. ఆమె నుండి వచ్చే ప్రతి ఉత్తరము ఒక్కో రంగు కాగితంలో రాసి పంపించేది. ఆ కాగితాలలో ఆమె దస్తూరి ముగ్గు వేసినట్టు

ఉంటే దానికి పూసిన కస్తూరి సుగంధం మరింత సొబగులదిమేది. అందరూ అభిమానిస్తారు, కొందరు ప్రేమిస్తారు. చాలా తక్కువ మంది ఆరాధిస్తారు. ఆమె అందరికంటే ఒక మెట్టు ఎత్తులో నిలబడేది. ఆరాధనకు మించిన భక్తి ఆమె మహాదేవపై చూపించేది.

అవన్నీ ప్రత్యేకంగా అలమారులో దాచుకునేవాడు. వారి మధ్య కలం స్నేహం చాలా కాలం సాగింది. కలం స్నేహం నుండి కలవాలని ఉందని అడిగేదాకా చేరుకుంది.

విరించి ప్రోత్సాహం, లలితా సహస్ర అభిమానం మహాదేవని మరింత మంచి కవితలు రాసే స్ఫూర్తిని అందించాయి. పగలనకా రాత్రనకా అదే పనిగా రాయడం, వచ్చే ఐదో, పదో అతని ఖర్చులకి వాడుకోవడం. తన ఖర్చులకి ఇంటిలో చేయి చాచింది లేదు. ఇంకా కొంచెం చేయూతనందిచాడు. చదువుకుంటూనే ఇలా కొడుకు కొద్దో గొప్పో సంపాదిస్తున్నాడని మహాదేవ తల్లిదండ్రులు మహదానందపడేవారు.

విరించి గురించి సహస్రకి, సహస్ర గురించి విరించికి చెప్పేవాడు. కొంత కాలం వారందరి జీవితం సాఫీగానే సాగిపోయింది.

ఒకనాడు విరించిని కలవాలనిపించి ఉత్తరం రాసాడు మహాదేవ.

'ప్రియమైన మిత్రుడికి,

ఈ వారం నీవు గీసిన బొమ్మ చాలా బాగా వచ్చింది. నేను రాసిన పిచ్చి రాతలకి నీవు వేసే గీతలు ప్రాణాన్ని పోస్తున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. నాదేముంది నాకు తోచింది, అనిపించింది కాగితం మీద కలంతో రాసేస్తాను. దాన్ని నువ్వు అర్థం చేసుకుని గీసేస్తావు చూడు అది గొప్ప విషయం. ఒక్కోసారి అనిపిస్తుంది నేను ఊహించిన దానికంటే నీవు చూసేది / అర్థం చేసుకునేది చాలా ఉన్నతంగా ఉంటుందని. నిన్ను పొగుడుతున్నానని అనుకోకు, వాస్తవం చెప్తున్నాను. నేను పది పేజీలు రాసిన కవిత నీవు పదంగుళాల బొమ్మలో చెప్పేస్తున్నావ్. ఒక రకంగా నాకు ఈర్ష్య కలుగుతోంది. ఒక కళాకారుడికి ( ఇంకా ఇలా పిలుచుకునేంత స్థాయి వచ్చిందని భావించడం లేదు ) మరొక కళాకారుడి ( నువ్వు నిశ్చయంగా కళాకారుడివే, సందేహం లేదు ) కళ చూస్తే ఈర్ష్య కలిగితే ఖచ్చితంగా అతను గెలిచాడనే అర్థం. నా ఈ అసూయ నీకు ఆశీర్వాదం కావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే నేను కలం పడితే నీవు కుంచె పట్టావు. నాది పదాల పొందిక అయితే నీది భావాల మాలిక. నా కలం నీ కుంచెని కలవాలని ఆరాటపడుతోంది. ఒకసారి కలుద్దామా మిత్రమా? వచ్చే నెల పదిహేనో తారీఖు, శనివారం, రాజమండ్రి కోటిలింగాల రేవు.

బదులు కోసం ఎదురు చూస్తూ....

నీ మిత్రుడు.

మహాదేవ'

విరించి బదులుగా కలవడానికి వస్తున్నట్టు ప్రత్యుత్తరం పంపాడు.

శనివారం, పదిహేనో తారీఖు, కోటిలింగాల రేవు..

విరించి కోసం ఎదురు చూస్తున్నాడు మహాదేవ. విరించి, ఒకరినొకరు ఎలా గుర్తు పట్టాలో చెప్పాడు. తాను ఒత్తుగా ఉన్న గడ్డంతో ఉంటానని, బ్లూ కలర్ లాల్చీ పైజామ వేసుకుంటానని చెప్పాడు. తాను వచ్చినప్పుడు తన దగ్గరున్న బెస్ట్ ఆర్ట్ ని గిఫ్ట్ గా ఇస్తానని చెప్పాడు. తనని కూడా బ్లూ కలర్ చొక్కా వేసుకురమ్మని చెప్పాడు. అనుకున్నట్టుగానే బ్లూ కలర్ చొక్కా వేసుకుని ఎదురు చూస్తున్నాడు మహాదేవ.

విరించిని దూరం నుండి చూసి చేయి ఊపాడు. దగ్గరకి వెళ్లి అతని చేయిని చేతిలోకి తీసుకుని కళ్ళకి హత్తుకున్నాడు మహాదేవ.

"నువ్వు మరీ సెంటిలా ఉన్నావ్ మహాదేవ" అన్నాడు విరించి.

"ఈ చేయి ఇప్పటివరకు ఒక్క వంకర గీత కూడా గీయలేదు." అన్నాడు మహాదేవ.

చాలాసేపు వారి వారి జీవన విధానాల గురించి మాట్లాడుకున్నారు. సాహిత్యంలో పోకడల గురించి విశ్లేషించుకున్నారు. మాటల మధ్యలో లలితా సహస్ర గురించి ప్రస్తావన వచ్చింది.

"లలితా ఎలా ఉంది?" అనడిగాడు విరించి.

"తెలియదు." అన్నాడు మహాదేవ.

"తెలియకపోవడం ఏంటి, ఆమె నుండి ఉత్తరాలు రావడం లేదా?."

"లేదు. నెల అయిపోతోంది."

"ఒకసారి వెళ్లి కలవలేకపోయావా?"

"లీవ్ దొరకడం లేదు. పైగా ఆమె ఉండేది తిరుపతి దగ్గర"

"తిరుపతి మరీ మంచిది. కలవాలని ఉందా?"

"ఎలా?"

"దేవుడి మొక్కు ఉందని అబద్ధం చెప్పు. రాత్రే బయలుదేరి వెళ్దాం."

“అలా అబద్ధం చెప్పి వెళ్తే పాపం.”

“పోనీ ఇప్పుడు మొక్కుకో, లలితా దేవిని కనపడేలా చేయి, నీ దర్శనం చేసుకుంటాను అని”

“లలితా సహస్ర...”

“అదే లలితా సహస్ర.. ఎవరైనా ఒక్కటే”

“ఇప్పటికిప్పుడు ప్రయాణం అంటే డబ్బులు కూడా చాలా కావాలేమో”

“వెళ్లి రావడానికి నా దగ్గర ఉన్నాయ్, తిండి తిప్పలు గుడిలో ఉండే అన్నప్రసాదంతో సరిపెట్టేద్దాం. ఏమంటావ్?”

“సరే,”

“రాత్రే బయలుదేరుదాం. లలితా దేవి...”

“లలితా సహస్ర..”

“అదే, లలితా సహస్ర అడ్రస్ పట్టుకురా. మర్చిపోతే వీధి వీధి వెతకలేం”

“సరే.”

“గుడ్. ఛలో తిరుపతి..”

ఆ రాత్రే ఇద్దరు తిరుపతి ప్రయాణమయ్యారు. మర్నాడు ఉదయం తిరుపతి చేరుకున్నారు.

తిరుపతిలో దిగాక అక్కడే ఉన్న సత్రంలో స్నానాలు ముగించుకుని, టిఫిన్ కూడా చేశారు.

"ముందు స్వామి దర్శనమా? దేవి దర్శనమా?" అనడిగాడు విరించి.

"సహస్ర…"

"సరే…"

ఆమె ఉండే అడ్రస్ కి ఆటోలో బయలుదేరారు.

ఆమె రాసిన ఉత్తరాన్ని చూసి "రైటింగ్ చాలా బాగుంది, ముత్యాలు పగడాలు ఏదో అంటాం కదా, అలా ఉన్నాయి అక్షరాలూ" అన్నాడు విరించి.

"అవును, కానీ చిన్ని చిన్ని అక్షర దోషాలు ఉంటాయి"

"హహ.. కవి అనిపించావ్." అన్నాడు విరించి. బదులుగా నవ్వాడు మహాదేవ.

" సెంట్ వాసనా కూడా వస్తోందే!!." వాసన పీలుస్తూ అన్నాడు విరించి.

"అదే ప్రత్యేకంగా ఆమె ఉత్తరాలు చదివేలా చేసింది." అన్నాడు మహాదేవ నెమ్మదిగా.

"నిజమే, అటెన్షన్ గ్రాబ్ చేసింది. తెలివైనదే. లేకపోతే ఒక పాఠకురాలి కోసం ఒక కవి అప్పటికప్పుడు ఏడు కొండలు కాలినడకన ఎక్కి వస్తానని మొక్కుతాడా" నవ్వాడు విరించి.

“కాలినడకన ఎక్కి వస్తానని ఏం మొక్కలేదు. వస్తానని మొక్కను అంతే, కొత్తవి పెట్టకు.” అన్నాడు మహాదేవ.

“సరే...సరే... మామూలు దర్శనమేలే.. నీ దయ వల్ల స్వామి దర్శనం అవుతోంది. థాంక్స్” అన్నాడు విరించి.

“అవును, ఆమె కనపడగానే ఏం మాట్లాడుతావ్?” అనడిగాడు విరించి.

“ఏమో.. ఏమి అనుకోలేదు. ఉత్తరం ఎందుకు రాయలేదు అని అడుగుతాను” అన్నాడు మహాదేవ.

“ఉత్తరం మాట సరే, నీ ఉత్తర కర్తవ్యమ్ కూడా ఏంటో ఒక మాట అనుకుంటే బాగుంటుంది”

“అంటే?”

“నెల రోజులు ఆమె ఉత్తరాలు రాకపోతేనే ఇబ్బంది పడ్డావ్. మరి దానికి అర్థం ఏమిటి?”

“ఆమె మనసులో ఏముందో నాకు తెలియదు.”

“అంటే ఒప్పుకుంటే ఆమెను పెళ్లి చేసుకుంటావా?”

“చేసుకుంటాను.”

“ఆమె ఎలా ఉంటుందని నువ్వు ఉహించుకున్నావ్”

“బాగుంటుందనే అనుకుంటున్నాను.”

"బాగోకపోతే..."

"నేను ఆమె మనసుని ఇష్టపడ్డాను. ఆమె అందం నాకు అడ్డం అవదు."

"వెల్... గుడ్.."

తన దగ్గరున్న అడ్రస్ కి చేరుకున్నారు.

ఇంటి ముందు పూలు కోస్తూ ఆమె కనిపించింది. మహాదేవ కూడా ఆమెను చూసాడు.

"ఆమె కురులు కురిసే మేఘాలు

ఆమె నయనాలు ఆకాశ నక్షత్రాలు

ఆమె పెదవులు పారాణి పూతలు

ఆమె చెంపలు చల్లని పొగ మంచు

ఆమె మెడ మెరిసే శంఖం

ఆమె నవ్వు పూసిన పూదోట

ఆమె నడుము..."

"చాలు చాలు మహాదేవ.." అన్నాడు విరించి.

"ఏంటి చాలు.. అస్సలు వర్ణనలకే అందడం లేదు.. పేరుకి తగ్గట్టే ఉంది. సహస్ర అంటే సంస్కృతంలో అనంతం అని, అనంతమైన అందం ఆనందంగా నవ్వుతూ నా ముందు నిలబడినట్లుంది."

సహస్ర వాళ్ళిద్దరిని చూసింది. లోపలికి వెళ్లి పేపర్ చదువుతున్న తండ్రిని బయటకు తీసుకు వచ్చింది.

“ఎవరు కావాలండి?” అడిగాడు లలితా తండ్రి.

“నమస్కారమండి, లలితా దేవి గారు ఉన్నరాండి?...” చెప్పాడు విరించి.

“కాదండి సహస్ర, లలితా సహస్ర” అన్నాడు మహాదేవ.

“సహస్రనా,, ఆమెతో ఏం పని?” అడిగాడు తండ్రి.

“మాట్లాడాలని వచ్చానండి, రాజమండ్రి నుండి”

రాజమండ్రి అనగానే సహస్ర కళ్ళు విప్పారాయి. అది మహాదేవ గమనించాడు.

“చెప్పండి. ఏం మాట్లాడాలి. నేను ఆమె తండ్రిని. ఇదిగో ఇదే సహస్ర” పక్కనున్న కూతుర్ని చూపించాడు.

మహాదేవ ఆమెను చూస్తూనే “నా పేరు మహాదేవ. నేను పత్రికలలో కవితలు రాస్తూ ఉంటానండి.” అని చెప్పి సహస్ర తండ్రి వంక తిరిగి “నేను రాసే కవితలకు మంచి సమీక్షలు రాస్తున్న పాఠకులను కవియే స్వయంగా కలిసి హృదయ పూర్వక ధన్యవాదములు చెప్పాలని తలచి ఇలా వచ్చామండి. ఈయన పేరు విరించి, నా కవితలకు బొమ్మలు వేసేది ఈయనే. మమ్మల్ని ప్రోత్సహిస్తున్న పాఠకులకి మా వంతుగా చిన్న అభినందన పత్రము” అంటూ ఒక కాగితాన్ని అందించాడు.

“భలేవారే.. ఇలా కూడా ఇంటికొచ్చేస్తారా? విచిత్రంగా ఉన్నా బాగుంది. లోపలికి రండి కూర్చోండి”

ఇద్దరు కూర్చున్నాక కాఫీలు ఇచ్చారు.

“మరొక విషయం అండి..” అన్నాడు.

“చెప్పండి..”

“పాఠకురాలిని మేము కొన్ని విషయాలు అడిగి తెలుసుకోవాలని అనుకుంటున్నాం.”

“క్షమించండి. మా అమ్మాయి సమాధానం చెప్పలేదు”

“మరోలా అనుకోకండి. చిన్న ఇంటర్వ్యూనే...”

“ఆమె మాట్లాడలేదు. మూగది.”

లలితా సహస్ర మూగది అని తెలియగానే హతాశులయ్యారు ఇద్దరు.

ఆమె నవ్వులో ఎంత మాత్రమూ మార్పు లేదు. చాలా స్వచ్ఛంగా నవ్వుతోంది. తన అభిమాన కవి ఎదురుగా కూర్చుని ఉంటే ఆరాధనగా చూస్తూ ఆనందపడుతోంది. ఆమె మనసు మరింత ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నెల నుండి ఉత్తరాలు రాయలేదని కారణం తెలుసుకోవడానికి ఇంటి వరకు వచ్చేసిన మహాదేవని చూస్తే ఆమె హృదయం ఆనందంతో బరువెక్కింది.

క్షణం కూడా ఆలోచించకుండా మహాదేవ.. "మీకేమి అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని నేను పెళ్లి చేసుకుంటాను. మంచి రోజు చూసుకుని పెద్దవాళ్ళతో వచ్చి మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం." అన్నాడు మహాదేవ.

మహాదేవ నిర్ణయానికి మనసులో చాలా ఆనందపడినా బయటకు చాలా భయపడ్డాడు విరించి. మహాదేవ అలా అడిగేసరికి లలిత రెప్ప వేయడం మర్చిపోయింది. లలితా తండ్రి నిశ్చేష్టుడై కూతుర్ని, మహాదేవుని మార్చి మార్చి చూసాడు. మధ్య మధ్యలో విరించిని చూసాడు. విరించి లేని నవ్వుని ముఖానికి పులుముకుని ఇబ్బందిగా నవ్వాడు.

"సరే, పెద్ద వాళ్ళతో రండి" అని చెప్పాడు.

***

వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

"కనపడవుగాని చాలా ధైర్యవంతుడివి" అని అన్నాడు విరించి.

"ధైర్యం కాదు. అదో రకమైన తెగింపు అనాలేమో.. ఆమె మూగది అనేసరికి నాకు..."

"హ్మ్.. నీకు... జాలేసిందా?"

"కాదు.. వదులుకోవాలనిపించలేదు."

"మీ ఇంట్లో ఒప్పుకుంటారా కోడలు మూగది అంటే..."

“నోరేసుకుని పడిపోయే కోడళ్లను ఉదాహరణగా చూపించి ఒప్పిస్తాను”

“ఒబ్బిడిగా, ఒద్దికగా ఉండేవాళ్ళను నీకు ఉదాహరణగా చూపించి ఒప్పించాలని చుస్తే”

“ఒద్దిక, ఒబ్బిడి ఆమెకున్నాయని చెప్తాను”

“మంచిది. శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు..”

ఇంటికెళ్ళాక మహాదేవ విషయం అంతా చెప్పాడు.

కొడుకు చెప్పిందంతా విని “నువ్వు తీసుకున్న నిర్ణయం కరెక్ట్ అని నువ్వు భావిస్తున్నావా?” మహాదేవ తండ్రి ప్రశ్నించాడు.

“భావన కాదు నమ్ముతున్నాను. ఆమె నాకు భార్యగా వస్తే మా జీవితం చాలా బాగుంటుంది.” నమ్మకంగా చెప్పాడు మహాదేవ.

“సరే నీ ఇష్టం..” అన్నాడు మహాదేవ తండ్రి. తల్లి కూడా అంగీకరించింది.

చెన్నైలో అవకాశాలు ఎక్కువ ఉంటాయని విరించి రూమ్ కి షిఫ్ట్ అయిపోయాడు మహాదేవ. ఈ లోపు లోనే వచ్చి పెళ్ళి గురించి మాట్లాడుకున్నారు. సంవత్సరం తరువాత పెళ్లి నిర్ణయించారు. ఆ సంవత్సరం గడువు సహస్ర తండ్రి అడిగాడు, అమ్మాయి చదువు అవ్వాలని కోరాడు.

ఏడాదిన్నరకి పెళ్లి జరిగింది.

"అస్సలు టెన్షన్ లేకుండా, గొడవలు లేకుండా భలే జరిగిపోయింది నీ ప్రేమ పెళ్లి" అన్నాడు విరించి. మహాదేవ నవ్వాడు అవును అన్నట్టుగా.

పెళ్లి అయ్యాక మహాదేవకి 'ఘోస్ట్ రైటర్' గా వరస పెట్టి అవకాశాలు రాసాగాయి. ఇదంతా సహస్ర వలెనే అని మురిసిపోయేవాడు. ల్యాండ్ ఫోన్స్ వచ్చాయి. వీలున్నప్పుడల్లా విరించి మహాదేవలు ఫోన్స్ లో మాట్లాడుకునేవారు.

నెమ్మది నెమ్మదిగా ఎవరి జీవితాలలో ఒకరు బిజీ అవసాగారు. విరించి కూడా పెళ్ళి చేసుకున్నాడు.

కొంతకాలానికి మహాదేవ, సహస్ర దంపతులకు కొడుకు పుట్టడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయింది.

కొడుకు పుట్టాక మహాదేవ జీవితంలో పెను మార్పులు వచ్చాయి. ఒక్కసారిగా లైం లైట్ లోకి వచ్చేసాడు. అంతా కొడుకు వలనే అని సంబరపడిపోయాడు.

మహాదేవ భార్యని అడగకుండా ఏ పని చేసేవాడు కాదు. కొడుక్కి ఏం పేరు పెడదాం అని అడిగాడు. కపర్ది పుట్టడమే ఒత్తైన ఉంగరాల జుట్టుతో పుట్టాడు. అందంగా మెరిసిపోతూ పరమశివుడు చిన్నప్పుడు ఎలా ఉంటాడో అలా ఉన్నాడు. అందుకే కపర్ది అని రాసి చూపించింది.

"'కపర్ది', చాలా బాగుంది" అన్నాడు మహాదేవ.

బియ్యంలో మధ్య వేలు, బొటన వేలు మధ్యలో బంగారు ఉంగరాన్ని పట్టుకుని కపర్ది అని నామకరణం చేశారు. పండితుల వేద మంత్రాల మధ్య ఆశీర్వచనం చేయించాడు.

అమ్మ అయ్యాక లలిత సహస్రకి కొడుకే లోకం అయింది. కపర్దిని చూసుకుంటూ మురిసిపోయేది. కపర్దిని ఆడించేది. కపర్దితో ఆడుకునేది. ఆకలి తీర్చేది. ఆలనా పాలనా చూసేది. మహాదేవ అన్నవాడు ఎదురుగా వచ్చి నుంచుంటే తప్ప గుర్తుకు రానంతగా కపర్దిని ప్రేమించసాగింది.

అమ్మతనంలో ఉండే గొప్పదనం వర్ణించలేనిది. ఊహకు అందని ఒక కొత్త రూపానికి ఊపిరులూది, నవ్వుతూ నవమాసాలు మోసి, పురిటి సలుపులో కూడా ప్రేమే నింపి పుట్టిన బిడ్డను మనసారా గుండెలకు హత్తుకుని, ఆయుష్మాన్ భవ అని తలమీద చేయి వేసి ఆసీర్వదిస్తుంది. అమ్మ తన ఆయువు కూడా కలిపి హాయిగా జీవించమంటుంది. అసలు ఈ ప్రపంచంలో అసలైన ప్రేమ రూపం అంటూ ఉంటే అది అమ్మ రూపంలోనే ఉంటుంది. అమ్మను మించిన ప్రేమ పిపాసి ప్రపంచంలో ఎక్కడా కూడా భూతద్దం పెట్టి వెతికినా దొరకదు. అమ్మ ప్రేమ కోసం త్రిమూర్తులే చనుబాలు తాగారు.

కపర్దికి నెలలు నిండుతున్నాయి. అన్నప్రాసన చేయించాలని నిర్ణయించారు. అన్నప్రాసన కార్యక్రమం ఉన్న దాంట్లో అట్టహాసంగా జరిపించాలని నిర్ణయించాడు మహదేవ.

అప్పుడప్పుడే పలుకుబడి సంపాదిస్తున్న మహాదేవ, తెలిసిన సినీ ప్రముఖులందరినీ ఆ వేడుకకి ఆహ్వానించాడు. విరించి కూడా తన భార్యతో కలిసి వచ్చాడు. ఫంక్షన్ బాగా జరిపించాడు. వచ్చిన వాళ్ళందరూ కపర్దిని

ఆశీర్వదించారు. అక్కడికి వచ్చిన వాళ్ళందరిలోను ఒకే అనుమానం మెదిలింది. తల్లి మూగది అయితే కొడుకుకి మాటలు రావడం కొంచెం ఇబ్బంది అవుతుందని, తల్లి మాటలు వింటూనే పిల్లలు మాటలు నేర్చుకుంటారని చెప్పుకొచ్చారు. కొంతమంది చనువు తీసుకుని మరీ మహాదేవతో ఈ విషయం ప్రస్తావించారు. ఫంక్షన్ అయ్యేవరకు మౌనంగానే ఉండిపోయాడు. విరించికి కూడా విషయం తెలిసింది.

"ఏం చేద్దాం అనుకుంటున్నావ్ రా మరి?" అడిగాడు విరించి.

"సహస్రని బాధపెట్టడం నాకు ఇష్టం లేదు."

"హ్మ్... అలా అని చెప్పకుండా ఉండలేము కదా."

"అసలు ఈ విషయం సహస్రకి ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు."

ఇద్దరి ముఖాలు గంభీరంగా మారాయి. ఒకరినొకరు చూసుకున్నారు. అప్పుడే సహస్ర అక్కడికి వచ్చి ఏమైందని సైగ చేసింది. భుజం మీద హాయిగా నిద్రపోతున్న కపర్దిని చూసాడు మహాదేవ. కపర్ది చిన్న చిన్న చేతుల్ని పట్టుకుని భార్య వంక చూసాడు.

"ఏమైనా సమస్య ఉందా?" రాసి చూపించింది.

అది చదివి "సమస్య కాదు. నువ్వు బాధపడకూడదు మరి" అన్నాడు చెంపల మీద చేయి ఆంచుతూ.

"చెప్పండి పర్లేదు.." రాసి చూపించింది.

"కపర్దికి ఆటలు నేర్పడానికి నువ్వు ఉన్నావ్. కాని మాటలు నేర్పడానికి....." అని ఆర్ధోక్తిలో ఆగిపోయాడు.

సహస్ర నవ్వుతూ "ఓ అదా.. అందుకే మా అమ్మని ఉండిపొమ్మని అడిగాను. ఉదయం అందరూ అనుకుంటుంటే విన్నాను. అమ్మ కూడా ఉంటానంది." రాసి చూపించింది. పెద్ద బరువు దించుకున్నట్టు ఊరట పొందాడు.

భోజనానికి రమ్మని సైగ చేసింది. భోజనాలు అయ్యాక కపర్దిని ఉయ్యాలలో పడుకోబెట్టి, ఏదో రాసుకుంటున్న మహాదేవ దగ్గరకి వెళ్ళి నుంచుంది.

"చెప్పు సహస్రా.." అన్నాడు రాయడం ఆపి.

తన చేతిలో ఉన్న కాగితాన్ని తీసి బల్ల మీద ఉంచింది.

"కపర్ది నన్ను 'అమ్మా' అని పిలిస్తే వినాలని నాకు ఉంది. నేనేమి అంత స్వార్ధపరురాలిని కాదు. నాకు నిజంగా తెలియలేదు అంతే.. లేకపోతే ఎప్పుడో మా అమ్మని వచ్చి నా దగ్గర ఉండమని చెప్పేదాన్ని." అని రాసి ఉంది. లేచి నుంచుని ఆమె తడిసిన కళ్ళను తుడిచి గుండెలకు హత్తుకున్నాడు.

***

మరో పక్క విరించి జీవితం తిరోగమనంలో సాగింది. బూతు బొమ్మలు వేయనని మంకు పట్టు పట్టాడు. అవకాశాలు తగ్గిపోయాయి. కొత్త కొత్త

వాళ్ళకు బొమ్మలు గీసి ఇచ్చినా వాళ్ళు డబ్బులు ఎగ్గొట్టేసేవారు లేదా తక్కువ ఇచ్చేవారు. అన్నిటిని భరించాడు. ఓపిగ్గా ఓర్చుకున్నాడు.

విరించి భార్య చాలా నెమ్మదస్తురాలు. ఆమె పేరు ధరణి, భూమికున్నంత ఓర్పు ఆమెకు ఉంది.

"ధరణి..." పిలిచాడు విరించి ఇంట్లోకి వస్తూ.

"హా.. చెప్పండి."

"మీరే చెప్పాలండీ.. ఏమి వంట చేసారు?"

"నన్ను మీరు అంటారేంటండీ. అలా పిలవద్దని ఎన్నిసార్లు చెప్పాలి."

"ఎందుకు అనకూడదండీ. మగాడేమైనా పెద్ద గొప్పా."

"అవును గొప్పే. అందులోను మీరు ఇంకా గొప్ప"

"సరే.. మీరు నాతోడు ఉన్నంత కాలం నేను గొప్పగానే ఉంటానండి."

"సరే.. రండి వడ్డించేస్తాను."

"ఒకటడగనా?"

"అడగండి."

"నిజం చెప్పాలి మరి"

"అబద్దం చెప్పాల్సొచ్చినా చెప్పను."

“పెళ్ళంటే ప్రతి అమ్మాయి, చాలా కలలు కంటుంది కదా. మీరు కూడా అలానే ఎన్నో ఆశలతో నాలైఫ్ లోకి వచ్చారు. కాని నేను మీరు అనుకున్నట్టు అస్సలు లేనని నాకు తెలుసు. మీకు ఎప్పుడూ నా మీద కోపం రాలేదా? ప్రాక్టికల్ గా ఆలోచిస్తే మీ జీవితం మీద మీకు పూర్తి హక్కు ఉంది. నా పార్ట్నర్షిప్ మీకు నచ్చకపోతే మీకు నచ్చిన నిర్ణయం నిర్భయంగా తీసుకోవచ్చు. ఎందుకంటే బలవంతంగా చేయడానికి ఇది హోమ్ వర్క్ కాదు, కాపురం. కాంప్రమైస్ అయి చేయాల్సిన అవసరం మీకు లేదు.”

“ఏదేదో మాట్లాడారు. కాని ఒక్క మాట! రాముడిని వదలి సీత ఉండలేదండి. భర్తకి పట్టాభిషేకం అంటే ఎలా ఉందో అరణ్యావాసం అంటే కూడా అలానే ఉంది. పొంగు లేదు కృంగు లేదు. నాకు మీతో ఉంటే చాలు. నాకు పట్టు చీరలిచ్చారా? పసిడి కొనిచ్చారా అనేది ముఖ్యం కాదు ప్రేమగా చూసుకునే మీరు నాతో ఉంటే చాలు.”

ఆ మాటకే విరించి కడుపు నిండిపోయింది. ఆకలి పోయి ఆనందం బాష్పాలు వచ్చాయి.

***

కపర్ది పెరిగి పెద్దవాడవసాగాడు. మహాదేవ కూడా అంచలంచెలుగా పెరిగాడు. కపర్ది స్కూల్ కి వెళ్ళడం ప్రారంభించాడు. అతను చదువులో ముందుండేవాడు. రాను రాను మహాదేవ కూడా చాలా బిజి అవసాగాడు. మహాదేవకి రాయడం తప్ప వేరే వ్యాపకం ఉండేది కాదు.

ఒక రోజు తదేకంగా లీనమై రాసుకుంటున్న కపర్ది తన ప్రోగ్రెస్ కార్డ్ చూపించడానికి వెళ్ళాడు. 'నాన్న సంతకం పెడతారు' అని సహస్ర చెప్పి వెళ్ళమంటే వెళ్ళాడు. పాట రాసుకుంటున్న మహేదేవ పక్కన నుంచున్నాడు కపర్ది.

"నాన్నా..." పిలిచాడు.

పలుకలేదు.

"నాన్నా..." మరొకసారి పిలిచాడు నవ్వుతూ.

వినిపించుకోలేదు.

"నాన్నా..." అంటూ రాస్తున్న మహాదేవ చేయిని పట్టుకుని కదిపాడు కపర్ది. రాస్తున్న మహాదేవ ఏకాగ్రత దెబ్బతింది. అతనికి చిరాకు అనిపించింది.

"రాసుకుంటున్నాను కదా కనపడటం లేదా?" అరిచాడు.

కపర్ది బెదిరిపోయాడు. "ప్రోగ్రెస్ కార్డ్.." అన్నాడు కపర్ది నెమ్మదిగా కార్డ్ చూపిస్తూ.

"ఆతలికిపో.. సహస్రా... వీడిని ఇక్కడి నుండి తీసుకెళ్ళు.." అరిచాడు ఇల్లెగిరిపోయేలా.

మహాదేవ అరిచిన అరుపులకి పరిగెత్తుకొచ్చింది సహస్ర.

"తీసుకెళ్ళు వీడిని.." అన్నాడు మహాదేవ.

సహస్ర వచ్చి కపర్దిని తీసుకెళ్ళిపోయింది. కపర్ది ఏడుస్తూ "నాన్న అంటే నాకు ఇష్టం లేదు." అన్నాడు.

'తప్పు. అలా అనకూడదు.' అని సైగ చేసి "నాన్న రాసుకుంటున్నారు కదా, అందుకే కోపడ్డారు. ఈసారి రాసుకుంటున్నప్పుడు వెళ్ళొద్దు. సరేనా" అని రాసి చూపించింది.

తల్లి మాట విని ఊరుకున్నాడు. కాని కపర్ది జీవితంలో జరిగిన మొదటి సంఘటన అతని మనసులో బలమైన ముద్ర వేసింది. మహాదేవ రాయని టైం అంటూ ఏమీ ఉండేది కాదు. అన్నం తినేటపుడు, స్నానానికి వెళ్ళినపుడు, పూజ చేసుకుంటున్నప్పుడు తప్ప మిగిలిన అన్ని సమయాల్లో అతను రాసుకుంటునే గడిపేవాడు. కొడుకు బాధ్యత అంతా సహస్రే చూసుకునేది. నెమ్మది నెమ్మదిగా కపర్దికి తెలిసీ తల్లికి దగ్గరయ్యాడు, తండ్రికి దూరం అయ్యాడు. మహాదేవ తెలియకుండా పాటకి దగ్గరయ్యాడు, కపర్దికి దూరమయ్యాడు. ఎవరికీ కాకుండా భర్త కొడుకుల మధ్యలో మిగిలిపోయింది సహస్ర.

***

విరించికి కూతురు పుట్టింది, దురదృష్టవశాత్తూ ధరణి చనిపోయింది. విరించి ఆ వార్త విని విలవిలలాడిపోయాడు. అతని కష్టాల్లో సుఖాల్లో తోడున్న మనిషి దూరమైపోయేసరికి బాగా కృంగిపోయాడు. విషయం తెలుసుకున్న మహాదేవ వెంటనే చెన్నై వెళ్ళి స్నేహితుడి దగ్గర ఉన్నాడు. అతని ఆసరాగా

ఉండి కార్యక్రమాలన్నీ ఏ లోటూ రాకుండా జరిపించాడు. పాల కోసం గీత ఏడ్చినప్పుడల్లా ఉలిక్కిపడి లేచేవాడు. వారం రోజులు పైనే మహాదేవ విరించి దగ్గర ఉన్నాడు.

"నాతో వచ్చేయకూడదూ?.." అనడిగాడు మహాదేవ.

"వద్దు.." అన్నాడు విరించి.

"మొండిగా మాట్లాడకు, నీ కూతురు గురించైనా ఒకసారి ఆలోచించు."

"నా కూతురుని నేను పెంచుచేగలను."

"మూర్ఖంగా మాట్లా డకు విరించి."

"మూర్ఖత్వం కాదు. బాధ్యతగానే చెప్తున్నాను."

"ఒక్కసారి ఆలోచించు.."

"ఆలోచించడానికేమీ లేదు. ఇదే నా నిర్ణయం"

"సరే, నీ ఇష్టం." అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు మహాదేవ.

***

కాలగర్భంలో కొన్ని సంవత్సరాలు కాలిపోయాయి.

కాలం గడిచేకొద్దీ కపర్దికి తండ్రి మీద కోపం పెరిగింది. వాళ్ళు కలిసి మాట్లాడుకునే సందర్భాలు వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు.

కపర్ది డిగ్రీలో చేరాడు. ఫైనల్ ఇయర్ లో ఉండగా కాలేజీకి వెళ్ళడానికి రెడీ అయ్యి "అమ్మా.. టిఫిన్ పెట్టు." అడిగాడు కపర్ది తన గదిలోంచి బయటకు వస్తూ.

తల్లి టిఫిన్ సర్దుతుంటే మహాదేవ కూడా వచ్చి కూర్చున్నాడు. డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి తండ్రిని చూసాడు. తల్లి వైపు చూసాడు. ఆమె కూర్చో అన్నట్టుగా సైగ చేసింది. కపర్ది కూర్చున్నాడు.

టిఫిన్ తింటూ "ఏరా చదువు ఎలా సాగుతోంది?" అనడిగాడు మహాదేవ.

"......"

"చెప్పరా నిన్నేఅడిగేది."

"తెలుసుకుని ఏం చేస్తారు?"

"ఏంట్రా ఎదురు ప్రశ్నలేస్తున్నావ్?"

"ఊరికనే అడగాలని ఏదో ఫార్మాలిటీకి అడగడమే కాని నేనేం చదువుకుంటే మీకెందుకు? నేనేం చేస్తే మీకెందుకు?"

పక్కనే ఉన్న సహస్ర తప్పు అన్నట్టుగా సైగ చేస్తూ కళ్ళెర్రజేసింది.

“ఇన్నాళ్ళు అమ్మ ముఖం చూసి కిమ్మనకుండా ఉన్నాను. ఇంక సహించేది లేదు.” అన్నాడు తినే ప్లేట్ నుండి లేచి నిలబడి.

“చాలా పెద్దాడివి అయిపోయావ్ రా. సహించలేడంట.. విన్నావా నీ కొడుకు ఎంత ఎదిగిపోయాడో.” అన్నాడు కళ్ళెత్తి కొడుకుని చూస్తూ.

“అమ్మని ఇందులో లాగకండి. అమ్మకేమీ తెలియదు. నేను ఎదిగిపోయి మాట్లాడటం లేదు. విసిగిపోయి మాట్లాడుతున్నాను. అవును నాన్నా,, కొన్నాళ్ళు పోతే ఒకే ఇంట్లో ఉన్న నన్ను పిలిచి ‘ఎలా ఉన్నావ్?’ అని అడిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు.” అని చెప్పి అక్కడి నుండి వెళ్ళేవాడు ఆగి “అమ్మా, కాలేజీకి వెళ్ళొస్తాను. టైంకి తిని టాబ్లెట్ వేసుకో.. నేనొక సారి ఫోన్ చేసి గుర్తు చేస్తాను” అని చెప్పి వెళ్ళిపోయాడు.

“టాబ్లెట్ దేనికి?” అనడిగాడు మహాదేవ కంగారుగా.

“బి.పి..” రాసింది సహస్ర.

“నాకు ఎందుకు చెప్పలేదు?” అనడిగాడు.

“మీరు కంగారు పడతారని చెప్పలేదు, అయినా కపర్ది నన్ను బాగా చూసుకుంటున్నాడు. మీరు నా గురించి కంగారు పడకండి.” రాసి చూపించింది.

“ఐ యామ్ రియల్లీ సారీ సహస్ర... వాడు చెప్పేదాక తెలియనంత బిజి అయిపోయానంటే నా మీద నాకే కోపంగా ఉంది.”

“అదేం పట్టించుకోకండి. వాడిని ఏమనకండి. ఇంకా చిన్నాడు. చిన్నప్పటి నుండి మీరు వాడిని సరిగా పట్టించుకోలేదని వాడు ఫీల్ అవుతున్నాడు. కాని ఎందుకు పట్టించుకోలేదనేది ఆలోచించడం లేదు. మీరు ఎంత కష్టపడి ఈ స్టేజ్ కి వచ్చారో వాడికి తెలిసినపుడు వాడే అర్థం చేసుకుంటాడు.” రాసి చూపించింది.

“వాడు మొదటిసారి ఎదిరించి మాట్లాడాడు. చూసావా?”

చిరు నవ్వు నవ్వింది.

“నవ్వుతావేంటి?”

“నాన్న తిట్టాడు అని చిన్నప్పుడు వాడు ఇలానే నాతో చెప్పుకున్నాడు. అది గుర్తొచ్చింది.” రాసి చూపించింది.

మౌనంగా సహస్రని చూస్తుండిపోయాడు.

***

కాలేజి కేంటిన్ లో కపర్ది ఒక్కడు కూర్చున్నాడు.

“ఏంటి కపర్ది, క్లాస్ కి వెళ్ళలేదా?” అనడిగాడు లెక్చరర్ గోవర్ధన్.

“లేటుగా వచ్చాను సార్. నెక్స్ట్ అవర్ అటెండ్ అవుతాను.” లేచి నిలబడి చెప్పాడు కపర్ది.

“సరే కూర్చో, ఇక్కడ కూడా అంత మర్యాదక్కర్లేదు” అంటూ తాను కూడా కూర్చున్నాడు గోవర్ధన్.

“మరి మీరు?”

“నేనా...” అని నవ్వి, “కాలేజి అంటే స్టూడెంట్స్ డుమ్మా కొట్టచ్చు గాని లెక్చరర్స్ కి కుదరదు కపర్ది, ఫస్ట్ అవర్ లేదు. స్టాఫ్ రూమ్ లో ఎవరూ లేకపోయేసరికి ఇలా కేంటీన్ కి వచ్చాను.” అన్నాడు.

నవ్వాడు కపర్ది.

“ఎలా ఉన్నారు మీ నాన్నగారు?” అనడిగాడు గోవర్ధన్.

“అందరూ మా నాన్ననే అడుగుతారేంటి సార్, ఒక్కరూ మా అమ్మ గురించి అడగరేంటి? సెలెబ్రటీ అన్నవాడు మాత్రమే మనిషా? మామూలువాళ్ళు కాదా?” అనడిగాడు. కపర్ది ప్రశ్నలకు అవాక్కై చూస్తుండుపోయాడు గోవర్ధన్.

కపర్ది కోపానికి కారణం అంతకు ముందు ఇంట్లో తండ్రితో జరిగిన వాదన! ఆ కోపం ఇలా బయటపడింది.

వెంటనే తేరుకుని “సారీ సార్... నా మూడ్ ఏమీ బాగోలేదు. అందుకే..” అంటుండగానే కపర్ది కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కపర్ది ఎందుకు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడో అర్థం కాక గోవర్ధన్ కి అయోమయంగా అనిపించింది.

తన మీద అరిచినందుకా... తను అడిగిన ప్రశ్నకా.. లేక ఇంకేమైనానా అనే ఆలోచనలో కపర్ధిని చూస్తూ ఉండిపోయాడు.

"కూల్ డౌన్ కపర్ది" అని కపర్ది చేతిని పట్టుకున్నాడు గోవర్ధన్.

కన్నీళ్ళు తుడుచుకుని "సారీ సార్, మిమ్మల్ని డిస్టర్బ్ చేసాను." అన్నాడు కపర్ది.

"ఏమైంది కపర్ది?" అనడిగాడు గోవర్ధన్.

"అందరు అనుకుంటున్నట్టు నా జీవితమేమీ పూల బాట కాదు సార్. రంగుల వేసిన ముళ్ళపై నడుస్తున్నాను. పైకి మాత్రమే అద్దాల మేడ. కాని ఆ అద్దాలు పగిలి ఎప్పుడో ఈ గుండెను ఛిద్రం చేసాయి సార్. చాలా సార్లు ఇంట్లోంచి వెళ్ళిపోవాలి అనుకున్నాను సార్, కాని మా అమ్మని చూసి ఉండిపోయాను. నిలబడలేను. పారిపోలేను. బతకాలేను. చావాలేను. ఆ... ఆ...ఆ..... ఫ్రస్ట్రేషన్ సార్. కోపం. కసి.. మెంటల్ ఎక్కిపోతోంది సార్. ఆఖరికి అడుక్కునేవాడు కూడా వాడి కొడుక్కి ఇంత ముద్ద పెట్టందే తినడు సార్. కనీసం ఆ అడుక్కునేవాడు, వాడి కొడుకు మీద చూపించే ప్రేమలో ఒక వంతు ప్రేమ నా మీద చూపించి ఉంటే నేను ఇలా ఉండేవాడిని కానేమో సార్. ఎవరైనా తండ్రితో కలిసి ఎక్కడైనా వెళ్తుంటే అది చూస్తున్న నాకు గుండె లోతుల్లో ఏదో తీరని లోటు. నరకంలా ఉంటోంది. ఇంతమంది అభిమానం సంపాదించుకున్న శ్రీశ్రీశ్రీ మహాదేవ గారు కన్న కొడుకు అభిమానం

పొందలేకపోయాడు సార్. కంటే తండ్రి అయిపోవచ్చుననుకుంటే జంతువులు కూడా...."

"కపర్ది..." అరిచాడు గోవర్ధన్. ఉలిక్కిపడ్డాడు కపర్ది. కేంటిన్ లో అందరూ వాళ్ళిద్దరినీ చూసారు. కపర్ది చుట్టూ చూసాడు. గోవర్ధన్ మాత్రం కపర్దినే సూటిగా చూస్తూ ఉన్నాడు. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. కపర్ది లేచి నిలబడ్డాడు. కపర్ది లేచి నిలబడుతున్నప్పుడు కళ్ళు మాత్రమే ఎత్తుతూ చూసాడు గోవర్ధన్.

"సారీ సార్" అన్నాడు తలొంచుకుని.

"మంచి మాట దానం లాంటిది. ప్రతిఫలంగా పుణ్యం అందిస్తుంది. చెడ్డ మాట అప్పు లాంటింది. ప్రతిగా వడ్డీ తీర్చాల్సివస్తుంది. మీ నాన్నగారి వల్ల నువ్వు ఇబ్బంది పడుండచ్చు, కాని నీ వయసుకు మించి మాట్లాడి నీ స్థాయిని దిగజార్చుకోకు."

"క్షమించండి సార్. కాని ఒక్క మాట, ఒడ్డున కూర్చున్నవాడికి ఉన్నంత కంఫర్ట్ ఓడలో ఉన్నవాడికి ఉండదు సార్." నెమ్మదిగానే చెప్పాడు.

"నీ కోపాన్ని నేను అర్థం చేసుకోగలను. కాని కోపంలో ఉన్నప్పుడు మౌనంగా ఉండటమంత ఉత్తమం మరొకటి లేదు."

"మౌనంగా ఉండటానికి ట్రై చేస్తాను సార్."

“ఆలోచిస్తుంటే, అంతకంటే ముందు నీకో డైవర్షన్ కావాలి. గో ఫర్ ఎనీ వెకేషన్..”

“దేనికి సార్.. ఆట మధ్యలో పిరికాడిలా పారిపోమంటున్నారా?”

“కాదు. ఆటవిడుపు తీసుకోమంటున్నాను.”

“అమ్మను వదిలి ఎక్కడికీ వెళ్ళేది లేదు సార్.”

నవ్వి “అమ్మ అంటే ప్రాణం పెట్టేవాడికి అంతా మంచే జరుగుతుంది కపర్ది” అన్నాడు గోవర్ధన్. బెల్ మోగడంతో ఇద్దరూ క్లాసెస్ కి వెళ్ళిపోయారు.

***

కపర్ది క్లాస్ లో కూర్చున్నాడు. లెసన్ అవుతుండగా “మే ఐ కమిన్ సర్?” అని అడిగింది ఓ అమ్మాయి. అందరూ గుమ్మం వైపు చూసారు. మెరూన్ కలర్ చుడిదార్ లో మెరుపు తీగలా ఉందా అమ్మాయి.

“యస్ కమిన్.. క్లాస్ కి ఇంత లేటుగానా వచ్చేది?” అడిగాడు లెక్చరర్.

“నేను న్యూ అడ్మిషన్ సార్.” చెప్పింది ఆ అమ్మాయి లోపలికి వచ్చి.

“ఓహో.. ఏం పేరు నీది?” అనడిగాడు లెక్చరర్.

“శ్రీజ..” చెప్పింది.

కపర్ది శ్రీజని చూస్తుండిపోయాడు. ఆమెను చూడకుండా ఉండటానికి తీవ్ర ప్రయత్నం చేసాడు. ఆమె కళ్ళు, ఆమె అందం అతన్ని చూపు

తిప్పనివ్వడం లేదు.

"కూర్చోమ్మా.." చెప్పాడు లెక్చరర్.

శ్రీజ వెళ్ళి కూర్చుంది. తెలియని ఆకర్షణేదో ఆమెలో తొణికిసలాడింది.

కపర్ది మనసు తనలో చెలరేగిన అలజడికి అర్థం వెతుక్కునే పనిలో నిమగ్నమైంది. మెదడు దానికి పేరు పెట్టడం కోసం ఆరాటపడుతోంది. ఆమెను చూస్తూ తనని తాను మైమరచిపోయాడు. ఒక్కసారిగా ఆమె వెనక్కి ఇరిగి చూసింది. కపర్ది తలొంచుకుని తాను తెచ్చిన పుస్తకంలోకి చూసాడు. శ్రీజ చిన్నగా నవ్వి మళ్ళీ లెక్చర్ వినడంలో మునిగిపోయింది.

***

మర్నాడు కాలేజీకి టైమ్ కి వెళ్ళిపోయాడు కపర్ది. కపర్ది స్నేహితుడు త్రినాథ్ తొందరగా వచ్చిన కపర్దిని చూసి ఈ రోజేనా ప్రళయం వచ్చి భూమి అంతమైపోతుంది అని చెప్పారు?" అనడిగాడు.

"ఎందుకలా?" అన్నాడు.

"నువ్వు తొందరగా వచ్చేసావ్ కదా.. ప్రళయం రాక ఇంకేమవుతుంది." అన్నాడు త్రినాధ్ నడుస్తూ.

కపర్ది నవ్వి "మామూలుగా వచ్చాను." అన్నాడు.

"అలాగా, నేను ఇంకా ఏదో ప్రత్యేక కారణంతో వచ్చావనుకున్నాలే..." వెటకారంగా అన్నాడు త్రినాథ్.

"సరే.. ఇప్పుడేమంటావ్.." అడిగాడు కపర్ది.

"నేనేమంటాను. అన్నట్టు కొత్తగా ఒక అమ్మాయి చేరింది చూసావా?" అడిగాడు ఓరగా చూస్తూ త్రినాధ్.

"హా, నిన్న క్లాస్ కి వచ్చింది కదా, గమనించాను." ఏమెరగనట్టు చెప్పాడు కపర్ది.

"ఓ, జస్ట్ గమనించావా!. ఆమె కూడా నిన్ను గమనించింది అంట. టాక్ ఆఫ్ ది క్లాస్" అన్నాడు త్రినాధ్.

"వునా.." ఆశ్చర్యం నటిస్తూ అన్నాడు కపర్ది.

"ఓరి బాబు.. నీ య్యాక్టింగ్ ఆపు. విషయం చెప్పు." అడిగాడు త్రినాధ్ డైరక్ట్ గా.

"చెప్పడానికేముంది.. ఆ అమ్మాయి బాగుంది." చెప్పాడు కపర్ది.

"ఐ.యస్.ఒ సర్టిఫికేట్ ఇమ్మనలేదు. నీకు నచ్చిందా?"

"హ్మ్. నచ్చిందా అంటే నచ్చింది."

"సరే, దా.."

"ఎక్కడికి?"

"క్లాస్ కి..."

"అప్పుడే ఎందుకు?"

“కరువు బాధితులను చూపిస్తాను.”

“అర్థం కాలేదు..”

“సినిమా చూడటానికి వెళ్తూ ట్రైలర్ ఎందుకు, పద..”

ఇద్దరు కలిసి క్లాస్ లోకి వెళ్ళారు. క్లాస్ లో అబ్బాయిలు అందరూ వచ్చేసారు. కపర్ది అందరినీ చూసాడు. కపర్ది, త్రినాథ్ లను అందరూ చూసారు.

“చూడు.. ప్రేమకరువు బాధితులు.. కొత్త అమ్మాయి కోసం.” చూపిస్తూ అన్నాడు త్రినాథ్.

“ఇదేంటిరా..?” కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు.

“నిన్న సీన్ ఒకసారి రివైండ్ చేస్తాను, జస్ట్ ఇమాజిన్ చేసుకో!! నిన్న నీతో పాటు అందరూ ఆమెనే చూస్తున్నారు. ఆమె వెనక్కి తిరిగి చూసేసరికి అందరూ పుస్తకాల్లో తల దూర్చేసారు. ఎవడి పెర్స్పెక్టివ్ లో వాడు వాడినే చూసింది అనుకున్నారు. వామ్మో... ఒక్క చూపు, ఒక్క నవ్వు ఇంత మందిని టైమ్ కి కాలేజ్ కి వచ్చేసేలా చేసిందంటే మామూలు చూపా అది..”

“తను నన్నే చూసిందనుకున్నాను.”

“అందరు అదే అంటున్నారు..”

“ఇప్పుడెలా?”

“ప్రస్తుతానికి కామ్ గా ఉండు.”

“వాడేంటిరా మెరుపుల షర్ట్ వేసుకొచ్చాడు.”

“మెరుపులు మెరిపిస్తాడట. వీడు వర్షాలు కురిపిస్తాడట. వాడు మబ్బులు విడగొట్టేస్తాడట. ఆ మూలన్నోడు అరచేత్తో సూర్యుడ్ని అడ్డు పెట్టి ఆమె అందం కందకుండా చూస్తాడట. ఈ బక్కోడు వీచే గాలుల్ని ఆపి ఎగురుతున్న ఆమె ముంగురులని సవరిస్తాడట. ఒక్కడు కూడా ప్రకృతిని ప్రశాంతంగా ఉంచేలా లేడు.” నిట్టూరుస్తూ అన్నాడు త్రినాధ్.

అంతలో ఆమె వచ్చింది.

రెప్పలు నెమ్మదిగా వేస్తూ ఒకడు. నోరు తెరిచొకడు. నవ్వుతూ ఒకడు. నిలబడి ఒకడు. ఒక్కొక్కడు ఒక్కోలా ఆమెను చూసారు. ఆమె అవేమి పట్టించుకోకుండా తన సీట్ లో కూర్చుంది. లెక్చరర్ వచ్చారు. లెసన్ స్టార్ట్ అయింది. ఆమె కళ్ళు బోర్డ్ వైపు, అందరి కళ్ళు ఆమె వైపు!!

“ఎందుకురా ఇలా పగబట్టారు నా మీద?” గుసగుసగా అడిగాడు కపర్ది.

త్రినాధ్ చెయ్యడ్డం పెట్టుకుని నవ్వుకున్నాడు.

***

క్లాస్ లో ఒక్కడూ ఉన్నాడు కపర్ది. ఎప్పుడొచ్చిందో తెలియదు శ్రీజ వచ్చి ఎదురుగా నుంచుంది.

నెమ్మదిగా కళ్ళెత్తి ఆమెను చూసాడు. ఆమె కళ్ళు అతని కళ్ళు కలిసాయి.

"ఐ యామ్ శ్రీజ.." చేయి అందించింది.

"కపర్ది.." చేయి కలిపాడు.

"కూర్చోవచ్చా?" అనడిగింది.

"యా.. ష్యూర్.." అన్నాడు. పక్కన కూర్చుంది.

"నీతో ఒక విషయం మాట్లాడాలి.." అంది.

"చెప్పు" అన్నాడు.

"నువ్వు ఎవరినైనా ప్రేమించావా?" అనడిగింది.

"అది.. అదీ..." అని నీళ్ళు నమిలాడు.

"నిజం చెప్పు కపర్ది.." అంది.

"అబ్బే, లేదు.. అయినా ఎందుకు?" కంగారు పడుతూ అన్నాడు.

"ఎందుకంటే నేను నిన్ను ప్రేమిస్తున్నాను కపర్ది." అంది.

కపర్ది మౌనంగా ఉండిపోయాడు.

"అవును కపర్ది, మొదటిసారి నిన్ను చూసినప్పుడే ప్రేమించాను. నేను అంటే నీకు ఇష్టమా?" అనడిగింది.

***

కపర్ది చెవి దగ్గర అలారం మోగించింది లలితా సహస్ర. అలారం వినపడేసరికి ఉలిక్కిపాటున లేచాడు. కంటున్న కలను కళ్ళు మింగేసాయి. సహస్ర నవ్వుతూ కాలేజీకి టైం అవుతోంది అని సైగ చేసింది.

అమ్మ ముఖం చూస్తూ నవ్వుతూ లేచాడు.

"ఏంటి విషయం?" సైగ చేసింది.

మళ్ళీ నవ్వాడు, ఏమీ లేదన్నట్టుగా..

"ఏదో ఉంది." అన్నట్టుగా చూసింది.

"శ్రీజ.." రాసి చూపించాడు.

అహా.. అన్నట్టుగా కళ్ళు పెద్దవి చేసింది.

"బాగుంటుందా?" సైగ చేసింది.

"చాలా బాగుంటుంది." అన్నాడు.

నవ్వింది.

"సరే, రెడీ అవ్వు, ఆమె వచ్చేస్తుందేమో!!" రాసింది.

***

కపర్ది కాలేజ్ కి వెళ్ళేసరికి లెక్చరర్ ఇంకా రాలేదు. తన బెంచ్ లో కూర్చున్నాడు.

“చూసావా. ఫుల్ అటెండన్స్.. ఇలా ఎప్పుడైనా వచ్చారా మనోళ్ళు.” అన్నాడు త్రినాధ్.

“ఇప్పుడేం చేద్దాం..”

“చేద్దాం కాదు. నువ్వు చేయాలి.”

“ఏం చేయాలి?”

“అందరికీ నువ్వు లవ్ చేస్తున్నట్టు లీలగా తెలియాలి.”

“లీలగానా....!! గోల అయిపోతుందేమో..”

“ఎలాగోలా చెప్పి తీరాలి. లేకపోతే తీరంలోనే మిగిలిపోతావ్.”

ఆలోచనలో పడ్డాడు కపర్ది.

క్లాస్ లో అందరూ శ్రీజ గురించి ఎదురుచూస్తున్నారు.

పది నిమిషాలకి ఆమె వచ్చింది. లోపలికి వస్తున్న ఆమెకు ఎదురెళ్ళి నిలబడ్డాడు కపర్ది. క్లాస్ లో ఉన్నవాళ్ళందరూ అవాక్కై చూస్తుండిపోయారు. కపర్దిని చూస్తూ ఆమె నిలబడిపోయింది.

“ఇన్నాళ్ళు ఎక్కడున్నావ్?” అనడిగాడు.

“సారీ....” అంది.

“నా దారికెందుకు అడ్డొచ్చావ్?”

“నువ్వే నా దారికడ్డొచ్చావ్.”

“సారీ..” అని దారిచ్చాడు. ఆమె దారి చూసుకుంటూ వెళ్ళి తన సీట్ లో కూర్చుంది. త్రినాధ్ తల గోక్కున్నాడు.

శ్రీజ పక్కనున్న అమ్మాయి ఆమెతో “కపర్ది నీకు లైన్ వేస్తున్నాడేమోనే..” అంది.

“లైనా... నీకేలా తెలిసింది..”

“బాబుగారి బాడీ లాంగ్వేజ్ అర్ధమవడం లేదేంటి! నీ లైన్ మేన్ వాడే!”

“వద్దులే.. వాడు లైన్ వేస్తున్నాడో లేదో తెలుసుకోవాలని తిరిగి చూస్తే నేను రెస్పాన్డ్ అవుతున్నానేమో అని అనుకుని ఇంకొంచెం ఆశలు పెంచుకుంటాడు.”

“అదేంటే.. కపర్దికేమి తక్కువ.. పైగా పాటలు రాసే మహాదేవగారి కొడుకు.”

“అయితే?”

“ఆస్థి అంతస్థులు ఉన్నాయి. నువ్వు చెపితే నమ్మవు, ఒక్క చెడ్డ అలవాటు కూడా లేదు.”

“ఇవన్నీ నాకెందుకు చెప్తున్నావ్?”

“కపర్దిలాంటివాడు భర్తగా రావాలంటే పుణ్యం చేసుకోవాలి.”

“కపర్దికి బంగారం, బంగళాలుంటే చాలా? కపర్ది తండ్రి రచయిత అయితే అది ఆయన గొప్పతనం, అందులో కపర్ది గొప్ప ఏముంది? లాజికల్ గా ఆలోచించు, మనందరం ఒకే క్లాస్ లో ఉన్నాం. అప్పుడు కపర్ది నీకు గొప్పగా ఎలా కనపడుతున్నాడు. డబ్బుంటే చెడలవాట్లు ఉండాలా? అదేమైనా క్వాలిఫికేషనా? అతని హెల్త్ పట్ల అతనికి జాగ్రత్త ఉంది. అంతే!. ఒక్కమాట, ప్రేమ లేని చోట డబ్బు, అందం ఎంత మాత్రమూ ఉపయోగపడవు.”

“నీకు చెప్పడం నాది బుద్ధి తక్కువ..”

“తక్కువ కాదు అవసరమైనదాని కంటే ఎక్కువైంది. నిజంగా నేను కపర్దిని పెళ్ళి చేసుకుని ఏ యూరప్ ట్రిప్ కో వెళ్తే కుళ్ళుకు చస్తావ్ కదే. మరెందుకే ఈ ఉచిత సలహాలు.”

“నీకో నమస్కారమే బాబు..” ఇంక వాదించలేక దండం పెట్టింది.

***

రానురాను శ్రీజ స్నేహితురాలు చెప్పినట్టుగానే కపర్ది ఆమెను చూడటం, ఆమె కోసం ఎదురు చూడటం, ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించడం చేసేవాడు. మొదట్లో అంత సీరియస్ గా తీసుకోకపోయినా క్లాస్ లో కపర్ది శ్రీజని ఇష్టపడుతున్నాడని టాక్ వచ్చింది. ఇది ఇలానే వదిలేస్తే అతని మనసులో తనపై ఉన్న ఇష్టం మరింత నాటుకుపోతుందని భావించి సరైన సమయం కోసం ఎదురుచూసింది.

ఆమె ఎదురుచూస్తున్న సమయం ఆమెకి తొందరగానే ఎదురుపడింది.

నోట్స్ రాసుకుంటూ కపర్ది ఒక్కడూ క్లాస్ లో కూర్చుని ఉన్నాడు. అతనికి దగ్గరకి వెళ్ళి ఎదురుగా నిలబడింది. రాసుకుంటున్నవాడు ఆపి తలెత్తి ఆమెను చూసాడు. చుట్టూ చూసాడు, ఎవరూ లేరు. మళ్ళీ ఆమెను చూసాడు. తనకొచ్చిన కల నిజమవబోతోందా అని అనిపించింది కపర్దికి.

"నీతో మాట్లాడాలి?" అంది.

నెమ్మదిగా తలాడిస్తూ "చెప్పు. దేని గురించి?" అనడిగాడు.

పక్కన కూర్చుంటూ "నేనేమనుకుంటున్నానో చెప్పే ముందు నువ్వేమనుకుంటున్నావో అడగాలనుకుంటున్నాను."

"సరే.. అడుగు."

"నువ్వు నన్ను ఇష్టపడుతున్నావని క్లాస్ లో అనుకుంటున్నారు, నీకా విషయం తెలుసా?"

"తెలుసు.."

"నిజమేనా?"

"నిజమవకూడదని అడుగుతున్నావా? నిజమైతే బాగుంటుందని అడుగుతున్నావా?"

అతన్ని చూస్తూ మౌనం వహించింది.

కాసేపాగి “అది అబద్ధమైతే మన స్నేహం కొనసాగుతుందని చెప్పాలనుకుంటున్నాను.”

“నిజమైయుంటే?”

“ఇష్టాలు మారతాయి కపర్ది. ప్రేమ కాదు. నాకు ఈ రోజు ఇష్టం అనిపించింది, రేపు అనిపించకపోవచ్చు. నీకు అర్ధమయ్యేలా చెప్పనా, చిన్నప్పుడు నాకు సున్నుండలంటే ఇష్టముండేది, ఇప్పుడు పోయింది. కాని చిన్నప్పటి నుండి ఉన్న మా బావ మీద ప్రేమ ఇప్పటికీ పోలేదు.” అని చెప్పి లేచి నిలబడింది.

కపర్ది మౌనంగా ఉండిపోయాడు.

“అర్ధం చేసుకుంటావని అనుకుంటున్నాను.” అని చెప్పి వెళ్ళిపోయింది.

***

శ్రీజ వెళ్ళిపోయాక కపర్ది దీర్ఘాలోచనలో పడిపోయాడు. గట్టిగా కళ్ళు మూసుకుని తల విదిలించాడు.

బెల్ మోగింది. స్టూడెంట్స్ అంతా క్లాస్ కి వచ్చారు. లెక్చరర్ రాగానే క్లాస్ స్టార్ట్ అయింది.

కపర్ది ఇంకా అదే ఆలోచనలో ఉండిపోయాడు. నిజానికి కపర్ది, శ్రీజ మాట్లాడిన దగ్గరే స్టక్ అయిపోయాడు. తల్లి గుర్తొచ్చింది. క్లాస్ అవుతుండగానే లేచి బయటకు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న కపర్దిని చూసింది శ్రీజ.

విసురుగా ఇంట్లోకి వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు. ఇంటికొచ్చిన కొడుకును తలెత్తి చూసి రాసుకోవడంలో మునిపోయాడు మహాదేవ.

లలితా సహస్ర కొడుకు దగ్గరకు వచ్చి కూర్చుని 'ఏమైందన్నట్టుగా' సైగ చేసింది. ఇబ్బందిగా నవ్వాడు.

"ఏమి జరిగిందో చెప్పు.." సైగ చేసింది.

పేపర్ మీద లవ్ సింబల్ వేసి, ఆ కాగితాన్ని నిలువునా చింపేసాడు. సహస్రకి అర్థమైంది.

ఆ చిరిగిన ముక్క తీసుకుని ఆ సగమైన హాఫ్ సింబల్ ని అడ్డంగా తిప్పి ఇన్ఫినిటీగా మార్చింది.

"నువ్వు ప్రేమలో జీవితం ఉందనుకుంటున్నావ్. కాని జీవితంలో ప్రేమ ఒక పార్ట్ అంతే! లివ్ టు లవ్ కాదు లవ్ టు లివ్." అని రాసి చూపించింది.

తన జీవితంలో ఏదీ కపర్దికి సంతృప్తినిచ్చేదిగా కనపడేది కాదు. అన్ని విషయాలలో అతనికి తల్లే ఆలంబన అయింది. బాధొస్తే ఓదార్చింది. ఓటమొస్తే వెన్నుతట్టింది. ఆమె మనసు ఎప్పుడూ కపర్దితో మాట్లాడుతూ ఉండేది. తల్లే ఊరట అయింది. తల్లే బాసట అయింది.

***

గుండె చప్పుడు చెయ్యదెప్పుడు నువ్వు ఉన్నప్పుడు

కనురెప్ప చప్పుడు వినిపించెనిప్పుడు నువ్వు లేనప్పుడు

అప్పుడెప్పుడో మనసు ఎప్పుడో మేఘమైనప్పుడు

ఇప్పుడిప్పుడే కురిసెనిప్పుడే ప్రేమ వర్షమైనప్పుడు .......

"ఎలా ఉంది పల్లవి?" అనడిగాడు మహాదేవ.

"బాగుందండి.." రాసింది సహస్ర.

"ఏంటి అంత నీరసంగా ఉన్నావ్?" అనడిగాడు.

"కొంచెం తలనొప్పిగా ఉంది.." సైగ చేసింది.

"పోనీ రెస్ట్ తీసుకోవెళ్ళి.."

"కపర్ది వస్తాడు భోజనానికి, అందుకే ఎదురు చూస్తున్నాను." రాసింది.

"వాడు వచ్చి తింటాడులే.. అయినా నీరసంగా ఉన్నదానివి ముందు నువ్వు తినేయచ్చు కదా.."

"వాడు వస్తే తిందామని ఆగాను. ఒంటరిగా తినడం అలవాటు లేదు." రాసింది.

"నన్ను పరోక్షంగా అంటున్నావా?"

"కాదన్నట్టుగా తలూపింది"

కపర్ది వచ్చాక అందరు కలిసి భోజనం చేసారు.

***

ఒకరోజు కళ్ళు తిరిగి పడిపోయింది లలిత సహస్ర. పడిపోయినపుడు అమాంతంగా వెళ్ళి తల మెట్టుకు కొట్టేసుకుంది. వెంటనే పెద్ద బొప్పి కట్టింది. వంటవాడు చూసి కేకలు వేయడంతో పనివాళ్ళందరూ సాయం పట్టి సోఫాలో పడుకోబెట్టారు. ముఖం మీద నీళ్ళు చల్లి లేపి కొంచెం నీళ్ళు పట్టించారు. ఆ సమయంలో మహాదేవ, కపర్దిలు ఇంట్లో లేరు. కపర్ది వచ్చేసరికి విషయం చెప్పారు. పరుగున తల్లి గదిలోకి వెళ్ళారు.

“ఏమైంది.. ఎలా పడిపోయావ్?”

“కళ్ళు తిరిగాయి అంతే.. కంగారు పడకు..” రాసి చూపించింది.

“ఇంత బొప్పికడితే కంగారుపడద్దంటావేంటి, పద హాస్పిటల్ కి.”

“కాపడం పెడితే తగ్గిపోతుంది…” అని రాసింది.

“మొండిగా చేయకు.. పదా…” అని చెప్పి అప్పటికప్పుడు హాస్పిటల్ కి తీసుకెళ్ళాడు.

డాక్టర్స్ కంగారు పడాల్సిందేమీ లేదని చెప్పి మందులు రాసి పంపారు.

***

ఆ తరువాత ఆమెకు మైగ్రేన్ రావడం మొదలైంది. విపరీతమైన తలనొప్పితో బాధపడేది. తల పట్టుకుని గంటలు గంటలు ఏడ్చేది. ఉండే కొద్దీ మనిషి నీరసపడిపోసాగింది. చిక్కి శల్యమైపోయింది. తింటే సయించేది కాదు. ఉండే కొద్దీ పరిస్థితి మరీ అద్వానంగా అవసాగింది. ఎన్ని మందులు వాడినా లాభం లేక పోయింది. పెద్ద పెద్ద డాక్టర్స్ ఇంటికొచ్చి చూసెళ్ళేవారు. మందులు మార్చి రాసారు. మహాదేవ కూడా చాలా కంగారు పడ్డాడు.

మహాదేవతో చనువున్న ఒక డాక్టర్, సహస్ర బెడ్ రెస్ట్ తీసుకోవాలని చెప్తూ "మనసు బాగోనపుడు మందులు పని చేయవు మహాదేవగారు. ఆమె మనసులో ఏదో పెట్టుకున్నారు. అదేంటో కనుక్కోండి. ఆమెకు ఇప్పుడు కడుపులో పెట్టుకుని ఉన్న ఏదో బెంగ పోవాలి. ఆమెకు ఏదో తెలియని భయం పట్టుకుంది. అది పోగొట్టే ప్రయత్నం చేయండి. అలా చేస్తే ఆమె మామూలు అయ్యే అవకాశం ఉంది."

"సరే డాక్టర్," అని చెప్పాడు మహాదేవ.

భార్య దగ్గరకి వెళ్ళి "నీకు ఆరోగ్యం బాగానే ఉందట.. మనసులో ఏదో పెట్టుకుని ఇలా అయిపోయావట.. నిజమేనా?" అనడిగాడు.

చిన్నగా నవ్వింది.

"నిజమేనా? దేని గురించి బెంగ?" అని ప్రశ్నించాడు.

చూపుడు వేలుతో మహాదేవని చూపించింది.

"నా గురించా?" ఆశ్చర్యంగా చూసాడు.

అవునన్నట్టుగా తలూపింది.

"నా గురించి బెంగదేనికి?"

"మీకు, కపర్దికి వంతెన లాంటి దాన్ని, ఈ వంతెన తెగిపోతే మీ ఇద్దరి మధ్య సంబంధాలు తెగిపోతాయాని.." అంది.

"అదేమీ లేదు. కపర్దికి నేను అంటే ఇష్టమే.. వాడంటే నాకు కూడా, నువ్వేమీ టెన్షన్స్ పెట్టుకోకు సరేనా.." అని చెప్పి ఆమెను రెస్ట్ తీసుకోమని దుప్పటి కప్పి ఆమె గదిలోంచి బయటకు వచ్చాడు.

ఆలోచిస్తే ఆమె చెప్పింది నిజమేనని మహాదేవకి అర్థమవసాగింది. అతని గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది. తనకు తెలియకుండానే తనకి తన కొడుక్కి మధ్య ఎంత దూరం ఏర్పడిపోయిందో తెలిసొచ్చింది. గతాన్ని తలచుకుంటే సన్మానాలు, సాహితీ సభలు, అవార్డులు, రివార్డులు, బిరుదులు, గజమాలలు, తన మీద వ్యాసాలు, అభిమానుల ఉత్తరాలు, కొడుకెక్కడో మూలన నుంచుని కోపంగా చూస్తూ..!!

***

ఏది ఏమైనా మందులు మాత్రం టైమ్ కి వేసుకోవాలని మరీ మరీ చెప్పారు డాక్టర్స్. తలనొప్పి పెరిగిపోతే చాలా ప్రమాదం అని హెచ్చరించి వెళ్ళారు.

కపర్దికి పరీక్షలు మొదలవడంతో ఉదయం పరీక్ష రాసి, మధ్యాహ్నానికి ఇంటికి వచ్చి తల్లికి మందులిచ్చి చూసుకునే వాడు.

చివరి పరీక్షరోజు, ప్రాజెక్ట్ సబ్మిట్ చేయాలి, పైగా దానికి సంబందించిన వైవా కూడా అటెండ్ చేయాలి.

తండ్రి దగ్గరకి వెళ్ళి "నాన్నా.." పిలిచాడు.

"చెప్పు.." అన్నాడు మహాదేవ రాయడానికి సిద్ధమవుతూ..

"అమ్మకి రెండు గంటలకొకసారి మందులివ్వాలి. నేను సాయంత్రం వచ్చేసరికి లేట్ అవ్వచ్చు."

"ఓ, అదా.. నేను చూసుకుంటాలే.."

"థాంక్స్ నాన్న.. మర్చిపోకండి. పది అయింది. ఒంటిగంటకొకటి.. నాలుగింటికొకటి.. ఏడింటికొకటి. నేను ఆరు అయ్యేసరికి వచ్చేస్తాలే.. ఒంటిగంట మాత్ర, నాలుగింటి మాత్ర వేయండి."

"అలాగేలేరా.. నువ్వెళ్ళు.."

కపర్ది కాలేజ్ కి వెళ్ళిపోయాడు.

మహాదేవకి అప్పుడే అర్జెంట్ గా పాట రాయాలని ఒక డైరక్టర్ నుండి కాల్ వచ్చింది.

"సిట్యువేషన్ చెప్పు.."

"అనుకోని కారణాల వలన భార్య చనిపోతుందండి. కాని ఆమె భర్త ఎవరు చెప్పినా మరో పెళ్ళి చేసుకోకుండా పిల్లల్ని పెద్ద చేసి వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. ఇదంతా మాంటేజల్ లో చూపిస్తూంటే బాక్ గ్రౌండ్ లో సాంగ్ రన్ అవుతుంది." అంటు వివరంగా కధనంతా చెప్పుకొచ్చాడు డైరక్టర్. మహాదేవ రాయడం మొదలు పెట్టాడు. రాస్తున్నాడేగాని అస్సలు కుదరడం లేదు. చిత్తుకాగితాల్లా రాసిందంతా చింపి పాడేస్తున్నాడు. టైం ఒంటిగంట అయింది. డైరక్టర్ మళ్ళీ ఫోన్ చేసాడు అయిందేమో అడగడానికి, "అయ్యాకా నేనే చెప్తాను." అని చెప్పాడు. టైం రెండు దాటింది. నిద్రపోతున్న సహస్రకి మెలకువ వచ్చింది. నీరసంతో పైకి లేవలేకపోయింది. పిలవడికి నోరు లేకపోయింది. నెమ్మదిగా ఆమెకు తలనొప్పి ప్రారంభమైంది. కిటికివైపు కూర్చుని బయట ఉన్న గార్డెన్ చూసుకుంటూ రాసుకుంటున్నాడు మహాదేవ. మరో పక్క కపర్ది ప్రాజెక్ట్ సెమినార్ ఇస్తున్నాడు. మహాదేవ ఒళ్ళు మర్చిపోయి తదేకంగా రాస్తున్నాడు. ఆలోచనలమీద ఆలోచనలు చేస్తున్నాడు. గదిలో సహస్ర తలనొప్పితో తల్లడిల్లిపోతోంది. బాధతో మెలికలు తిరిగిపోతోంది. మహాదేవ రాస్తున్నాడు, అడ్డంగా స్ట్రైక్ ఆఫ్ చేసి నలిపి పారేస్తున్నాడు. సమయం నాలుగు దాటిపోయింది. కపర్ది సెమినార్ పూర్తి అయింది.

"యు కెన్ గో నవ్.." అని చెప్పారు ప్రొఫెసర్స్.

కపర్ది ఇంటికొచ్చేసరికి మహాదేవ రాసుకుంటూ కనిపించాడు. కిటికి బయట నుండి మహాదేవని చూసి ఆయన వెనకాలే మంచం మీద పడుకుని ఉన్న తల్లిని చూసాడు.

“అమ్మా...” పిలిచాడు లోపలికి వస్తూనే.

పలుకలేదు.

“అన్ని పరీక్షలు అయిపోయాయి. ఇంక ఇంట్లోనే..” అన్నాడు. మహాదేవ రాసింది తిరిగి చదువుతున్నాడు. బాగా వచ్చేసరికి మురిసిపోతున్నాడు.

ఎంతకీ కళ్ళు తెరవకపోయేసరికి కపర్దికి ఎందుకో భయమనిపించింది. కొంచెం పరీక్షగా సహస్రని చూసాడు. ఆమె ఒళ్ళు అంతా చెమటతో తడిసింది. నుదుటిమీద నరాలు పైకి ఉబికి వచ్చాయి. కపర్ది గుండె వేగంగా కొట్టుకుంది. వణుకుతున్న చేతులతో ఆమె నుదుటి మీద చేయి ఆంచాడు. చల్లగా అనిపించింది. ఒక్కసారిగా ఒళ్ళు జల్లుమంది. ముక్కు దగ్గర వేలుంచాడు. గాలి తగలలేదు. అతని కళ్ళ నీళ్ళు వచ్చాయ్. రాసింది బాగా వచ్చేసరికి మహాదేవ కుర్చీలోంచి లేచి గదివైపు నవ్వుతూ వస్తూ మంచం పక్కన తల్లిని చూస్తూ ఉన్న కపర్దిని చూసాడు. అప్పుడు గుర్తొచ్చింది మహాదేవకి మందులు వేయడం మర్చిపోయాడని.

“కపర్ది...” పిలిచాడు మహాదేవ.

పలకలేదు. “కపర్దీ..” మళ్ళీ పిలిచాడు.

“అమ్మకి మందులు ఇచ్చారా?” అడిగాడు రాలుతున్న కన్నీళ్ళతో.

“మందులూ..” నీళ్ళు నమిలాడు మహాదేవ.

“ఇచ్చారా లేదా?” మళ్ళీ అడిగాడు.

“అయినా ఒకసారి మిస్ అయినా ఏం పరవాలేదు, ఇప్పు.....” ఏదో చెప్పబోయాడు.

“అమ్మ చచ్చిపోయింది.” చెప్పాడు గద్గధ స్వరంతో.

నిశ్చేష్టుడై నిలబడిపోయాడు మహాదేవ. అప్రయత్నంగా కళ్ళు పెద్దవయ్యాయి. వెంటనే కాల్వలుగా మారాయి.. ధారగా కన్నీరు ఉబికివచ్చింది.

“నేను ఇలా అవుతుందనుకో...” అని చెప్తుంటే “ఎందుకు చంపేసారు అమ్మని...” గొంతు పెంచుతూ అడిగాడు కపర్ది.

“కపర్ది...” అన్నాడు మహాదేవ.

“అవును.. మీరే అమ్మని చంపేసారు. ఎందుకు చంపావో చెప్పూ....” అరుస్తూ లేచి మహాదేవ కాలర్ పట్టుకున్నాడు కపర్ది.

“మీ అమ్మ చెప్పింది నిజమే.. వంతెన తెగిపోయింది..” అన్నాడు మహాదేవ.

పట్టుకున్న కాలర్ వదిలేసి వెనక్కి నెట్టాడు. తల్లి దగ్గర కూర్చుని గుండెలు పగిలేలా రోదించాడు. కార్యం పూర్తి చేసాడు.

సహస్ర పోయి నెల కూడా పూర్తవకుండా మహాదేవ మళ్ళీ తన వ్యాపకంలో మునిగిపోయాడు. కపర్ది ఏదో జీవశ్చవంలా బతుకీడుస్తున్నాడు. సహస్ర బతికుంటే ఆమెకు తను రాసింది చదివి వినిపించేవాడు, కాని ఆమె లేకపోయేసరికి కొడుక్కి చెప్పుకుందామని భోజనం చేస్తున్న కపర్దిని అడిగాడు. కపర్దికి ఓపిక నశించింది. కోపం కట్టలు తెంచుకుంది. ఉన్న బంధాన్ని తెంచేసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోయాడు.

***

గీత కపర్దిని చూస్తూ ఉండిపోయింది. కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ పక్కకి తిరిగాడు కపర్ది.

“ఎప్పుడూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నానని చెప్పే నాన్నకి అమ్మ ఎప్పుడూ రెండో ప్రయారిటీనే అయింది. అసలు అమ్మ, నాన్న పెళ్ళి చేసుకోకుండా ఉండాల్సింది. చేసుకున్నా నేను వాళ్ళకు పుట్టకుండా ఉండాల్సింది.” అని ఏడుస్తూ గోడ మీదున్న ఇటుకతో ఇన్ఫినిటీని గీసాడు.

గీత, కపర్ది దగ్గరకి వచ్చి అతని భుజంపై చేయి వేసింది. కపర్ది అక్కడి నుండి వెళ్ళిపోయాడు. బయట కపర్ది చెప్పిందంతా మనోహర్ కూడా విన్నాడు. కపర్ది వెళ్ళిపోయాక గీత దగ్గరకు వచ్చి నుంచున్నాడు. ఆమె

కన్నీళ్ళు తుడుచుకుని మనోహర్ ని చూసి లేని నవ్వుని పెదాలపై పులుముకుంది.

“ఆడది ఏడిస్తే సముద్రాలు నిండిపోతాయే లేవో తెలియదు కాని మగాడు ఏడిస్తే మాత్రం సముద్రాలు ఎండిపోతాయి.” అని చెప్పాడు మనోహర్.

గీత వెళ్ళిపోయాక మనోహర్ షూటింగ్ కి బయలుదేరాడు. శ్రీజ వచ్చినప్పుడు "కాబోయే డైరక్టర్ వి, ఎవరు ఎప్పుడు కాల్ చేస్తారో ఎవరికి తెలుసు! అవకాశాలు వస్తుంటాయి కదా! మిస్ చేసుకుంటే ఎలా?" అంటూ ఫోన్ ఇచ్చి వెళ్ళింది. ఆమె సంకల్ప బలమో ఏమో గాని మనోహర్ కి ఫోన్ రింగ్ అయింది.

"హలో.."

"హలో.. మాట్లాడేది మనోహరా?"

"అవునండి.. ఎవరూ.."

"నువ్వు ఇప్పుడు పని చేస్తున్న సినిమాకి కో-ప్రొడ్యూసర్ నయ్యా.."

"సార్... చెప్పండి సార్," మనోహర్ కళ్ళు మెరిసాయి. తన అక్కడ అసిస్టెంట్ డైరక్టర్ గా పని చేస్తునే, ఎందుకైనా మంచిదని తను తీసిన షార్ట్ ఫిల్మ్స్ ని ఆ కో-ప్రొడ్యూసర్ కి ఇచ్చాడు. అతన్ని ఆ ఫిల్మ్స్ చూసి అభిప్రాయం చెప్పమని అడిగాడు. తన దగ్గర అద్భుతమైన కథ ఉందని, తన వర్క్ నచ్చితే కాంటాక్ట్ అవమని ఫోన్ నంబర్ ఇచ్చాడు.

"చూసానయ్యా.." అన్నాడా ప్రొడ్యూసర్.

"సార్.."

"కలుస్తావేంటి మరి?"

“సార్.. కలుస్తాను సార్..” కళ్ళు తడిసాయి.

“షూటింగ్ చూసుకుని ఆఫీస్ కి వచ్చేయ్ మరి,”

“సరే సార్.. వస్తాను సార్. థ్యాంక్యు సార్” గొంతు గద్గమైంది.

వెంటనే శ్రీజకి ఫోన్ చేసాడు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేసింది.

“శ్రీజా....” అరిచాడు.

“చెప్పవోయ్, ఏంటి డైరక్టర్ గారు హుషారుగా ఉన్నారు” అంది.

“చాన్స్ వచ్చేసేలా ఉందీ....” సాగదీస్తూ అరుస్తూ చెప్పి, ప్రొడ్యూసర్ ఫోన్ చేసిన విషయం చెప్పాడు.

“వెరీ గుడ్ బావ.. చాలా హ్యాపీ! కంగ్రాట్యులేషన్స్ బావ.. కాన్ఫిడెంట్ గా ఉండు. కంగారుపడకుండా కథ చెప్పు. ఒకె అయితే నీకో సర్ప్రైస్ గిఫ్ట్” అంది.

“ఒకె.. ఒకె. నాన్నకు చెప్పు.”

“చెప్తాను..” అని చెప్పి ఫోన్ పెట్టేసింది. అక్కడే ఉన్న మనోహర్ తండ్రి శ్రీజ మాటలు విని అర్థం చేసుకున్నాడు.

“మావయ్యా..” నెమ్మదిగా పిలిచింది.

కూర్చునే కళ్ళెత్తి చూసి “ఇప్పుడే బయటకు వెళ్ళొస్తాను.” అని లేచి నుంచున్నాడు. ఆమె, మావయ్యను చూస్తు “అదేంటి మావయ్యా, బావ ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నాడు,..” అని ఏదో చెప్పబోయింది.

దగ్గరకు వచ్చి ఆమె తల మీద చేయి వేసి “ఒక మనిషి గెలిచాక వెనక నిలబడటం గొప్ప కాదమ్మా, ఆ మనిషి గెలవడంకోసం వెన్నుతట్టడంలో ఉంది గొప్పతనం. నా కొడుకు విషయంలో నా కంటే నువ్వే ఒక మెట్టు పైనే నిలబడ్డావు. వాడు గెలిస్తే ఆ గెలుపు నీది కూడా.” అని వెళ్ళిపోతూ ఆగి “శ్రీజా…” పిలిచాడు.

“మావయ్యా,”

“థ్యాంక్స్ అమ్మా.. ఇది అంతా నీ వల్లే..” అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆమె కళ్ళు తడిసాయి, మావయ్య కళ్ళల్లో నీళ్ళు చూసాక!!

***

మర్నాడు బాలరాజు రూమ్ కి వచ్చేసరికి తలుపు గడి పెట్టి ఉంది. నిద్ర కళ్ళతో తలుపు తీసాడు. బాలరాజు పడుకోవడం కోసం పక్క సద్ది షూటింగ్ కి వెళ్ళిపోయాడు మనోహర్. పక్కనే తినడానికి అన్నీ సిద్దం చేసి ఉంచాడు. పక్క మీద కూర్చుని గిన్నెలు మూత తీసి చూసాడు. ఒక దాంట్లో ఉప్మా ఉంది. వేరే వాటిల్లో కూర, సాంబార్ ఉన్నాయి. ఉప్మా తినేసి పడుకున్నాడు. మధ్యాహ్నం అయ్యేసరికి కపర్ది రూమ్ కి వచ్చేసాడు. నిద్రపోతున్న బాలరాజుని లేపాడు.

“బాలరాజు…” పిలిచాడు.

నిద్ర మత్తులో అటు ఇటు మెదిలాడు.

“బాలరాజు, లే, భోజనం చేద్దాం..”

లేచి కూర్చున్నాడు బాలరాజు.

"హలో బాస్, కాలేజ్ కి వెళ్ళలేదా?"

"వెళ్ళాను.. వచ్చేసాను."

"మానేసావా?"

"మానేయలేదు. ఉండబుద్దవలేదు, అందుకే పర్మిషన్ తీసుకుని వచ్చేసాను. వెళ్ళి ఫేస్ వాష్ చేసుకో. తినేద్దాం"

"సరే బాస్,"

ఫ్రెష్ అయ్యి వచ్చి కంచం ముందు కూర్చునే సరికి అన్నీ వడ్డించాడు కపర్ది.

"మీరు చాలా గ్రేట్ బాసు. నాలాంటి వాడికి వండి పెట్టేసి వెళ్ళే వాడొకడు. వడ్డించే వాడొకడు." అన్నాడు బాలారాజు.

తలెత్తి చూసాడు కపర్ది.

"వేరేగా అర్ధం చేసుకోకు.. నిజం చెప్పనా బాసు, మనోహర్ వచ్చాకనే మధ్యాహ్నం అన్నం తింటున్నాను. లేకపోతే సాయంత్రం ఎప్పుడో వచ్చే శ్రీనుగాడితో కలిసి తినడమే! వాడెలా ఉన్నాడో ఏంటో!?" తలుచుకుంటూ చెప్పాడు బాలరాజు.

"శ్రీను గురించి టెన్షన్ ఏమీ పడకు. హి ఈజ్ ఫైన్.." చెప్పాడు కపర్ది.

"హ్మ.." అని కాసేపాగి "కపర్ది..." అని పిలిచాడు నెమ్మదిగా

"చెప్పు బాలరాజు." అన్నాడు కపర్ది.

"నాకు వాడిని చూడాలని ఉంది.. ఒకే కడుపున పుట్టకపోయినా కలిసి కష్టాలు పంచుకున్నాం." ఎటో చూస్తూ అన్నాడు బాలరాజు.

"ఈరోజు వెళ్తావా?" అనడిగాడు కపర్ది సూటిగా చూస్తూ.

"ఇప్పటికిప్పుడు అంటే మా ఓనర్ లీవ్ ఇవ్వడు." అన్నాడు బాలరాజు.

"ఉద్యోగం మానేసేయ్..." సింపుల్ గా చెప్పాడు కపర్ది.

"మానేసి.." ఆశ్చర్యంగా చూసాడు బాలరాజు.

"నీకు హైదరాబాద్ లో శ్రీనుకిలానే జాబ్ చూస్తాను. చేసుకో.." సమాధానమిచ్చాడు కపర్ది.

"మరి నువ్వు?" ప్రశ్నించాడు బాలరాజు.

"నేను ఇక్కడే ఉంటాను." అని చెప్పాడు కపర్ది.

"కొంపతోసి నువ్వేమైనా సీక్రెట్ ఏజెంట్ కాదు కదా. సీక్రెట్ మిషన్ కోసం ఇక్కడికి వచ్చి కామ్ గా నీ పని పూర్తి చేసుకుంటున్నావా?" అనుమానంగా అడిగాడు బాలరాజు.

"నువ్వు కొత్త కథ అల్లకు.. నువ్వు చూస్తున్నది నన్నే, వేరే సీక్రెట్ ఏమి లేదు." నవ్వుతూ చెప్పాడు కపర్ది.

“అయితే రైటర్ మహాదేవగారి అబ్బాయేనంటావ్, అంతేనా?” అన్నాడు మంచినీళ్ళు అందుకుని నోట్లో పోసుకుంటూ.

“అవును..” అన్నాడు కపర్ది తనకి తెలియకుండానే. ఆ మాట అన్నాక బాలారాజుని చూస్తూ ఉండిపోయాడు కపర్ది.

గిన్నెలో మిగిలిన అన్నం పెట్టుకుంటూ కూర వేసుకుంటూ, దాన్ని కలుపుతూ తనలో తనే మాట్లాడుకుంటున్నట్టుగా “మీ ఫాధర్ గొప్ప రైటర్ బాసు. తమిళంలో కూడా పాటలు రాసారట. అలాంటాయనకు పుట్టడం నీ అదృష్టం. అంత గొప్పోడికి పుట్టీ మాలాంటోళ్ళకి హెల్ప్ చేస్తున్నావ్ అంటే మామూలు విషయమా? చెప్పు” అని అడిగాడు బాలరాజు.

కపర్ది మనసు ‘అవును’ అన్న దగ్గరే స్టక్ అయిపోయింది. ఏదో ట్రాన్స్ లో ఉన్నట్టుగా బాలరాజుని చూస్తూ ఉండిపోయాడు. తన జీవితంలో తెలిసి, తెలియక ఎప్పుడూ మహాదేవని తండ్రిగా ఒప్పుకున్న దాఖలాలు ఒక్కటి కూడా లేవు. కపర్ది ఎప్పుడూ తన తల్లి ద్వారానే ఐడింటెఫై అవ్వాలని కోరుకున్నాడేగాని మహాదేవ కొడుకుగా గుర్తింపబడాలని అస్సలు అనుకోలేదు. కాని ఈ క్షణం అతను అవునని అనడం మనసులో ఏదో తెలియని అనిశ్చితి.

కపర్ది ముఖం ముందు చేయి ఊపుతూ “హలో..బాస్!” అని అన్నాడు.

“హా....” అంటూ తేరుకుని బాలరాజుని చూసాడు.

“ఏంటా డే డ్రీమ్?” అనడిగాడు బాలరాజు.

“ఏమీ లేదు పీడ కల...” అని లేవబోయాడు కపర్ది.

“కూర్చో బాసు. కంచం మీంచి లేవకూడదు, మా అమ్మ చెప్పింది.” అన్నాడు బాలరాజు.

మౌనంగా కూర్చున్నాడు.

“అన్నం ముందు అబద్దాలు చెప్పకూడదు అంటారు బాసు. అందుకే నా ఫ్లాష బాక్ చెప్తాను, సరదాగా విను. యాక్చువల్ గా మామూలుగా సినిమాల్లో అయితే మంచిగా మంచింగ్ పెట్టుకుని మందు తాగుతూ చెప్పే ఫ్లాష్ బాక్ లాంటిదే. ఇలా బోజనాల ముందు చెప్తున్నందుకు ఏమీ అనుకోకు. సిట్టింగ్, సెట్ అప్ వేరైనా శాడ్ ఫీలింగ్ కామన్.” అన్నాడు బాలరాజు.

కపర్ది అలానే చూస్తున్నాడు. మునుపెన్నడూ బాలారాజు ఏ విషయానికి అంతలా రియాక్టవలేదు. కాస్త మంచి నీళ్ళు తాగి చెప్పడం ప్రారంభించాడు.

“నాకు మా అమ్మే నాకు అన్నం తినిపించేది. నాకు, నాన్నకు కూడా!! చాలా ఆనందంగా ఉండేవాళ్ళం. నాన్న మాకు తెలియకుండా ఎక్కడో అప్పు చేసాడు. రానురాను ఇల్లు గడవడం ఇబ్బంది అయ్యేది. ఓరోజు స్కూల్ కి వెళ్ళి ఇంటికి వచ్చేసరికి ఇంటి చుట్టూ జనం. ఏం జరిగిందో అర్థమవుతూ అర్థం కాని వయసు! దూలానికి వేళ్ళాడుతున్న ఇద్దర్నీ దించుతున్నారు. అప్పు అవసరాలు తీర్చడమే కాదు ప్రాణాలు కూడా తీస్తుంది అని అప్పుడు

తెలిసింది. ఆ తరువాత నుండీ ఆకలి వేసినప్పుడల్లా అమ్మ గుర్తొచ్చేది. అమ్మ గుర్తొచ్చిన్నప్పుడల్లా నాన్న గుర్తొచ్చేవాడు. ఇద్దరు గుర్తొచ్చినపుడు నేనొక అనాధనని గుర్తొచ్చేది. అమ్మానాన్నలు కావాలంటే దొరకరు బాసు, కోరుకుంటే పొందేవారు కాదు. ఉన్నప్పుడు చూసుకోవాలి. లేనప్పుడు చూసుకుందామన్నా అవకాశం ఉండదు. ఎందుకంటే అమ్మా, నాన్నలను సెలక్ట్ చేసుకునే ఛాన్స్ మనకి లేదు. మనల్ని సెలెక్ట్ చేసుకునే అవకాశం వాళ్లకి లేదు. ఏదీ మన చేతుల్లో ఉండదు. చేతుల్లో ఉన్నదాన్ని చేజార్చుకోకూడదు. ఎందుకంటే కాలం, ప్రాణం పోతే తిరిగిరావు." అని చెప్పి కంచం ముందు నుండి లేచాడు బాలరాజు.

బాలరాజు చెప్పిందంతా మౌనంగా విన్న కపర్ది, ఇదంతా తనకి ఎందుకు చెప్పాడా అని ఆలోచనలో మునిపోయాడు. ఎంగిలి కంచం బయటపెట్టి, చేతులు కడుగుకుని వాటిని కర్టెన్ తో తుడుచుకుంటూ "నీ ఫ్లాష్ బాక్ తెలిసాక నా ఫ్లాష్ బాక్ చెప్పలనిపించింది కపర్ది." అని చెప్పాడు బాలరాజు. కపర్ది గతాన్ని మనోహర్ బాలరాజుకి మాటల్లో చెప్పాడు.

"నమస్తే సార్" అన్నాడు మనోహర్.

"రావయ్యా, కూర్చో" అని కుర్చీ చూపించాడు ప్రొడ్యూసర్.

వినయంగా కూర్చున్నాడు. అక్కడ ప్రొడ్యూసర్ తో పాటు ఇంకో ఇద్దరు కూర్చున్నారు. వాళ్ళకు పరిచయం చేసాడు. వారిలో ఒకరు కో-డైరక్టర్, మరొకరు పి.ఆర్.ఒ.

"నువ్వు రాసిన కథ చదివామయ్యా.. బాగుంది."

"థ్యాంక్స్ సార్.."

"హీరో ఎవరనుకుంటున్నావ్?"

"మూవీ అంతా కొత్త వాళ్ళతో తీద్దామని ప్లానింగ్ సార్."

"కొత్తోళ్ళతోనా...!" అనడిగాడు కో-డైరక్టర్.

"అవునండి."

"ఎందుకు?"

"అంటే, కాలేజ్ స్టోరీ కదా సార్, కొత్త వాళ్ళతో ఆయితేనే ఫ్రెష్ గా ఉంటుంది."

"అది చాలా రిస్క్ అవుతుందేమో.."

"రిస్క్ అవదని అనుకుంటున్నాను సార్, కొత్త వాళ్ళు కనక ఎలా అయినా బాగా చేయాలని కసితో పని చేస్తారు. పైగా వాళ్ళకు ఇచ్చే

రెమ్యూనేషన్ కూడా బడ్జెట్ లో చేయచ్చు. పబ్లిసిటీకి కొంచెం ఎక్కువ మనీ స్పెండ్ చేస్తే మనకు థియేటర్స్ కి ఆడియన్స్ ఆటోమేటిక్ గా వస్తారు. నమ్మండి సార్, కచ్చితంగా మన సినిమా మంచి సక్సెస్ అవుతుంది. నా కథ మీద నాకున్న నమ్మకం సార్." అన్నాడు కుర్చీలోంచి ముందుకు జరుగుతూ..

"కొత్తోళ్ళు అంటే నమ్మకం కుదరడం లేదయ్యా.." అన్నాడు ప్రొడ్యూసర్.

"అవును.. వర్క్ అవుట్ అవుతుందని నేను అనుకోవడం లేదు.." వంత పాడాడు కో-డైరక్టర్.

వాళ్లను చూస్తూ ఆలోచనలో పడిపోయాడు. లోపల గుండె కొట్టుకోవడం స్పష్టంగా వినపడుతోంది. ఇప్పుడు ఎదురు మాట్లాడితే వచ్చిన అవకాశం పోవచ్చు. కాదని వారి మాట ఒప్పుకుంటే తాను అనుకున్న అవుట్ పుట్ రాదు, పైగా ఆల్రెడీ ఎస్టాబ్లిష్ అయిన నటులు అంటే కథలో మార్పులు చేర్పులు చేయాల్సి రావచ్చు. కథలో ఉండే సోల్ మొత్తం హీరోయిజాలు చూపించడం వైపు మళ్ళిపోతుంది. అదే గనక జరిగితే మనోహర్ అసలు టేస్ట్ ఏంటో ప్రేక్షకులకు వేరేగా అర్థమయ్యే అవకాశం ఉంది. అప్పుడు తరువాత సినిమా ఏమైనా కొత్తగా ట్రై చేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకోకపోవచ్చు. చిన్నప్పుడెప్పుడో చదువుకున్న 'ది రోడ్ నాట్ టేకెన్' అన్న ఇంగ్లీష్ పోయమ్ గుర్తొచ్చింది. ఆ పోయమ్ లో హీరో ఒక Y జంక్షన్ లా ఉన్న చోట నిలబడి

ఉంటాడు. ఒక రోడ్ మంచిగా ఉంటుంది. మరొకటి రాళ్ళు, ముళ్ళు ఉండే బాట ఉంటుంది. హీరో ముళ్ళ బాటనే ఎంచుకుంటాడు. నిర్ణయం తీసుకున్నవాడిలా వాళ్ళ వైపు చూసాడు.

"ఈ కథ కొత్తవాళ్ళతో తీస్తేనే బాగా వస్తుంది అని నమ్ముతున్నాను సార్. పైగా మీరు పది రూపాయలు పెడితే పన్నెండు రూపాయలు వచ్చేలా చేసే పూచి నాది సార్." ఆఖరి సారి విషయం చెప్పాడు.

"సరే.. ఆలోచించుకుని కబురంపుతాను." అన్నాడు ప్రొడ్యూసర్ సాలోచనగా.

అక్కడి నుండి రూమ్ కి వెళ్ళిపోయాడు మనోహర్.

***

సాహిత్యరంగంలో చేసిన కృషికి ఫలితంగా మహాదేవకి పద్మశ్రీ ఇస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. మహాదేవ అభిమానులు, శ్రేయోభిలాషులు సంబరాలు చేసుకున్నారు. తెలిసిన వాళ్లందరూ మహాదేవకి అభినందనలు తెలిపారు. విరించి కూడా స్నేహితుడు పొందిన అవార్డ్ కి చాలా సంతోషించాడు. తనతో విరించి ఉండగా ఈ అనౌన్స్మెంట్ జరగడం మహాదేవకి కించింత్ ఆనందం కలిగించింది. అదే సమయంలో కొడుకు లేకపోవడం అంతే బాధను కలిగించింది. మనిషి జీవితమే అంత! సంతోషాలను బాధలను తూకం తూచి ఇస్తుంది.

"చాలా సంతోషంగా ఉందిరా.." అన్నాడు విరించి.

“మన విజయం మనకి సంతోషాన్ని ఇవ్వకపోతే దాన్నేమంటారు?” అనడిగాడు మహాదేవ.

రెప్ప వాల్చకుండా మహాదేవని చూసాడు.

“అలా చూస్తావేంటిరా..? జవాబు చెప్పు.” అనడిగాడు మహాదేవ.

“మన విజయం మనకి సంతోషాన్ని ఇవ్వలేదంటే, మనం కోరుకునే సంతోషం అంతకు మించి ఏదో ఉందని అర్థం.” అని చెప్పాడు విరించి.

విరించిని చూస్తుండిపోయాడు మహాదేవ.

“అలా చూస్తావేంటి? ఆన్సర్ నచ్చలేదా?” అనడిగాడు విరించి.

“ఎక్కడా నచ్చే ఆన్సర్, నచ్చని ఆన్సర్ అని ఉండవు. కరక్ట్ ఆన్సర్, రాంగ్ ఆన్సర్ అని ఉంటాయి.” అని చెప్పాడు మహాదేవ.

విరించి నవ్వి, “నువ్వేం కోరుకుంటున్నావో, నీకు ఏది సంతోషాన్నిస్తుందో నాకు తెలుసురా.” అన్నాడు నెమ్మదిగా.

ఆ మాట విని కుర్చీలో తల వెనక్కి వాల్చాడు మహాదేవ. గుండెల మీద చేయి వేసుకుని “నా గుండెతో వాడికున్న బంధం, నా ఇంటిలో వాడికున్న స్థానం, నా ఆస్థిలో వాడికున్న వాటా, నా చావులో వాడికున్న భాద్యత తెలిస్తే ఎంత బాగుంటుంది.”

“ఏంటిరా ఆ మాటలు,”

“కొడుకు బాధ్యత లేకుండా తిరిగితే తండ్రికి కోపం ఉంటుంది. కాని తండ్రే లేడనుకుని తిరిగితే ఆ తండ్రికి చావాలని ఉంటుంది.” అన్నాడు మహాదేవ కన్నీరు బయటకు కనపడకుండా.

“పిచ్చిపిచ్చిగా మాట్లాడకు, అన్నీ సద్దుకుంటాయి. కపర్దికి కూడా నువ్వంటే ప్రేమ ఉంది. దాన్ని చూపించే అవకాశంగాని, ఆస్కారంగాని అతనికి కలగలేదు.” ధైర్యం చెప్పాడు విరించి.

“చాలా లౌక్యంగా మాట్లాడుతున్నావ్ రా, నేను నా పనుల్లో బిజీ అయిపోయి వాడితో సరిగా ఉండలేకపోయాననే కదా చెప్తున్నావ్?” అనడిగాడు అలానే సీలింగ్ ని చూస్తూ.

విరించి సాలోచనగా ముందు వంగి “కపర్ది ప్రవర్తన బట్టి చూస్తే జరిగింది అదే అని నేను అనుకుంటున్నాను, కాదని చెప్పడానికి నీ దగ్గర ఆధారాలున్నాయా?” అని సూటిగా ప్రశ్నించాడు.

కాసేపాగి “నిజామే, సహస్ర ఉన్నంత కాలం వాడి బాగోగులు చూసుకునేది. ఆమె ఉంది కదా అనే ధీమాతో నేను వాడిని అంతగా పట్టించుకోలేదు. అలా అని వాడి మీద ప్రేమ లేక కాదు.” బదులు చెప్పాడు మహాదేవ.

“ఇలా అంటున్నానని మరోలా అనుకోకు, ఏదైనా తీవ్రతకి మించింది అయిుండకూడదు. నువ్వొక కళా పిపాసివిరా. అది జీవితాన్ని ఒక పార్శ్వంలో

మెరిసేలా చేసింది. మరో పార్శ్వంలో మునిగేలా చేసింది. అందుకే నాదొక సలహా, కొంతకాలం నీ రాతలకి విరామం ఇవ్వు, నీ కొడుకు కోసం ఏమన్నా చేయి..” అని చెప్పాడు విరించి.

“వాడికోసం నేనేమి చేయగలను?” అనడిగాడు మహాదేవ.

“పెళ్ళి చేయి, నీకభ్యంతరం లేకపోతే నా కూతురు...” సందిగ్ధంలో ఆగిపోయాడు విరించి.

కూర్చున్న మహాదేవ చప్పున లేచాడు. చివుక్కున తలెత్తి మహాదేవని చూసాడు విరించి. తాను కూడా లేచి నుంచున్నాడు. నెమ్మదిగా కిటికీవైపు నడిచి గార్డెన్ ని చూస్తూ “నిజానికి నేను వచ్చిన కారణం నా కూతురు నాతో కపర్దిని ఇష్టపడుతున్నానని చెప్పింది. ఆ విషయం చెప్పడానికని వచ్చాను. నీ పరిస్థితిని ఆసరగా వాడుకుని నేను ఈ పెళ్ళి ప్రస్థావని తీసుకురాలేదు. జెన్యూన్ గానే అడిగాను. నాకు తెలుసు నువ్వు తలుచుకుంటే పెద్ద పెద్ద సంబంధాలు నీ కొడుకు కోసం తేగలవు. కాని నా కూతురు నాతో చెప్పినదాని బట్టి చూస్తే నీ కొడుకు కూడా నా కూతుర్ని ఇష్టపడుతున్నాడని నాకనిపించింది. నా కూతురు మీదున్న ప్రేమ, నీతో ఉన్న స్నేహం, కపర్ది మీదన్న నమ్మకం నన్ను ఇక్కడి వరకు వచ్చేలా చేసాయి. నేనొచ్చిన కారణం విడిగా జీవిస్తున్న కపర్దిని నా కూతుర్ని కలిపి తద్వారా విడిపోయి జీవిస్తున్న నిన్ను కపర్దిని కలపాలని! కొంచెం అత్యాశే, కాని మనిషి ఆశాజీవి కదా.. ఏదో జరగాలని ఎప్పుడూ తాపత్రయ పడుతుంటాడు. నేను అడిగిన దాంట్లో నా

స్వార్థం ఏమైనా ఉంటే నిర్మొహమాటంగా నీ అభిప్రాయాన్ని చెప్పేయ్." అన్నాడు విరించి.

విరించి చెప్పిందంతా విని "ఇందులో నీ స్వార్థం ఏముందిరా. అయినా వాడు నాకు చెప్పి ఎందుకు పెళ్ళి చేసుకుంటాడు? ఆ అవసరం గాని అలాంటి అవకాశం గాని లేనే లేదు. వాడికి నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకునే హక్కు వాడికుంది అది నీ కూతురైనా, ఏ అమ్మాయైనా.. నా అనుమతితో పని లేదు." అన్నాడు మహాదేవ.

"ఒకవేళ నీ కొడుకు నా కూతుర్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటే అది నీ సమక్షంలోనే జరుగుతుంది." అని చెప్పాడు విరించి.

"ఆశకి కూడా హద్దుండాలి.. వాడు అందుకు ఒప్పుకోవాలిగా.." నిరాశగా పలికాడు మహాదేవ.

అందుకు విరించి "నా కూతురు మామగారి చేతులు మీదగానే పెళ్ళి జరగాలి అని కండిషన్ పెడితే!!?" అన్నాడు మహాదేవ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

కాలేజికి నుండి వస్తుంటే కపర్దికి గీత ఎదురైంది. ఆమెను చూసి ఆగాడు.

"ఇంటికేనా?" అనడిగాడు.

"అవును.." అని చెప్పింది.

"సరే పద.. నాకూ చిన్న పని ఉంది." అని నడిచాడు.

"నేనెందుకు నువ్వెళ్ళు."

"మీ ఇంటికెళ్ళే దారిలోనే నాకు పని ఉంది."

"అయితే.. నేనెందుకు నీతో రావాలి?"

"ఎందుకంత కోపం?"

"నాకెందుకు కోపం... అసలు నేనెవరు నీ మీద కోప్పడడానికి ?"

"ప్రతివారికి సొంత అభిప్రాయాలుంటాయి. సొంతంగా నిర్ణయం తీసుకునే అధికారమూ ఉంటుంది."

"అందుకే నీ దారిన నువ్వు వెళ్ళు.. నా దారిన నేను వెళ్తాను."

"ఒకే దారి అయినపుడు కలిసి వెళ్ళచ్చు కదా.."

"కలిసి నడవాలంటే కరము పట్టుకొనవలె ..." నవ్వుతూ అంది.

"పట్టుకొననియెడల ..." నవ్వాపుకుంటూ అడిగాడు.

మౌనంగా చూసి “ఇది కరచాలనమేగాని, పాణిగ్రహణము కాదు.” అంది.

ఆమెను చూసి చేయందుకున్నాడు. ఆమె అతని చేయిని గట్టిగా ఒత్తి పట్టుకుంది. ఆ క్షణంలో ఆమె కళ్ళల్లో తెలియని వెలుగు, ఆమె పెదవుల్లో అందమైన నవ్వు, ఆమె గుండెల్లో తేలిక... “ఈ సమయం ఇలా ఆగిపోతే ఎంత బాగుంటుంది.” తనలో తను అనుకున్నట్టుగా అంది.

ఆమె చేయిని వదిలేయాలనుకున్నాడేమో “వదిలేయకు కపర్ది, నా ప్రేమ నీకు ఎలా అర్ధమవుతుందో నాకు తెలియడంలేదు. అమ్మ మీద ప్రేమ నాన్న మీద కోపంగా మారిందంటే అర్ధముంది, కాని నా మీద ప్రేమ కలగకపోవడానికి నీ దగ్గరేమైనా సరైన సమాధానం ఉందా? కనీసం నీకన్నా ఎందుకు నన్ను వద్దన్నావో తెలుసా? ఎంతకాలం నిన్ను నువ్వు మోసం చేసుకుంటావు? ఆ రోజు బస్ స్టాండ్ లో నీకు నా ప్రేమ గురించి చెప్పినపుడు , నీ కళ్ళల్లో కనిపించిన ప్రేమ ఇప్పటికీ గుర్తుంది. అబద్దం చెప్పి దాచాలనుకోకు. నిజం చెప్పు!!” అని అడిగింది.

ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబివ్వకుండా మౌనంగా నడక సాగించాడు. ఆమె ఇంటికి చేరుకున్నాక అతని చేయి విడిచింది. తలుపు తాళం తీసి “లోపలికిరా కపర్ది..” అని ఆమె ముందు లోపలికి వెళ్ళింది.

ఇంటిలో విరించి గీసిన చిత్రపటాలు చాలానే ఉన్నాయి. అన్నీ ఒక మూలగా పెట్టి ఉన్నాయి. రెండు మాత్రం గోడకు ఉన్నాయి.

ఒకటి ధరణిది, మరొకటి గీతది.

వాటిని చూస్తూ ఉన్న కపర్దితో ధరణి చిత్రపటం దగ్గరకు వెళ్ళి “అమ్మ పిక్చర్, నాకు పదేళ్ళప్పుడు స్కూల్ లో పేరెంట్స్ మీటింగ్ అయితే అందరూ వాళ్ళ వాళ్ళ అమ్మానాన్నలతో వచ్చారు. నాతో నాన్న మాత్రమే వచ్చారు. అప్పుడు అమ్మ కావాలని ఏడ్చాను. నాన్న అమ్మ రాదని, దేవుడి దగ్గరకు వెళ్ళిపోయిందని ఎంతో నచ్చజెప్పి ఓదార్చాలని చూసారు. కాని నేను ఏడుస్తునే ఉన్నాను. చేసేది లేక అమ్మని చూపిస్తాను అన్నారు. ఎలా చూపిస్తావ్ అనడిగాను. ఏడవకుండా పడుకుంటే పొద్దున్న అమ్మని చూపిస్తాను అన్నారు. నేను నిద్రపోయాను. ఆ రాత్రంతా నిద్రపోకుండా అమ్మ బొమ్మ గీసారు. అమ్మ పోయిన పదేళ్ళ తరువాత కూతురి కోసం గుండెల్లో దాచుకుని ఉన్న ఆమె రూపాన్ని గీసారు. ఎంత ప్రేమ ఉంటే అలా చేయగలరు. మర్నాడు ఉదయం నేను లేవగానే నా కళ్ళు మూసి అమ్మ ఫొటో దగ్గరకు తీసుకువచ్చి చేతులు అడ్డం తీసి చూపించారు. అమ్మని నేను చూసినప్పుడు నన్ను చూసి నాన్న కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నారు. ఒక చేతిలో అమ్మ ఫొటో. మరో చేత్తో నన్ను దగ్గరకు తీసుకుని హత్తుకున్నారు. ‘ఏడవకు నాన్నా... అమ్మ చాలా బాగుంది నాన్నా..’ అంటుంటే ఆయన ఆనందంతో నా నుదుటి మీద ముద్దు పెట్టుకున్నారు.” అని చెప్పి కపర్దిని చూసింది. ఆమె కళ్ళల్లో చిరు తడి. ఆమె

పరిస్థితితో కంపేర్ చేసుకుంటే కపర్ది పరిస్థితి చాలా బెటర్ అని అతనికి అనిపించింది. కనీసం అతను అమ్మ ప్రేమను పొందగలిగాడు. ఆమెకు ఆ భాగ్యం కలగలేదు.

నిజమే కష్టం కంపేర్ చేసుకుంటే మనసు తేలికపడుతుంది. ఆకలితో పడుకునే వాళ్ళని తలచుకుంటే తినే పచ్చడి మెతుకులైనా పరమాన్నంలానే ఉంటుంది.

గీత తన ఫొటోని చూస్తూ "ఇది నేను పన్నెండేళ్ళప్పుడు.. నాన్న నా పుట్టినరోజున పావుగంటలో గీసి ఇచ్చిన బొమ్మ. చాలా బాగున్నాను కదా. నాకు ఈ గౌను అంటే చాలా ఇష్టం. ఈ డ్రస్ ఇప్పటికీ దాచుకున్నాను. చూపించనా?" అని చెప్పి కపర్ది బదులు కూడా ఎదురు చూడకుండా బీరువా తెరిచి ఆ గౌనుని బయటకు తీసి కపర్దికి అందించింది. కపర్ది ఆ గౌనుని చూసి "అచ్చం బొమ్మలోలానే ఉంది." అన్నాడు.

"ఇదే బొమ్మలో వేసారు. " అంది.

"హా.. యస్.. యస్.. మీ నాన్న చాలా గ్రేట్ చూడు, చిన్న లైన్ కూడా మిస్ చేయలేదు. ఎంత డీప్ గా అబ్సర్వ్ చేస్తే ఇలా ఉన్నదున్నట్టు వేయగలరు." అన్నాడు. తన తండ్రిని తను ప్రేమించినవాడు మెచ్చుకోవడం ఏ అమ్మాయికైనా చాలా నచ్చుతుంది. అందులోనూ తండ్రే ప్రపంచంగా

బతుకుతున్న గీతకి మరింత ఆనందం కలిగించింది. మనస్ఫూర్తిగా నవ్వింది. అతను కూడా తిరిగి నవ్వాడు.

"నువ్వు నవ్వితే బాగుంటావ్ కపర్ది." అంది. ఆమె పొగడ్తకి సిగ్గనిపించినా బయటపడకుండా "ఇంటికొచ్చిన అతిథికి ఏమైనా ఇచ్చేది ఉందా లేదా?" అనడిగాడు.

"కాఫీ ? ఆర్ టీ ?" అనడిగింది జుట్టుపైకి ముడి వేస్తూ.

"కాఫీ.." అని చెప్పాడు.

"సరే.. పది నిమిషాలు.." అంటూ తను వేసుకున్న చున్నీ తీసి కుర్చీ మీద వేసింది. ఒక్క క్షణం ఆమెను చూసి తలొంచుకున్నాడు. నిజానికి గీత చాలా అందంగా ఉంటుంది. తలపైకి ముడి వేసుకుని క్లిప్ పెట్టుకుని ఉన్న గీతను చూసిన కపర్దికి మనసులో తెలియని అలజడి రేగింది. చేతివేళ్ళను జుట్టులోంచి పోనిచ్చి పక్కనే ఉన్న పుస్తకాన్ని తీసాడు. అదంతా తమిళంలో ఉండేసరికి ఉత్త ఫొటోలను మాత్రం చూస్తూ పేజీలను తిప్పాడు.

"అర్థం చేసుకునే మనుషులు పక్కన ఉన్నప్పుడు అర్థం కాని పుస్తకలు తిరగేస్తావేంటి , నాతో మాట్లాడచ్చు కదా!" అనడిగింది వంటింటి గుమ్మం దగ్గర నిలబడి.

ఆమెలా గుమ్మానికానుకుని నిలబడి ఉంటే ఆమె ఒంపుసొంపులన్నీ అతనికళ్ళకు ఇంపుగా అనిపించాయి. రెప్పవాల్చకుండా ఆమెనే చూసి

“చెప్పు.. ఏం మాట్లాడను?” అనడిగాడు.

“నిజం చెప్పనా.. నువ్వు చాలా బోరింగ్ కేండేట్ వి కపర్ది. నీకు నేను అయితేనే సరిపోతాను. వేరే ఏ అమ్మాయి చేసుకున్నా నిన్ను భరించలేదు.” అని చెప్పింది నవ్వుతూ.

ఆమె చెప్పినదానికి నవ్వి “నేను ఇంట్రోవర్ట్ ని., తొందరగా కలవలేను.” అని చెప్పాడు.

“అదే నేను చెప్పేది. ఏదో ఒకటి తేల్చమని.” అంది కాఫీ కప్ అందిస్తూ.

కప్ అందుకుని అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఆమె కూడా ఎదురుగా కూర్చుంది.

“నాకు చాలా ఎక్సైటింగ్ గా ఉంది. నీతో కలిసి ఇలా కాఫీ తాగుతుంటే..” అంది. నవ్వాడు.

అతని మనసులో కూడా చాలా ఎక్సైటింగ్ గా ఉంది. అంత అందమైన అమ్మాయి తన గురించి ఇంతలా ఆలోచిస్తూ తనకంటే ఎక్కువగా ప్రేమిస్తూ మాట్లాడుతుంటే లోపల మనసు ఉబ్బి తబ్బిబ్బైపోతోంది. ఆ ఆనందాన్ని ఉత్సాహాన్ని బయటపెట్టకుండా ఉండటానికి సాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ఆమె కాఫి సిప్ చేస్తుంటే ఆమె పెదవులను, మింగుతుంటే ఆమె కంఠాన్ని, చూస్తుంటే అతని మెదడు అప్పటికే అదుపు తప్పి హృదయపు లోయలో పడిపోయింది. ఇంకొంచెం కిందకు చూడాలని ఉన్నా సంస్కారం వద్దని

చెప్తుంటే వయసు చూడమని అల్లరి చేసింది. కళ్ళు దించబోయాడు, “హలో.. ఏంటి?” అనడిగింది అరచేతి ఆకాశం వైపుంచి వేళ్ళను చూపిస్తూ. “అబ్బే, ఏమీ లేదు, కప్ మీద కొటేషన్ చూస్తున్నా..” అన్నాడు. ఆమె ప్రశ్నకు కొంచెం ఇబ్బందిగా కదిలాడు. ముఖ్యంగా ఆమె చేతి పొడవాటి వేళ్ళు .. అవి ఇందాక అతని చేయిని పట్టుకున్నప్పుడు అతని మనసు గాలిలో ఊగిసలాడింది. ఆమె మాట్లాడుతున్నప్పుడు భలే అందంగా వేళ్ళను కదుపుతూ ఉంటుంది. అప్పుడు ఆమె కళ్ళు, ఆమె పెదవుల కదలికలు కాలాన్ని ఆపేసి చూడమన్నట్టు, అదేదో మంత్రం వేసినట్టు చూపు తిప్పుకోనీయకుండా చేస్తాయి.

గీత ఎప్పుడూ ఏవేవో కబుర్లు చెప్తూ ఉంటుంది. ఆమె కపర్దితో ఉన్నప్పుడు అయితే చాలా విషయాలు షేర్ చేసుకుంటుంది. అది పనికొచ్చేదా కాదా అనేది ముఖ్యం కాదు. తను ప్రేమించిన వాడితో గడిపే పది నిమిషాలైనా కంప్లీట్ గా మైండ్ పెట్టి మాట్లాడుతుంది. మధ్యలో ఎటువంటి ఫోన్ కాల్స్ వచ్చినా అటెండ్ చేయదు. అంత ప్రయారిటీ ఇచ్చి మాట్లాడుతుంది. ఇద్దరు కాఫీ తాగారు. అతను తాగిన గ్లాస్ అందుకుని లోపల సింక్ లో పెట్టి ఆ గ్లాస్ లో నీళ్ళు పట్టి చేతులు కడుకుని హాల్ లోకి వచ్చింది.

“చెప్పు ఇంకా?” అంది.

“మామూలే...” అన్నాడు.

అతన్ని సూటిగా చూసి “నీకు నేనంటే లోకువ కదా..” అనడిగింది.

“ఛ..ఛ.. అదేం లేదు.” అన్నాడు.

“అలానే అంటావ్, ఖచ్చితంగా ఉంటుంది.” అంది.

“నిజంగా లేదు.” అన్నాడు.

“అయితే రేపు మనకి పెళ్ళి అయ్యాక ఎవరు ముందు ప్రొపోస్ చేసారు అంటే నువ్వే చేసానని అందరికీ చెప్పాలి.” అంది సీరియస్ గానే.

“నేనెందుకలా చెప్తాను. నువ్వు ప్రొపోస్ చేసావ్ కదా..” అన్నాడు మామూలుగా.

“చూసావా.. మేల్ ఈగో. ఒప్పుకోలేకపోతున్నావ్.” అంది.

“అబద్ధం ఎందుకు చెప్పాలి అంటున్నాను. నువ్వు ప్రొపోస్ చేస్తే ఏంటి? నేను ప్రొపోస్ చేస్తే ఏంటి?” అనడిగాడు.

“అదే బాబు.. నువ్వు ప్రొపోస్ చేస్తే ఏంటి! నేను ప్రొపోస్ చేస్తే ఏంటి! అందుకే నువ్వే చెప్పానని చెప్పు. రియల్ గా నేనే చేసాను కదా.. అదెలాగో మనకు తెలుసు.” సమాధనమిచ్చింది.

“నేనేం చెప్పను. అది ఈ విషయంలో అస్సలు చెప్పను.” బల్లగుద్ది చెప్పాడు.

“సరే. కనీసం మన పిల్లలు పెద్దవాళ్ళు అయ్యాక వాళ్ళకైనా నన్ను చెప్పుకోనీ ముందు నువ్వే ప్రొపోస్ చేసావని.” అంది ప్లీడింగ్ గా.

"హ్మ్.. ఆలోచిద్దాం..." అన్నాడు నవ్వుతూ.. నవ్వుతూ ఉన్నవాడు ఒక్క క్షణం ఆగి ఆమె కళ్ళలోకి చూసాడు. ఆమె కళ్ళు ఎంత ప్రేమగా చూస్తున్నాయంటే అతని హృదయం ద్రవించడానికి సిద్ధమైపోయింది. ఇప్పటివరకు తను ఎలాంటి సంభాషణ చేసాడో తలచుకుని అతని లోపల మనిషి సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు. బయట మనిషి భయం నటిస్తూ "సారీ.." అని చెప్పబోయాడు.

ఆమె దగ్గరగా వచ్చి అతని నుదుటి మీద జుత్తును పైకి జరిపి ఆమె పెదవులు ఆంచి ముద్దు పెట్టుకుంది. ఆ ముద్దు చప్పుడు అతని మనసుని కుదిపేసింది. ఆమె పెదవుల స్పర్శ అతని గుండెను తడిపేసింది. నెమ్మదిగా వెనక్కి జరిగి మోకాళ్ళ మీద కూర్చుని అతని కళ్ళలోకి చూసింది. ఆమెకు ఆ క్షణంలో వచ్చిన కన్నీరు అతని మనసును చిత్రవధ చేసింది. అతని లోపలున్నవాడు గిల్ట్ ఫీలింగ్ తో గిలగిలలాడిపోయాడు. అతని చేయి ఆమె చెంపను తాకి కన్నీరుని తుడిచింది.

"ఇంతకంటే నా ప్రేమను నీకెలా చెప్పలో తెలియలేదు కపర్ది.." అంది. అప్పటికే అతని మనసు ఆమె ప్రేమతో నిండిపోయింది. అతని కళ్ళు కూడా తడిసాయి. ప్రేమగా ఆమె చేయిని తీసుకుని అతని గుండెల దగ్గర పెట్టుకున్నాడు. "ఐ లవ్ యు..." అని చెప్పాడు.

కాలింగ్ బెల్ మోగే సరికి నిద్ర మత్తులో తలుపు తీసాడు శ్రీను. కళ్ళు పూర్తిగా తెరవకుండా ఎదురుగా ఎవరున్నారో చూసాడు. ఎవరున్నారో పోల్చుకుని కళ్ళు పెద్దవి చేసి "బాలరాజు........" అరిచాడు.

"శ్రీనుగా......" బాలరాజు అరిచాడు.

శ్రీను వెళ్ళి గట్టిగా హత్తుకున్నాడు.

"ఒరి నీ యబ్బ, ఎముకలు పొడి అయిపోయేలా ఉన్నాయి. వదలరా బాబు. నీకెమొచ్చినా పట్టుకోలేము." అన్నాడు బాలరాజు.

బాలరాజుని వదిలి "ఎన్నాళ్ళైందిరా చూసి.." అన్నాడు శ్రీను.

"ఓవర్ యాక్షన్ చేయకు, బాగా ఎంజాయ్ చేస్తున్నావ్ ఫ్రెండ్ ని మర్చిపోయి" అన్నాడు బాలరాజు.

"మర్చిపోవడాలేమీ లేవు. కపర్ది చెప్పాడు నిన్ను కూడా పంపుతాను అని.. సో వెయింటింగ్" అన్నాడు శ్రీను.

"అది సరే, ఏదో సోది చెప్తావ్ గాని, ఎలా ఉంది చాందిని?" అనడిగాడు బాలరాజు.

"తనకే... నేనున్నాగా సూపర్ గా ఉంటుంది." అన్నాడు శ్రీను.

చాందిని అప్పుడే వచ్చి బాలరాజుని చూసి "బాలరాజు, బాగున్నావా? చిక్కిపోయావేంటలా?" అనడిగింది.

"చిక్కిపోవడాలేమీ లేదు. మనోహర్ దయ వల్ల మూడు పూటలా తింటున్నాను." అన్నాడు బాలరాజు.

"నిన్ను కూడా కపర్దినే పంపాడా?" అనడిగింది.

"అవును," అన్నాడు.

"ఫ్లైట్ లోనే వచ్చావా?" అనడిగింది.

"ఏంటి? మీరు ఫ్లైట్ లో వచ్చారా?" అనడిగాడు శ్రీనుని చూసి.

"అదీ.. అదీ.. కపర్ది టికెట్స్ తీసి పంపించాడురా," అని చెప్పాడు శ్రీను.

"మిత్ర ద్రోహి.." అన్నాడు బాలరాజు.

"పాపం కపర్దిని ఏమనకు.. అప్పటికప్పుడు ఏదో ప్లాన్ వేసి..." ఏదో చెప్పబోయాడు శ్రీను.

"నేను మిత్ర ద్రోహి అన్నది కపర్దిని కాదు నిన్ను, కలిసి ఎక్కుదాం అన్నావ్ కదరా.. మరెందుకు ఎక్కావ్?" అంటూ కాలర్ పట్టుకున్నాడు బాలరాజు.

"అదేంటీ శ్రీను, బాలరాజు రాగానే మనం ఫ్లైట్ ఎక్కామని చెప్పి ఏడిపిద్దాం అన్నావ్ కదా, ఎందుకలా జంకుతున్నావ్ అనడిగింది." చాందిని శ్రీనుని.

"ఏడిపిస్తాడు.. ఏడిపిస్తాడు.. నీ దగ్గరే ఈడి గొప్పలన్నీ... నా దగ్గర కాదు" అన్నాడు బాలరాజు.

అప్పుడే రమణమ్మ అటుగా వస్తూ, "ఇదేనా రావడం బాలరాజు, వెళ్ళు ఆ ఫ్లైట్ జర్నీ పడిందో లేదో నీకు. నాకు అయితే వాంతులయ్యాయి," అంది.

"ఈ ముసల్ది కూడా విమానం ఎక్కిందా?" అనడిగాడు బాలరాజు.

అవును అన్నట్టుగా తలూపి "ముగ్గురం కలిసే వచ్చాం.." అని బదులిచ్చాడు శ్రీను.

కళ్ళు గట్టిగా మూసుకుని ఊపిరి బిగించి "కంట్రోల్ బాలరాజు, ఇప్పుడు రక్తపాతం చేసీ ఉపయోగం లేదు. ఎదవల్ని క్షమిస్తేనే ఎదగగలం" అని అనుకున్నాడు.

"సరే.. వెళ్ళి తయారవ్వు, టిఫిన్ తిందుగాని" అన్నాడు శ్రీను.

"నా రూమ్ ఎక్కడ?" అనడిగాడు బాలరాజు,

"పెద్ద పిల్ల జమిందార్ మరి... పిందెంత ఉన్నావ్.. గది కావాలంట.." అంది రమణమ్మ.

చాందిని పకపకా నవ్వింది. శ్రీను నవ్వాపుకుంటూ "అక్కడ ఉంది." అని చెప్పాడు తను ఉన్న గదిని చూపిస్తూ.

వెళ్ళి రడీ అయ్యి వచ్చి "ఎలా ఉందిరా షవర్ బాత్?" అనడిగాడు శ్రీను.

"షవర్ బాత్ బాగానే ఉంది గాని, ఈ ఫారెన్ కమోడ్ తో చాలా ఇబ్బంది అయిందిరా. నువ్వెలా సర్దుకున్నావ్ రా?" అనడిగాడు బాలరాజు.

"ఎలా ఏంటీ.. అలానే.." అన్నాడు శ్రీను.

"అంటే?" అనడిగాడు బాలరాజు.

"నాకెలా వచ్చో అలానే..." అన్నాడు శ్రీను.

"ఛి.. ఛి.." అన్నాడు బాలరాజు.

"అది సరే మనోహర్ ఎలా ఉన్నాడు?" అనడిగాడు శ్రీను.

"వాడికేం.. అల్మోస్ట్ డైరక్టర్ చాన్స్ వచ్చేసేలా ఉంది. కొత్తోళ్ళతో తీస్తానని చెప్పాడట. ప్రొడ్యూసర్ మళ్ళీ కబురంపుతానన్నాడు. అదే డైలామాలో ఉన్నాడు."

"అబ్బో.. డైలమా? మళ్ళీ ఇంగ్లీష్ మొదలెట్టావా?"

"అదేరా, ఊగిసలాటలో ఉన్నాడు. అసలు డైలమా అన్న పదం ఎక్కడినుండి వచ్చిందో తెలుసా? మన తెలుగునుండే.. డోలాయమానం అని తెలుగుపదం ఉందా, దాన్ని పలకడానికి బ్రిటీష్ వాడికి నోరు తిరగక డైలమా అని అన్నారు" అని చెప్పాడు.

"ఒహో.." అని అన్నాడు శ్రీను నిజమనుకుని.

శ్రీనుని చూసి నవ్వుకున్నాడు బాలరాజు. కపర్ది మాట ఇచ్చినట్టుగానే బాలరాజుని కూడా సెటిల్ చేసాడు.

***

మనోహర్ కి కో-ప్రొడ్యూసర్ నుండి మళ్ళీ కాల్ వచ్చింది.

"హలో సార్," అన్నాడు.

"మనోహర్, ఒకసారి వస్తావేంటయ్యా?"

"వస్తాను సార్." అని ఫోన్ పెట్టి ఉన్నపళంగా బయలుదేరి వెళ్ళాడు. అక్కడ మెయిన్ ప్రొడ్యూసర్ తో కలిసి టీ తాగుతూ ఉన్నాడు కో-ప్రొడ్యూసర్.

మనోహర్ వస్తూనే "రావయ్యా.. కూర్చో.." అన్నాడు కో-ప్రొడ్యూసర్.

"నేను చెప్పాను కదా, ఇతని గురించే.." అని చెప్పాడు ప్రొడ్యూసర్ తో.

"నువ్వు తీసిన షార్ట్ ఫిల్మ్స్ చూసాను. నాకు నచ్చాయి." అని చెప్పాడు ప్రొడ్యూసర్.

"థ్యాంక్ యు సార్" చెప్పాడు మనోహర్.

"సరే. చెప్పు ఎంత బడ్జెట్ లో తీస్తావు."

"1-1.5 Cr లోపు తీస్తాను. మరొక 1.5 Cr పబ్లిసిటీకి. మొత్తం 3-3.5 Cr లో కంప్లీట్ చేయగలను."

"కొత్త వాళ్ళంటున్నావ్ మరి?"

"అవును సార్. ఒక్క చాన్స్ అంటూ ఇల్లు వాకిలి వదిలేసి వచ్చి చాలా ట్రై చేస్తున్నారు. అవకాశం వస్తే వాళ్ళను ప్రూవ్ చేసుకోవడానికి సిద్దంగా కూడా ఉన్నారు. అండ్ అందరు తెలుగు వాళ్ళతోనే తీయాలనేది నా ఆలోచన సార్."

“అందరు తెలుగువాళ్ళేనా? ఎందుకంత భాషాభిమానం? మిగిలిన భాషల్లో నటించే నటులు ఒక్కరు కూడా వద్దా?”

“అలా అని నేను అనడం లేదు సార్. మన దగ్గర దొరకకపోతే అప్పుడు పరాయి భాషలో వెతుకుదాం. మన దగ్గర చాలామంది మంచి నటులు ఉన్నారు. ఇంట్లో ఉన్న తులసి మొక్కకి నీళ్ళు పోయడం మానేసి బయటనుండి గులాబి మొక్కని కొనుక్కోవడం ఎందుకు సార్?”

మనోహర్ మాటలకు నవ్వి, “సరేనయ్యా, ఆడిషన్స్ ఏర్పాటు చేద్దామా మరి?” అనడిగాడు ప్రొడ్యూసర్.

“తప్పకుండా సార్..” అన్నాడు నవ్వుతూ.

“మంచిరోజు చూసి కబురంపుతాను. ఫార్మాలిటీస్ ఉంటాయి కదా, బాండ్ పేపర్ మీద సంతకం చేద్దు గాని..” అన్నాడు ప్రొడ్యూసర్.

“థ్యాంక్యూ సార్..” మనోహర్ కళ్ళల్లో ఆనందం.

ఇంటికెళ్ళి మేడ మీద బయట పడుకున్నాడు. కళ్ళు మూసుకుని శ్రీజని తలచుకున్నాడు.

ఓ రోజు తను అలానే మేడ మీద పడుకున్నాడు. శ్రీజ వచ్చి పక్కన కూర్చుంది.

“ఏమి చేస్తున్నావ్ బావా?” అనడిగింది.

"సినిమా చూస్తున్నాను.." అన్నాడూ ఆకాశంలో చూస్తూ.

పక్కున నవ్వింది.

"ఎందుకా వెకిలి నవ్వు.. నువ్వు చూస్తానంటే చూపిస్తాను."

"చూపించు.."

"ఇలా పడుకో.. కొంచెం దూరంగా.."

"అబ్బా, దూరంగా కాకపోతే దగ్గరగా పడుకుంటానని ఎక్స్పెక్ట్ చేసావా?"

"లేదు.. పడుకో.."

ఆమె పడుకుంది.

"చూడు ఆకాశాన్ని.. ఎంత పెద్ద తెరో..."

"హ్మ్..."

"నేను చెప్పేది అక్కడ ఊహించుకో.."

"హ్మ్..."

"బాక్ గ్రౌండ్ అంతా మంచులా తెల్లగా ఉంది. నువ్వు నేను బెంచ్ మీద కూర్చుని ఉన్నాము. పక్కనే నందివర్ధనం చెట్టు. గాలి వీచింది. నీ నుదిటిపై ముంగురులు నాట్యం చేస్తున్నాయి. నేను సుతారంగా నీ చెవి వెనక్కి జరిపాను. నీ చూపు నన్ను దాటి పోలేదు. వీచిన గాలి వల్ల ఆ పూలు నేల

రాలుతున్నాయి. నెమ్మదిగా నేను నీ దగ్గరకి జరిగి...” అంటూ ఆమె దగ్గరకి జరిగాడు.

“జరిగి...” అంది.

“నీ చెంప మీద చేయి ఆంచి...” అంటూ ఆంచాడు.

“ఆంచి...” అనడిగింది.

“నీ పెదవులను నా మునివేళ్ళతో తడిమి...” అని తడిమాడు.

“తడిమి...” అంది.

“మరింత దగ్గరగా జరిగి..” అని జరిగాడు.

“జరిగి..” అంది.

“ఇలా నా పెదవులతో నీ పెదవులు తగిలించి....” అని ముద్దు పెట్టుకోబోయాడు.

“బావా, తెరకి అడ్డు తప్పుకో, సినిమా కనపడటం లేదు.” అంటూ చిలిపిగా అతని గుండెల మీద చేయి వేసి వెనక్కి నెట్టి వెంటనే నవ్వుతూ లేచి అక్కడే గోడకానుకుని కాళ్ళు ముడుచుకుని కూర్చుంది.

“సినిమా సగంలో ఆపేయకూడదు.” అన్నాడు తాను కూడా లేచి కూర్చుంటూ.

“తెలివెక్కువైపోయింది బావా నీకు.” అని చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఆ విషయాన్ని తలచుకున్న అతని మనసు శ్రీజాని చూడాలని ఉవ్విళ్ళూరింది. అందమైన స్మృతులతో హాయిగా నిద్రపోయాడు.

రెండు రోజుల తరువాత వెళ్ళి బాండ్ పేపర్ మీద సంతకం పెట్టాడు. ఆ క్షణంలో అతని గుండె బరువెక్కింది. అతని ఆనందానికి అవధుల్లేవు.

“థ్యాంక్యు సో మచ్ సార్...” అని చెప్పి షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

“మంచిగా తీయాలి మరి.. ఆల్ ది బెస్ట్” అని చెప్పాడు. ప్రొడ్యూసర్.

ఇంకో నెలలో ఆడిషన్స్ చేద్దామని ఫిక్స్ చేసారు. మనోహర్ కపర్దికి చెప్పి తన ఊరు పయనమయ్యాడు శ్రీజని కలవడానికి.

***

ఆ రోజు ఆదివారం అవడంతో గీత, కపర్దిలు కలిసి మాల్ కి వెళ్ళారు. అక్కడి కాఫీ షాప్ లో కూర్చుని కాఫీ ఆర్డర్ చేసాక “నాన్నతో మన గురించి చెప్పాను. ఆయనకు ఏమీ అభ్యంతరం లేదు.” అంది. సర్వర్ వచ్చి కాఫిని టేబుల్ మీద పెట్టి వెళ్ళాడు.

“అయితే మన పెళ్ళి జరిగిపోతుంది.” అన్నాడు కాఫీ కప్ అందుకుంటూ.

“అదేంటి? మీ నాన్నగారితో చెప్పవా మన గురించి..”

“.....”

“మాట్లాడవేంటి కపర్ది.” అనడిగింది.

“ఇప్పటివరకు నేనేది ఆయనకు చెప్పి చేయలేదు.” అన్నాడు.

“అందుకే ఇది చెప్పమంటున్నాను..” అంది.

“సడన్ గా చెప్పడం అంటే...” సంశయం వ్యక్తపరిచాడు.

“అదేం ఉండదు.. నీకు కూడా ఆయనతో మాట్లాడటానికి ఏదో ఒక ముఖ్యమైన కారణం ఉండాలి కదా. అది ఇదే విషయం ఎందుకు కాకూడదు. మాట్లాడు కపర్ది, ఆలోచించకు, ప్లీజ్.. లేట్ చేయకు..” అని చెప్పింది.

కపర్దికి మనోహర్ చెప్పిన మాటలు, బాలరాజు గతం ఒక్క క్షణం కళ్ళ ముందు ఫ్లాష్ లా కదలాడింది.

నెమ్మదిగా ఫోన్ తీసుకుని ఒక్కో నంబర్ ప్రెస్ చేసాడు. మూడు నంబర్స్ ప్రెస్ చేసేసరికి నాన్న అని ఇంగ్లీష్ లో సేవ్ చేసి ఉన్న నంబర్ వచ్చింది. పక్కనే కూర్చుని ఉన్న గీతని చూసాడు. “డయల్ చేయ్” అంది అతని భుజం పట్టుకుని ఒత్తుతూ.

డయల్ బటన్ నొక్కాడు. ఫోన్ చెవి దగ్గర పెట్టుకున్నాడు. ఫోన్ రింగ్ అయింది.

.....

......

రింగ్ అవుతూ ఉంది. లిఫ్ట్ చేయలేదు. "లిఫ్ట్ చేయడం లేదు.." అన్నాడు మధ్యలో. ఫోన్ కట్ అయిపోయింది.

"మళ్ళీ ట్రై చేయు," అంది. ఆమె మాట విని డయల్ చేసాడు. ఎవరూ లిఫ్ట్ చేయలేదు.

"లాభం లేదు.." అన్నాడు.

"పోనీ మా నాన్నకి చేద్దామా? అక్కడే ఉన్నారుగా ఇద్దరు." అని సలహా ఇచ్చింది.

"సరే... అంకుల్ నంబర్ చెప్పు, నేనే చేస్తాను." అన్నాడు.

ఆమె నంబర్ చెప్పింది. విరించికి డయల్ చేసాడు.

విరించి రెండో రింగ్ కే లిఫ్ట్ చేసాడు.

"హలో.." అన్నాడు విరించి.

"హలో అంకుల్ నేను కపర్దిని..."

"కపర్ది... నేనే ట్రై చేస్తున్నాను. గీత నీతోనే ఉందా?"

"అవునంకుల్. నాతోనే ఉంది." ఆమెను చూస్తూ అన్నాడు.

"ఫోన్ సైలెంట్ లో ఎందుకు పెట్టుకుంది.. ఎన్నిసార్లు చెప్పాలి దానికి..." కొంచెం కోపం ధ్వనించింది విరించి కంఠంలో..

"చెప్పండంకుల్ ఏమైంది..?"

“కంగారుపడకు కపర్ది, మీ నాన్నగారికి రెండోసారి అటాక్ వచ్చింది. అది చెప్పడానికే గీతకి ట్రై చేసాను, అదేమో ఫోన్ సైలెంట్ లో పెట్టుకుంది.” అని చెప్పాడు గబగబా. తండ్రికి రెండోసారి స్ట్రోక్ అనగానే నివ్వెరపోయాడు కపర్ది. “మళ్ళీనా?” అతని గొంతు భయంతో వణికింది.

“అవును కపర్ది, హాస్పిటల్ కి తీసుకెళ్తున్నాం..” అని చెప్పాడు విరించి.

వెంటనే తేరుకుని “మేము బయలుదేరుతున్నాం..” అని లేచాడు.

***

‘మహాదేవాకి రెండోసారి అటాక్ అన్నమాట’ తూటాలా తగిలింది కపర్దికి.

“ఏమైంది కపర్ది?” అనడిగింది కంగారుగా.

“నాన్నకి రెండోసారి స్ట్రోక్…” చెప్పాడు. ఆ మాట చెప్పినపుడు అతని కళ్ళల్లో ఆందోళన సుస్పష్టంగా కనపడింది. షాక్ తో నిలబడిపోయింది గీత.

“ఇప్పటికిప్పుడు ప్రయాణం అంటే ఫ్లైట్ లో వెళ్ళాలి. మధ్యాహ్నం రెండు గంటలకి ఫ్లైట్ ఉంది.” అని ఫ్లైట్ చార్జ్ చూసాడు. “పన్నెండు వేలు ఉంది టికెట్. నాకో పాతికవేలు సర్దగలవా?” అనడిగాడు.

“అంత డబ్బు నా దగ్గర కూడా లేదు.” అంది.

“వేరే ఆల్టర్నేట్ ఏమైనా ఉందా?” అనడిగాడు.

“కాలేజ్ లో అడ్వాన్స్ సాలరి అడిగితే ఇస్తారు కాని ఈరోజు ఆదివారం కాలేజ్ కి సెలవు..” అని చెప్పింది.

“మనకు అప్పు ఇచ్చేవాళ్ళు ఎవరైనా ఉన్నారా?” అనడిగాడు.

కాసేపు ఆలోచించి “హా, మా కాలేజ్ లో పని చేసే బాటనీ లెక్చరర్ సత్యకృష్ణ గారు ఉన్నారు. ఆయన ఇస్తారు.” అంది కచ్చితంగా హెల్ప్ చేస్తారన్న నమ్మకంతో.

“సరే ఆయన ఇల్లు తెలుసా నీకు?” అడిగాడు.

“తెలుసు,” అంది నడుస్తూ.

ఇద్దరు కలిసి ఆటోలో సత్యకృష్ణ ఇంటికి చేరుకున్నారు. ఆటోవాడికి డబ్బులిచ్చి పంపేసి గేట్ బయటే ఉన్న కాలింగ్ బెల్ నొక్కాడు.

"ఎవరూ?" అంటు రాధిక బయటకు వచ్చింది.

"సార్ ఉన్నారా మేడం? ఒకసారి కలవాలి.." అంది గీత.

"ఉన్నారు, రండి.." అంది రాధిక.

సత్యకృష్ణ ఇంట్లో ఉన్నాడనేసరికి ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు. సత్యకృష్ణ లోపల కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు.

"వచ్చేస్తారు కూర్చోండి.." అని చెప్పి రాధిక సత్యకృష్ణ గదిలోకి వెళ్ళి, "సత్య, నీకోసం స్టూడెంట్స్ వచ్చారు." అని చెప్పింది రాధిక. కూర్చునే వెనక్కి తిరిగి చూసాడు. గీతను గుర్తుపట్టి "స్టూడెంట్ కాదు, స్టాఫ్. ఆ అమ్మాయి మా లైబ్రేరియన్," అంటూ రాసేవాడు ఆపి హాల్లోకి వచ్చాడు.

"ఏమ్మా.. గీతా ఎలా ఉన్నావు? ఏంటి ఇలా వచ్చావు?" అనడిగాడు కూర్చుంటూ.

"సార్, బాగున్నాను సార్. అత్యవసరం అయి మీ దగ్గరకు వచ్చాను." అని చెప్పింది.

"చెప్పమ్మా.." అని కపర్దిని చూసాడు.

“సార్, ఇతను రైటర్ మహాదేవాగారి అబ్బాయి. పేరు కపర్ది.” అని పరిచయం చేస్తున్నట్టుగా చెప్పింది.

“అవునా...” అంటూ లేచి నిలబడి “మీ నాన్నగారికి నేను పెద్ద అభిమానిని” అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చాడు సత్యకృష్ణ ఆనందంతో.

“థాంక్యు సార్.” అన్నాడు కపర్ది.

“చెప్పండి నేను ఏం చేయాలి?” అన్నాడు మళ్ళీ కూర్చుంటూ.

“మాకు కొంచెం డబ్బు కావాలి సార్,” అనడిగాడు కపర్ది.

“అవును సార్,” అంటూ మహాదేవాకి హార్ట్ అటాక్ వచ్చిన సంగతి చెప్పింది.

“ఓ మై గాడ్..” అన్నాడు సత్యకృష్ణ.

“కొంచెం పాతికవేలుంటే సర్దగలరా సార్, నేను హైదరాబాద్ వెళ్ళగానే మీకు ట్రాన్స్ఫర్ చేస్తాను.” అని చెప్పాడు.

“తప్పకుండా ఇస్తాను. మీరు ఏమి టెన్షన్ పడకండి. మీకు వీలున్నప్పుడు ఇవ్వండి. నాకు హడవిడేమీ లేదు.” అని ధైర్యం చెప్పాడు.

“థ్యాంక్యూ సార్..” అని చెప్పాడు కపర్ది.

లోపలికి వెళ్ళి డబ్బు తెచ్చాడు సత్యకృష్ణ. కపర్దికి ఇస్తూ “మీ నాన్నగారు చాలా గొప్పవారు. ఆయనకు మంచే జరుగుతుంది. జీవితంలో ఒక్కసారైనా

ఆయన్ని కలవాలని ఉందయ్యా.. ఆయన కోలుకుని ఇంటికి వచ్చాక నాకు, నా భార్యకు ఒకసారి కలిసే అవకాశం ఏర్పాటు చేస్తావా? ఒక్క ఆటోగ్రాఫ్ తీసుకుని, దగ్గర నుండి ఆయన్ని చూసి, ఆయన పాదాలకు నమస్కరించాలనేది నా కోరిక." అని చెప్పాడు.

"తప్పకుండా సార్.." అన్నాడు కపర్ది.

గర్భగుడిలో పని చేసేవాడికి దేవుడంటే అంతగా పట్టింపు ఉండదు. దూరం నుండి దర్శనానికి వచ్చేవాడు మాత్రం ఎప్పుడు దైవాన్ని చూద్దామా అని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తాడు.

సత్యకృష్ణ సాయంతో కపర్ది, గీత లు హైదరాబాద్ కి స్టార్ట్ అయ్యారు.

***

ఫ్లైట్ రైట్ టైమ్ కి చేరుకోవడంతో డైరక్ట్ గా హాస్పిటల్ కి చేరుకున్నారు.

అక్కడ విరించి ఉన్నాడు. కిరీటి కూడా అప్పటికే చేరుకున్నాడు.

కపర్ది విరించి దగ్గరకు వెళ్ళి "ఎలా ఉంది ఇప్పుడు?" అనడిగాడు.

"ప్రస్తుతానికేమీ చెప్పలేమన్నారు. 48 గంటలు అబ్సర్వేషన్ లో ఉంచమన్నారు." అని చెప్పాడు విరించి.

అక్కడే కుర్చీలో కూలబడ్డాడు. కపర్ది కిరిటీని చూసాడు. అతని దగ్గరకు వెళ్ళి "మీ పేరు తెలియదు, నాకో చిన్న హెల్ప్. ఇక్కడే హాస్పిటల్ లో ఉంటారా? నేనొకసారి ఇంటికెళ్ళొస్తాను." అనడిగాడు.

“సరే..” అని తలూపాడు కిరీటి.

“ఇప్పుడెక్కడికి వెళ్తావ్?” అనడిగింది గీత.

“ఇంటికి..”

“ఎందుకు?”

“పనుంది..” అని చెప్పి హాస్పిటల్ బయటకు వచ్చాడు.

అప్పుడే పరుగుపరుగున శ్రీను, చాందిని, బాలరాజు హాస్పిటల్ కి చేరుకున్నారు. వాళ్ళను చూసాడు.

“ఎలా ఉంది బాసు?” అనడిగాడు శ్రీను.

“అబ్సర్వేషన్ లో ఉన్నారు. గంటలు గడవాలట” చెప్పాడు కపర్ది.

“టెన్షన్ పడకు కపర్ది, ఆయనకు తగ్గిపోతుందిలే..” అని చెప్పింది చాందిని. ఆమెను చూసి, బాలరాజు వైపు తిరిగి “ఇక్కడే ఉండండి. ఎమర్జన్సీ అయితే కాల్ చేయండి.” అని చెప్పాడు కపర్ది.

“ఎమర్జన్సీ అనే చెప్తున్నారు అంటున్నావ్ కదా బాసు.” అని అడిగాడు బాలరాజు ఆందోళనగా.

బాలరాజుని చూసి కార్ ఎక్కి ఇంటికి బయలుదేరాడు కపర్ది. అరగంటలో చేరుకున్నాడు. కార్ డోర్ తీసుకుని ఇంటిలోపలికి వెళ్ళాడు.

వంటవాడు ఎదురొచ్చి “కాఫీ ఇమ్మంటారా బాబు..?” అనడిగాడు. వద్దన్నట్టుగా సైగ చేసాడు.

సోఫాలో చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయాడు. అతని గుండెలోపల పేరుకుపోయిన మంచు పర్వతం కరగడానికి సిద్ధంగా ఉంది. ద్రవించిన గుండెలోని బాధ బయటకు రావడానికి దారి వెతుక్కుంటోంది. కలత అంతా కన్నీరై ఒక్కసారిగా ఉబికివచ్చింది. తెలియకుండా వచ్చిన కన్నీరు తేలికగా చెంపల మీదకు జారింది. రెండు చేతులతో రెండు కళ్ళను తుడుచుకున్నాడు. ఎర్రబడ్డ కళ్ళతో తల్లి ఫొటోని చూసాడు. నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి ఆ ఫొటో ఎదురుగా నుంచున్నాడు. తడిసిన కళ్ళతో ఫొటోని చూస్తూ “మనసులో ఏమీ బాలేదు అమ్మా. గుండె చాలా బరువుగా ఉంది. ఇలా ఎప్పుడూ అనిపించలేదు, ఇప్పుడెందుకిలా అనిపిస్తోందో కూడా తెలియడం లేదు. అందరి ముందు దోషిలా నిలబడ్డాను. ఇప్పుడు నాకు ఏమి చేయాలో కూడా తెలియడం లేదు.” అన్నాడు.

పక్కనే ఉన్న తండ్రి గదిని చూసాడు. మహాదేవ ఎక్కువ కాలం గడిపిన గది అది. కిటికిలోంచి వచ్చే గాలులకి కర్టెన్స్ చిన్నగా ఊగుతున్నాయి. కర్టెన్ వెనకాల ఉన్న పచ్చటి గార్డెన్ చిన్నగా కనపడుతోంది. ఆ కిటికీ ముందు మహాదేవా ఎప్పుడూ కూర్చుని రాసుకునే బల్ల, ఒద్దికగా సద్ది ఉన్న పుస్తకల దొంతరలు. పెన్ స్టాండ్, అందులో రంగురంగుల పెన్స్. పక్కనే రామకృష్ణ పరమహంస, వివేకానందల బొమ్మలతో ఉన్న కేలండర్. తన జీవితంలో కపర్ది

ఆ గదిలోకి వెళ్ళిన సందర్భాలు వేళ్ళ మీద లెక్కపెట్టచ్చు. ఆ గదిలో గడిపిన సమయం కొన్ని నిమిషాల్లో చెప్పచ్చు. అవన్నీ చూసి నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు.

మహాదేవా బల్ల మీద గొప్పగొప్ప సాహిత్య పుస్తకాలున్నాయి. బల్ల మీద ఉన్న ట్రాన్స్పరెంట్ అద్దం కింద కపర్ది చిన్నప్పటి ఫొటో ఉంది. దాని కింద 'ఆత్మానాం పుత్రనామాసి' అని రాసి ఉంది.

పక్కనే లలితసహస్ర ఫొటో కూడా ఉంది. దాని కింద

'మాటలే లేని భాషకి

మనసు రాసెను

కనుపాపతో ప్రేమ లిపి'

అని రాసి ఉంది.

ఆ బల్లకున్న సరుగు తీసి చూసాడు. అందులో ఒక పుస్తకం ఉంది. అది తెరచి చూసాడు.

అది తెరిచి పుస్తకంలో ఉన్న పేజీలన్నీ ఒకసారి తిప్పాడు. రంగుల పుస్తకమది.

గుండెల గదిలో గూడు కట్టుకున్న ఎన్నో అనుభవాలు... మదిలో మూటగట్టుకున పదాలన్నీ పాటగా పాదిగి ఎన్నో గాయకుల గాత్రాలలో

వినిపించిన గీతాలు. ఆ పుస్తకానికి 'మహాదేవాలాపనలో...' అని పేరు పెట్టుకున్నాడు.

అదే డెస్క్ లో పెన్ డ్రైవ్ ఒకటి ఉంది. దాన్ని తీసి మహాదేవా లాప్ టాప్ కి కనెక్ట్ చేసాడు. తేదీల ప్రకారం ఫోల్డర్స్ క్రియేట్ చేసి ఉన్నాయి. సాంపిల్ కి ఒక ఫోల్డర్ ఓపెన్ చేసి చూసాడు. ఆడియో ఫైల్స్ ఉన్నాయి. ప్లే చేసి విన్నాడు. మహాదేవ ఏరోజు ఏపని చేసాడో ఏ పాట ఏ మూవి కోసం రాసాడో అన్నీ రికార్డ్ చేసి పెట్టుకున్నాడు.

విరించి వచ్చినప్పుడున్న ఆడియో ఫైల్ ని ప్లే చేసాడు. అరనిమిషం వరకు నిశ్శబ్ధం.. ప్లే అవడం లేదేమో అనుకున్నాడు. నెమ్మదిగా మహాదేవ కంఠం ధ్వనించింది..

"కన్నానో కొడుకుని! కపర్ది అని పిలుచుకున్నాను! కంటికి రెప్పలా కాపాడుకున్నాను! ఆ కంటినే పొడిచి వదిలి పోతుంటే చివరికి కన్నీరు మిగుల్చుకున్నాను. ఒకరు ఒంటరిగా వెళ్ళిపోయారు.. మరొకరు ఒంటరిని చేసి వెళ్ళిపోయారు.

రాముడు వెళ్ళిపోతే దశరధుడు ఎంత ఏడ్చాడో నేను అందుకు పదింతలు ఏడుస్తున్నాను. దశరధుడు ఇచ్చిన మాట వల్ల రాముడు వెళ్ళిపోయాడు. నా పాట వల్ల కపర్ది వెళ్ళిపోయాడు. ఒకరిది ప్రేమ, ఒకరిది

ద్వేషం. ఒకరు తప్పక వెళ్ళారు, మరొకరు తప్పుకుని వెళ్ళారు. ఒకరు వదిలేసి వెళ్తే మరొకరు వదిలించుకుని వెళ్ళారు.

వెనక్కి తిరిగి చూసుకుంటే నా జీవితం అంతా పూల తోటే, కాని ఎక్కడికక్కడ కంచెలా నా కొడుకు కనబడ్డాడు. కంచె ఉంటేనే కదా పూలతోటకి భద్రం.. పూలతోట కంచెను దాటాలని చూసింది.. కంచె కొంచెం దూరమైంది. మళ్ళీ కంచెను దాటి పూసింది. కంచెం ఇంకొంచెం జరిగింది. మళ్ళీ మళ్ళీ పూసి కంచెను అతిక్రమించాలనుకుంది. కంచెకు కోపం వచ్చి పూలదోటను వదిలేసి వెళ్ళిపోయింది. కంచెలేని పూలదోట ఇప్పుడు అభద్రతగా బతుకీడుస్తోంది. ఇప్పుడే పూలదోటకు కంచె అవసరం చాలా ఉందనే విషయం తెలియవచ్చింది. చూస్తే ఆ పూలదోట కాటివరకు వ్యాపించేసింది. చరమాంకంలో చూసే దిక్కులేక చులకన అయిపోయింది. ఎప్పుడో వదిలేసి వెళ్ళిపోయిన తోటమాలి స్నేహితుడి రూపంలో వచ్చి నీరు పోయాలని చూసాడు. కాని ఎంతని పోయగలడు. నెమ్మదిగా పూలదోట వాడిపోవడం మొదలెట్టింది.

కష్టాల్లో సుఖాల్లో కూడా నాకు నా పాటే తోడుగా ఉండిపోయింది. అది నాలోది కదా ఎక్కడికి పోతుంది? పోతేగీతే నాతోనే పోవాలి.. హ్మ్, నేను పోయినా నా పాట ఉంటుంది. అప్పుడు ఎంతమంది నన్ను, నా పాటను గుర్తుపెట్టుకుంటారు? పాత నీరు పోతేనే కదా కొత్త నీరు చేరేది.

అక్షరాలన్నీ గంగా ప్రవాహమై, పదాలన్నీ గోదారి పరవళులై సాగిపోయిన నా జీవితం ఎప్పటికైనా సాగరసంగమం చేరాల్సిందే. కాని నా తుది కోరిక ఇప్పటికీ తీరలేదు అంటే అతిశయోక్తి లేదేమో. తీరుతుందో లేదో కూడా నమ్మకం లేదు.. (కాసేపు మౌనం..)

వినడానికి చిన్న కోరికే కావచ్చు... కాని తీరడానికి చాలా పెద్ద కోరిక.. నా కొడుకు నా పాటను మెచ్చుకోవాలి.

నేను నచ్చకపోయినా నాకు పరవాలేదు. ఒక్కపాటనైనా వాడు బాగుందనాలి. తండ్రిగా నేను ఈ స్థాయికి రావాడానికి నేను కృషి ఎంత చేసాననేది గుర్తించకపోయినా పరవలేదు. ఒక పాట కవి కలం నుండి పురుడు పోసుకొనేప్పుడు ఆ కవి హృదయం ఎంతటి ప్రసూతి వేదన అనుభవిస్తుందో గుర్తించాలి. కపర్ది పుట్టినప్పుడు నేను ఎంత సంబరపడ్డానో అంతే సంబరం ప్రతి పాట పుట్టినప్పుడు కూడా అనుభవించానని తెలియాలి.

పరమేశ్వర విభూదిగా లభించే ఈ కళ అందరికీ అబ్బేది కాదని, అదృష్టం కొద్దీ లభిస్తే దాన్ని అంత తొందరగా వదిలించుకోలేమని గ్రహించాలి. నరనరాల్లో ఇంకిపోయిన అక్షరాలన్నీ వేళ్ళ మధ్య నుండి వెన్నపూసలా జారిపోతుంటే ఆ మనసు పొందే ఆనందం ముందు ఏదీ నిలబడలేదని తెలుసుకోవాలి. ఒక్కసారి మనసిచ్చి మనువాడిన మనిషి, ఒకసారి మనసుకు నచ్చిన పని ఊపిరి ఆగితేగాని ఆపలేమని గుర్తించాలి. ఊపిరి ఆగిపోయినా పాట నిలిచిపోతుందని అది పోయినవాడిని కలకాలం ఉండేలా చేస్తుందనే

విషయం ఆలోచించాలి. ఏ కవీ కట్టుకున్న మనిషిని, కన్న కొడుకుని వదిలేయలేడని గుర్తెరగాలి. అలా వదిలేసిన నాడు అతను అంతవరకు సాధించిందంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుందేగాని బలమైన బంధాలకు పునాదులవదు.

నా కొడుకు విషయంలో జరిగిన పొరపాటును సరిదిద్దుకునే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. ఒకప్పుడు కవిని అవ్వాలని అవకాశం కోసం ఎలా ఎదురు చూశానో అలానే ఇప్పుడు కొడుకుతో ఒక్కసారి మాట్లాడే అవకాశం ఎదురుచూస్తున్నాను. పరమేశ్వరా పుత్రగాత్ర పరిష్వంగానికి ఒక అవకాశం ఇవ్వు, అంతకు మించి మరేమీ కోరేది లేదు."

ఆడియో ఆగాకా కుర్చిలో తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు. కంటినీరు కనుకొలికల్లోంచి జారింది. నుదుటిమీద చేయి వేసుకున్నాడు. హాల్ లో ఉన్న లాండ్ ఫోన్ రింగ్ అయింది. వినపడి హాల్ లోకి వచ్చాడు. వంటవాడు ఫోన్ ఎత్తి మాట్లాడాడు. కపర్ది ముఖంలో కంగారు స్పష్టంగా కనపడింది. ఫోన్ పెట్టేసి కపర్దిని చూసాడు వంటవాడు. ఏడ్చి ఎర్రబడ్డ కళ్ళు ఏంటని అడిగాయి.

"మిమ్మల్ని తొందరగా రమ్మంటున్నారు..." చెప్పాడు వంటవాడు.

పరుగుపరుగున వంటవాడి దగ్గరకి వెళ్ళి "నువ్వు కూడా రా రామయ్యా.. నాకు భయంగా ఉంది." అన్నాడు చేతులు పట్టుకుంటూ.

వంటవాడు కళ్ళనీళ్ళు తిరిగాయి. "వస్తాను బాబు, కంగారుపడకండి." అన్నాడు. కార్ లో ఉన్నపళంగా హాస్పిటల్ కి బయలుదేరారు.

హాస్పిటల్ కి చేరుకునే సరికి అక్కడ చాలా మంది జనం పోగయ్యి ఉన్నారు. ముగ్గురు కానిస్టేబుల్స్ పరిస్థితిని అదుపులో ఉండేందుకు కాపలాగా ఉన్నారు. వాళ్ళని దాటుకుంటూ లోపలికి వెళ్ళాడు. అప్పటికే మనోహర్ ఫ్లైట్ లో హైదరాబాద్ వచ్చి, హాస్పిటల్ కి చేరుకున్నాడు. అందరి ముఖాలు వివర్ణమై ఉన్నాయి. వాళ్ళని చూసి కపర్ది మరింత కంగారు పడ్డాడు. విరించి దగ్గరకు వెళ్ళి "ఎలా ఉంది నాన్నకి?" అనడిగాడు.

"సీరియస్ గానే ఉంది. బి.పి ఫ్లక్చువేట్ అవుతోంది. ఇప్పుడే డాక్టర్స్ వెళ్ళారు." అని చెప్పాడు.

తడిసిన కపర్ది కళ్ళు ఐ.సి.యు రూమ్ వైపు చూసాయి. గీత వచ్చి కపర్ది భుజం మీద చేయి వేసింది.

డాక్టర్ బయటకు వచ్చాడు. అందరు అతనివైపు తిరిగి చూసారు. కపర్ది దగ్గరకి వచ్చి "కండిషన్ సీరియస్ గానే ఉంది. ప్రస్తుతానికి స్టేబుల్ గానే ఉన్నారు. కాని మళ్ళీ రియాక్ట్ అయ్యే అవకాశం లేకపోలేదు. ఒకసారి వెళ్ళి చూడాలనుకుంటే వెళ్ళండి." అని చెప్పాడు.

బాలరాజు వచ్చి "వెళ్ళు బాసు.." అన్నాడు.

"ఏమి కాదు కపర్ది. మేమందరం దేవుడిని ప్రార్థిస్తాంలే.. టెన్షన్ పడకు.." అంది చాందిని.

శ్రీను వచ్చి "నువ్వు మంచోడివి కపర్ది, మహాదేవాగారికి ఏమి కాదు." అన్నాడు.

"ఆయన కోలుకుని తప్పకుండా తిరిగొస్తారు.." అన్నాడు మనోహర్.

ఎవరు ఎన్ని చెప్పినా కపర్ది మనసు అల్లకల్లోలంగా ఉంది. ఎంతమంది ధైర్యం చెప్పినా మనసు తీసుకోలేకపోతోంది.

ప్రపంచాన్ని తన పాటలతో అలరించిన గొప్ప కవి అలా ఒక గదిలో ఒంటరిగా కృత్రిమ ఊపిరి పీలుస్తూ ఉన్నాడు. ఐ.సి.యు రూమ్ తలుపు తీసి లోపలికి చూసాడు కపర్ది. కపర్ది కంటికి మింటికి మధ్య ఏకదాటిగా ఏడుస్తున్నాడు. ఏడ్చి ఏడ్చి ఇంకిపోయిన కన్నీరు కన్న తండ్రిని చూపించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆక్సిజన్ మాస్క్ పెట్టి ఉన్న మహాదేవా ఊపిరులను, గుండె చప్పుడులను, రక్తప్రసరణను అంకెల్లో చూపించే పరికరాలన్నీ ప్రాణం ఉందో లేదో చూపిస్తూ వాటిపని అవి చేసుకుపోతున్నాయి. మెషీన్ శబ్దాలు తప్ప ఇంకేమి ఆ గదిలో వినిపించడం లేదు.

కపర్దికి తెలియకుండా ఆసుపత్రి వైరాగ్యం ఆవహించింది. ఎన్నో కోట్ల మంది అభిమానుల హృదయాలను కదిలించిన మహాదేవా కదలిక లేకుండా

మంచం మీద నిశ్చలంగా పడుకుని ఉన్నాడు. ఎప్పుడూ కలం పట్టుకుని ఉండే చేతి వేళ్ళకు ఏవో క్లిప్స్ పెట్టారు. అవన్నీ చూస్తూ కపర్ది పక్కనే కూర్చున్నాడు. ఆక్సిజన మాస్క్ లో మహాదేవ ఉచ్ఛ్వాసనిశ్వాస్వాలు ఆవిరిగా కనపడుతున్నాయి. కళ్ళు మూసుకుని నిశ్చలంగా పడుకుని ఉన్నాడు. నిర్మలమైన మనసు లోపల మౌనంగా రోదించి నిమ్మకుండిపోయింది. కన్నీళ్ళతో నెమ్మదిగా తండ్రి చేయిని పట్టుకున్నాడు. మెషీన్ దాని పని అది చేసుకుపోతుంది. గోడమీద గడియారంలో ముల్లు కూడా ఆగకుండా కదిలిపోతోంది. బయట ప్రపంచం అంతా ఏమీ పట్టనట్టు దాని పని చేసుకుపోతోంది. కాలం అంతే జాలి లేకుండా కదిలిపోతుంది.

***

కళను నమ్ముకుని కళే జీవితంగా బతికే ప్రతి పిపాసికి ఈ నవల అంకితం.